

'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4 వెల: ₹ 5.50

సంపుటి: 17

సంచిక: 26

గురువారం 18-4-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



యూఏఈలో అనూహ్య వర్షాలు

- 24 గంటల్లోనే 14.2 సెంటీమీటర్ల వర్షపాతం
- ఏడాదిన్నర వాన ఒక్క రోజులోనే నమోదు
- నీట మునిగిన దుబాయ్ ఎయిర్‌పోర్ట్!

- 6లో

న్యూస్‌మేకర్


వార్దా ఖాన్

యు.పి.ఎస్.సి. 2023 ఫలితాల్లో టాప్ 25 ర్యాంకుల్లో 10 మంది మహిళా అభ్యర్థులున్నారు. భిన్న జీవనస్థాయిల నుంచి వీరంతా మొక్కవోని పట్టుదలతో పోరాడి ఇండియన్ సివిల్ సర్వీసుల్లో సేవలు అందించేందుకు ఎంపికయ్యారు. 18వ ర్యాంకు సాధించిన 23 ఏళ్ల వార్దా ఖాన్ సివిల్స్ కల కోసం కార్పొరేట్ ఉద్యోగాన్ని వదిలి పెట్టింది. సొంతగా ఇంట్లో ప్రిపేర్ అవుతూ గతంలో ర్యాంక్ సాధించిన విజేతలతో స్ఫూర్తిపొందింది. నోయిడాలోని ఆమె ఇలాకా ఇప్పుడు సంతోషంతో మిఠాయిలు పంచుతోంది.

ఇంట్లో ప్రిపేరయ్యి విజేతల వీడియోలు చూసి

సివిల్స్‌కు ప్రిపేర్ అవుతుండగా వార్దా ఖాన్‌ను 'మాక్ ఇంటర్వ్యూ'లో ఒక ప్రశ్న అడిగారు– 'నువ్వు సోషియాలజీ చదివావు కదా. సమాజంలో మూడు మార్పులు తేవాలనుకుంటే ఏమేమి తెస్తావు' అని. దానికి వార్దా ఖాన్ సమాధానం 1.స్త్రీల పట్ల సమాజానికి ఉన్న మూస అభిప్రాయం మారాలి. వారికి అన్ని విధాల ముందుకెళ్లడానికి సమానమైన అవకాశాలు కల్పించగల దృష్టి అలవడాలి. 2. దేశ అభివృద్ధిలో గిరిజనులకు అన్యాయం జరిగింది. వారి సంస్కృతిని గౌరవిస్తూనే వారిని అభివృద్ధిలోకి తీసుకురావాలి. 3. దేశానికి ప్రమాదకరంగా మారగల మత వైషమ్యాలను నివారించాలి.

'నా మెయిన్ ఇంటర్వ్యూ కూడా ఇంతే ఆసక్తికరంగా సాగింది' అంటుంది వార్దా. నోయిడాకు చెందిన వార్దా ఖాన్ రెండో అటెంప్ట్‌లోనే సివిల్స్‌ను సాధించింది. 18వ ర్యాంక్ సాధించి సగర్వంగా నిలుచుంది.


కుటుంబ సభ్యులతో ఆనందం పంచుకుంటూ...

ఇంటి నుంచి చదువుకుని...

వార్దాఖాన్‌ది నోయిడాలోని వివేక్ విహార్. తండ్రి తొమ్మిదేళ్ల క్రితం చనిపోయాడు. చిన్నప్పటి నుంచి చదువులో చాలా ప్రతిభ చూపిన వార్దా వక్తృత్వ పోటీల్లో మంచి ప్రతిభ చూపేది. ఢిల్లీ యూనివర్సిటీ నుంచి కామర్స్‌లో గ్రాడ్యుయేషన్ చేసింది. ఆ వెంటనే కార్పొరేట్ సంస్థలో ఉద్యోగానికి చేరినా ఆమెకు అది సంతృప్తి ఇవ్వలేదు. ప్రజారంగంలో పని చేసి వారికి సేవలు అందించడంలో ఒక తృప్తి ఉంటుందని భావించి సివిల్స్‌కు ప్రిపేర్ అవసాగింది. అయితే అందుకు నేరుగా కోచింగ్ తీసుకోలేదు. కొన్ని ఆన్‌లైన్ క్లాసులు, ఆ తర్వాత సొంత తర్ఫీదు మీద ఆధారపడింది. అన్నింటి కంటే ముఖ్యం గతంలో ర్యాంకులు సాధించిన విజేతల వీడియోలు, వారి సూచనలు వింటూ ప్రిపేర్ అయ్యింది. 'సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యేటప్పుడు ఆందోళన, అపనమ్మకం ఉంటాయి. విజేతల మాటలు వింటే వారిని కూడా అవి వేధించాయని, వారూ మనలాంటి వారేనని తెలుస్తుంది. కనుక ధైర్యం వస్తుంది' అని తెలిపింది వార్దాఖాన్.

ఏకాంతంలో ఉంటూ...

'సివిల్స్‌కి ప్రిపేర్ అవ్వాలంటే మనం లోకంతో మన సంబంధాలు కట్ చేసుకోవాలి. నాకు నలుగురితో కలవడం, మాట్లాడటం ఇష్టం. కాని దానివల్ల సమయం వృథా అవుతుంది. సివిల్స్‌కు ప్రిపేర్ అయినన్నాళ్లు ఇతరులతో కలవడం, సోషల్ మీడియాలో ఉండటం అన్నీ మానేశాను. అయితే మరీ బోర్ కొట్టినప్పుడు ఈ సిలబస్ ఇన్ని గంటల్లో పూర్తి చేయగలిగితే అరగంట సేపు ఎవరైనా ఫ్రెండ్‌ని కలవొచ్చు అని నాకు నేనే లంచం ఇచ్చుకునేదాన్ని. అలా చదివాను' అని తెలిపిందామె.

పది లక్షల మందిలో...

2023 యు.పి.ఎస్.సి పరీక్షల కోసం 10,16,850 మంది అభ్యర్థులు అప్లై చేస్తే వారిలో 5,92,141 మంది ప్రిలిమ్స్ రాశారు. 14,624 మంది మెయిన్స్‌లో క్వాలిఫై అయ్యారు. 2,855 మంది ఇంటర్వ్యూ వరకూ వచ్చారు. 1,016 మంది ఎంపికయ్యారు. వీరిలో 664 మంది పురుషులు 352 మంది స్త్రీలు. ఇంత పోటీని దాటుకుని వార్దా ఖాన్ 18 వ ర్యాంకును సాధించిందంటే ఆమె మీద ఆమెకున్న ఆత్మవిశ్వాసమే కారణం. 'మిమ్మల్ని మీరు మోసం చేసుకోకుండా కష్టపడితే కచ్చితంగా సివిల్స్ సాధించవచ్చు' అని తెలుపుతోందామె. ఆమె ఐ.ఎఫ్.ఎస్ (ఇండియన్ ఫారిన్ సర్వీసెస్)ను తన మొదటి ప్రాధాన్యంగా ఎంపిక చేసుకుంది. 'గ్లోబల్ వేదిక మీద భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను తెలియచేసి దౌత్య సంబంధాల మెరుగులో కీలకపాత్ర పోషించడమే నా లక్ష్యం' అంటోంది వార్దా.

క్రియేటివ్ వరల్డ్

డెబ్యూ ఫిక్షన్ ఫీచర్ ఫిల్మ్ 'ఆల్ వి ఇమాజిన్ యాజ్ లైట్'తో ప్రపంచ దృష్టిని ఆకర్షించింది ముంబైకి చెందిన పాయల్ కపాడియా. కాన్స్ ఫిల్మ్‌ఫెస్టివల్‌లోని ప్రిస్టీజియస్ కాంపిటీషన్ సెక్షన్ పామ్ డ ఓర్ (గోల్డెన్ పామ్)లో పాయల్ ఫిల్మ్ పోటీ పడనుంది. మూడు దశాబ్దాల తరువాత మన దేశం నుంచి ఈ విభాగానికి ఎంపికైన చిత్రం ఇదే...

గోల్డెన్ బరిలో మన బంగారం


పాయల్ కపాడియా

ఎకనామిక్స్‌లో పట్టా పుచ్చుకున్న పాయల్‌కు ఆర్థికశాస్త్రం కంటే సినిమా శాస్త్రమే ఎక్కువగా దగ్గరైంది. ఆ ఇష్టంతోనే 'పుణె ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్'లో చేరాలనుకుంది. రెండో ప్రయత్నంలో ఫిల్మ్ డైరెక్షన్ కోర్సులో చేరింది. పాయల్‌కు తొలి గుర్తింపు ఆఫ్టర్‌నూన్ క్లౌడ్స్. కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్(2017)కు మన దేశం నుంచి ఎంపికైన ఏకైక చిత్రం ఇది. ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో సెకండ్ ఇయర్‌లో ఉన్నప్పుడు డైలాగ్ రైటింగ్ ఎక్సర్‌సైజ్‌లో భాగంగా 'ఆఫ్టర్‌నూన్ క్లౌడ్స్' స్క్రిప్ట్ రాసుకుంది.

పాయల్ శబ్దప్రేమికురాలు.

'చెవులు మూసుకొని సినిమా చూస్తే ఏ ఫీలింగ్ ఉండదు' అంటున్న పాయల్‌కు ఏ దృశ్యంలో ఎలాంటి శబ్దం ఉపయోగించాలో బాగా తెలుసు. 'సినిమాలు ఎందుకు తీస్తారు?' అనే ప్రశ్నకు ఒక్కొక్కరూ ఒక్కోవిధంగా జవాబు చెప్పవచ్చు. పాయల్ చెప్పే జవాబు మాత్రం... 'నన్ను నేను అర్థం చేసుకోవడానికి, చుట్టూ ఉన్న పరిస్థితులను అర్థం చేసుకోవడానికి చిత్రాలు తీస్తాను'

సినిమాను పాయల్ అర్థం చేసుకునే కోణం కూడా భిన్నమైనది. 'సినిమా అనేది ప్లాటే సర్వస్వంగా ఉండనక్కర్లేదు. చక్కని కవిత్వం చదివినట్లు ఉన్నా సరిపోతుంది' అనేది ఆమె మనసులోని భావం.

సోకాల్డ్ ఆడంబరాలు, పాపులర్ కల్చర్‌కు దూరంగా ఉండే 'రిషి వ్యాలీ స్కూల్'లో చదువుకున్న చదువు పాయల్ ఆలోచనలను విశాలం చేసింది.

ఇప్పుడంటే ప్రపంచ 'చిత్ర' పటంలో తనకంటూ కొంత గుర్తింపు సాధించింది పాయల్. కొన్ని సంవత్సరాలు వెనక్కి వెళ్లితే మాత్రం ఫిల్మ్ ఇనిస్టిట్యూట్‌కు సంబంధించి ఫస్ట్ రిజెక్షన్ ఆమెను అమితంగా బాధించింది. కలల మేడ కళ్ల ముందే కుప్పకూలినట్లుగా అనిపించింది.

'స్కూల్ రోజుల నుంచి పుణె ఫిల్మ్ ఇనిస్టిట్యూట్‌లో చేరాలనేది నా కల. ఎందుకంటే నేను అభిమానించే ఎంతో మంది దర్శకులు అక్కడ చదువుకున్నారు. మొదట బాధ అనిపించినా ఆ తరువాత రెండో ప్రయత్నం చేయాలనుకున్నాను' అంటూ గతాన్ని గుర్తు తెచ్చుకుంటుంది పాయల్. రెండో ప్రయత్నం చేసి ఉండకపోతే ఆమె ప్రతిభ వృథాగా పోయేది.

'ఆఫ్టర్‌నూన్ క్లౌడ్స్'కు లభించిన గుర్తింపుతో పాయల్ మనసులో ఆత్మవిశ్వాసం అనే బీజం పడింది. 'ది లాస్ట్ మ్యాంగో బిఫోర్ ది మాన్‌సూన్' ఫిల్మ్‌తో ఆ విత్తనం మొలకెత్తింది. ఈ షార్ట్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ క్రిటిక్స్ ప్రైజ్ గెలుచుకుంది.'ఏ నైట్ ఆఫ్ నోయింగ్ నథింగ్'తో ప్రపంచ దృష్టిని ఆకర్షించింది పాయల్. ఇది కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ (2021)లో బెస్ట్ డాక్యుమెంటరీ ఫిల్మ్ 'గోల్డెన్ ఐ' అవార్డ్ అందుకుంది.

ఫిల్మ్‌మేకర్స్ డిజిటల్ ప్రపంచంలో ఉన్న ఈ కాలంలోనూ 'ఫిల్మ్' అంటే పాయల్‌కు ప్రత్యేక ఇష్టం. 'ఆఫ్టర్‌నూన్ క్లౌడ్స్'ను ఫిల్మ్ పైనే షూట్ చేసింది. 'డిజిటల్ ఫిల్మ్‌తో పోల్చితే ఓల్డ్-స్కూల్ ఫిల్మ్‌లో ఇమేజ్‌కు సంబంధించిన ఈస్తెటిక్ క్వాలిటీ, సాఫ్ట్‌నెస్ భిన్నంగా ఉంటుంది' అంటుంది పాయల్.

ఫిల్మ్‌మేకింగ్ అనేది ఇలా అనుకోగానే అలా అయిపోదు. కొన్నిసార్లు చాలా టైమ్ తీసుకోవచ్చు. అందుకు ఎంతో ఓపిక అవసరం. అందుకే చిత్రనిర్మాణాన్ని శిల్పం చెక్కడంతో పోల్చుతుంది పాయల్. 'చిత్రనిర్మాణం అనేది చాలా ఓపికగా శిల్పం చెక్కడం లాంటిది. ఆ శిల్పం ఎలా రూపుదిద్దుకోనుందో శిల్పికి కూడా తెలియదు. చిత్రం కూడా అంతే' అంటుంది పాయల్.

పాయల్ తల్లి నళిని మలాని ఆర్టిస్ట్. దేశవిదేశాలకు చెందిన అత్యుత్తమ సినిమాల క్యాసెట్లను ఇంటికి తీసుకువచ్చేది. సినిమాలపై పాయల్ ఆసక్తికి తల్లి ఫిల్మ్ కలెక్షన్ ఒక కారణం. 'చూడాలేగానీ మన చుట్టూ ఉన్న పరిసరాల్లోనే ఎంతో అందం దాగుంది. అలాంటి అందాలను అమ్మ ఆస్వాదిస్తూ ఎప్పుడూ ఉత్సాహంగా ఉండేది' అంటుంది పాయల్.

తల్లి ప్రభావం పాయల్‌పై కనిపిస్తుంది. 'జీవనోత్సాహం నుంచే సృజన జనిస్తుంది' అంటున్న పాయల్ తనదైన విజువల్ లాంగ్వేజ్‌ను తయారు చేసుకుంటోంది.

మూడు దశాబ్దాల తరువాత...



పాయల్ కపాడియా గుర్తింపును మరో స్థాయికి తీసుకు వెళ్లిన ఫీచర్ ఫిల్మ్ ఆల్ వి ఇమాజిన్ యాజ్ లైట్. ముంబైలోని నర్స్ ప్రభ. భర్త, ప్రభ స్నేహితురాలు అను కేంద్రంగా సాగే చిత్రం ఇది. షాజీ ఎస్ కరుణ్ మలయాళ చిత్రం 'స్వాహమ్' తరువాత కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రధాన పోటీకి ఎంపికైన చిత్రంగా ప్రత్యేకతను సాధించి ప్రశంసలు అందుకుంటోంది. 'ఆల్ వి...'కి దర్శకత్వంతో పాటు రచన కూడా చేసింది పాయల్. ఈ చిత్రంలో దివ్య ప్రభ(మలయాళం సినిమా టేక్ ఆఫ్ ఫేమ్), కనీ కుస్రుతి (కేరళ కేఫ్ ఫేమ్), హృదు హరూన్ నటించారు.

వారసత్వ కళకు కొత్త జీవం

✻ కసుతి

ఆశాపాటిల్, సీమా కిశోర్ ఇద్దరూ వ్యాపారవేత్తలు ఇద్దరూ స్నేహితులు అయ్యారు. కర్ణాటక వాసులైన వీరి సంభాషణలో ఒకసారి... అంతరించిపోతున్న గిరిజనుల సాంస్కృతిక కళాకాంతుల గురించి చర్చ వచ్చింది. 'గిరిజన సంస్కృతిని కాపాడుకుందాం' అనుకున్నారు. వెంటనే తమ ఆలోచనను అమలులో పెట్టారు. కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర, గోవా రాష్ట్రాలలో ఉన్న బంజారాల గురించి తెలుసుకున్నారు. వారి నివాస స్థావరాలను కనుక్కొని, అక్కడి మహిళలను కలుసుకున్నారు. వారి వస్త్రాభరణాల కళారూపాలను కొంగొత్తగా ప్రపంచ మార్కెట్ ముందుకు తీసుకు వస్తున్నారు. అంతేకాదు, బంజారా మహిళల అక్షరాస్యత, ఆరోగ్యం, విద్య.. మొదలైన అంశాలపై వీరిద్దరూ కలిసి చేస్తున్న ప్రయత్నం నేడు ఎంతోమందికి ఉపాధినిస్తోంది.


బంజారాలతో ఆశాపాటిల్, సీమా కిశోర్

సమకాలీన ఫ్యాషన్‌లో తమదైన స్థానం కోసం పోరాడుతున్న లంబాడీ సమాజ సంప్రదాయ కళలను గమనించిన ఆశా పాటిల్, సీమా కిశోర్ వారి సాంస్కృతిక వారసత్వానికి కొత్త జీవం పోయడానికి ప్రయాణం ప్రారంభించారు.

అద్దం చుట్టూ పూసలు

లంబాడీల ఎంబ్రాయిడరీ చూస్తే ఒక అద్దం నుంచి మరొక అద్దం, ఒక పూస నుంచి మరొక పూస, రంగు రంగుల దారాలతో ఎంతో సొగసుగా కనిపిస్తుంది. దీనినే వారి జీవనోపాధికి ముఖ్య భూమికగా మార్చాలనుకున్నారు. బంజారాలు, లంబాడీలు అని కూడా పిలిచే వీళ్లంతా మొదట రాజస్థాన్ నుండి వచ్చిన సంచార గిరిజనులు. ఎక్కువగా కర్ణాటకలో స్థిరపడ్డారు. మరికొందరు తెలంగాణ, మహారాష్ట్ర, గోవా వంటి ఇతర రాష్ట్రాలలో ఉన్నారు. వారి సంస్కృతి, భాష, జీవనశైలిలో వారి వస్త్రాలు, ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించుకొని ఉంటారు. వారి వస్త్రాల కళను ఆధునిక ప్రజలు ఇష్టపడేలా మార్పులు చేసి, ప్రపంచం ముందుకు తేవాలనుకున్నారు. తండాలుగా పిలిచే లంబాడీ నివాసాలను ఆశాపాటిల్ క్రమం తప్పకుండా సందర్శించేది. బంజారాల అత్యుత్తమ కళాత్మక నైపుణ్యాలు ఆధునిక కాలంలో చోటు దక్కించుకోవడానికి కష్టపడడాన్ని ఆమె చూసింది. కసుతి ఎంబ్రాయిడరీ చాలా క్లిష్టమైనది. 2017లో, ఆమె తన స్నేహితురాలు సీమా కిశోర్‌తో కలిసి బంజారా 'కసుతి' అనే సంస్థను స్థాపించింది. ఆధునిక పోకడలను సృష్టించడానికి బంజారా మహిళలు అంతే ఉత్సాహంతో పనిచేశారు.

పోరాట మహిళలకు మద్దతుగా!

బంజారా కళాకారిణి లలితా జాదవ్ ఆధునిక సమాజంలో తమ మహిళలు చేస్తున్న పోరాటాలను వివరిస్తూ 'మేం వ్యవసాయం లేదా భవన నిర్మాణ కార్మికులుగా పని చేస్తుండేవాళ్లం. మా ఇళ్లు, కుటుంబాలకు దూరంగా నెలల తరబడి పని చేసేవాళ్లం. సుదీర్ఘ ప్రయాణాలు, అధిక పని ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు చూపుతుండేవి. బంజారా స్థావరాలకు పాటిల్ తరచూ వస్తుండేవారు. ఆమె ఒకసారి ఈ కళారూపాన్ని కాపాడుకోవడానికే, కమ్యూనిటీ సంప్రదాయాలను పునరుజ్జీవింపజేసేందుకు తాము నెలకొల్పిన సంస్థ ఎలా లక్ష్యంగా పెట్టుకుందనే విషయాన్ని చెప్పింది. అనేక సందర్భాల్లో ఆమెతో మాట్లాడిన తరువాత, ఈ అవకాశం మా కుటుంబ ఆదాయానికి తోడ్పడటమే కాకుండా శతాబ్దాలుగా మాకు తెలిసిన, అలంకరించబడిన కళారూపాన్ని పునరుద్ధరించగలమని గ్రహించాం' అని చెబుతుంది.

నైపుణ్యాలకు నెలవు

పాటిల్, కిషోర్ కృషి వల్ల బంజారా మహిళల్లో తగ్గిపోతున్న నైపుణ్యానికి చోటు



దక్కడమే కాకుండా వారి ఆర్థిక, ఆరోగ్య స్థితిని మెరుగుపరచడానికీ దోహదపడింది. అంతేకాకుండా, వీరిద్దరూ లంబాడీ సమాజంలోని అమ్మాయిలకు వారి వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లడానికి ఆసక్తిని రేకెత్తించారు. 'కసుతి ఎంబ్రాయిడరీ సంప్రదాయ–ఆధునిక మేళవింపులతో ఉంటుంది. ఒక తెగకు మాత్రమే పరిమితమైన ఈ కళను ఆధునిక మహిళకు చేరువ చేస్తున్నాం. నేరుగా మార్కెటింగ్ చేయడమే కాదు ఆన్‌లైన్ ఆర్డర్ల ద్వారా గిరిజన మహిళలు ఉపాధి పొందుతున్నారు. 'మహిళలు మరిచిపోయిన కొన్ని సాంప్రదాయ కుట్లు, అల్లికలను అభివృద్ధి చేయడానికి వారికి తగిన ఆసరాతోపాటు అందుకు అవసరమైన శిక్షణను కూడా ఇందిస్తున్నాం. పర్యావరణ అనుకూలమైన దుస్తులు, శక్తిమంతమైన దారాల రూపకల్పనను పట్టణ సమాజానికి చేరువచేస్తున్నాం. అంతేకాదు గిరిజనుల సంస్కృతి, నైతికత, ప్రామాణికతను మనం గౌరవించాలి. అందుకే, వారి సంప్రదాయ పండుగలు, వేడుకలలో పాల్గొంటాం' అని వారు చెప్పారు. సంప్రదాయ కళలను పునరుద్ధరించడమే కాదు స్థానిక కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరాన్ని గ్రహించాం' అని వివరిస్తారు ఈ వ్యాపార ద్వయం.

బ్యూటిప్స్
వేసవిలో చర్మానికి సాంత్వన



- **హనీ– యోగర్ట్ మాస్క్:** ఒక టేబుల్ స్పూన్ తేనెలో ఒక టేబుల్ స్పూన్ తాజా పెరుగు కలిపి ముఖం, మెడ, చేతులకు రాసి పదిహేను నిమిషాల తర్వాత చన్నీటితో ముఖం కడగాలి.



- **వాటర్ మెలన్ మాస్క్:** పుచ్చకాయ ముక్కలు అర కప్పు తీసుకుని చిదిమి గుజ్జు చేయాలి. ఆ గుజ్జును, నీటిని ముఖానికి, మెడకు పట్టించాలి. ఆరిన తర్వాత చన్నీటితో శుభ్రం చేయాలి.



- **కోకోనట్ ఆయిల్– టర్మరిక్ మాస్క్:** టేబుల్ స్పూన్ కొబ్బరినూనెలో అర టీ స్పూన్ స్వచ్ఛమైన పసుపు కలిపి ముఖం, మెడ, చేతులు, పాదాలకు పట్టించాలి. కొంత ఆరిన తర్వాత (పూర్తిగా ఎండిపోకముందు) వేళ్లతో వలయాకారంగా మర్దన చేసి చన్నీటితో శుభ్రం చేయాలి. నూనె జిడ్డు పూర్తిగా వదలకపోయినప్పటికీ నీటితో కడిగి టిష్యూతో తుడవాలి తప్ప సబ్బు వాడరాదు.



- **పపయా– హనీ మాస్క్:** బాగా పండిన బొప్పాయి పండు ముక్కలు అర కప్పు తీసుకుని బాగా చిదమాలి. అందులో టేబుల్ స్పూన్ తేనె కలపాలి. ఈ మిశ్రమాన్ని చర్మానికి పట్టించి పదిహేను నిమిషాల తర్వాత చన్నీటితో శుభ్రం చేయాలి.



- **మింట్ – కుకుంబర్ మాస్క్:** కీరదోస కాయ చెక్కు అర కప్పు ముక్కలు తీసుకోవాలి. అందులో గుప్పెడు పుదీన ఆకులు వేసి మిక్సీలో గ్రైండ్ చేసి చర్మానికి పట్టించాలి. ఆరిన తర్వాత చన్నీటితో శుభ్రం చేయాలి.

ఈ డాక్టర్ ఇల్లు... ఔషధాల హరివిల్లు


డాక్టర్ అన్షు రాతీ

డాక్టర్ ప్రిస్క్రిప్షన్ రాస్తూ... 'ఆరోగ్యంగా ఉండాలంటే కాఫీ, టీ లతో రోజును మొదలు పెట్టకండి' అని చెబితే ఆ కఠోరమైన సూచనను జీర్ణించుకోవడం కొంచెం కష్టమే. డాక్టర్ ముందు బుద్ధిగా తలూపుతాం. పాటిస్తామని గొంతులో నిజాయితీని ధ్వనింపచేస్తూ బదులిస్తాం. మరునాడు తెల్లవారి కాఫీ–టీలు తాగిన తర్వాతగానీ ముందురోజు డాక్టర్‌కు ఇచ్చిన మాట గుర్తు రాదు. ఇదంతా మన బ్రెయిన్ మనతో ఆడుకునే ఆటలో భాగం. అయితే ఈ డాక్టర్ మాత్రం టీ వద్దనే వద్దని చెప్పనే చెప్పరు. 'హాయిగా టీ తాగండి. దేహానికి హాయినిచ్చే తాజా ఔషధ ఆకులతో చేసిన టీని తాగండి' అంటూ ఒక పెద్ద జాబితానే సూచిస్తారు. అవన్నీ ఇంట్లో సాధ్యమే అంటూ తన ఇంటి టెర్రస్‌ను చూపిస్తారీ ఉత్తరాఖండ్ డాక్టర్ అన్షు రాతీ. ఆమె టెర్రస్ మీద 1500 అడుగుల విస్తీర్ణం కలిగిన టెర్రస్ మీద మిరియాలు, యాలకుల చెట్లతో సహా 400 మొక్కలను పెంచుతున్నారు. అందులో పండ్లు, కూరగాయలతో పాటు అశ్వగంధ, తులసి, ఆరెగానో, పసుపు, మిరియాలు, కుంకుమ పువ్వు, లవంగాలు, జాజికాయ, సోంపు, మెంతులు, బిర్యానీ ఆకు, దాల్చిన చెక్క, ఇంగువ, మిర్చి, కొత్తిమీర, కలోంజి (నల్ల జీలకర్ర) వంటి 15 రకాల ఔషధ మూలికల మొక్కలున్నాయి. ఏడాదంతా సీజనల్‌గా వచ్చే అనేక అనారోగ్యాల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండాలంటే... ఆయా కాలాల్లో ప్రకృతి ఇచ్చిన ఔషధాలను ఆహారంగా తీసుకోవాలని చెబుతున్నారు 36 ఏళ్ల అన్షురాతీ.



నేర్చుకోండి... పచ్చగా పెంచుకోండి!

"మనదేశంలో వాతావరణం వైవిధ్యంగా ఉంటుంది. ప్రదేశాలు, కాలాలను బట్టి ఆయా నేలల్లో కొన్ని ప్రత్యేకమైన జాతులు విస్తరిస్తుంటాయి. వాటికి అనువైన పరిస్థితులను అంచనా వేయగలిగితే వాటన్నింటినీ ఒకే చోట పెంచవచ్చు. కొత్తిమీర, మిరియాలు, జీలకర్రలను పెంచాలంటే అక్టోబర్– నవంబర్ నెలల్లో నారు పోయాలి. పసుపును మే–జూన్ నెలల్లో నాటాలి. నాటడం నుంచి ప్రతి దశనూ ఆస్వాదించాలంటే అలా చేయవచ్చు. గార్డెనింగ్‌లో అనుభవం లేని వాళ్లు మాత్రం నారుమడిలో గింజలు చల్లడం నుంచి మొదలు పెట్టకుండా నర్సరీ నుంచి నారు మొలకలను కొనుక్కోవడం మంచిది. మిరియాలు, యాలకుల వంటి వాటిని నాటేముందు రాత్రంతా నానబెట్టాలి. జీలకర్ర, మెంతులు, ఆవాలను నానబెట్టాల్సిన అవసరం లేదు. అలాగే నాటే పంటల కాల వ్యవధిని కూడా గమనించుకోవాలి. కొత్తిమీర రెండు వారాల్లో చేతికొస్తుంది, మెంతికి నాలుగు రోజులు చాలు. జీలకర్ర నారు 45 రోజులు తీసుకుంటుంది. ముందుగా ఒక కప్పులో నారు పోసి మొలకలు వచ్చిన తర్వాత ఆ నారు తీసి పెద్ద కుండీలు లేదా ట్రేలలో నాటాలి. ఈ ట్రేలను ఓ వారం రోజుల పాటు నీరెండలో ఉంచి ఆ తర్వాత ఎండలోకి మార్చాలి. జీలకర్ర, కొత్తిమీర (ధనియాలు రావడానికి) పంట రావడానికి ఐదు నెలలు పడుతుంది. మిరియాలు మూడేళ్లు, యాలకులు ఐదేళ్ల సమయం తీసుకుంటాయి. మొక్కలు పెంచడంలో మట్టిని పరిశీలించుకోవడం చాలా ముఖ్యం. మనం ఉన్న ప్రదేశంలో లభించే మట్టి స్వభావాన్ని గమనించుకోవాలి. మట్టిని పట్టుకుని ముద్ద చేసినప్పుడు సులభంగా బంతి ఆకారం వస్తే ఆ మట్టి జిగురుగా ఉన్నట్లు. అందులో 20 శాతం ఇసుక, 30 శాతం ఆవుపేడ, వేప పిప్పి కలపాలి. ఇలా తయారు చేసుకున్న మట్టిలో నాటిన మొక్కలకు తరచు ఎరువులు వేయాల్సిన అవసరం ఉండదు. పంటకోతకు రావడానికి రెండువారాల ముందు వర్మీ–కంపోస్టు వేస్తే సరిపోతుంది. నేనున్నది గంగా నది– యమునా నదికి మధ్య విస్తరించిన నేల. ఇక్కడ మట్టి... మొక్కలు పెరగడానికి అనువుగా ఉంటుంది. కాబట్టి ప్రత్యేకమైన జాగ్రత్తలేవీ అవసరం లేదు. వంటగది వ్యర్థాలనే ఎరువుగా వేస్తున్నాను. వీటన్నింటినీ సొంతంగా పెంచుకోవడం అసాధ్యమేమీ కాదు. కొంత సమయం, మరికొంత శ్రద్ధ ఉంటే చాలు. ఉదయాన్నే అరలీటరు నీటిలో తులసి, మెంతితోపాటు నచ్చిన తాజాఆకులను వేసుకుని పావు లీటరు అయ్యే వరకు మరిగించి రుచి కోసం తేనె కలుపుకుని తాగడం అలవాటు చేసుకుంటే ఆరోగ్యం కోసం ప్రయాస పడాల్సిన అవసరమే ఉండదు. ఇంట్లోనే ఫార్మసీ, మీరే వైద్యులు" అని ఆరోగ్యం కోసం ఔషధాలను కప్పులో పోసి ఇస్తున్నారు డాక్టర్ అన్షు రాతీ.



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 26

గురువారం 18-4-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఢిల్లీ అదరహో...

గుజరాత్‌పై 6 వికెట్ల తేడాతో విజయం.. మెరిసిన పంత్, ముకేశ్ - 12లో



'స్పేస్'లో మరిన్ని ఎఫ్‌డీఐలకు సై

ఉపగ్రహాల తయారీలో 74% వరకు, విడి భాగాల్లో 100% వరకు అనుమతి -13లో



బాలరాముడికి సూర్య తిలకం

శ్రీరామనవమి పర్వదినాన అయోధ్య బాలరాముడు సూర్య తిలకంతో కోట్లాది మంది భక్తులకు ఆశీస్సులందించాడు.

వివరాలు 6లో ▸



దేశ జనాభా 144.17 కోట్లు!

భారత్ జనాభా 144.17 కోట్లకు చేరిందని.. 24 శాతం మంది 14 ఏళ్లలోపు వారేనని ఐక్యరాజ్యసమితి పాపులేషన్ ఫండ్ తెలిపింది.


వివరాలు 6లో ▸



చీలికకు కేంద్రమే కారణం

సంయుక్త కిసాన్ మోర్చాలో చీలికకు కేంద్రమే కారణమని భారతీయ కిసాన్ యూనియన్ నేత రాకేశ్ తికాయత్ ఆరోపించారు.

వివరాలు 6లో ▸



'ఆప్ కా రామ్‌రాజ్య'

శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఆమ్ ఆద్మీ పార్టీ 'ఆప్ కా రామ్‌రాజ్య' పేరుతో వెబ్‌సైట్ లాంచ్ చేసింది.

వివరాలు 6లో ▸

బాబు నుంచి షర్మిలకు రూ. 60 కోట్లు



- చంద్రబాబు ఫైనాన్స్ చేయక పోతే ఆమెకు అంత డబ్బు ఎక్కడిది?
- చంద్రబాబు డ్రామాలో షర్మిల, సునీత పాత్రధారులు
- వివేకా కేసులో రాజకీయ కోణం లేదు.. మరో సంబంధం ఉంది
- సునీత, రాజశేఖర్‌రెడ్డికి నార్కో అనాలసిస్ టెస్టులు చేయాలి
- వైఎస్సార్‌సీపీ నేత ఆర్. రమేష్‌కుమార్‌రెడ్డి

10 లో



మహానటి.. సునీత

- తన తండ్రి వివేకా రెండో వివాహం గురించే తెలియదట
- షమీమ్‌ను రెండో పెళ్లి చేసుకోవడంతోనే ఆయన కుటుంబంలో విభేదాలు
- వివేకా ఆస్తిపై సునీత భర్త రాజశేఖరరెడ్డి కన్ను
- షమీమ్‌కు బెదిరింపులు

10 లో

వ్యూహకర్తలు హ్యాండ్సప్..

జారిన జాకీలు!

విశ్వసనీయత లేని చంద్రబాబుకు జనాదరణ లేదని తేల్చిన రాబిన్ శర్మ బృందం

జనసేన, బీజేపీతో అసహజ పొత్తు వల్ల నష్టమే కానీ లాభం లేదు

- మూడు పార్టీల మధ్య ఓట్ల బదలాయింపు కష్టమేనన్న సర్వేలు
- సీట్లు అమ్ముకుంటే ఎన్నికల్లో ఎలా గెలుస్తారని రాబిన్ నిర్వేదం.. సర్వేలు, స్థానిక పరిస్థితులతో సంబంధం లేకుండా సీట్లిచ్చారు
- పార్టీ కోసం పని చేసిన వారిని పక్కనపెట్టి.. ధనవంతులకే సీట్లు
- క్షేత్రస్థాయి పరిస్థితిని వివరించినా పట్టించుకోనప్పుడు మేమెందుకు?
- తమ ప్రయత్నాలు అంతా వృథా అయ్యాయని ఆక్రోశం
- రాబిన్ శర్మ చేతులెత్తేయడంతో పీకేని రంగంలోకి దించిన బాబు
- పీకే మధ్యవర్తిత్వంతో అయిష్టంగా పనిచేస్తున్న రాబిన్ బృందం



సాక్షి, అమరావతి: ఎన్ని ఎత్తుగడలు వేసినా.. ఎంత హైప్ ఇచ్చినా.. జాకీల నుంచి పోల్‌క్లెయిన్ల దాకా అన్నీ వాడి చూసినా టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు గ్రాఫ్ ఏమాత్రం పెరగడం లేదని పార్టీ వ్యూహకర్తలు తేల్చేశారు! తాము చేసిన ప్రయత్నాలేవీ ఫలించడం లేదని, ఎన్నికల్లో టీడీపీ గెలుపు దుర్లభమని పార్టీ ప్రధాన వ్యూహకర్త రాబిన్ శర్మ చేతులెత్తేశారు. టీడీపీ ముఖ్య నేతల్లో ఇప్పుడు ఇది హాట్ టాపిక్‌గా మారింది. చంద్రబాబుకు ఏమాత్రం విశ్వసనీయత లేకపోవడమే అసలు సమస్య అని రాబిన్ బృందం తేల్చింది. ప్రజలు ఆయన చెప్పే మాటలను నమ్మడం లేదని, అందువల్లే ఆరు నెలల ముందే విడుదల చేసిన శాంపిల్ మేనిఫెస్టో నిష్ఫలంగా మారిందనే అంచనాకు వచ్చారు. 'బాబు ష్యూరిటీ–భవిష్యత్తుకు గ్యారంటీ' పేరుతో సూపర్ సిక్స్ పథకాల గురించి

మిగతా 2వ పేజీలో ▶

కూటమి చిలుక 'పీకే'



- ఆయన టీడీపీ, బీజేపీ కూటమికి పనిచేస్తున్నారు
- అందుకే చంద్రబాబుకు అనుకూలంగా జోస్యం
- పశ్చిమ బెంగాల్ సీఎం మమత వెల్లడి
- బిహార్‌లో రాజకీయంగా చెల్లక ప్యాకేజీ కోసం టీడీపీకి సేవలు.. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ ఎన్నికల్లో వికటించిన పీకే జోస్యం

2 లో



నేటి నుంచి నామినేషన్ల పర్వం

- రాష్ట్రంలో మే 13న జరిగే 175 అసెంబ్లీ, 25 లోక్‌సభ స్థానాలకు నేడు ఎన్నికల నోటిఫికేషన్
- ఏప్రిల్ 25 వరకు నామినేషన్ల స్వీకరణ.. 26న పరిశీలన
- 29 వరకు ఉపసంహరణకు చాన్స్
- ఉ.11 నుంచి మ.3 గంటల వరకు నామినేషన్ల దాఖలుకు అవకాశం
- ఒక అభ్యర్థి గరిష్టంగా నాలుగు సెట్ల నామినేషన్లు వెయ్యొచ్చు
- గుర్తింపు పొందిన పార్టీ అభ్యర్థికి ఒకరు, స్వతంత్ర అభ్యర్థికి పదిమంది ఓటర్లు ప్రతిపాదించాలి
- ఎంపీ అభ్యర్థి నామినేషన్ రుసుం రూ.25,000.. ఎమ్మెల్యేకు రూ.10,000
- ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం రాయితీ.. నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు పూర్తి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా వెల్లడి

3 లో



ఒంటిమిట్టలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

వైఎస్సార్‌జిల్లా ఒంటిమిట్టలోని శ్రీకోదండరామస్వామి ఆలయంలో బుధవారం ధ్వజారోహణంతో శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 22న సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు శ్రీసీతారాముల కల్యాణం కన్నుల పండువగా జరుగనుంది.

5 లో

అభిమానం.. ఆకాశమంత

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల్లో అమితాదరణ



- కిలోమీటర్ల కొద్దీ వెన్నంటి వస్తున్న వీరాభిమానులు
- జిల్లాలు దాటి ఎండా, వాన లెక్క చేయకుండా ప్రయాణం
- పగలూ, రాత్రి తేడా లేకుండా వేచిచూస్తున్న అవ్వాతాతలు
- చిందులు వేస్తూ ఉత్సాహపరుస్తున్న యువత
- వేలాది బైకులతో భారీ ర్యాలీలు
- గజమాలల పరిమాణం దాటి క్రేన్లు వాడాల్సిన పరిస్థితి
- టన్నుల కొద్దీ పూలతో సీఎంకు భారీ దండలు, గజమాలలు
- భారీ కటౌట్లు, ఫ్లెక్సీలు, బాణ సంచాలతో అఖండ స్వాగతాలు
- మేమంతా సిద్ధం బస్సు యాత్రలో అడుగడుగునా అపురూప దృశ్యాలు

2 లో

సెగలు.. భగభగలు

- 46 డిగ్రీల దిశగా ఉష్ణోగ్రతలు
- పలుచోట్ల 42–45 డిగ్రీలకు పైగా నమోదు
- విజృంభిస్తున్న తీవ్ర వడగాడ్పులు
- రాయలసీమ మీదుగా కొనసాగుతున్న ద్రోణి
- అక్కడక్కడ తేలికపాటి వర్షాలకు అవకాశం

14 లో





అవినీతి 'జీవి'

'తూర్పు'లో అభివృద్ధి వికాసం

మళ్లీ జగన్‌దే గెలుపు

ప్రముఖ సినీ హీరో విశాల్

నాన్‌లోకల్ 'నాయిక'

- వివరాలు I, II, III, IVలో

'అటానమస్'లోనూ ఏపీ అదుర్స్!

దేశంలో అత్యధిక అటానమస్ కళాశాలలు కలిగిన టాప్-3 రాష్ట్రాల్లో ఏపీ

తమిళనాడు, మహారాష్ట్ర తర్వాత స్థానం

165 ఉన్నత విద్య కళాశాలలకు అటానమస్ హోదా

పెద్ద రాష్ట్రాలైన యూపీ, రాజస్థాన్, మధ్యప్రదేశ్ కంటే మెరుగైన పనితీరు

సాక్షి, అమరావతి: ఉన్నత విద్య కళాశాలలకు స్వయం ప్రతిపత్తి సాధనలో రాష్ట్రం దూసుకెళ్తోంది. దేశంలోని అత్యధిక సంఖ్యలో అటానమస్ కళాశాలలు కలిగిన మొదటి ఐదు రాష్ట్రాల జాబితాలో ఏపీ చోటు దక్కించుకుంది. తమిళనాడు, మహారాష్ట్ర తర్వాత 165 స్వయం ప్రతిపత్తి కలిగిన కళాశాలలతో ఏపీ మూడో స్థానంలో నిలుస్తోంది. ఏపీ తర్వాతే తెలంగాణ, కర్ణాటక ఉన్నాయి. మరీ ముఖ్యంగా పెద్ద రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ కంటే మెరుగైన విద్యా ప్రమాణాలు, ఫలితాలు, సమగ్ర మౌలిక వసతుల కల్పనల ద్వారా

మిగతా 11వ పేజీలో ▶



దర్యాప్తు కొలిక్కి

- సీఎం జగన్‌పై హత్యాయత్నం కేసును ఛేదించిన పోలీసులు
- దాడికి పాల్పడ్డ దుండగుడి గుర్తింపు
- ఓ టీడీపీ నేతతోపాటు అదుపులో కీలక నిందితులు
- కుట్ర కోణంపై కీలక సమాచారం రాబట్టిన పోలీసులు
- విచారణలో సంచలన విషయాలు వెల్లడి!
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి పోలీసుల నివేదిక
- నేడు దర్యాప్తు వివరాలను వెల్లడించే అవకాశం

3 లో

క్లుప్తంగా...

అన్ని కాలాల్లోనూ రామరాజ్యమే ఆదర్శం: సీఎం జగన్

సాక్షి, అమరావతి: రాముడు ధర్మ స్వరూపుడు.. సత్యనిష్టకూ ధర్మనిరతికీ ప్రతీక అని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. 'శ్రీరామ జయం.. సకల ప్రజల విజయం. అందుకే అన్ని కాలాల్లోనూ ఆదర్శం రామరాజ్యం. ధర్మం పక్షాన నిలబడి, ప్రజలను మరింత బలసంపన్నులను చేయాలని శ్రీ రామచంద్ర ప్రభువును వేడుకుందాం. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలందరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలు' అంటూ సీఎం వైఎస్ జగన్ బుధవారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

సీఎం శిబిరం వద్ద గట్టి బందోబస్తు



తేతలిలో సీఎం వైఎస్ జగన్ బస చేసిన శిబిరం వద్ద పోలీస్ బందోబస్తు

తణుకు టౌన్: 'మేమంతా సిద్ధం' పేరుతో ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన బస్సు యాత్రకు బుధవారం శ్రీరామనవమి పర్వదినం కావడంతో విరామం ఇచ్చారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు రూరల్ మండలం తేతలి వద్ద విడిది శిబిరంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విశ్రాంతి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన శిబిరం చుట్టూ పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు, భద్రతను ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఐజీ అశోక్‌కుమార్ పరిశీలించారు. కాగా సీఎం వైఎస్ జగన్‌ను చూసేందుకు పరిసర గ్రామాల నేతలు, కార్యకర్తలు శిబిరం వద్దకు భారీ ఎత్తున వచ్చారు.

కూటమి చిలుక పీకే

- అందుకే చంద్రబాబు, బీజేపీకి అనుకూలంగా పీకే పలుకులు
- తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ ఎన్నికల్లో వికటించిన ప్రశాంత్ కిశోర్ జోస్యం



సాక్షి, అమరావతి: తాను ఏ రాజకీయ పార్టీకీ ఎన్నికల వ్యూహకర్తగా పనిచేయడం లేదంటూ ప్రశాంత్ కిశోర్ (పీకే) వల్లె వేస్తున్న మాటల్లో వీసమెత్తు నిజం లేదని స్పష్టమైంది. ఏపీలో టీడీపీ–బీజేపీ కూటమికి పీకే ఎన్నికల వ్యూహకర్తగా పని చేస్తున్నట్లు పశ్చిమ బంగాల్ సీఎం మమతా బెనర్జీ వెల్లడించారు. ఈమేరకు బుధవారం టీవీ 9 బంగ్లా చానెల్‌కు మమతా బెనర్జీ ఇంటర్వ్యూ ఇచ్చారు. 'పీకే ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ–బీజేపీ కూటమికి ఎన్నికల వ్యూహకర్తగా పనిచేస్తున్నారు. అందుకే ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబుకు, పశ్చిమ బెంగాల్‌లో బీజేపీకి అనుకూలంగా పీకే జోస్యం చెబుతున్నారు' అని వెల్లడించారు. మమతా బెనర్జీ వ్యాఖ్యలను బట్టి పీకే చంద్రబాబు విసిరిన ప్యాకేజీ తీసుకుని టీడీపీకి ఎన్నికల వ్యూహకర్తగా పనిచేస్తున్నట్లు స్పష్టమవుతోంది. అందుకనే టీడీపీ గెలిచే అవకాశం ఉందంటూ చంద్రబాబుకు అవసరమైనప్పుడల్లా జోస్యం చెబుతున్నట్లు తేలిపోయింది.

బాబు అరెస్టు తరువాత..

స్కిల్ స్కామ్‌లో చంద్రబాబు అరెస్టు అనంతరం భయపడి ఢిల్లీలో తలదాచుకున్న సమయంలో నారా లోకేష్ పీకేను కలిశారు. తమకు ఎన్నికల వ్యూహకర్తగా పని చేయాలని వేడుకున్నారు. ఈక్రమంలో చంద్రబాబు బెయిల్‌పై విడుదలయ్యాక పీకేను ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు అక్కడి నుంచి విజయవాడకు సీఎం రమేష్ స్పెషల్ ఫ్లైట్‌లో లోకేష్ తీసుకొచ్చారు. ఉండవల్లిలోని తమ అక్రమ నివాసంలో చంద్రబాబుతో సమావేశం ఏర్పాటు చేశారు. అయితే అప్పుడు తాను ఏ పార్టీకీ వ్యూహకర్తగా పని చేయడం లేదని పీకే చెప్పారు.

బిహార్‌లో కలసి రాకపోవడంతో..

బెంగాల్ ఎన్నికల తర్వాత 2021లో ఇక ఎన్నికల వ్యూహకర్తగా పని చేయనంటూ పీకే ప్రతినబూని ఐప్యాక్ నుంచి తప్పుకున్నారు. బిహార్‌లో రాజకీయ అరంగేట్రం చేశారు. తొలుత బిహార్ సీఎం నితీష్‌కుమార్ పంచన చేరి జేడీ(యూ) కీలక నేతగా చలామణి అయ్యారు. ఆపై నితీశ్‌తో విభేదించి సొంత పార్టీ స్థాపించి పాదయాత్ర చేసినా ఎలాంటి ప్రభావం చూపలేకపోయారు. దీంతో రాజకీయంగా బిహార్‌లో తన పప్పులు ఉడకవని గ్రహించిన పీకే డబ్బుల కోసం ఎవరు ప్యాకేజీ ఇస్తే వారికి అనుకూలంగా జోస్యం చెప్పేందుకు అలవాటుపడ్డారు. ఈ క్రమంలో చంద్రబాబు ఇచ్చే ప్యాకేజీ తీసుకుంటూ టీడీపీకి అవసరమైనప్పుడల్లా ఆ పార్టీకి అనుకూలంగా జోస్యం చెబుతూ వస్తున్నారు.

ఆ జోస్యాలన్నీ తప్పే..

అటు బిహార్‌లో రాజకీయంగా చెల్లక.. ఇటు ఇం'ధనం' లేక కొట్టుమిట్టాడిన పీకే తనకు ఎవరు ప్యాకేజీ ఇస్తే వారికి అనుకూలంగా జోస్యాలు చెప్పేందుకు అలవాటు పడ్డారు. గతేడాది చివరిలో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, మిజోరాం శాసనసభల ఎన్నికల్లోనూ పీకే జోస్యాలు చెప్పారు. తెలంగాణలో బీఆర్ఎస్ గెలుస్తుందని పీకే చెబితే చివరకు అక్కడ కాంగ్రెస్ గెలిచింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలో కాంగ్రెస్ గెలుస్తుందని పీకే ఢంకా భజాయిస్తే ఆ మూడు రాష్ట్రాల్లోనూ బీజేపీ గెలిచింది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లోనూ పీకే జోస్యం తప్పడం ఖాయమని, గత ఎన్నికల్లో టీడీపీ తరఫున వకాల్తా తీసుకున్న లగడపాటి మాదిరిగానే ప్రశాంత్ కిశోర్ కూడా ఫలితాలు వెలువడ్డాక మాయం కావడం తథ్యమని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

బాబు సేవలో 'పీకే'

- ఏపీ రాజకీయాల్లో తలమునకలు
- బెంగాల్ సీఎం మమత వెల్లడి



సాక్షి, న్యూఢిల్లీ: రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ ఏపీలో చంద్రబాబు నేతృత్వంలోని కూటమి గెలుపు కోసం కృషి చేస్తున్నట్లు పశ్చిమ బంగ సీఎం మమతా బెనర్జీ వెల్లడించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఆయన తృణమూల్ కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేయడం లేదన్నారు. ఐప్యాక్ సంస్థకు చెందిన ప్రతీక్ జైన్, ఆయన బృందం తమకు వ్యూహకర్తలుగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. ప్రశాంత్ కిషోర్ ప్రస్తుతం ఏపీ రాజకీయాల్లో తలమునకలై ఉన్నట్లు చెప్పారు. ఆయన టీడీపీ, బీజేపీల కోసం పనిచేస్తున్నారన్నారు. తాజాగా బెంగాల్ టీవీ ఛానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మమతా ఈ విషయాలను వెల్లడించారు. పీకే బీజేపీకి అనుకూలంగా ఉన్నారు కాబట్టే ఎన్డీఏ కూటమి మళ్లీ విజయం సాధిస్తుందంటూ పదే పదే చెబుతున్నారని వ్యాఖ్యానించారు. పశ్చిమ బెంగాల్ వెలుపల ఆయన ప్రభావం, ప్రమేయం పెద్దగా లేదన్నారు.

ఎన్‌కౌంటర్ మృతుల్లో చిన్నన్న లేడు

- ధ్రువీకరించిన సోదరులు
- 29 మంది మృతి చెందినట్లు పోలీసులు వెల్లడి
- మృతుల్లో మావోయిస్టు పార్టీ దండకారణ్యం టాప్ కమాండర్, ఆయన భార్య

ఆత్మకూరు రూరల్ (నంద్యాల జిల్లా) / సాక్షి ప్రతినిధి, వరంగల్: ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో మరణించిన 29 మంది మావోయిస్టుల్లో నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం వడ్ల రామాపురం గ్రామానికి చెందిన మావోయిస్టు అగ్రనేత సుగులూరి చిన్నన్న అలియాస్ శంకర్‌రావు అలియాస్ నాగన్న అలియాస్ విజయ్ లేరని బస్తర్ ఐజీ సుందర్‌రాజ్, కాంకేర్ సీనియర్ ఐపీఎస్ అధికారి ఇంద్ర కళ్యాణ్ ఎల్లిసెల వెల్లడించారు. బుధవారం రాత్రి వరకు 8 మంది మావోయిస్టులను గుర్తించామన్నారు. మృతుల్లో జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగెకు చెందిన మావోయిస్టు పార్టీ దండకారణ్యం (డీకే) టాప్ కమాండర్ సిరిపల్లె సుధాకర్ అలియాస్ మురళి, అలియాస్ శంకర్, ఆయన భార్య ఉన్నారని చెప్పారు. ఈ ఎన్‌కౌంటర్‌లో 29 మంది మావోయిస్టులు మృతి చెందారని, వారిలో 15 మంది మహిళలు, 14 మంది పురుషులు ఉన్నారని చెప్పారు. ఘటన స్థలంలో ఏకే–47, ఎల్ఎంజీ, ఇన్సాస్ లాంటి అత్యాధునిక ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మృతుల్లో చిన్నన్న లేడని ధ్రువీకరించిన సోదరులు

ఈ ఎన్‌కౌంటర్‌లో సుగులూరి చిన్నన్న అలియాస్ శంకర్‌రావు ఉన్నట్లు పోలీసులు తొలుత భావించారు. అయితే నంద్యాల పోలీసులు చూపించిన ఎన్‌కౌంటర్ మృతుల ఫొటోల్లో చిన్నన్న లేడని ఆయన సోదరులు ధ్రువీకరించారు. సుగులూరి చిన్నన్న 1996లో అప్పటి పీపుల్స్‌వార్‌లో పూర్తికాల సభ్యుడిగా చేరారు. తొలుత కర్నూలు జిల్లాలో అప్పటి భవనాసిదళం సభ్యుడిగా ప్రస్థానం ప్రారంభించిన ఆయన.. 2006 తర్వాత దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీలోకి వెళ్లినట్లు సమాచారం. ఆ తర్వాత దండకారణ్యం స్పెషల్ జోనల్ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, రాజ్‌నంద్‌గావ్ – కాంకేర్ డివిజన్ కార్యదర్శిగా విజయ్ పేరుతో కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.



సుగులూరి చిన్నన్న (ఫైల్)

గుర్తించిన మృతులు

1. సిరిపల్లె సుధాకర్ అలియాస్ శంకర్‌రావు, మావోయిస్టు పార్టీ దండకారణ్యం (డీకే) టాప్ కమాండర్
2. దాశశ్వర్ సుమన అలియాస్ రజిత, డీసీఎస్, సిరిపల్లె సుధాకర్ అలియాస్ శంకర్ భార్య, ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూరు
3. లలిత, డీవీసీ మెంబర్, జన తన సర్కార్ కమిటీ ఇన్‌చార్జి
4. మాధవి, నార్త్ బస్తర్ మెంబర్
5. జగ్గు అలియాస్ మాలతి, పర్థాపూర్ ఏరియా కమిటీ
6. రాజు సలామ్ అలియాస్ సుఖాల్, పర్తాపూర్ ఏరియా కమిటీ మెంబర్
7. వెల సోను అలియాస్ శ్రీకాంత్ సోను, పర్థాపూర్ ఏరియా కమిటీ మెంబర్
8. రాణిత అలియాస్ జయమతి, రూపి, ప్రాగ్ ఎల్వోసీ కమాండర్
9. రామ్ షీలా, నార్త్ బస్తర్ డివిజన్ కమిటీ మెంబర్

వ్యూహకర్తలు హ్యాండ్సప్..

జారిన జాకీలు!

▶ మొదటి పేజీ తరువాయి

ఎంత ఊదరగొట్టినా, ఇంటింటికీ తిరిగి రిజిస్ట్రేషన్ల కోసం వేడుకున్నా జనం పట్టించుకోలేదని వారి సర్వేల్లో తేలింది. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఏ ఒక్క హామీని నెరవేర్చకపోవడం, మాట నిలబెట్టుకోకపోవడం వల్లే చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇస్తున్న హామీలు నమ్మదగ్గవి కావనే అభిప్రాయం ప్రజల్లో నెలకొన్నట్లు గుర్తించారు. మరోవైపు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన అన్ని పనులను సీఎం అయ్యాక చేయడం, 99 శాతం హామీలను అమలు చేయడంతో ప్రజల్లో ఆయన పట్ల విశ్వసనీయత బలంగా నాటుకుందని నిర్ధారించుకున్నారు. ఈ పరిస్థితుల్లో ఎంత గొప్ప పథకాలు అమలు చేస్తామని చంద్రబాబు నమ్మబలికినా జనం నమ్మే అవకాశాలు లేవనే అంచనాకు వచ్చారు.

పొత్తు బెడిసికొట్టింది.. ఓట్ల బదిలీ అసాధ్యం

బీజేపీ, జనసేనతో టీడీపీ కుదుర్చుకున్న అవకాశవాద పొత్తు బెడిసికొట్టినట్లు రాబిన్ శర్మ సర్వేలు తేల్చినట్లు సమాచారం. రాజకీయ అవసరాల కోసం కుదుర్చుకున్న అసహజ పొత్తుగా ప్రజలు దీన్ని గుర్తించినట్లు గ్రహించారు. పొత్తులతో సీట్ల సర్దుబాటు కూడా ఆశాజనకంగా లేదని వెల్లడైంది. దీంతో ఏ రకంగా చూసినా టీడీపీ, జనసేన, బీజేపీల మధ్య ఓట్ల బదలాయింపు సాధ్యం కాదని తేలింది. నియోజకవర్గాల స్థాయిలో మూడు పార్టీలు కలవలేదని, జనసేన ఓట్లు టీడీపీకి వచ్చే అవకాశాలు చాలా స్వల్పమేనని అంచనా వేశారు. పొత్తు కుదిరాక పవన్ కళ్యాణ్ బలహీనంగా మారడంతో ఆయనకున్న కొద్దిపాటి ఓటు బ్యాంకుకు గండి పడుతున్నట్లు నిర్ధారించుకున్నారు. ఇక బీజేపీకి ఉన్న ఓట్లే తక్కువ కావడంతోపాటు అవి టీడీపీకి బదిలీ అవడం కష్టమేనని తేల్చారు. బీజేపీతో కలవడం వల్ల టీడీపీకి ఉన్న స్వల్ప మైనారిటీల ఓట్లు కూడా దూరమైనట్లు గుర్తించారు. జనసేన, బీజేపీకి కేటాయించిన 31 సీట్లలో ఆ పార్టీలు గెలిచే సీట్లు అరడజను కూడా లేవని వారి సర్వేలో నిర్ధారణ అయినట్లు సమాచారం.

దిద్దుకోలేని తప్పులు.. గెలవడం దుర్లభం

తమ వ్యూహాలకు అనుగుణంగా పార్టీ నడుచుకోకుండా సొంత నిర్ణయాలు తీసుకోవడం వల్ల దిద్దుకోలేని తప్పులు జరిగాయని రాబిన్ శర్మ తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో టీడీపీతో కలిసి పని చేయడంలో అర్థం లేదని ఆయన తేల్చి చెప్పడంతో చంద్రబాబు బుజ్జగించి కొద్దిరోజులు ఆపినట్లు తెలిసింది. ఆ తర్వాత జరిగిన పరిణామాలు, తీసుకున్న నిర్ణయాలపైనా రాబిన్ బృందం అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. దీంతో దిద్దుబాటు చర్యలు చేపట్టిన చంద్రబాబు తన పలుకుబడి ఉపయోగించి రాబిన్ శర్మ గురువైన ప్రశాంత్ కిశోర్‌ను పిలిచి మధ్యవర్తిత్వం చేయాలని కోరారు. దీంతో పీకే జోక్యం చేసుకుని సర్దుబాటు చేయడంతో ప్రస్తుతం అయిష్టంగానే రాబిన్ శర్మ బృందం టీడీపీ కోసం పని చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే సందర్భంలో పీకే సైతం సంక్షేమ పథకాలు, విశ్వసనీయత విషయాల్లో సీఎం జగన్‌తో చంద్రబాబు పోటీ పడలేరని చెప్పినట్లు తెలిసింది. వ్యూహకర్తలు ఇచ్చిన ఈ షాకులతో చంద్రబాబు అయోమయంలో మునిగిపోయారు. రాబిన్ శర్మ చెప్పినట్లు అభ్యర్థులను మార్చలేక, కొనసాగించలేక సతమతమవుతున్నారు. అభ్యర్థులను మార్చాలంటే లోకేష్ వారి వద్ద నుంచి రూ.కోట్లలో వసూలు చేసిన డిపాజిట్లు వెనక్కి ఇవ్వాలి. అందుకు చినబాబు ససేమిరా అనడంతో చంద్రబాబు కక్కలేక మింగలేక మిన్నకుండిపోయారు.

అమ్ముకుంటే గెలిచేదెలా?

అనేక సీట్లను తాము సూచించిన వారికి కాకుండా బయట వ్యక్తులకు కేటాయించడాన్ని రాబిన్ శర్మ తీవ్రంగా తప్పుబట్టినట్లు తెలిసింది. నియోజకవర్గాల్లో ఉన్న పరిస్థితులు, పలు సమీకరణాలు, రకరకాల పొందికల ఆధారంగా తాము ప్రతిపాదించిన వారికి సీట్లు ఇవ్వకపోవడం ప్రధాన తప్పిదంగా ఆయన ప్రస్తావిస్తున్నారు. సర్వేలను పట్టించుకోకుండా, పార్టీ కోసం పని చేసిన వారిని వదిలేసి బయట వ్యక్తులకు సీట్లు ఇవ్వడాన్ని ఆయన ప్రశ్నించినట్లు సమాచారం. డబ్బు మూటలతో అప్పటికప్పుడు దిగిన ఎన్నారైలు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారులకు సీట్లు అమ్ముకుంటే ఇక గెలవడం ఎలా సాధ్యమని ఆయన నిర్వేదం వ్యక్తం చేస్తున్నారు. అనంతపురం అర్బన్ సీటును పార్టీ కోసం సుదీర్ఘ కాలంగా పని చేస్తున్న ప్రభాకర చౌదరికి కాకుండా పెద్దగా తెలియని దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌కి కేటాయించడంపై రగడ జరిగిన విషయం తెలిసిందే. ఇలా బయట వ్యక్తులకు సీట్లు ఇచ్చిన అసెంబ్లీ నియోజకవర్గాలు 30 వరకూ ఉన్నట్లు రాబిన్ శర్మ చెబుతున్నారు. స్థానిక పరిస్థితులతో సంబంధం లేకుండా 8 ఎంపీ స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించడాన్ని ఆయన తప్పుబట్టారు. ఏలూరు ఎంపీ స్థానాన్ని రాయలసీమకు చెందిన వ్యక్తికి ఇవ్వడం లాంటి అంశాలను ప్రస్తావించినట్లు సమాచారం. తాము చేసిన సర్వేలు, క్షేత్ర స్థాయి పరిస్థితులకు విరుద్ధంగా చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్ నిర్ణయాలు తీసుకున్నారని, దీంతో తమ బృందాలు మూడేళ్లుగా పడ్డ శ్రమ అంతా బూడిదలో పోసిన పన్నీరులా వృథా అయిందని రాబిన్ బృందం వాపోతున్నట్లు సమాచారం.

నేడు మేమంతా సిద్ధం

బస్సు యాత్ర ఇలా..

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం జగన్ చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర 17వ రోజైన గురువారం(ఏప్రిల్ 18) షెడ్యూల్‌ను ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం బుధవారం విడుదల చేశారు. సీఎం జగన్ రాత్రి బస చేసిన తేతలి నుంచి గురువారం ఉదయం 9 గంటలకు బయలుదేరుతారు. తణుకు, రావులపాలెం, జొన్నాడ మీదుగా పొట్టిలంక చేరుకొని భోజన విరామం తీసుకుంటారు. కడియపులంక, వేమగిరి, మోరంపూడి జంక్షన్, తాడితోటజంక్షన్, చర్చిసెంటర్, దేవిచౌక్, పేపర్ మిల్ సెంటర్, దివాన్ చెరువు, రాజానగరం మీదుగా ఎస్‌టీ రాజపురం వద్ద రాత్రి బస శిబిరానికి సీఎం చేరుకుంటారు.



భయపడొద్దమ్మా.. నేనున్నా..

- క్యాన్సర్‌తో బాధపడుతున్న చిన్నారికి సీఎం జగన్ భరోసా
- వైద్యం చేయిస్తామని చిన్నారి తల్లిదండ్రులకు హామీ



దువ్వలో క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న చిన్నారితో మాట్లాడుతున్న సీఎం జగన్

అత్తిలి: క్యాన్సర్‌తో బాధపడుతున్న ఓ చిన్నారి కుటుంబానికి సీఎం వైఎస్ జగన్ అండగా నిలిచారు. ఆమె వైద్యానికయ్యే ఖర్చును ప్రభుత్వం భరిస్తుందని సీఎం వైఎస్ జగన్ భరోసా ఇచ్చారు. మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా మంగళవారం రాత్రి పశ్చిమగోదావరి జిల్లా తణుకు మండలంలోని దువ్వ వెంకయ్య కాలువ గట్టు వద్ద నివసిస్తున్న ప్రజలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మమేకమయ్యారు. ఈ సందర్భంగా కోనాల ఆంజనేయులు, కామాక్షి దంపతులు తమ కుమార్తె దానేశ్వరిని తీసుకువచ్చి సీఎం జగన్‌ను కలిశారు. తమ కుమార్తె కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతోందంటూ కన్నీరుపెట్టుకున్నారు. వైద్యం కోసం చాలా ఖర్చు చేశామని.. అయినా ఉపయోగం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మీరే ఆదుకోవాలి జగనన్నా అంటూ విలపించారు. సీఎం జగన్ ఆ పాపను ఆప్యాయంగా పలకరించారు. ఆంజనేయులు దంపతులకు ధైర్యం చెప్పారు. పాప విషయంలో భయపడొద్దని.. వైద్యానికయ్యే ఖర్చు రూ.40 లక్షలను ప్రభుత్వం భరిస్తుందంటూ భరోసా ఇచ్చారు. దీంతో ఆంజనేయులు దంపతులు సంతోషం వ్యక్తం చేశారు. దేవుడిలా వచ్చి ఆదుకుంటున్నారంటూ ఆనందం వ్యక్తం చేశారు.

ఇదం జగత్



అభిమానం.. ఆకాశమంత

సీఎం వైఎస్ జగన్‌కు ప్రజల్లో అమితాదరణ.. కిలోమీటర్ల కొద్దీ వెన్నంటి వస్తున్న వీరాభిమానులు



ఈ చిత్రంలో ఒంటిమీద వైఎస్సార్‌సీపీ రంగు దుస్తులు.. బైక్ మొత్తం వైఎస్సార్‌సీపీ జెండాలతో కనిపిస్తున్న ఈ వ్యక్తి పేరు.. రామిరెడ్డి అమరనాథ్ రెడ్డి. మండుటెండలో కాలికి చెప్పులు కూడా లేకుండా వైఎస్సార్‌సీపీ జెండా రంగులతో ఉన్న హెల్మెట్ పెట్టుకుని, మోటార్ సైకిల్‌కు మైక్‌ను కట్టుకుని, వైఎస్సార్‌సీపీ ప్రచార గీతాలను వినిపిస్తూ వేల కిలోమీటర్లు 'మేమంతా సిద్ధం' బస్సుయాత్రతో పాటు ప్రయాణిస్తున్నాడు. ఎందుకిదంతా అంటే.. జగనన్న అంటే ప్రాణమని తెలిపాడు. ఆయన కోసం విశాఖ ఫార్మా కంపెనీలో రూ.40 వేలు జీతం వచ్చే ఉద్యోగాన్ని వదిలిపెట్టానన్నాడు. అంతేకాకుండా ఏడాదిన్నర పాపతోపాటు కుటుంబానికి దూరమైనా సంతోషంగా జగనన్న వెంట నడుస్తున్నానని చెబుతున్నాడు. జగన్ మళ్లీ సీఎం అయ్యేంత వరకూ తాను కాలికి చెప్పులు ధరించనని దీక్ష పూనానని అంటున్నాడు. తన వాహనాన్నే ప్రచార రథంగా మార్చి దానికి రెండు వైపులా 'బలవంతుడికి.. బలహీనుడికి జరిగే యుద్ధం' అనే వ్యాఖ్యతో ఉన్న స్టిక్కర్‌ను అతికించుకుని తిరుగుతున్నాడు. అమరనాథ్ రెడ్డి 2014, 2019 ఎన్నికల్లోనూ, ఇటీవల జరిగిన సిద్ధం సభల్లోనూ ఇదేవిధంగా పాల్గొని ప్రచారంలో తన వంతు పాత్ర పోషించాడు. తన జీవితం జగనన్నకే అంకితమని, ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకూ బస్సుయాత్రలో తన బైక్ యాత్ర కూడా కొనసాగుతుందని అభిమానాన్ని చాటుకున్నాడు.



అంబాపురంలో అవ్వ అభిమానం



కొత్తపేట- గన్నవరంలో అభిమానుల కేరింతలు

(బోణం గణేష్, 'మేమంతా సిద్ధం బస్సు యాత్ర' నుంచి సాక్షి ప్రతినిధి)

ఇలా ఒక్క అమరనాథ్ రెడ్డి మాత్రమే కాదు.. 'మేమంతా సిద్ధం' అంటూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన బస్సుయాత్రలో ఇలాంటి వారు అడుగడుగునా కనిపిస్తున్నారు. ప్రజలు ఒక వ్యక్తిని మనస్ఫూర్తిగా అభిమానిస్తే.. గుండెల్లో గుడికట్టేస్తారనడానికి నిదర్శనంగా నిలుస్తున్నారు. గుంటూరు జిల్లా పాత మంగళగిరికి చెందిన పండ్ల వ్యాపారి శ్రీనివాసరావు తన ద్విచక్ర వాహనంపై భార్య, కుమార్తెను ఎక్కించుకుని, ఆ బైక్ మొత్తం వైఎస్సార్‌సీపీ జెండాలను కట్టుకుని బస్సుయాత్రలో పాల్గొన్నారు. మరి కొందరు కార్లతో యాత్ర ప్రారంభం నుంచి చివరి వరకూ వచ్చేలా ఏర్పాట్లు చేసుకున్నారు. రోజుల తరబడి, జిల్లాలు దాటి, ఎండా, వాన లెక్క చేయకుండా, వ్యయప్రయాసలను పట్టించుకోకుండా వేలాది కిలోమీటర్ల మేర సీఎం జగన్ వెంట ప్రయాణం చేస్తున్నారు. మరోవైపు జననేత తమ ప్రాంతానికి వస్తున్నారని తెలియడం ఆలస్యం.. బస్సుయాత్ర వెళ్లే రహదారికి తమ గ్రామం దూరంగా ఉన్నాసరే అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు, చిన్నారులు, యువత ప్రతికూల వాతావరణంలోనూ కిలోమీటర్ల కొద్దీ నడిచి వచ్చి జగన్‌కు అఖండ స్వాగతం పలుకుతున్నారు. పసిపిల్లలతో పాటు వచ్చిన తల్లులు, బాలింతలు ఇలా ఒకరేమిటి గంటల తరబడి జగన్‌ను చూసేందుకు నిరీక్షిస్తున్నారు. పగలూ రాత్రి తేడా లేకుండా వీధుల్లో పోటెత్తుతున్నారు.

మమా మాస్..

ఇక యువత అయితే వారి ఉత్సాహం మామూలుగా లేదు. ఓ మాస్ హీరోకు ఉన్న దానికంటే వంద రెట్లు ఫాలోయింగ్ సీఎం వైఎస్ జగన్‌కు ఉందని యువత ఆనందం చూస్తుంటే తెలుస్తోంది. బస్సు యాత్ర మొత్తం ప్రతి చోటా వైఎస్సార్‌సీపీ ప్రచార గీతాలకు ఒళ్లుమరచి యువత ఆనంద తాండవం చేస్తోంది. సినిమా పరంగా తాము ఎవరి ఫ్యాన్స్ అయినప్పటికీ..రాజకీయాల్లో జగన్ తమ రియల్ హీరో అంటూ బైక్‌ల మీద తమ అభిమాన హీరో ఫొటోతో పాటు సీఎం జగన్ ఫొటో స్టిక్కర్లను అతికించుకోవడం విశేషం. స్థానిక నాయకుల్లోనూ బస్సుయాత్ర నూతన ఉత్తేజాన్ని కలిగిస్తోంది. ఎక్కడికక్కడ సీఎం వైఎస్ జగన్‌కు సంప్రదాయం ఉట్టిపడేలా కోలాటాలు, స్టిక్ వాకర్స్‌ను ఏర్పాటు చేసి భారీ గజమాలలతో ఘన స్వాగతం పలుకుతున్నారు. ఈ గజమాలలు సాధారణ పరిమాణం దాటి ఉండటంతో వాటిని క్రేన్లతో మోయాల్సి వస్తోంది. సీఎం జగన్ బస్సు యాత్ర వెంట వేలాది బైకులతో భారీ ర్యాలీలు చేస్తూ యువత, కార్యకర్తలు, స్థానిక నేతలు సందడి చేస్తున్నారు.

కొండంత ఆనందం..

పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా ప్రజలు సీఎం వైఎస్ జగన్‌కు అఖండ స్వాగతాలు పలుకుతున్నారు. హారతులు ఇచ్చి దిష్టి తీయడంతో పాటు పూలతో దండలు, పూలాభిషేకాలు చేస్తున్నారు. ప్రతి కూడలిలో జగన్ భారీ కటౌట్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తూ అభిమానాన్ని చాటుకుంటున్నారు. జగన్ తమ గ్రామానికి, వీధికి రాగానే బాణాసంచా కాల్చి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు, బాలికలు సైతం జగన్ మామే మళ్లీ సీఎం కావాలంటూ జెండాలు చేతబట్టి నినదిస్తున్నారు. సీఎం జగన్ బస్సు ఆపి తమను పలకరిస్తుంటే ప్రజలు భావోద్వేగానికి గురవుతున్నారు. ఆయనతో ఫొటో దిగి కొండంత ఆనందాన్ని మూటగట్టుకుంటున్నారు. అన్నా నీ కోసం మా ప్రాణం ఇస్తామంటూ సీఎం వైఎస్ జగన్‌కు భరోసా ఇస్తున్నారు. ఆనక ఆ ఫొటోలను తమ వారందరికీ పంపుతున్నారు. అంతే కాకుండా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, ఎక్స్, వాట్సాప్ వంటి సోషల్ మీడియా మాధ్యమాల్లో షేర్ చేస్తున్నారు. కటిక చీకటిని.. జోరున కురిసే వర్షాన్ని..మండుతున్న ఎండను కూడా లెక్కచేయకుండా తమ అభిమాన నేతకు జననీరాజనం పలుకుతున్న ఇలాంటి అపురూప దృశ్యాలు సీఎం జగన్‌ను ప్రజలు ఎంతగా ఆరాధిస్తున్నారో చెప్పడానికి నిలువెత్తు నిదర్శనాలని రాజకీయ విశ్లేషకులు చెబుతుండటం విశేషం.



కొత్తపేట- గన్నవరంలో మహిళల ఉత్సాహం

నేటి నుంచి నామినేషన్ల పర్వం

మే 13న 175 అసెంబ్లీ, 25 లోక్‌సభ స్థానాలకు నేడు ఎన్నికల నోటిఫికేషన్

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 175 అసెంబ్లీ నియోజకవర్గాలకు, 25 లోక్‌సభ స్థానాలకు గురువారం నుంచి నామినేషన్ల పర్వం ప్రారంభం కానుంది. నాల్గవ దశ ఎన్నికల్లో భాగంగా మే 13న రాష్ట్రంలో జరిగే ఈ ఎన్నికలకు గురువారం కేంద్ర ఎన్నికల సంఘం గెజిట్ నోటిఫికేషన్ జారీచేయనుంది. దీంతో అప్పటి నుంచే అంటే ఈనెల 18 నుంచి ఏప్రిల్ 25 వరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగనుంది. అతి కీలకమైన ఈ కార్యక్రమానికి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తిచేసినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) ముఖేష్‌కుమార్ మీనా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్లమెంట్ స్థానాలకు పోటీచేసే అభ్యర్థులు ఆయా కలెక్టరేట్లలో.. అసెంబ్లీ స్థానాలకు పోటీచేసే అభ్యర్థులు ఆయా నియోజకవర్గాల ప్రధాన కేంద్రాల్లో ఎన్నికల కోడ్‌ను పాటిస్తూ నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంటుందన్నారు. నామినేషన్ల ప్రక్రియను పూర్తిగా రికార్డు చేసేందుకు నామినేషన్లు స్వీకరించే గదిలో అభ్యర్థులు ప్రవేశించే ద్వారాల వద్ద సీసీ కెమేరాలను ఏర్పాటుచేసినట్లు ఆయన తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో భాగంగా అభ్యర్థుల ఊరేగింపులను, నామినేషన్ల దాఖలు ప్రక్రియను వీడియో రికార్డింగ్ చేస్తామన్నారు. ఈ క్రతువులో అభ్యర్థుల భవితవ్యాన్ని 4.10 కోట్ల మంది ఓటర్లు నిర్ణయించనున్నారు. ఇప్పటికే ప్రధాన పార్టీలు అభ్యర్థులను ప్రకటించడంతో తొలిరోజు నుంచే నామినేషన్ల దాఖలు ప్రక్రియ మొదలుకానుంది. వీటిని ఏప్రిల్ 26 వరకు పరిశీలించి, 29 వరకు ఉపసంహరణకు సమయమిస్తారు. మే 13న పోలింగ్ కాగా.. జూన్ 4 ఓట్ల లెక్కింపు జరుగుతుంది.



ఉ.11 గంటల నుంచి నామినేషన్ల స్వీకరణ..

ఎన్నికల నోటిఫికేషన్ గురువారం జారీకాగానే నామినేషన్ల దాఖలు ప్రక్రియ వెంటనే ప్రారంభమవుతుంది. సంబంధిత అసెంబ్లీ లేదా లోక్‌సభ స్థానం రిటర్నింగ్ ఆఫీసు కార్యాలయంలో ఉ.11 గంటల నుంచి మ.3 వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. ప్రభుత్వం ప్రకటించిన సెలవు రోజుల్లో స్వీకరించరు. ఒక అభ్యర్థి గరిష్ఠంగా నాలుగు సెట్ల నామినేషన్లు వెయ్యొచ్చు. ఒక అభ్యర్థి ఏదైనా రెండు స్థానాల్లో మాత్రమే పోటీచేసే అవకాశముంది. ఎంపీ అభ్యర్థి అయితే ఫారం–2ఏ, ఎమ్మెల్యే అభ్యర్థయితే ఫారం–2బీ ఉపయోగించాల్సి ఉంటుంది.



అభ్యర్థులు సువిధ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో నామినేషన్లు, అఫిడవిట్లను దాఖలు చేయవచ్చు. అయితే, వాటి కాపీలను భౌతికంగా ఆర్వోలకు అందజేయాల్సి ఉంటుంది. ఎన్నికల సంఘం గుర్తించిన రాజకీయ పార్టీల అభ్యర్థికి స్థానికంగా ఉండే ఒక ఓటరు ప్రతిపాదన (ప్రపోజర్‌గా) సంతకం చేయాల్సి ఉంటుంది. అదే ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులకు 10 మంది ప్రతిపాదించాలి. ఒక ఓటరు ఎంతమంది అభ్యర్థులకైన ప్రపోజ్ చేయడానికి ఎన్నికల సంఘం అనుమతించింది. నామినేషన్ దాఖలు సందర్భంగా ప్రతీ అభ్యర్థి కొన్ని కచ్చితమైన నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. నామినేషన్ వేయడానికి వెళ్లే సమయంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి 100 మీటర్ల పరిధిలోనికి కేవలం మూడు వాహనాలను మాత్రమే అనుమతిస్తారు. నామినేషన్ దాఖలు చేసేటప్పుడు రిటర్నింగ్ అధికారి గదిలోకి అభ్యర్థితో కలిపి కేవలం ఐదుగురికి మాత్రమే అనుమతి ఉంటుంది. నామినేషన్లు దాఖలు చేసినప్పుడు ఫారం–ఏ, ఫారం–బీలు కూడా సమర్పించవచ్చు. లేకపోతే నామినేషన్ల చివరి రోజున 3 గంటలలోపు వీటిని సమర్పించాల్సి ఉంటుంది. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో నామినేషన్ల స్వీకరణకు సంబంధించి హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటుచేశారు.

ఫారం–26 తప్పనిసరి..

ఇక నామినేషన్ దాఖలుతోపాటు ఫారం–26 (అఫిడవిట్) కూడా అభ్యర్థులు విధిగా సమర్పించాలి. ఇది నామినేషన్ల చివరి తేదీ ఏప్రిల్ 25, మ.3 గంటల లోపు ఇవ్వొచ్చు. ఫారం–26 స్టాంప్ పేపర్ విలువ రూ.10 కంటే ఎక్కువ ఉండాలి. భౌతిక స్టాంప్ పేపర్ అందుబాటులో లేకపోతే ఈ–స్టాంప్ పేపర్ ఉపయోగించవచ్చు. ఫారం–26 అంటే.. పోటీచేసే అభ్యర్థులు తన కుటుంబసభ్యుల ఆస్తులు, అప్పులతోపాటు క్రిమినల్ కేసులు, న్యాయస్థానాల్లో విచారణలో ఉన్న అన్ని కేసుల వివరాలను పొందుపరచాల్సి ఉంటుంది. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీకి చెందిన అభ్యర్థి అయితే ఆ పార్టీకి కేటాయించిన గుర్తును నామినేషన్ ఫారంలో రాయాలి. అదే ఇతర అభ్యర్థులైతే ఫ్రీ సింబల్స్ నుండి తనకు నచ్చిన మూడు గుర్తులను కోరుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ రిజిస్టర్ అయివుండి, గుర్తింపు పొందని పార్టీలు ఎన్నికల సంఘం నుండి కామన్ సింబల్ కేటాయించినట్లయితే ఆ గుర్తును నామినేషన్ ఫారంలో రాయాలి.

నామినేషన్ రుసుం ఇలా..

పార్లమెంటు అభ్యర్థి అయితే రూ.25,000లు, అసెంబ్లీ అభ్యర్థి అయితే రూ. 10,000లు చెల్లించాల్సి ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఈ రుసుంలో 50 శాతం రాయితీ కల్పించారు. వీరు సామాజిక ధ్రువపత్రాన్ని విధిగా సమర్పించాల్సి ఉంటుంది. నామినేషన్ వేసిన తర్వాత ప్రతి అభ్యర్థి రిటర్నింగ్ అధికారి ముందు ప్రమాణం చేయాల్సి ఉంటుంది. ప్రతి అభ్యర్థి నామినేషన్‌తో పాటు లేటెస్ట్ పాస్‌పోర్టు సైజ్ ఫొటో (2 x 2.5 సెం.మీ) ఇవ్వాల్సి ఉంటుంది. నామినేషన్ వేసిన తరువాత అభ్యర్థి రశీదుతోపాటు స్క్రూట్నీ తేదీ, సమయం.. నామినేషన్ ఉపసంహరణ తేదీ, సమయం.. గుర్తులు కేటాయించే తేదీ, సమయం తెలిపే నోటీసులను అధికారుల నుంచి తీసుకోవాలి. నామినేషన్ల దాఖలుకు అభ్యర్థులు 13 రకాల పత్రాలను తీసుకురావల్సి ఉంటుంది.

నేటి నుంచి అభ్యర్థుల ఖర్చు కౌంట్



నామినేషన్ల పర్వం ప్రారంభైన నాటి నుంచి అంటే గురువారం నుంచే అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలకు పోటీచేసే అభ్యర్థుల ఖర్చును ఆయా అభ్యర్థుల ఖాతాలో నమోదు చేస్తారు. పత్రికల్లో వచ్చే పెయిడ్ న్యూస్, ప్రకటనలు, వార్తలను సైతం అభ్యర్థి ఖాతా కింద లెక్కిస్తారు. అసెంబ్లీ స్థానాలకు పోటీచేసే అభ్యర్థి రూ.40 లక్షల వరకు ఖర్చు పెట్టొచ్చు. అలాగే, ఎంపీ అభ్యర్థి రూ.95 లక్షల వరకు వ్యయం చెయ్యొచ్చు. అభ్యర్థుల ఖర్చును ఎప్పటికప్పుడు కేంద్ర ఎన్నికల సంఘం నియమించిన నోడల్ అధికారులు పర్యవేక్షిస్తారు. అభ్యర్థులు ఎన్నికల వ్యయానికి ప్రత్యేకంగా బ్యాంకు ఖాతాను తెరవాలి.

క్లుప్తంగా...

పేరెంట్స్, టీచర్ సమావేశాలు వాయిదా

ప్రోగ్రెస్ రిపోర్టుల అందజేత యధాతథం

సాక్షి, అమరావతి: ఈ విద్యా సంవత్సరం చివరిరోజు ఏప్రిల్ 23న నిర్వహించే పేరెంట్స్, టీచర్ సమావేశాలు వాయిదా వేశారు. చివరి రోజున విద్యార్థులకు ప్రోగ్రెస్ రిపోర్టులను మాత్రమే అందించనున్నారు. ఈ సమావేశాన్ని జూన్ 12న నిర్వహించనున్నారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. పేరెంట్స్ సమావేశంలో పిల్లల ప్రవర్తన, చదువు, పనితీరుపై చర్చించాలని సూచించారు. ఈ సమావేశాలు వాయిదా పడినప్పటికీ ఈనెల 23న విద్యార్థులందరికీ ప్రోగ్రెస్ రిపోర్ట్ కార్డులు అందించాలని ఆదేశించారు. ఆలోగా సమ్మెటివ్ అసెస్‌మెంట్‌లో (చివరి పరీక్ష) విద్యార్థులు పొందిన మార్కులను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఈమేరకు అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సమాచారం అందించాలని డీఈవోలకు సూచించారు.

నల్లారి, చల్లాపై కేసు నమోదు



ఈ నెల 7వ తేదీన రొంపిచెర్లలో ప్రచార వాహనంపై మాట్లాడుతున్న కిరణ్‌కుమార్‌రెడ్డి

రొంపిచెర్ల(చిత్తూరు జిల్లా): ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన మాజీ ముఖ్యమంత్రి, రాజంపేట బీజేపీ ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి, పుంగనూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డిపై రొంపిచెర్ల పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 7వ తేదీ రొంపిచెర్లలోని చిన్న మసీదు వీధిలో ముస్లింలు ఇచ్చిన ఇఫ్తార్ విందులో కిరణ్‌కుమార్‌రెడ్డి, చల్లా రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. అదేరోజు రాత్రి రొంపిచెర్ల సర్కిల్‌లో జరిగిన సభలో ప్రచార వాహనంపై నుంచి వారు ప్రసంగించారు. అయితే ఎన్నికల అధికారుల అనుమతి లేకుండానే సభ నిర్వహించి ప్రచార వాహనంపై నుంచి ప్రసంగించడంపై పుంగనూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మధుసూదన్‌రెడ్డికి రొంపిచెర్ల ఎంపీడీవో ఫిర్యాదు చేశారు. ఆయన జిల్లా, రాష్ట్ర ఎన్నికల అధికారుల సూచనల మేరకు కిరణ్‌కుమార్ రెడ్డి, చల్లా రామచంద్రారెడ్డిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. దీంతో ఎన్నికల అధికారులు రొంపిచెర్ల పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్‌ఐ సుకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలకృష్ణ, లోకేశ్‌లపై వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు

సాక్షి, అమరావతి: ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్, వైఎస్సార్‌సీపీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, ఇష్టానుసారం సీఎం జగన్‌పై పాటలు ప్రచారం చేస్తున్న మాజీమంత్రి లోకేశ్‌లపై వైఎస్సార్‌సీపీ బుధవారం ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, మాజీమంత్రి రావెల కిషోర్‌బాబు, పార్టీ నాయకుడు ఎ.నారాయణమూర్తి, పార్టీ లీగల్‌సెల్ నేత శ్రీనివాసరెడ్డి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదుతోపాటు ఆధారాలను అందజేశారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. బాలకృష్ణ ఈనెల 16న కర్నూలులో స్వర్ణాంధ్ర సాకారయాత్ర సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు, తిట్లు, శాపనార్థాలు, బూతులతో ప్రసంగించారని తెలిపారు. లోకేశ్ తన యూట్యూబ్ చానల్ ద్వారా సీఎం జగన్‌ని ఉద్దేశించి సైకో పోవాలి, సైకిల్ రావాలంటూ ఒక వీడియో పాటను పోస్ట్ చేశారని, ఈ పాటను కర్నూలు జిల్లాలో నిర్వహించిన తెలుగుదేశం పార్టీ సభలో ప్లే చేశారని తెలిపారు. అది యూట్యూబ్ చానల్‌లో టెలికాస్ట్ అవుతోందని పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతిపై ఫిర్యాదు

ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'సీఎం జగన్ సేవలో జవహర్' శీర్షికతో బుధవారం ప్రచురించిన కథనంపై ఎన్నికల సంఘానికి వైఎస్సార్‌సీపీ నేతలు ఫిర్యాదు చేశారు. జవహర్ సీఎం జగన్‌కు మద్దతిస్తున్నారంటూ అవాస్తవాలతో కూడిన ఆ కథనం ఎన్నికల నియమావళికి విరుద్ధమని తెలిపారు. ఆ కథనాన్ని ప్రచురించిన ఆంధ్రజ్యోతిపై తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

'ఎన్నికల' ఉద్యోగులను అధికారులు వేధిస్తున్నారు

ఈసీకి ఏపీ స్టేట్ ఆడిట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఫిర్యాదు

సాక్షి, అమరావతి: ఎన్నికల విధులకు కేటాయించిన స్టేట్ ఆడిట్ ఉద్యోగులను కొంతమంది అధికారులు తరచూ వేధిస్తున్నారని ఎన్నికల సంఘానికి ఏపీస్టేట్ ఆడిట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఫిర్యాదు చేసింది. ఎన్నికల నిబంధనల ప్రకారం జిల్లా కలెక్టర్ల వద్ద ఎన్నికల ప్రక్రియకు సంబంధించి వివిధ హోదాల్లో పనిచేస్తున్న ఆడిట్ ఉద్యోగులను స్టేట్ ఆడిట్ శాఖ సమావేశాలు, సమాచారం కోసమంటూ ఆఫీసులకు రావాలంటూ వేధిస్తున్నారంటూ అసోసియేషన్ ప్రెసిడెంట్ బీవీఎస్ఎన్ రవిశంకర్, ప్రధాన కార్యదర్శి ఎం.అబ్రహం బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో ఉన్నామని చెప్పినా వినకుండా మీటింగ్‌లకు రాకపోతే చర్యలు తీసుకుంటామంటూ సొంత శాఖ ఉన్నతాధికారులు బెదిరిస్తున్నారని, దీనిపై ఎన్నికల సంఘం తక్షణం స్పందించి తగు ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

దర్యాప్తు కొలిక్కి

సీఎం జగన్‌పై హత్యాయత్నం కేసును ఛేదించిన పోలీసులు

నేడు దర్యాప్తు వివరాలను వెల్లడించే అవకాశం

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం కేసులో పోలీసుల దర్యాప్తు కొలిక్కి వచ్చింది. విజయవాడ అజిత్‌సింగ్ నగర్‌లో శనివారం రాత్రి 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌పై హత్యాయత్నానికి పాల్పడ్డ దుండగుడితోపాటు సహకరించిన ముఠా, కీలక సూత్రధారులను పోలీసులు గుర్తించినట్లు సమాచారం. దాడికి పాల్పడినట్లు గుర్తించిన అనుమానితుడితోపాటు మరో ఐదుగురిని పోలీసులు విచారిస్తున్నట్లు తెలుస్తోంది. వీరిలో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేత ఒకరు ఉండటం గమనార్హం. హత్యాయత్నం వెనుక కుట్ర కోణంలో సంచలన విషయాలు వెలుగు చూసినట్లు సమాచారం. అనుమానితులు, తెర వెనుక పాత్రధారులకు సంబంధించిన ఆధారాలను పక్కా శాస్త్రీయంగా విశ్లేషించారు. నేరాన్ని రుజువు చేసేందుకు హేతుబద్ధమైన ఆధారాలను సేకరించి క్రోడీకరించారు. సాంకేతిక పరమైన ప్రక్రియను కూడా పాటించిన అనంతరం కేసుకు సంబంధించిన వివరాలను పోలీసులు గురువారం వెల్లడించే అవకాశాలున్నాయి.



60 మందికిపైగా విచారణ

ముఖ్యమంత్రి జగన్‌పై హత్యాయత్నం కేసును పోలీసులు ఛేదించారు. పదునైన రాయితో ఏ విధంగా హత్యాయత్నానికి పాల్పడిందీ నిర్ధారించారు. పదునైన రాయితో దాడి చేసింది ఎవరు? దుండగుడికి సహకారం అందించింది ఎవరు? అనే కీలక అంశాలను రాబట్టారు. వీడియో ఫుటేజీలు, కాల్ డేటా, ఇతర శాస్త్రీయ ఆధారాలతో కేసు దర్యాప్తును పోలీసులు తుది అంకానికి తెచ్చారు. దాదాపు 60 మందికిపైగా అనుమానితులను విచారించి అన్ని కోణాల్లో సమగ్రంగా దర్యాప్తు చేసి కేసును కొలిక్కి తెచ్చారు.

కుట్ర కోణంపై ముమ్మర దర్యాప్తు

ఈ హత్యాయత్నం వెనుక కుట్ర కోణంపై విచారణ సందర్భంగా సంచలన విషయాలు వెలుగు చూసినట్లు సమాచారం. దుండగుడికి సహకరించినవారితోపాటు ఆ దిశగా ప్రోత్సహించిన కీలక నిందితుడిని పోలీసులు గుర్తించారు. అతడు విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో టీడీపీ క్రియాశీలక నేత కావడం గమనార్హం. టీడీపీ సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా కూడా వ్యవహరిస్తున్నట్లు గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకుని క్షుణ్నంగా విచారించడంతో సంచలన అంశాలు వెల్లడైనట్టు తెలుస్తోంది.

అజ్ఞాతంలో సెంట్రల్ నేత

తాజా పరిణామాల నేపథ్యంలో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గానికి చెందిన టీడీపీ కీలక నేత అజ్ఞాతంలోకి వెళ్లడం గమనార్హం. పోలీసులు దీంతో నిమిత్తం లేకుండా ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ కేసు దర్యాప్తును వేగవంతం చేశారు. టీడీపీ నేత వెల్లడించిన విషయాలను ఇతర అంశాలతో సరిపోల్చి నిర్ధారించుకుంటున్నారు. అదుపులో ఉన్న నిందితులు వెల్లడించిన కుట్ర కోణం వాస్తవమేనని నిర్ధారించుకున్న తరువాతే తదుపరి చర్యలు చేపట్టాలన్నది పోలీసుల ఉద్దేశం. దాంతో ఆ దిశగా దర్యాప్తు వేగం పుంజుకుంది.

ప్రధాన ఎన్నికల అధికారికి నివేదిక

ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ఈ కేసు దర్యాప్తు వివరాలను పోలీసులు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనాకు ఎప్పటికప్పుడు నివేదిస్తున్నారు. దాడికి పాల్పడిన విధానం, అనుమానితుల నుంచి సేకరించిన సమాచారం, కుట్ర కోణాలపై కీలక సమాచారాన్ని విజయవాడ పోలీసులు ఇప్పటికే రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి నివేదించినట్లు తెలుస్తోంది. దర్యాప్తు వివరాలపై ఆయన వ్యక్తం చేసిన సందేహాలను సంతృప్తికరంగా నివృత్తి చేసినట్టు సమాచారం. ఈ క్రమంలో సాంకేతిక వ్యవహారాలను పూర్తి చేసి కేసులో కీలక వివరాలను నేడు వెల్లడించవచ్చని భావిస్తున్నారు.

బాబూ.. తప్పుచేసి తప్పించుకునే ప్రయత్నమా?

- సీఎం జగన్‌పై హత్యాయత్నంలో చంద్రబాబు ప్రమేయం ఉంది
- అందుకే బొండా ఉమాను కేసులో ఇరికిస్తున్నారంటూ ప్రెస్ రిలీజ్‌లు
- ఇప్పటివరకు దర్యాప్తు వివరాలను బయటపెట్టని పోలీసులు
- మరి చంద్రబాబు ఏ ప్రాతిపదికన బొండా ఉన్నారని నిర్ధారించేశారు
- ముందు జాగ్రత్త కోసం దొంగే.. దొంగా.. దొంగా అని అరుస్తున్నట్టుంది
- జూన్ 4 నాటికి టీడీపీ అంటే తూర్పు తిరిగి దండం పెట్టే పార్టీగా మిగులుతుంది
- వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి రవిచంద్రారెడ్డి

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం కేసులో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడి వైఖరి చూస్తుంటే తప్పుచేసి తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నట్టుందని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి కనుమూరి రవిచంద్రారెడ్డి చెప్పారు. టీడీపీ విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థి బొండా ఉమాను కేసులో ఇరికించే ప్రయత్నం చేస్తున్నట్టు చంద్రబాబు ప్రెస్ రిలీజ్‌లు చేయడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. సీఎం జగన్‌పై హత్యాయత్నం కేసులో పోలీసులు ఇప్పటివరకు దర్యాప్తు విషయాలను బహిర్గతం చేయలేదని చెప్పారు. అలాంటప్పుడు బాబు ఏ సమాచారం మేరకు బొండా ఉమా ప్రమేయాన్ని నిర్ధారించేశారని ప్రశ్నించారు. కచ్చితంగా తప్పు చేశారు కాబట్టే.. దొరికిపోతామనే భయంతో ముందస్తు డ్రామాకు తెరదీశారని ఎద్దేవా చేశారు. మేమంతా సిద్ధం బస్సుయాత్రకు వస్తున్న జనప్రవాహాన్ని చూసి ఓర్చుకోలేక హత్యాయత్నానికి పాల్పడ్డారన్నారు. ముందు జాగ్రత్త కోసమే దొంగే (బాబు).. దొంగా.. దొంగా అన్నట్లుగా అరుస్తున్నారని చెప్పారు. వీటినిబట్టి కచ్చితంగా ఈ దురాఘతానికి పురిగొల్పింది చంద్రబాబే అని స్పష్టమవుతోందని పేర్కొన్నారు.



అందుకే బొండా ఉమా ఫోన్ స్విచ్ ఆఫ్ చేశారని తెలుస్తోందన్నారు. 'పోలీసులు అధికారికంగా ప్రకటించకుండానే.. ఏ బొండా ఉన్నాడో, ఏ బజ్జీ ఉన్నాడో మీకెలా తెలుసు చంద్రబాబు? సీఎం జగన్ యాత్ర చూసి మీలో ఓటమి భయం పెరిగింది. మీరు పవన్, పురందేశ్వరితో కలిసి చేస్తున్న యాత్రలు అట్టర్‌ఫ్లాప్ అవుతున్నాయి. అందుకే ఫ్రస్టేషన్‌కి గురవుతున్నారు. ఇందులో భాగంగానే హత్యాయత్నానికి ఉసిగొల్పారు..' అని మండిపడ్డారు. కుట్రలే అజెండాగా ఏర్పడిన కూటమి భవిష్యత్తు రాబోయే రోజుల్లో కచ్చితంగా తెల్లారిపోతుందన్నారు. ఇప్పటికే రామోజీ మార్గదర్శి అక్రమాల కేసుల్లో పీకల్లోతు మునిగిపోయారని, మళ్లీ సీఎం జగన్ అధికారంలోకి వస్తే ఉనికి గల్లంతవుతుందని భయపడుతున్నారని చెప్పారు. దింపుడుకళ్లెం ఆశలతో రాధాకృష్ణ, బి.ఆర్.నాయుడుతో సహా దుష్టచతుష్టయం మొత్తం విషం చిమ్ముతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే టీడీపీ అంటే టోటల్‌గా దివాళా తీసే పార్టీగా మారిపోయిందని చెప్పారు. జూన్ 4న టీడీపీ అంటే తూర్పు తిరిగి దండం పెట్టే పార్టీగా మిగులుతుందని ఆయన పేర్కొన్నారు.

నాడు కోడికత్తి.. నేడు గులకరాయి డ్రామా

- పెడన, మచిలీపట్నం ప్రజాగళంలో చంద్రబాబు, పవన్
- టీడీపీ కూటమిని గెలిపిస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు
- బాబాయిని ఎందుకు హత్య చేశావో.. చెల్లిని రోడ్డుపాలెందుకు చేశావో చెప్పు..
- అధికారంలోకి వచ్చాక మమ్మల్ని ఇబ్బంది పెట్టిన వారి సంగతి చెబుతాం

సాక్షి, మచిలీపట్నం: గత ఎన్నికల ముందు కోడికత్తి డ్రామాలు ఆడిన సీఎం జగన్ ఇప్పుడు గులకరాయి డ్రామాకు తెరలేపారని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఎద్దేవా చేశారు. ఎవరితోనో దాడులు చేయించుకుని వాటిని తమపై రుద్దుతున్నారని ఆరోపించారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌తో కలిసి బుధవారం ఆయన కృష్ణాజిల్లా పెడన, మచిలీపట్నంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో టీడీపీ కూటమిని గెలిపిస్తేనే రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుందన్నారు. గత ఎన్నికల ముందు సొంత బాబాయిని గొడ్డలితో ఎందుకు హత్యచేశావో చెప్పాలని, తోడబుట్టిన చెల్లిని ఎందుకు రోడ్డుపాల్జేశావో సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సైకో పోవాలని, సైకిల్ కూటమి రావాలన్నారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తానని, జాబు రావాలంటే కూటమి రావాలని చంద్రబాబు చెప్పారు. ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలిస్తానని, అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ విడుదల చేస్తామని ఆయన వెల్లడించారు. ఈ ఫైలుపైనే తొలి సంతకం చేస్తానని హామీ ఇచ్చారు. అవ్వాతాతలకు నెలకు రూ.4వేల పింఛన్ ఇస్తామని.. ఏప్రిల్ నుంచి దీనిని వర్తింపజేస్తామన్నారు. అనంతరం పవన్ మాట్లాడుతూ.. కూటమి పాలన వస్తుందని తెలిసే జగన్‌కు బీపీ పెరిగిందని, సర్వేలన్నీ కూటమి గెలుపునే చెబుతున్నాయన్నారు. అధికారంలోకి వచ్చాక తమ పార్టీ నాయకులను ఇబ్బందులు పెట్టిన వారి సంగతి చెబుతామన్నారు. తమ కూటమి అధికారంలోకొస్తే ఇంటింటికీ కుళాయి ద్వారా మంచినీటి సరఫరా చేస్తామని పవన్ హామీ ఇచ్చారు. మరోవైపు.. ప్రజాగళం ఎన్నికల షో అట్టర్‌ఫ్లాప్ అయ్యింది. చంద్రబాబు ప్రసంగం ప్రారంభమైన వెంటనే జనం తిరుగుముఖం పట్టారు.



పెడన సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు

అభ్యర్థులతో పవన్ ఫొటోషూట్

- దుర్ముహూర్త ఘడియల్లో బి.ఫారాలు ఇచ్చేందుకు నిర్ణయం
- ఎవరో చెప్పడంతో నాలుక కరుచుకుని మధ్యాహ్నానికి వాయిదా

సాక్షి, అమరావతి: నిన్నమొన్నటి వరకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిలుగా కొనసాగి.. ఇప్పుడు జనసేనలో చేరిన వారికి పలుచోట్ల అభ్యర్థిత్వాలు దక్కాయి. ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో వినియోగించుకునేందుకు వీలుగా పవన్‌కళ్యాణ్ తన పార్టీ అభ్యర్థులతో బుధవారం ఫొటో షూట్ నిర్వహించారు. ఇందుకు మంగళగిరిలోని జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయం వేదికైంది. నిజానికి.. అభ్యర్థులకు బుధవారం బి.ఫారాలు అందజేయాలని నిర్ణయించగా.. 21 స్థానాల్లో పోటీ చేయబోయే అభ్యర్థులందరినీ పార్టీ కార్యాలయానికి రావాలని పిలిచారు. ఉదయం 11.30 గంటలకు ముహూర్తం నిర్ణయించగా.. ఆ సమయంలో దుర్ముహూర్త ఘడియలు ఉన్నాయని ఎవరో చెప్పడంతో పార్టీ అధిష్టానం నాలుక కరుచుకుంది. ఆ తరువాత తేరుకుని బుధవారం మధ్యాహ్నం 1.30 గంటల తర్వాత అభ్యర్థులకు పవన్‌కళ్యాణ్ చేతుల మీదగా బి.ఫారాలు అందజేసే కార్యక్రమం చేపట్టారు. 11.30–1.30 గంటల మధ్య అభ్యర్థులతో ఫొటోషూట్ జరిపించారు. కాగా.. ఈ కార్యక్రమాలకు పాలకొండ అభ్యర్థి నిమ్మక జయకృష్ణ హాజరుకాలేదు.


నిమ్మక జయరాజుపై సస్పెన్షన్ వేటు



సాక్షి ప్రతినిధి, విజయనగరం: అరకు లోక్‌సభ టికెట్ కోసం చివరి వరకూ ప్రయత్నాలు చేసిన బీజేపీ కోర్ కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజుపై బీజేపీ సస్పెన్షన్ వేటు వేసింది. ఆయనను పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి తొలగించినట్టు పేర్కొంటూ బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ పాకా వెంకట సత్యనారాయణ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్టు వచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల 1న నోటీసు ద్వారా వివరణ కోరినా.. జయరాజు నుంచి స్పందన లేదని పేర్కొన్నారు. పార్టీ నియమావళికి విరుద్ధంగా ఆయన ప్రవర్తన ఉండటంతో పార్టీ నుంచి బహిష్కరించినట్టు తెలిపారు. దీనిపై జయరాజు 'సాక్షి'తో మాట్లాడుతూ.. తాను ఎలాంటి తప్పు చేయలేదన్నారు. బీజేపీలో సీనియర్ నాయకుడిగా.. పార్టీ నియమావళికి ఏ రోజూ విరుద్ధంగా వ్యవహరించలేదన్నారు. కేవలం బీజేపీలో సంప్రదాయానికి విరుద్ధంగా ఉన్న కొత్తపల్లి గీత వ్యవహార శైలిపై మాత్రమే ఫిర్యాదు చేశానని, ఆమెపై వ్యక్తిగతంగా తనకు ఎలాంటి ద్వేషం లేదని వెల్లడించారు. కనీసం నోటీసు కూడా ఇవ్వకుండా ఏకపక్షంగా ఎలా సస్పెండ్ చేస్తారని ప్రశ్నించారు.

రాష్ట్రంలో రూ.350 కోట్లతో సింపోలో టైల్స్

సాక్షి, అమరావతి: ప్రముఖ టైల్స్, బాత్‌వేర్ బ్రాండ్ సింపోలో రాష్ట్రంలో భారీ పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చింది. దక్షిణాది రాష్ట్రాల టైల్ మార్కెట్ అవకాశాలను అందిపుచ్చుకోవడానికి రూ.350 కోట్లతో దేశంలో రెండో టైల్స్ తయారీ యూనిట్‌ను ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు సింపోలో మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) జితేంద్ర అఘరా చెప్పారు. తిరుపతి జిల్లా నాయుడుపేట సమీపంలో సుమారు 83 ఎకరాల విస్తీర్ణంలో ఈ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఇటీవల కోయంబత్తూరులో జరిగిన కార్యక్రమంలో ప్రకటించారు. ఏటా 13.2 మిలియన్ చదరపు మీటర్ల టైల్స్ తయారీ సామర్థ్యంతో ఏర్పాటు చేస్తున్న ఈ యూనిట్ వచ్చే ఆర్థిక సంవత్సరంలో వాణిజ్యపరంగా ఉత్పత్తి కార్యకలాపాలు ప్రారంభిస్తుందని తెలిపారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం బాగా జరిగే తమిళనాడు, కర్ణాటక, తెలంగాణలకు నాయుడుపేట సమదూరంలో ఉండటంతో వ్యూహాత్మక ప్రాంతంగా దీన్ని ఎంచుకున్నారు. ఈ యూనిట్ ఏర్పాటు ద్వారా దక్షిణాది టైల్స్ మార్కెట్‌లో వాటా పెంచుకోవడానికి సింపోలో ప్రణాళికను సిద్ధం చేసింది. దీంతోపాటు గుజరాత్‌లోని మొర్బీ ప్లాంట్‌ను రూ.650 కోట్లతో విస్తరించనుంది. ఈ రెండు యూనిట్ల రాకతో ప్రస్తుతం ఉన్న 14.5 మిలియన్ చదరపు మీటర్ల టైల్స్ ఉత్పత్తి సామర్థ్యానికి అదనంగా మరో 28 మిలియన్ చదరపు మీటర్ల సామర్థ్యం పెరగనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో టర్నోవర్ రూ.1,600 కోట్లు దాటుతుందని సింపోలో టైల్స్ అంచనా వేస్తోంది.



"ఏమైనా సరే పెళ్లి చేసుకోండి : ఒకవేళ నీకు మంచి భార్య దొరికితే సంతోషపడతావు ; చెడ్డ మనిషి దొరికితే తత్వవేత్త అవుతావు.
– సోక్రటీస్

సాక్షి
గురువారం, 18 ఏప్రిల్ 2024

ప్రమాదపుటంచున...

ఇప్పటి దాకా ముసుగులో గుద్దులాటగా ఉన్న వ్యవహారం బట్టబయలైంది. ఏప్రిల్ 13 రాత్రి ఇజ్రాయెల్‌పై ఇరాన్ పెద్దయెత్తున సాగించిన డ్రోన్, క్షిపణి దాడితో ఆ రెండు దేశాల మధ్య నాలుగు దశాబ్దాల పైగా లోలోపల సాగుతున్న కుమ్ములాట బయటపడింది. ముందుగా ఏప్రిల్ 1న సిరియా రాజధాని డెమాస్కస్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయంపై ఇజ్రాయెల్ జరిపిన దాడి, ఒక జనరల్ సహా పలువురు సైనికాధికారుల మృతితో అగ్గి రాజుకుంది. ప్రతీకారంగా గత శనివారం ఇరాన్ పంజా విసరడంతో వ్యవహారం ముదిరింది. యుద్ధం ఊసెత్తకపోయినా దెబ్బకు దెబ్బగా టెహరాన్‌పై తగిన చర్య చేపడుతామంటోంది టెల్ అవీవ్. అసలే అస్థిరతలో మునిగిన పశ్చిమాసియా ఈ శరవేగ పరిణామాలు, వ్యాఖ్యలతో ఏ క్షణమైనా పూర్తిస్థాయి యుద్ధంలో చిక్కుకుపోవచ్చు.

చాలాకాలంగా ఇరాన్ తన వ్యూహాత్మక లక్ష్యాలకై పరోక్ష సహకారం అందిస్తూ ప్రాంతీయ తీవ్రవాద సంస్థలను ఇజ్రాయెల్ పౌరులపైన, వివిధ దేశాల్లోని ఇజ్రాయెల్ ఆస్తులపైన ప్రయోగిస్తూ వచ్చింది. అయితే, ఇజ్రాయెల్‌తో ఎన్నడూ నేరుగా ఘర్షణకు దిగలేదు. తెర వెనుక నుంచి తాను చేసినవి ఒప్పుకోనూ లేదు. ఇజ్రాయెల్‌దీ అదే పంథా. మూడేళ్ళ క్రితం ఇరాన్‌కు చెందిన ముగ్గురు అణుశాస్త్రవేత్తల హత్యలో తన పాత్రను ఆ దేశమూ అంగీకరించ లేదు, అలాగని ఖండించనూ లేదు. ఈ పరిస్థితుల్లో గత ఏడాది అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడులతో గాజా భూఖండం సంక్షోభంలో పడింది. సదరు హమాస్ దాడుల వెనుక ఇరాన్ పాత్ర గురించి కథలు కథలుంటే, అదే అదనుగా పాలెస్తీనీయుల గాజాను ఇజ్రాయెల్ సమూలంగా ధ్వంసం చేసేసింది. ఐరాస సహా ఎవరెన్ని చెప్పినా నెలల తరబడి ఇజ్రాయెల్ ఆగలేదు, గాజాపై దాడులు ఆపనూ లేదు. ఈ నేపథ్యం నుంచి తాజా ఘటనల్ని చూడాలి. చివరకిప్పుడు ఇరాన్ నేరుగా తన గడ్డ మీద నుంచే ఇజ్రాయెల్‌పై దాడికి దిగింది. కొన్ని దశాబ్దాలుగా పశ్చిమాసియాలో ఎన్నడూ లేనంతటి ఉద్రిక్తతను పెంచింది.

ఇరాన్ ప్రయోగించిన 360 క్షిపణుల్లో చాలావాటిని అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జోర్డాన్‌ల సహకారంతో ఇజ్రాయెల్ నిలువరించగలిగింది. రాయబార కార్యాలయంపై దాడికి ప్రతిగా స్వీయ రక్షణ కోసమే తాము దాడి చేశామనీ, విషయం ఇంతటితో ముగిసిందనీ ఇరాన్ అంటోంది. ఇక, క్షిపణి దాడిని సమర్థంగా అడ్డుకున్నందున సంయమనం పాటించి, పరిస్థితి ప్రాంతీయ యుద్ధానికి దారి తీయకుండా చూడాలని అమెరికా సహా ఇతర మిత్రదేశాలు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూను అభ్యర్థిస్తున్నాయి. ఇజ్రాయెల్ సరేనన్నట్టు ఉంటూనే, ఇరాన్‌కు తగిన బదులిస్తామంటోంది. ఏమైనా ఇరాన్, ఇజ్రాయెల్‌లు దేనికది మధ్యప్రాచ్యంలో తమదే పై చేయి అని చూపేందుకు యత్నిస్తున్నాయి. అందులో భాగమే రెండు దేశాలూ ఇప్పుడు దాదాపు నేరుగా కయ్యానికి దిగడం!

పశ్చిమాసియాలో పరిస్థితికి ఇరు దేశాల బాధ్యతా ఉంది. ఇజ్రాయెల్ నిస్సిగ్గుగా పాలెస్తీనా భూభాగాల్ని బలవంతాన దిగ్బంధించి, కథ నడుపుతుంటే ప్రపంచపు పెద్దన్నలెవరూ ఎన్నో ఏళ్ళుగా పెదవి విప్పలేదు. పట్టించుకోకుండా వదిలేశారు. నిరుడు హమాస్ దాడితో ఇజ్రాయెల్ అహం దెబ్బతిని, గాజాలో సామూహిక ఊచకోతకు దిగినప్పుడూ అమెరికా సహా ఎవరూ దాన్ని ఆపలేకపోయారు. ఇరాన్ సంగతికొస్తే, అదీ ఇష్టానుసారం వ్యవహరించింది. హెజ్బుల్లా, హమాస్, హౌతీల లాంటివన్నీ అది పరోక్షంగా పోషిస్తున్న పాములే. కొన్నేళ్ళుగా ఇరాక్, లెబనాన్, సిరియా, యెమన్‌లలో ఇరాన్ పరోక్ష సహకారంతో నడుస్తున్న ప్రాంతీయ తీవ్ర వాద మూకలను నిలువరించడమే ఇజ్రాయెల్, అమెరికాల పని అయింది. వెరసి, ఇరాన్, ఇజ్రాయెల్‌ల తప్పిదాలు, స్వార్థంతో పక్కన చేరిన దేశాలతో పశ్చిమాసియా చిక్కుల్లో పడింది. తాజా ఘటనలతో యుద్ధం అంచున నిల్చుంది.

ప్రతి యుద్ధం ప్రపంచంలో అనిశ్చితిని పెంచేదే. మరీ ముఖ్యంగా, ప్రపంచానికి ఇంధన భాండాగారం లాంటి పశ్చిమాసియా యుద్ధక్షేత్రంగా మారితే ఇక చెప్పేదేముంది! తీవ్ర పరిణామాలు తప్పవు. ఇరాన్ – ఇజ్రాయెల్‌ల మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణంతో ప్రస్తుతం ప్రపంచమంతటా ఉత్కంఠ నెలకొన్నది అందుకే! వ్యవహారాన్ని తెగేదాకా లాగి, ప్రపంచం రెండు శిబిరాలుగా చీలితే కష్టం. ఇరాన్ దాడితో పని లేకుండా గాజాలో యుద్ధం కొనసాగిస్తామని ఇజ్రాయెల్ అంటోంది. అంటే, ఇరాన్ – ఇజ్రాయెల్ సంక్షోభం ముగియనే లేదని స్పష్టమవుతోంది. తక్షణమే అంతర్జాతీయ సమాజం బరిలోకి దిగి, ముందు గాజాలో దాడులు, పాలెస్తీనాలో అమాయక పౌరుల మరణాలు ఆగేలా చూడాలి. ఇజ్రాయెల్‌కు 66 శాతం మేర ఆయుధాలిస్తున్న అమెరికా, అలాగే ఇతర ఆయుధ సరఫరా దేశాలు తమ సరఫరాలు తగ్గించగలిగితే మేలు.

అంతకంతకూ అంతర్జాతీయంగా తాను ఒంటరి అవుతున్నానని ఇజ్రాయెల్ గుర్తించాలి. 'అబ్రహమ్ ఒడంబడికల' ద్వారా మితవాద అరబ్ దేశాలు నెయ్యానికి ముందుకు రావడంతో దానికి కలిగిన ప్రయోజనం పోతుంది. అయినా, ఇంతకు ముందు, ఇకపైన కూడా మధ్య ప్రాచ్యంలో ఇరాన్, ఇజ్రాయెల్‌లు రెండు ప్రధాన సైనిక శక్తులు. ఇరుపక్షాలూ లక్ష్మణరేఖ దాటాయి. వాటి మధ్య ఘర్షణ చివరకు యుద్ధంగా పర్యవసిస్తే అది రెంటికీ నష్టమే. కాబట్టి, మంకుపట్టు వీడి, వెనక్కు తగ్గాలి. ప్రస్తుత ఉద్రిక్తతను చల్లార్చాలి. పొంచివున్న పెను యుద్ధం ముప్పును నివారించాలి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగితే, ప్రపంచ చమురు సరఫరాలు సైతం అస్తవ్యస్తమై, ధరలు పెరుగుతాయి. రష్యా నుంచి చమురు సరఫరా కోసం ఎర్రసముద్రంపై ఆధారపడే మన దేశానికీ ఇబ్బందే. భారత్ సూచించినట్టు మళ్ళీ దౌత్యమార్గాన్ని ఆశ్రయించడమే అన్ని వివాదాలకూ పరిష్కారం.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు
చైత్ర మాసం, **తిథి:** శు.దశమి రా.6.54 వరకు, తదుపరి ఏకాదశి,
నక్షత్రం: ఆశ్లేష ఉ.9.37 వరకు, తదుపరి మఖ, **వర్జ్యం:** రా.10.45 నుండి 12.30 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.55 నుండి 10.43 వరకు తదుపరి ప.2.54 నుండి 3.43 వరకు, **అమృతఘడియలు:** ఉ.7.54 నుండి 9.35 వరకు

సూర్యోదయం : 5.47
సూర్యాస్తమయం : 6.11
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

లింగసమానత్వమే మహిళల ఎజెండా

విశ్లేషణ



ఏంజెలికా అరిబమ్

మహిళా ఓటర్లు రాజకీయ పార్టీలకు కీలకంగా మారారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో, పురుషుల భాగస్వామ్యాన్ని మహిళా ఓటర్ల సంఖ్య అధిగమించింది. రానున్న సాధారణ ఎన్నికల్లో దాదాపు 47 కోట్ల మంది మహిళలు ఓటు వేయనున్నట్లు భారత ఎన్నికల సంఘం అంచనా వేసింది. మగవారి ఆదేశాల మేరకే మహిళలు ఓటు వేస్తారనే భావన క్రమంగా తన విలువను కోల్పోతోంది. పూర్తి స్పృహతో వారి ఎంపికలు ఉంటున్నాయి. సమానత్వం, గౌరవప్రదమైన జీవితం తప్ప మహిళలకు మరేదీ అంగీకారం కాదు. వీటిని సాధించే జెండర్ మేనిఫెస్టో తక్షణావసరం. లింగ సమాన ప్రపంచాన్ని సాధించడానికి కొత్త పుంతలు తొక్కాలనే సంకల్పం ఉంటే ఇదేమీ అసాధ్యం కాదు.

భారతదేశం సార్వత్రిక ఎన్నికల వైపు వెళుతున్నందున, నేను గత కొన్ని వారాలుగా మహిళలు, ఎల్‌జీబీటీక్యూ+ వ్యక్తులతో మాట్లాడి తదుపరి ప్రభుత్వంపై వారి అంచనాలను జెండర్ మేనిఫెస్టోలో పొందుపరిచాను. గ్లోబల్ జెండర్ గ్యాప్ రిపోర్ట్ 2023 ప్రకారం, భారతదేశం ప్రస్తుతం లింగ సమానత్వంలో 146 దేశాలలో 127వ స్థానంలో ఉంది. ఈ విషయంలో కొన్ని చిన్న, కొన్ని భారీ అడుగులు పడ్డాయి. కానీ ఇది సరిపోదు. రాజ్యాంగ ప్రవేశిక పౌరులందరికీ న్యాయం, స్వేచ్ఛ, సమానత్వానికి కట్టుబడి ఉంది. భారతదేశ జనాభాలో సగానికి పైగా, ముఖ్యంగా అట్టడుగు వర్గాలకు చెందిన వారు ఇప్పటికీ ఈ ప్రాథమిక హామీలను పొందేందుకు కష్టపడుతున్నారు. జెండర్ మేనిఫెస్టో కోసం సంప్రదింపుల ప్రక్రియను మొత్తంగా చూస్తే, భారతదేశంలోని మహిళలు సమానత్వం, గౌరవప్రదమైన జీవితాన్ని తప్ప మరేమీ కోరుకోవడం లేదని స్పష్టమైంది.

హక్కుల కోసం పోరాడాలా?

చారిత్రకంగా నేరపూరితమైన సంచార, డీనోటిఫైడ్ తెగల (నేరస్థ తెగల చట్టం నుండి మినహాయించిన) జనాభాలో ఎక్కువ మందికి, ప్రత్యేకించి మహిళలకు ప్రభుత్వ గుర్తింపు పత్రాలు లేవని అధ్యయనాలు చెబుతున్నాయి. అదేవిధంగా, ట్రాన్స్ జెండర్ వ్యక్తులు ఇప్పటికీ, వారి 'మృత పేర్లను' (లింగ పరివర్తన తర్వాత ఉపయోగంలో లేనటువంటి వారి పుట్టుక పేర్లు) కలిగి ఉన్న రాతపనిని నవీకరించడానికి అధిగమించలేని సవాళ్లను ఎదుర్కొంటున్నారు. వారి గుర్తింపు హక్కు చాలా కాలంగా నిరాకరించబడింది. 2024లో, ఉనికిలో ఉండే హక్కు ఏ వ్యక్తికైనా పోరాటం కాకూడదు. అన్ని వర్గాలకు చెందిన మహిళలు, ఎల్‌జీబీటీక్యూ+ వ్యక్తుల ఆశలు, ఆశయాలను గుర్తించే జెండర్ ఎజెండాను అనుసరించడం మన రాజకీయ పార్టీల కర్తవ్యం కావాలి. ఈ ఎజెండా కోసం ఇక్కడ కొన్ని సిఫార్సులు: రాజ్యాంగం సమానత్వానికి హామీ ఇస్తుండగా, లింగ నిర్ధారిత కోణం నుండి చూసినప్పుడు వ్యక్తిగత హక్కులు తక్కువగా ఉంటున్నాయి. వివాహం చేసుకునే ప్రాథమిక హక్కు పౌరులకు లేదని గతేడాది సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ఎల్‌జీబీటీక్యూ+ వ్యక్తులకు తమ భాగస్వాములను ఎంచుకునే హక్కును తిరస్కరించినట్లయితే మనం సమానత్వాన్ని ప్రకటించుకోలేం. వీలైనంత త్వరగా పార్లమెంటు దీనిపై చట్టం చేయాలి.

ప్రతిరోజూ, మహిళలు తీవ్రమైన భద్రతా సవాళ్లను ఎదుర్కొంటున్నారు. వాటిలో కొన్ని ఇంట్లో ప్రారంభమవుతాయి. శిక్షాస్మృతిలో వైవాహిక అత్యాచారం మినహాయింపుగా ఉండటం అనాలోచితం. తదుపరి ప్రభుత్వం ఈ చట్టాన్ని తొలగించి, లింగ ఆధారిత హింస పట్ల జీరో–టాలరెన్స్(ఏమాత్రం సహించని) విధానాన్ని అనుసరించాలి. చాలామంది మహిళలు డీప్ ఫేక్ (మార్ఫింగ్ వీడియోలు), ఆన్‌లైన్ దుర్వినియోగం పట్ల ఉన్న వారి భయాల గురించి నాతో మాట్లాడారు. పెరుగుతున్న ముప్పును ఎదుర్కోవడానికి ప్రస్తుత శాంతి భద్రతల యంత్రాంగాలు తగినంతగా సన్నద్ధంగా లేవు. మహిళలు ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో సురక్షితంగా ఉండేలా చేయడానికి వీటిని తప్పనిసరిగా సంస్కరించాల్సి ఉంది.



లింగ అపోహలు తొలగాలి

అన్నిరకాల సామాజిక కలయికలు పెరగాలంటే, లింగ అపోహలను వదిలించుకోవాలి. ముఖ్యంగా పిల్లలు తమ పరిసరాలలో లింగపరమైన సామాజికీకరణ కారణంగా పితృస్వామ్య పద్ధతులను అవలంబిస్తారు. లింగపరమైన మూస పద్ధతులను తొలగించడానికి పాఠశాల పాఠ్యపుస్తకాలను సమీక్షించడం, తిరగరాయడం తక్షణ అవసరం. అదనంగా, లింగపరమైన సున్నితత్వాన్ని బోధించే వర్క్‌షాప్‌లను పాఠశాల పాఠ్యాంశాలలో చేర్చాలి. తరువాత, పిల్లల సంరక్షణ అనేది తల్లిదండ్రుల ఉమ్మడి బాధ్యత అని మనం గుర్తించాలి. అన్ని అధికారిక సంస్థలలో వేతన చెల్లింపుతో కూడిన పితృత్వ సెలవును తప్పనిసరి చేయాలి. ఒక దృష్టాంతాన్ని నెలకొల్పడానికి, అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో 'క్రెష్'(శిశు సంరక్షణ కేంద్రం)లను కూడా ఏర్పాటు చేయాలి. తద్వారా పనిచేసే తల్లిదండ్రులు, లింగ భేదం లేకుండా పిల్లల సంరక్షణలో పాల్గొనేలా చేయాలి.

కోవిడ్ తర్వాత, ఆరోగ్య హక్కుపై ఎక్కువ దృష్టి పడింది. అయితే, మహిళలు తమ ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వడం లేదని అధ్యయనాలు కనుగొన్నాయి. ఆరోగ్య హక్కును కీలకమైనదిగా పరిగణించాలి. లింగపరమైన దృష్టితో విధానాలను రూపొందించాలి. గత కేంద్ర బడ్జెట్‌లో, గర్భాశయ క్యాన్సర్‌ను నివారించడానికి టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రకటించింది. తప్పనిసరిగా రొమ్ము, గర్భాశయ క్యాన్సర్‌కు ఉచిత పరీక్షలు చేయాలి. ఇంకా, జాతీయ ఆహార భద్రతా చట్టం 2013 ప్రకారం, గర్భిణులకు, పాలిచ్చే తల్లులకు ద్రవ్యోల్బణంతో సరిపోయేలా ఆర్థిక సహాయాన్ని తప్పనిసరిగా పెంచాలి.

మహిళలకు ఆర్థిక శ్రేయస్సును అందించడం తదుపరి ప్రభుత్వానికి ఒక ముఖ్యమైన సవాలు. మహిళల నేతృత్వంలోని స్టార్టప్‌లకు నిర్దిష్ట నిధులను తప్పనిసరిగా కేటాయించాలి. మహిళా రైతులను గుర్తించకపోవడం, తక్కువ మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్యం మహిళలకు సంబంధించినంతవరకు రెండు ప్రధాన బాధాకరమైన అంశాలు. తదుపరి ప్రభుత్వం మహిళా రైతుల హక్కుల బిల్లు, 2011ను తప్పనిసరిగా అమలులోకి తేవాలి. కార్మిక శక్తిలో మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే ఆర్థిక విధానాలను, ముఖ్యంగా ఉత్పాదక రంగంలో అమలు చేయాలి. తమ సిబ్బందిలో 20 శాతం కంటే ఎక్కువ మంది మహిళలను నియమించుకునే సంస్థలకు పన్ను రాయితీలు మంజూరు చేయడం ఒక మార్గం. ప్రభుత్వం అతిపెద్ద ఉద్యోగ కల్పనాదారులలో ఒకటి కాబట్టి, 30 లక్షలుగా అంచనా వేసిన ప్రస్తుత ఖాళీ స్థానాలను త్వరగా భర్తీ చేయాలి. ఈ ఉద్యోగాలకు మహిళా రిజర్వేషన్‌ను తప్పనిసరిగా విస్తరించాలి.

చట్టం చేయాల్సిన ఆవశ్యకత

భారతదేశంలో మహిళల రాజకీయ హక్కులకు సంబంధించి గత సంవత్సరం చాలా ముఖ్యమైనది. మూడు దశాబ్దాలకు పైగా జరిగిన ఉద్యమాల తర్వాత మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందింది. ప్రభుత్వానికి దృఢ సంకల్పం ఉంటే లింగ సమానత్వం వైపు చరిత్రాత్మక అడుగు వేయవచ్చని ఇది సూచిస్తోంది. అయితే, చట్టం అమలులో లేకపోవడం మనందరినీ నిరాశకు గురిచేస్తోంది. రాబోయే ప్రభుత్వం మహిళా రిజర్వేషన్‌ను వీలైనంత త్వరగా అమలు చేసేలా చూడాలి. ఇది జనాభా లెక్కలను పూర్తి చేయడానికి లోబడి ఉండకూడదు. పైగా, ప్రాతినిధ్యం అనేది ఎగువ మరియు దిగువ సభలు రెండింటిలోనూ ప్రతిబింబించే ఆదర్శం. రాజ్యసభ, లెజిస్లేటివ్ కౌన్సిల్‌లలో ప్రాతినిధ్యం లేని వర్గాలకు రిజర్వేషన్ల నిబంధనలపై పార్లమెంటు తప్పనిసరిగా చట్టం చేయాలి.

భారతదేశం లింగ సమానత్వాన్ని సాధించడానికి ఒక శతాబ్దానికి పైగా కాలం పడుతుంది. గత స్త్రీవాద ఉద్యమాలు మన ప్రధాన లక్ష్యాల సాధనలో పట్టుదలతో కొనసాగుతూనే, చిన్నపాటి విజయాలను జరుపుకోవాలని బోధించాయి. పైన పేర్కొన్న సిఫార్సులు కీలకమైనవి, దూరదృష్టితో కూడుకున్నవి. ముఖ్యంగా, తదుపరి ప్రభుత్వానికి దాని పదవీకాలంలోనే సాధించదగినవి. మనకు కావలసిందల్లా లింగ–సమాన ప్రపంచాన్ని సాధించడానికి కొత్త పుంతలు తొక్కాలనే నిస్సందేహమైన సంకల్పం మాత్రమే.

వ్యాసకర్త 'ఫెమ్మె ఫస్ట్' ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ప్రార్థన



ఓ అల్లా! వరదల నుంచి దుబాయిని రక్షించు. నష్టాలను తక్కువలో తక్కువగా ఉంచు. అక్కడ ఉంటున్నవారినీ, వారి ఆస్తులనూ కాపాడు.

– మహమ్మద్ జకార్యా, పాకిస్తాన్ యానిమేటర్

ఇదేనా భక్తి?



రామమందిర పునర్నిర్మాణానికి పాటు పడ్డానని మోదీ చెప్పకొంటారు. నిజానికి ఆయన తోడ్పాటు సున్నా లేదా అంత కంటే తక్కువ. ఒకవేళ మోదీ నిజమైన రామభక్తుడే అయితే, సుప్రీంకోర్టు తీర్పును ఎందుకు ఆలస్యం అయ్యేలా చేస్తున్నారు? రామ సేతువును జాతీయ వారసత్వ కట్టడంగా ప్రకటించడాన్ని ఎందుకు అడ్డుకుంటున్నారు?

– సుబ్రమణియన్ స్వామి, కేంద్ర మాజీ మంత్రి

గత వైభవం



అఫ్గానిస్తాన్‌ను 1992లో చీకటి మనుషులు చెరపట్టేవరకూ ఫాతనా నజీబ్ అఫ్గానిస్తాన్ తొలి మహిళగా ఉన్నారు. ఆమె కమ్యూనిస్టు పార్టీ నాయకుడు (అఫ్గానిస్తాన్ మాజీ అధ్యక్షుడు) మహమ్మద్ నజీబుల్లా భార్య. ఆమె ఇండియాలో 1992 నుంచి ఉంటూ, ప్రస్తుతం పర్షియన్ భాషను బోధిస్తున్నారు.

– అరశ్ అజీజీ, యూఎస్ పరిశోధకుడు

ప్రయత్నిస్తే ఎదగొచ్చు!



ఈసారి 51 మంది ముస్లింలు యూపీఎస్సీ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. ఈ సంఖ్య తృప్తికరంగా ఉందని చెప్పను గానీ, వాళ్లు ఎవరు అనేదానితో నిమిత్తం లేకుండా ఇండియాలో పౌరులందరికీ అవకాశాలు ఉన్నాయని వాదించ గలను.

– అమనా బేగమ్ అన్సారీ, పాలసీ అనలిస్ట్

పెద్ద పార్టీయేనా?



కాంగ్రెస్ పార్టీ పోటీ చేస్తున్న స్థానాల సంఖ్య: ఉత్తర ప్రదేశ్‌లో 80 స్థానాలకు 17 : మహారాష్ట్రలో 48కి 17 : పశ్చిమ బెంగాల్‌లో 42కు 13 ; బిహార్‌లో 40కి 9 ; తమిళనాడులో 39కి 9. మొత్తం 249 స్థానాల్లో 65. అంటే ఐదు పెద్ద రాష్ట్రాల్లో కాంగ్రెస్ 25 శాతం స్థానాల్లో కూడా పోటీ చేయడం లేదు.

– రిఫీ బాగ్రీ, ట్యాక్స్ పేయర్

రైళ్లు దారుణం



భారతీయ రైల్వేల పరిస్థితి దారుణంగా ఉంది. క్షేత్ర స్థాయి వాస్తవాలు కఠినంగా ఉన్నాయి. అత్యధిక ఛార్జీలతో వందే భారత్ రైళ్లను నడిపే బదులు, ప్రభుత్వం ఉన్నవాటిని నవీకరించాలి. చదువుకున్నవాళ్లు, స్కిల్డ్ ఉద్యోగులు దేశాన్ని వీడి వలస పోతున్నారంటే ఆశ్చర్యం లేదు ; వాళ్లు చెల్లించే పన్నులకు సరిపడా సౌకర్యాలు విదేశాల్లో అందుతాయి.

– ప్రశాంత్ యాదవ్, ఇంజినీర్

ఆరోగ్యం పేరుతో జంక్



ఎయిర్ లైన్స్‌లో ఉప్మా, పోహా, దాల్, చావల్ అనే పేర్లతో సరఫరా చేసినంత మాత్రాన అవి ఆరోగ్యకరమైన ఆహారం అనుకోనక్కర్లేదు. ఆరోగ్యకరమైన ఆహారం పేరుతో చలామణీ అయ్యే జంక్‌ఫుడ్ నిజానికి ఎక్కువ ప్రమాదకరం. భారతీయులు ఇప్పటికే సోడియంను ఎక్కువగా తింటున్నారు. రోజూ సోడియం తింటే రక్తపోటు పెరుగుతుంది ; గుండె, మూత్రపిండాల సమస్యలు వస్తాయి.


– రేవంత్ హిమత్‌సింగ్కా, ఫుడ్ యాక్టివిస్ట్

ఇన్ బాక్స్

భూదానోద్యమ స్ఫూర్తి

భారతదేశంలో 20వ శతాబ్దానికి చెందిన అత్యంత ప్రభావవంతమైన సామాజిక, ఆధ్యాత్మిక నాయకులలో ఆచార్య వినోబా భావే ఒకరు. ఆయన ప్రపంచంలోనే విప్లవాత్మకమైన 'భూదాన ఉద్యమా'న్ని ప్రారంభించారు. దానికి వేదిక తెలంగాణలోని 'పోచంపల్లి' గ్రామం కావడం విశేషం.

వినోబా భావే 1895లో మహారాష్ట్రలో జన్మించారు. ఆయన చిన్నతనంలోనే ఆధ్యాత్మిక, సామాజిక సేవల పట్ల ఆకర్షితులయ్యారు. గాంధీజీ ఆలోచనలకు ప్రభావితులై భారత స్వాతంత్ర్య ఉద్యమంలో చేరారు. 1947లో భారత్ స్వాతంత్ర్యం సాధించిన తర్వాత కూడా వందలు, వేల ఎకరాలున్న భూస్వాములు ఒకవైపూ; అసలు సెంటు భూమి కూడా లేని నిరుపేదలు ఒకవైపూ కనిపించారు. భూస్వాములు తమ భూమిలో కొంత పేదలకు పంచాలని ఉద్బోధిస్తూ వినోబా భావే 1951 ఏప్రిల్ 18వ తేదీన తన 'సర్వోదయ' సమాజం ద్వారా 'భూదాన్ ఉద్యమా'న్ని ప్రారంభించారు. ప్రస్తుత తెలంగాణలోని యాదాద్రి-భువనగిరి జిల్లా, పోచంపల్లి గ్రామానికి చెందిన భూస్వామి రామచంద్రారెడ్డి తనకున్న 3,500 ఎకరాల భూమిలో 900 ఎకరాల భూమిని దానంగా ఇచ్చారు. ఈ భూమిని భూమిలేని కుటుంబాలకు పంపిణీ చేశారు. మొదటగా 'మైసయ్య' అనే వ్యక్తి భూమిని దానంగా పొందాడు.



ఆచార్య వినోబా భావే

హైదరాబాద్ సంస్థానం ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ తన వ్యక్తిగత ఆస్తి 14 వేల ఎకరాల భూమినీ వినోబా పిలుపునందుకొని పేదలకు దానంగా ఇచ్చారు. తెలంగాణలో కమ్యూనిస్టు ఉద్యమం బలంగా ఉండటం భూదాన ఉద్యమం విజయవంతం కావడానికి ఒక కారణం.

దేశంలోని ఇతర ప్రాంతాలలో ఇలాంటి ఉద్యమాలకు ఈ ఉద్యమం స్ఫూర్తినిచ్చింది. ఈ ఉద్యమం వల్ల భూమిలేని పేద ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికీ, సామాజిక న్యాయానికీ ఉద్యమం ఒక ప్రేరణగా నిలిచింది.

– పూనపాటి వేదాద్రి, జగ్గయ్యపేట
(నేడు భూదాన ఉద్యమం ప్రారంభమైన రోజు)

అసలైన సంపద సృష్టికర్తలే గెలిపిస్తారు!

అభిప్రాయం



డా॥ కాలువ మల్లయ్య

వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో ఓ నూతన శకం ఆరంభమైందని చెప్పవచ్చు. కార్పొరేట్ విద్యాలయాలు అందించే విద్యను మించి నాణ్యమైన ఇంగ్లీషు మాధ్యమ విద్యను ఆంధ్రప్రదేశ్ పిల్లలు ఒక్క రూపాయి ఖర్చులేకుండా అభ్యసించగలుగుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలు అన్నింటినీ అద్భుతంగా తీర్చిదిద్దడంవల్ల ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి పేద కుటుంబం కూడా తమ చిరకాల స్వప్నమైన ఆంగ్ల మాధ్యమ విద్యను సాకారం చేసుకోవడంలో కృతకృత్యులయ్యారు.

ఒక్క విద్యారంగంలోనే కాదు, వైద్య, వ్యవసాయ, సంక్షేమ రంగాల్లోనూ, ఉద్యోగాల కల్పనలోనూ జగన్ ముందున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా జగన్ చేస్తున్న బస్సు యాత్రకు రాష్ట్ర మంతటి నుంచీ విశేష ఆదరణ లభిస్తోంది. ఆయన సభలకు హాజరవుతూన్న అశేష జనవాహినిని గమనిస్తుంటే జగనన్నకు ఆంధ్రప్రజల్లో ఎంత అభిమానం, ఆదరణ ఉందో అర్థమవుతుంది. తరతరాలుగా సామాజిక అసమానతలు, సామాజిక న్యాయానికి దూరమైన ప్రజల్లో జగన్ పథకాలు కొత్త ఆశలను రేకెత్తించాయి. తాము కూడా పాలనలో భాగస్వాములమవుతున్నామన్న అద్భుత సంతృప్తి, ఆత్మగౌరవాలను జగన్ చర్యలు దళిత, వెనుకబడిన, మైనారిటీ కులాల వారిలో నింపుతున్నాయి.

ఈ విషయాలేవీ గోబెల్‌ను ఆదర్శంగా తీసుకున్న తెలుగుదేశం పార్టీ అధినాయకునికి, ఆయనతో అనైతిక పొత్తు పెట్టుకున్న పార్టీలకు నచ్చలేదు. ఈ ఎన్నికల ప్రచారంలో ఈ శతాబ్దపు జోక్‌గా చెప్పుకోబడే అతిపెద్ద కామెడీ విషయాన్ని ప్రచారం చేస్తున్నారు చంద్రబాబు. అదేంటంటే... సంపదను సృష్టించి ప్రజలకు పంచే పాలనను అందించడానికి తనను గెలిపించాలని అనడం. అసలు సంపద సృష్టికర్త లెవరో, ఏ సంపదయినా ఎంత చెమట కాలువలై పారితే సృష్టింపబడుతుందో చంద్రబాబు నాయుడికి తెలుసా? ఆయన, ఆయన సహచర వర్గాలు ఎన్నడైనా నాగలి పట్టారా? మగ్గంపై నేశారా? చేపలు పట్టారా? పశువులు, గొర్రెలు, మేకల వెంట తిరిగారా? పాలు, మాంసం ఉత్పత్తి చేశారా? నగలు చేశారా? చెప్పులు కుట్టారా? ఏ సంపద సృష్టించడంలో వీళ్ళ పాత్ర ఉంది? పోనీ ఆ సంపద సృష్టికర్తల నాదుకున్నారా? వాళ్ళను కనీసంగా మనుషులుగానైనా చూశారా? చంద్రబాబు పద్నాలుగేళ్ళ ముఖ్యమంత్రి పాలనలో సర్వసంపదల సృష్టికర్తలకు చేసిందేంటి? ఏమీ చేయకపోగా... వ్యవసాయం దండగ, కంప్యూటరుంటే చాలనడం; బీసీల అంతు చూస్తానని బెదిరించడం, 'ఎవరైనా ఎస్సీగా పుట్టాలనుకుంటారా' అని దళితులను అవమానించడం!



చంద్రబాబు పాలనలో రైతుల ఆత్మహత్యలు, చేనేత కార్మికుల ఆత్మహత్యలు, వలసలు పెరిగిపోయాయని లెక్కలు చూస్తే అర్థమవుతుంది. కార్పొరేట్ శక్తులను ప్రోత్సహించి విద్యనూ, వ్యవసాయాన్నీ, పరిశ్రమలనూ వారికి ధారాదత్తం చేసి నేలవిడిచి సాముచేసిన చంద్రబాబు సంపద ఎలా సృష్టిస్తాడో, ఎవరి కోసం సృష్టిస్తాడో పద్నాలుగేళ్ల పాలన రుజువు చేసింది. సంపద సృష్టికర్తలనందరినీ ఆదుకుని, ఆదాయ మార్గాలు చూపి, పాలనలో భాగస్వామ్యమిచ్చిన జగన్ పాలనకు; వాళ్ళ ఉసురు పోసుకున్న చంద్రబాబు పాలనకు ఎంత వ్యత్యాసం! గాలిలో మేడలు, సముద్రం పూడ్చి ఇండ్లు కట్టిస్తానన్న స్థాయిలో వాగ్దానాల జడివాన కురిపించడం చంద్రబాబు నైజమైతే, తన మేనిఫెస్టోలో పొందుపరిచిన వాటిని నూటికి నూరుపాళ్ళు అమలు చేయడం జగన్ ఎంచుకున్న మార్గం.


తాము సృష్టించిన సంపద తమకే చెందాలని భావించే అశేష ఆంధ్ర ప్రజానీకం జగన్‌ను గెలిపించి తీరుతారన్నది జగమెరిగిన సత్యం.

వ్యాసకర్త ప్రముఖ కథా రచయిత
మొబైల్: 91829 18567

భక్తి – ఆత్మ నివేదన

భక్తుడు హృదయపూర్వకంగా భగవంతుని కోరుకొనుటయే భక్తి. ఒక ఇనుప ముక్క అయస్కాంతం చేత ఆకర్షించబడినట్లు, భక్తునికి గల బలమైన కోరిక వలన అతని మనస్సు భగవంతుని పాదపద్మముల వైపు ఆకర్షించబడి, వానియందే లగ్నమవుతుంది. ప్రతివ్యక్తి తన భార్యను, పిల్లలను, సోదరులను, సోదరీమణులను, తల్లిదండ్రులను ప్రేమిస్తాడు. వీరందరి పైన గల ప్రేమభావమును భగవంతునిపై మళ్ళించుటయే 'భక్తి'. ప్రేమ ప్రాపంచిక విషయాలపై ఉన్నచో అది పతనమై అత్యాశగా మారడమే కాదు మనిషిని అధమ స్థాయికి తీసుకొనివెళ్తుంది. కాని భగవంతునిపై గల ప్రేమ మనిషికి ప్రశాంతతను ఇచ్చి, పరిపూర్ణ ఆనంద స్థితిలోకి తీసుకొని వెళ్తుంది.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

మన పవిత్ర గ్రంథముల యందు అనేక రకముల భక్తి కనిపిస్తుంది. వీటి అన్నింటిలో ఆత్మ నివేదన అనేది భక్తికి తారాస్థాయిగా పరిగణింపబడుతుంది. ఆత్మనివేదన యందు అహంకారమును సంపూర్ణంగా వదలి 'నేను చేయుచున్నాను, నేను భోగిస్తున్నాను' అనే భావనను సంపూర్ణంగా రూపుమాపాలి. భగవంతుని శరణాగతి చేసి మన యోగ, క్షేమములను వారి పాద పద్మముల దగ్గరే వదలాలి. భగవంతుని పైననే సంపూర్ణ విశ్వాసముంచి, ఈ ప్రపంచము నందు మనము భగవంతుని ఉపకరణముగా పనిచేయాలి. ఆ విధముగా చేసినప్పుడు మాత్రమే మనము ఆయన దయను పొందుటకు యోగ్యులము కాగలము.

ఆధ్యాత్మిక మార్గమునందు శరణాగతి చేయుట అనగా దేవుడిపై పూర్తి బాధ్యతను వదలిపెట్టుటయే. శరణాగతి చేసిన తర్వాత నీపై ఏ విధమైన భారము ఉండదు. ఎవరైనను భగవంతుని శరణుచొచ్చిన తర్వాత, ఆ వ్యక్తి చేయు పనులన్నియు భగవంతునివే నను వాస్తవమును చిట్టచివరిగా తెలుసుకోగలడు. అప్పుడు 'నేను', 'నాది' అనే భావనలు తొలగిపోతాయి.

ఎవరైనను తొలిదశలో కొంతమేరకే శరణుజొచ్చెదరు. ఆ తర్వాత 'అహం' అనునది ఎంత త్వరగా అణగిపోవునో, అతడు అంత త్వరగా సంపూర్ణ శరణాగతివైపు ముందుకు వెళ్తాడు. 'మనమే కర్తలము' అను భావముతో ఉండకుండా, ఆ దివ్యశక్తిని శరణుజొచ్చినచో ఆ శక్తియే మనలను ముందుకు నడిపిస్తుంది.

క్లుప్తంగా...

శాసనమండలి చైర్మన్ కుమారునికి సివిల్స్‌లో ర్యాంక్

- 833వ ర్యాంకు సాధించిన చిట్టిరాజు


చిట్టిరాజుకు అభినందనలు తెలుపుతున్న స్థానిక ఆర్యవైశ్య సంఘం నాయకులు

భీమవరం: ఆంధ్రప్రదేశ్ శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు కుమారుడు సివిల్స్ ఫలితాల్లో ప్రతిభ చాటారు. పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం పట్టణానికి చెందిన కొయ్యే చిట్టిరాజు సివిల్స్ ఫలితాల్లో 833వ ర్యాంకు సాధించారు. ఈయన శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు ద్వితీయ కుమారుడు. భీమవరంలో ప్రాథమిక విద్యనభ్యసించిన చిట్టిరాజు, ఆంధ్ర యూనివర్సిటీలో బీటెక్ పూర్తి చేశారు. ఇన్ఫోసిస్‌లో రెండేళ్లపాటు పనిచేసి సివిల్స్ సాధించాలనే లక్ష్యంతో ఢిల్లీలో ఉంటూ పట్టుదలతో సాధన చేసి ర్యాంకు సాధించారు. చిట్టిరాజు సివిల్స్‌లో ర్యాంకు సాధించడంతో ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

శ్రీవారి సేవలో పీవీ సింధు


ఆలయం వెలుపల బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు

తిరుమల: తిరుమల శ్రీవారిని ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు బుధవారం దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు పలుకగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు.

అంబటి మాటలను టీడీపీ వక్రీకరిస్తోంది

ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

సాక్షి, అమరావతి: మంత్రి అంబటి రాంబాబు ఒక టీవీ చానల్‌లో మాట్లాడిన మాటలను వక్రీకరించి, మధ్యలో కట్ చేసి టీడీపీ సోషల్ మీడియా విభాగం ఇష్టమొచ్చినట్టు ప్రచారం చేస్తోందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ ఆరోపించారు. దమ్మున్న నాయకుడు జగన్ మోహన్‌రెడ్డి ఒకసారి ప్రధాని మోదీ స్టేజీ మీద ఉన్నప్పుడే తమకు రాష్ట్ర ప్రయోజనాలు తప్ప వాళ్లతో ఎలాంటి పనిలేదు, ఉండదు, ఉండబోదని చెప్పారని గుర్తుచేశారు. ఇప్పుడు చంద్రబాబుగానీ, టీడీపీ నాయకులుగానీ బీజేపీ ముస్లింల పట్ల వివక్ష చూపించేలా ఉన్న నాలుగు శాతం రిజర్వేషన్ల అంశంపైన, యూనిఫాం సివిల్‌కోడ్ తదితర చట్టాలు తీసుకురావడంపైన మాట్లాడాలని సవాల్ విసిరారు. అప్పట్లో జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడిన తీరుగా వాళ్లు మాట్లాడి అప్పుడు ప్రజలను ఓట్లు అడగాలని చెప్పారు.

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు నిలిచిన బొగ్గు సరఫరా

ఉక్కు నగరం (విశాఖ): గంగవరం పోర్టు కార్మికులు చేస్తున్న ఆందోళన ప్రభావం విశాఖ స్టీల్ ప్లాంట్‌పై పడింది. స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన బొగ్గు గంగవరం పోర్టులో నిలిచిపోయింది. స్టీల్‌ప్లాంట్‌కు రావాల్సిన బొగ్గు సుమారు 35 వేల టన్నులు గంగవరం పోర్టు బెర్తుపై ఉంది. అక్కడి కార్మికులు 8 రోజులుగా తమ డిమాండ్లపై విధుల్ని బహిష్కరించి ఆందోళన చేస్తున్నారు. దానివల్ల ప్లాంట్‌కు బొగ్గు సరఫరా నిలిచిపోయింది. పోర్టులో ఉన్న 30 వేల టన్నుల బొగ్గు సరఫరా కోసం అటు యాజమాన్యం, ఇటు కార్మిక సంఘాలు జిల్లా కలెక్టర్‌కు మొరపెట్టుకున్నాయి. ఇదిలా ఉండగా ప్లాంట్ ఉద్యోగులతో గంగవరం పోర్టు నుంచి బొగ్గు సరఫరా చేయించడానికి మంగళవారం రాత్రి ప్రయత్నించినప్పటికి విఫలమైనట్టు తెలుస్తోంది.

నేత్రపర్వం.. సీతారాముల కల్యాణం

భద్రాచలంలో వైభవంగా రామయ్య పెళ్లి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/సిరిసిల్ల: భద్రాచలంలో సీతారాముల కల్యాణం బుధవారం వైభవంగా జరిగింది. ఉదయం 8 గంటలకు ఆలయ గర్భగుడిలో ఉన్న మూలవిరాట్‌లకు వేదపండితులు లఘు కల్యాణం నిర్వహించి లక్ష్మణ సమేత సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఆలయం నుంచి పల్లకీలో వెలుపలకు తీసుకువచ్చారు. కల్యాణ మండపంలో శ్రీరాముడిని సింహాసనంలో, ఆయనకు ఎదురుగా గజాసనంపై సీతమ్మవారిని కొలువుదీర్చారు. మధ్యాహ్నం 12 గంటలకు అర్చకులు సీతారాముల ఉత్సవమూర్తుల శిరస్సులపై జీలకర్ర, బెల్లం పెట్టారు. అనంతరం సీతమ్మ వారికి మాంగల్యధారణ చేసి వెండి పాత్రల్లో ఉంచిన ముత్యాల తలంబ్రాలను సీతారాములపై పోశారు. ఆ తర్వాత తలంబ్రాలతో వేడుక నిర్వహించారు. స్వామివారికి తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను, త్రిదండి చినజీయర్ స్వామి మఠం, శృంగేరి పీఠం, శ్రీరంగం, టీటీడీ తరఫున ప్రతినిధులు వస్త్రాలను సమర్పించారు. ఈ వేడుకకు సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరసింహ, తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ భీమపాక నగేశ్, ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్.హ రినాథ్, జస్టిస్ రవినాథ్ తిల్హారి హాజరయ్యారు. గురువారం మిథిలా స్టేడియంలో పట్టాభిషేక మహోత్సవం జరగనుంది. కల్యాణోత్సవానికి తాను నేసిన బంగారు, వెండి జరీ పోగుల చీరను సిరిసిల్ల నేత కళాకారుడు హరిప్రసాద్ కానుకగా అందించారు.


సీతమ్మ వారి మాంగల్యాన్ని భక్తులకు చూపిస్తున్న అర్చకులు

ఒంటిమిట్టలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- శాస్త్రోక్తంగా ధ్వజారోహణం
- 22న కల్యాణోత్సవానికి విస్తృత ఏర్పాట్లు

ఒంటిమిట్ట: వైఎస్సార్‌జిల్లా ఒంటిమిట్టలోని శ్రీకోదండరామ స్వామి ఆలయంలో బుధవారం ఉదయం 10.30 నుంచి 11 గంటల మధ్య ధ్వజారోహణంతో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. కంకణబట్టర్ రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో ముందుగా గరుడ ధ్వజపటాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి గరుడ ప్రతిష్ట, ప్రాణప్రతిష్ట, నేత్రోన్మీలనం నిర్వహించారు. ధ్వజస్తంభానికి నవకలశ పంచామృతాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వేదపండితులు చతుర్వేద పారాయణం చేశారు. ఉత్సవాల్లో ప్రధానంగా ఈ నెల 20న హనుమంత వాహనం, 22న కల్యాణోత్సవం, 23న రథోత్సవం, 25న చక్రస్నానం నిర్వహించనున్నారు. 22న సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు శ్రీసీతారాముల కల్యాణం కన్నుల పండువగా జరుగనుంది. ఈ వేడుక చూసేందుకు భారీగా భక్తులు తరలిరానున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి సీతారామ లక్ష్మణులు ఒంటిమిట్ట పురవీధుల్లో శేషవాహనంపై విహరించారు.


ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు

రేపు అప్పన్న వార్షిక కల్యాణోత్సవం


నృసింహ మండపంలో ఏర్పాటు చేస్తున్న కల్యాణ వేదిక(ఇన్‌సెట్‌లో) స్వామివారు

సింహాచలం: సింహగిరిపై వెలసిన శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి వారి వార్షిక కల్యాణ మహోత్సవం శుక్రవారం రాత్రి వైభవంగా జరుగనుంది. మధ్యాహ్నం మూడు గంటలకు కొట్నాలు ఉత్సవం, అనంతరం ఆలయ ధ్వజస్తంభం వద్ద గరుడాళ్వార్ చిత్రపటాన్ని ఎగురవేసి ధ్వజారోహణం నిర్వహిస్తారు. సాయంత్రం ఎదురుసన్నాహోత్సవం ఉంటుంది. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని బంగారు చాయ పల్లకీలోను, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ముత్యాల పల్లకీలోను వేంజేపచేసి సింహగిరి మాడ వీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లి జోడుభద్రాల ఎదురెదురుగా ఏర్పాటు చేసిన వేదికలపై ఆశీనులను జేస్తారు. అక్కడ ఎదురు సన్నాహోత్సవం నిర్వహిస్తారు. అనంతరం స్వామి, అమ్మవార్లను రథంపై అధిష్టింపజేసి రాత్రి రథోత్సవం జరుపుతారు. తర్వాత రాత్రి 10.30 గంటల నుంచి నృసింహ మండపంలో ఏర్పాటు చేసిన భారీ వేదికపై వార్షిక కల్యాణమహోత్సవం నిర్వహిస్తారు. కాగా కల్యాణోత్సవాలకు గురువారం రాత్రి అంకురార్పణ చేస్తారు. ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు.

రామతీర్థంలో వైభవంగా రాములోరి కల్యాణం

- సింహాచలం దేవస్థానం తరఫున పట్టువస్త్రాల సమర్పణ
- ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి తరలివచ్చిన భక్తులు


సీతమ్మ మెడలో వేయబోయే మంగళ సూత్రం చూపిస్తున్న అర్చకుడు

నెల్లిమర్ల రూరల్/సింహాచలం: విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం రామతీర్థం రామస్వామి వారి పుణ్యక్షేత్రంలో సీతారామ స్వామి వారి కల్యాణోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. వేకువజాము నుంచే ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి స్వామి వారి కల్యాణ వేడుక ప్రారంభమైంది. ప్రత్యేక పూజలు అనంతరం సీతారామలక్ష్మణుల ఉత్సవ విగ్రహాలను మంగళవాయిద్యాలతో పల్లకిలో ఊరేగింపుగా కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. సీతారామ లక్ష్మణులకు పాలు, పెరుగు, నెయ్యి, తేనె, సముద్ర నదీ జలాలతో అష్టకలశ స్నపన మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం పట్టువస్త్రాలతో సీతారాములను అలంకరించి కల్యాణానికి సిద్ధం చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు శ్రీరాముడి జన్మనక్షత్రమైన అభిజిత్ లగ్నంలో ఉత్సవ విగ్రహాల శిరస్సుపై జీలకర్ర బెల్లం ఉంచారు. తర్వాత మాంగల్యధారణ జరిపించారు. ముత్యాల తలంబ్రాల కార్యక్రమాన్ని కనులపండువుగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించేందుకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున సింహాచలం దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ, ఝాన్సీ దంపతులు, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పద్మావతి దంపతులు, విశాఖ, విజయనగరం జిల్లాల న్యాయమూర్తులు గిరిధర్, కళ్యాణ చక్రవర్తి తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు.

శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో శ్రీరామనవమి ఆస్థానాన్ని పురస్కరించుకుని శ్రీసీతారామ లక్ష్మణ సమేత హనుమంతుడి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి, తోమాలసేవ, అర్చన జరిపారు. అనంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో ఉదయం తొమ్మిది నుంచి 11 గంటల వరకు శ్రీసీతారామ లక్ష్మణ సమేత హనుమంతుల వారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. అభిషేక సమయంలో అనుసంధానం చేసే పాశురాలను వేదపండితులు పఠించారు. రాత్రి శ్రీరామచంద్రమూర్తి హనుమంత వాహనంపై తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్ స్వామి, ఈవో ఏవీ ధర్మారెడ్డి దంపతులు, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం పాల్గొన్నారు.


స్నపన తిరుమంజనంలో సేదదీరుతున్న సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయస్వామి

వైఎస్సార్‌సీపీలోకి కొనసాగుతున్న చేరికలు

లబ్బీపేట(విజయవాడ తూర్పు)/నందిగామ టౌన్/దెందులూరు/కామవరపుకోట/తణుకు అర్బన్/పెనుగొండ/మండవల్లి/నాగులుప్పలపాడు: విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని 4వ డివిజన్‌లో టీడీపీకి చెందిన 100 మైనార్టీ కుటుంబాలు ఆ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాశ్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. టీడీపీకి చెందిన 90 కుటుంబాలు ఆ పార్టీని వీడి ప్రకాశం జిల్లా సంతనూతలపాడు నియోజకవర్గ అభ్యర్థి, మంత్రి మేరుగు నాగార్జున సమక్షంలో బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. నాగులుప్పలపాడు మండలం కనపర్తి గ్రామానికి చెందిన నాయకులకు మంత్రి నాగార్జున పార్టీ కండువాలు కప్పి వైఎస్సార్‌సీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు నలమలపు కృష్ణారెడ్డి, తుమ్మల బ్రహ్మానందరెడ్డి, మారెళ్ల కిరణ్, కోమట్ల త్రినాథ్‌రెడ్డి ఉన్నారు. ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం గుడిమెట్ల, చింతలపాడు గ్రామాలకు చెందిన 25 కుటుంబాలు టీడీపీని వీడి ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ సమక్షంలో పార్టీలో చేరారు. ఏలూరు జిల్లా దెందులూరు టీడీపీ నేత ధరణికోట పోతురాజు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్, పార్టీ జిల్లా అధ్యక్షులు ఆళ్ళ నాని ఆధ్వర్యంలో పార్టీ రీజనల్ కోఆర్డినేటర్, ఎంపీ పి.మిథున్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. కామవరపుకోట మండలంలోని మంకినపల్లిలో టీడీపీకి చెందిన 30 యాదవ కుటుంబాలు చింతలపూడి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు సమక్షంలో పార్టీలో చేరారు. పశ్చిమ గోదావరి జిల్లా సజ్జాపురంలోని టీడీపీకి చెందిన 10 కుటుంబాలు మంత్రి కారుమూరి సమక్షంలో పార్టీలో చేరాయి. ఆచంట నియోజకవర్గంలోని ముస్లింలు, పెనుమంట్ర గరువు నుంచి గౌడ, శెట్టి బలిజ మహిళలు, యువకులు భారీ సంఖ్యలో ఎమ్మెల్యే చెరుకువాడ సమక్షంలో పార్టీలో చేరారు. ఏలూరు జిల్లా మండవల్లిలో ఎమ్మెల్యే డీఎన్నార్ సమక్షంలో పలువురు టీడీపీ కార్యకర్తలు పార్టీలో చేరారు.


ఎమ్మెల్యే చెరుకువాడ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరికలు


తణుకులో పార్టీలో చేరిన వారితో మంత్రి కారుమూరి


విజయవాడలో 100 కుటుంబాలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న అవినాశ్


వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మంత్రి మేరుగు నాగార్జున


టీడీపీ నేత పోతురాజును పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్

చిన్నారి ప్రాణానికి సీఎం అభయం

- రూ.16 కోట్ల విలువైన ఇంజెక్షన్‌ను అమెరికా నుంచి తెప్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- ఆస్పత్రికి చేరే సరికి అన్ని పన్నులతో కలిపి దాని విలువ రూ.20 కోట్లు


బెంగళూరులోని ఆస్పత్రిలో తల్లి ఒడిలో ప్రజ్ఞరెడ్డి

చక్రాయపేట: అరుదైన వ్యాధితో బాధపడుతున్న ఓ చిన్నారి ప్రాణానికి సీఎం వైఎస్ జగన్ అభయమిచ్చారు. అమెరికా నుంచి రూ.16కోట్ల విలువైన ఇంజెక్షన్‌ను తెప్పించారు. ఆ పేద కుటుంబానికి దేవుడయ్యారు. వివరాల్లోకి వెళితే.. వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గానికి చెందిన ధరణి, అశోక్‌కుమార్‌రెడ్డి దంపతుల కుమార్తె 14 నెలల ప్రజ్ఞరెడ్డి. పాపకు మూడు నెలల వయసులో కాళ్లు కదపలేక పోవడంతో బెంగళూరులోని బాప్టిస్టు హాస్పిటల్లో చేర్చగా.. అక్కడి వైద్యులు పరీక్షలు చేసి ఇది దేశంలో చాలా అరుదుగా ఏ ఒక్కరికో ఇద్దరికో వచ్చే ఎస్ఎంఏ వ్యాధి(వెన్నెముఖ కండరాల క్షీణత)గా నిర్ధారించారు. రూ.కోట్లాది రూపాయలు ఖరీదు చేసే మందులు వాడితే గానీ నయం కాదన్నారు. దీంతో దిక్కుతోచని చిన్నారి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తన మనవరాలి దీనస్థితిని చూసిన ఆమె తాత రంగారెడ్డి వెంటనే తన కుమార్తె ధరణి (చిన్నారి తల్లి)ని వెంటబెట్టుకుని సీఎం వైఎస్ జగన్‌ను కలిసేందుకు విజయవాడ వచ్చారు. అక్కడ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి తమ బాధను చెప్పుకొన్నారు. ముఖ్యమంత్రితో మాట్లాడి న్యాయం చేయిస్తానని ఆయన హామీ ఇవ్వడంతో వెనుతిరిగారు.

ఇంజెక్షన్‌తో ఊపిరి నిలిపారు..

చిన్నారి కుటుంబ సభ్యులు విజయవాడకు వెళ్లి వచ్చి రెండు నెలలు గడిచే సరికి సీఎం జగన్.. అమెరికాలోని కంపెనీలతో మాట్లాడి చిన్నారికి అవసరమైన ఇంజక్షన్‌ను బెంగళూరులోని ఆస్పత్రికి చేరేలా చర్యలు తీసుకున్నారు. ఆ ఇంజక్షన్ విలువ రు.16 కోట్లు. ఇక్కడికి చేరే సరికి జీఎస్టీ తదితర ట్యాక్సులు కలిపి మొత్తం రూ.20 కోట్ల వరకు అవుతుందని వైద్యులు చెప్పినట్టు చిన్నారి కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే ఇంజెక్షన్ ఇచ్చాక ఇన్ఫెక్షన్ వచ్చే అవకాశాలున్నందున వారానికోసారి రక్త పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచించారు. దీనికి అదనంగా డబ్బు ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. ఇంజెక్షన్‌ను చిన్నారికి గతేడాది డిసెంబర్ 5న ఇచ్చారు. దీంతో పాప ప్రాణాలు నిలబడ్డాయి. వైద్యులు ముందే చెప్పినట్టుగా ఇన్ఫెక్షన్ రావడంతో తిరిగి జనవరి 5న ఐసీయూలో బిడ్డను ఉంచి.. ఫిబ్రవరి చివరి వారంలో డిశ్చార్జ్ చేశారు. ఇంటికి రాగానే మళ్లీ ఇన్ఫెక్షన్ రావడంతో తిరిగి బెంగళూరు ఆస్పత్రికి తీసుకెళ్లగా.. వైద్యులు పరీక్షించి కరోనా సోకినట్టు నిర్ధారించారు. ప్రస్తుతం పాపకు మందు బిళ్లల కోసమే రోజుకు రూ.10 వేల నుంచి 20 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. ఐసీయూ బెడ్ ఖర్చులు, వైద్యుల ఫీజులు తదితరాలన్నీ కలిపి ఇప్పటి వరకు సుమారు రూ.10 లక్షల వరకూ అయ్యాయి. కాగా, నెలన్నర కిందట చిన్నారి తల్లిదండ్రులు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని కలిసి తమ బిడ్డ పరిస్థితి విన్నవించగా.. స్పందించిన ఎంపీ వెంటనే తన ఖాతాకు రూ.4.5 లక్షలు పంపి సాయం అందించారని చిన్నారి తల్లి ధరణి చెప్పారు.

> **బిడ్డ ప్రాణాలు నిలిపిన జగనన్నకు చేతులెత్తి మొక్కుతున్నాం**
>
> నా బిడ్డకు వచ్చిన వ్యాధిపై సీఎం జగనన్న వెంటనే స్పందించకపోయి ఉంటే.. బిడ్డ ప్రాణాలతో మిగిలేది కాదు. నా బిడ్డ ప్రాణాలు నిలిపిన జగనన్నకు చేతులెత్తి మొక్కుతున్నాం. – ధరణి, చిన్నారి తల్లి

స్వయం సిద్ధ క్షేత్రం 'తొలి తిరుపతి'

- కాకినాడ జిల్లాలో 9 వేల ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయం
- తిరుమల, సింహాచలం కంటే పురాతనమైనదిగా ప్రఖ్యాతి
- ఆలయంలో కొలువై భక్తుల కోర్కెలు తీరుస్తున్న స్వయంభూ శృంగార వల్లభుడు
- రేపటి నుంచి స్వామివారి కల్యాణోత్సవాలు ప్రారంభం



పెద్దాపురం: ఏలేరు నది ఒడ్డున అతి పురాతన కాలంలో స్వయం సిద్ధ క్షేత్రంగా వెలసిన స్వయంభూ శ్రీ భూసమేత శృంగార వల్లభ స్వామి కల్యాణానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం చదలాడ తొలి తిరుపతిలో వెలసిన స్వామి వారి కల్యాణం శుక్రవారం రాత్రి 8 గంటలకు నిర్వహిస్తారు. సామర్లకోట–ప్రత్తిపాడు రహదారిలో పెద్దాపురం మండలంలోని దివిలి గ్రామానికి ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలో ఉంది చదలాడ తొలి తిరుపతి. విశిష్ట నిర్మాణ శైలితో ఉండే ఈ పుణ్యక్షేత్రం సింహాచలం, తిరుమల తిరుపతి కంటే పురాతనమైనదిగా పేర్కొంటారు. తొలి తిరుపతిగా పేరొందిన ఈ గ్రామంలోని ఆలయం తొమ్మిది వేల సంవత్సరాల క్రితం నాటిదని, ఈ విషయం 'చాతావళి' అనే సంస్కృత గ్రంథంలో కూడా ఉందని ఆలయ ప్రధాన పూజారులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు చెప్పారు. దేశవ్యాప్తంగా మొత్తం 108 తిరుపతిలు ఉండగా వాటిలో 'తొలి తిరుపతి'దే తొలిస్థానమని పేర్కొంటున్నారు. ఈ ఆలయం మాదిరిగానే పెద్ద తిరుపతి (తిరుమల తిరుపతి)లో కూడా ఏడు ద్వారాలు ఉండడం విశేషం. ఇక ప్రతీ శనివారం ఆలయానికి భక్తులు పోటెత్తుతున్నారు. ఆలయానికి పాదయాత్రగా వచ్చి ఏడు వారాలు మొక్కు తీర్చుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తులు విశ్వసిస్తున్నారు.

ఎడమ చేతిలో చక్రం... కుడి చేతిలో శంఖం

ఇక్కడ స్వామి ఇతర పుణ్యక్షేత్రాల్లో విగ్రహాలకు భిన్నంగా ఎడమ చేతిలో చక్రం, కుడి చేతిలో శంఖం ధరించి ఉండటం విశేషం. అలాగే ఇక్కడ స్వామి చేతుల్లో తామర పుష్పం ఉన్నట్లే తిరుమల, సింహాచలం ఆలయాల్లోని విగ్రహాల చేతిలోనూ ఉన్నట్లు చెబుతారు. ఇది మూడు క్షేత్రాల మహాక్షేత్రంగా గణుతికెక్కింది. ప్రధానంగా ఇది స్వయం సిద్ధక్షేత్రం. నారద మునీంద్రుడు ఇక్కడ లక్ష్మీదేవిని ప్రతిష్ఠించడంతో దివ్యక్షేత్రమవ్వగా శ్రీకృష్ణ దేవరాయలు గోదాదేవిని ప్రతిష్ఠించడంతో రాజక్షేత్రంగా మారి మహా క్షేత్రమైంది. భోజ మహారాజు ఈ ఆలయానికి సున్నం వేయించినట్టు, విక్రమాదిత్యుడు, ఛత్రపతి శివాజీ మహారాజ్, విక్టోరియా మహారాణి ఈ ఆలయ దర్శనానికి వచ్చినట్లు శాసనాధారాల్లో ఉంది.



బొడ్నబావి ప్రత్యేకత..

ఆలయానికి ఆగ్నేయ మూలలో చతురస్రాకారంలో ఉన్న బావిని బొడ్నబావిగా పిలుస్తుంటారు. నేలబావిగా ఉన్న ఈ బావి చుట్టూ రాళ్లు పేర్చి నిర్మించడాన్ని పురాతన నిర్మాణానికి ఆనవాలుగా చెబుతారు. కార్తిక మాసంలో ఈ బావి నీటిని ఆలయ అర్చకులతో తోడించుకుని స్నానం చేస్తే సంతానం లేనివారికి సంతాన భాగ్యం కలుగుతుందని, కార్తిక పౌర్ణమి నాడు ఆ స్నానం మరింత ప్రాశస్త్యమని భక్తుల నమ్ముతారు. ఈ బావి నీటిని చుట్టుపక్కల గ్రామాల వారు ఇంటికి తీసుకువెళ్లి మామూలు నీళ్లతో కలుపుకొని స్నానం చేస్తారు.

> **స్వామి వారి కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి**
>
> శృంగార వల్లభ స్వామి దివ్య కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి చేశాం. రాత్రి 8 గంటలకు ఉభయ దేవేరులైన క్షీర సాగరనందని లక్ష్మీదేవి, భూదేవిలతో స్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవం ఉంటుంది. 20న గ్రామోత్సవం, 21న సదస్యం, 22న సుదర్శన హోమం, చోర సంవాదం, 23వ తేదీ ఉదయం 8 గంటలకు చక్రస్నానం, బుక్కా పండగ, సామూహిక కుంకుమ పూజలు, 24వ తేదీన సాయంత్రం 6 గంటలకు స్వామి వారికి శ్రీ పుష్పయాగం ఉంటాయి.
>
> – వడ్డి శ్రీనివాస్, కార్యనిర్వహణాధికారి

టీటీడీ సహకారంతో ఆలయ అభివృద్ధి

ఈ ఆలయానికి ఉండే వందలాది ఎకరాల ఆస్తి కాలక్రమంగా అన్యాక్రాంతమై నేటికి 18 ఎకరాలు మాత్రమే మిగిలింది. అయితే జీర్ణావస్థలో ఉన్న ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు పురావస్తు శాఖ చర్యలు చేపట్టింది. టీటీడీ చైర్మన్‌గా వైవీ సుబ్బారెడ్డి ఉన్న సమయంలో ఆలయ అభివృద్ధికి రూ. 2 కోట్లు మంజూరు చేశారు. ఇక దాతల సహకారంతో భక్తులకు అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు.



బాలరాముడికి సూర్య తిలకం

అయోధ్య భవ్యరామమందిరంలో మరో అద్భుతం

- భక్తులను పరవశింపజేసిన అపురూప దృశ్యాలు
- టీవీల్లో వీక్షించిన కోట్లాది మంది జనం
- సూర్య తిలకాన్ని ఆన్‌లైన్‌లో దర్శించుకున్న మోదీ

అయోధ్య: శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా అయోధ్య బాలరాముడికి సూర్య భగవానుడు స్వయంగా తిలకం దిద్ది ఆశీస్సులందించాడు. సరిగ్గా నుదుటిన చుంబించి రఘుకుల పురుషోత్తముడి పట్ల ఆత్మీయత చాటుకున్నాడు. భవ్య రామమందిరంలోని గర్భాలయంలో రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠ తర్వాత తొలిసారిగా కనిపించిన ఈ అద్భుత దృశ్యాలను భక్తులు కనులారా తిలకించి పరవశించిపోయారు. జైశ్రీరామ్ అంటూ నినదించారు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది టీవీల్లో దర్శించుకున్నారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటల తర్వాత సూర్యతిలకం ఘట్టం ఆవిష్కృతమైంది. ఈ సమయంలో గర్భగుడిలో అర్చకులు ప్రత్యేక హారతి ఇచ్చారు. అరుదైన వజ్రాలు, రత్నాలు పొదిగిన కిరీటంతోపాటు ప్రత్యేక ఆభరణాల అలంకరణతో బాలరాముడు మరింత సుందరంగా మెరిసిపోయాడు. ప్రతిఏటా శ్రీరామనవమి సందర్భంగా రాముడికి 58 మిల్లీమీటర్ల పరిమాణంలో సూర్యతిలకం దిద్దేలా ఆలయంలో దర్పణాలు, కటకాల సాయంతో ప్రత్యేక ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. సూర్యతిలకం దృశ్యం 4 నుంచి 5 నిమిషాల పాటు కొనసాగిందని ఆలయ ప్రతినిధి ప్రకాశ్ గుప్తా చెప్పారు. సూర్యకిరణాలు నేరుగా బాలరాముడి విగ్రహం నుదుటి భాగంపైకి ప్రసరించాయని వెల్లడించారు. ఈ సమయంలో భక్తులను గర్భాలయంలోకి అనుమతించలేదని అన్నారు. వారు బయటి నుంచే దర్శించుకున్నారని తెలిపారు. మరోవైపు, అయోధ్యలో శ్రీరామనవమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రాణప్రతిష్ఠ తర్వాత జరుగుతున్న మొట్టమొదటి ఉత్సవాలు కావడంతో భక్తులు భారీగా తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే వేలాది మంది దర్శనం కోసం బారులు తీరారు.



భావోద్వేగపూరిత క్షణం: ప్రధాని మోదీ

దేశ ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేశారు. అయోధ్యలో రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠ తర్వాత జరుగుతున్న తొలి శ్రీరామనవమి తనకెంతో ఆనందంగా కలిగిస్తోందని పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఈ రోజు కోసం మేం కోట్లాది మంది ఎదురుచూశారని వెల్లడించారు. అస్సాంలోని నల్బారీలో ఎన్నికల ప్రచారం అనంతరం ప్రధాని మోదీ హెలికాప్టర్‌లో ప్రయాణిస్తూ బాలరాముడి సూర్యతిలకం ఘట్టాన్ని ఆన్‌లైన్‌లో వీక్షించి, భావోద్వేగానికి గురయ్యారు. ఈ దృశ్యాన్ని చూసి తరించానని చెప్పారు. కోట్లాది మంది ప్రజల్లాగే తనకు కూడా ఇది భావోద్వేగపూరిత క్షణమని వెల్లడించారు.



ఎన్నికల విచిత్రం

అస్సాంలోని జోర్హాట్ పట్టణం నిమాటి ఘాట్ నుంచి బ్రహ్మపుత్ర నది ఆవలి ప్రాంతాలకు బీజేపీ అభ్యర్థి ప్రచార హోర్డింగ్‌లను పడవలో తరలిస్తున్న దృశ్యం

రామనామమే ఎన్నికల బాణం!

యూపీ సహా హిందీ మాట్లాడే రాష్ట్రాల్లో రాముడే ప్రచారాస్త్రం

- మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, బిహార్, రాజస్థాన్‌ల నుంచి 2 కోట్ల మంది భక్తులను అయోధ్యకు తీసుకెళ్లిన బీజేపీ
- హిందూత్వ వాదాన్ని ముందుపెట్టి ప్రచారాన్ని హోరెత్తిస్తున్న కాషాయదళం
- రామాయణం ఫేమ్ అరుణ్ గోవిల్ పోటీ చేస్తున్న మీరట్ నుంచే ప్రచారం మొదలుపెట్టిన ప్రధాని మోదీ
- పశ్చిమబెంగాల్ సహా దక్షిణాది రాష్ట్రాల్లోనూ రాముడి ఫోటోలతోనే ప్రచారాలు

ఎలక్షణీయం

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్రంలో ముచ్చటగా మూడోసారి విజయకేతనాన్ని ఎగురవేసేందుకు అస్త్రశస్త్రాలన్నీ సంధిస్తున్న కాషాయదళం..హిందీ రాష్ట్రాలతో సహా అనేక రాష్ట్రాల్లో అయోధ్య రామమందిర నిర్మాణ అంశాన్ని ప్రచారాస్త్రంగా మారుస్తోంది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు ముందునుంచే రాముడే ఈసారి తమ ఎన్నికల బ్రాండ్ అంబాసిడర్ అని ప్రకటించిన బీజేపీ నేతలు..ఇప్పుడే రాముడి చిత్రాలనే ముందుపెట్టి, రామరాజ్యం నినాదాలిస్తూ, హిందూత్వ ఎజెండాతో ఎన్నికల పోరును పరుగులు పెట్టిస్తున్నారు. ప్రతిపక్షాలపై రామబాణాన్ని ఎక్కుపెట్టి దమ్ముంటే తమ విజయాన్ని ఆపాలని సవాల్ విసురుతున్నారు.

హిందీ బెల్ట్‌లో 'రాముడే' అజెండా..

అయోధ్యలో రామమందిరంలో ఈ ఏడాది జనవరిలో రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠ సమయంలోనే లోక్‌సభ ఎన్నికలపై 'జై శ్రీరామ్' నినాదం తీవ్ర ప్రభావం చూపుతుందనే వ్యాఖ్యానాలు మొదలయ్యాయి. దేశంలోని 80 శాతం హిందువుల భావోద్వేగాలతో ముడిపడిన రామమందిర నిర్మాణాన్ని పూర్తి చేయడం ద్వారా హిందూత్వ భావజాలం పట్ల తనకున్న నిబద్ధతను బీజేపీ రుజువు చేసుకుందనే వాదనలు, విశ్లేషణలు వచ్చాయి. ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి రావాలన్న ఆహ్వానాన్ని కాంగ్రెస్ సహా మెజార్టీ ప్రతిపక్షాలు తిరస్కరించడం దీనికి మరింత రాజకీయాన్ని పులిమాయి. ఈ అంచనాలకు తగ్గట్లుగానే ప్రస్తుతం హిందీ భాష మాట్లాడే రాష్ట్రాల్లో రాముడే ఎన్నికల ప్రచారాస్త్రంగా మారాడు. ముఖ్యంగా ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, జార్ఖండ్, హరియాణా, హిమాచల్‌ప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో రామాలయం, రామరాజ్యం అన్న అంశాల చుట్టూ రాజకీయం నడుస్తోంది. ఈ రాష్ట్రాల్లో మొత్తంగా 218 లోక్‌సభ స్థానాలుండగా, గత ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే 166 స్థానాలను గెలుపొందించింది. ఒక్క యూపీలోనే 80 స్థానాలకు గానూ ఒంటిరిగా, 62, మిత్రపక్షాలతో కలిసి 64 సీట్లు సాధించింది. ప్రస్తుత ఎన్నికల్లో యూపీలో సొంతంగా 70 సీట్లు సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీన్ని సాధించే క్రమంలో హిందుత్వ భావాజాలన్ని మరింత విస్తృతం చేసే క్రమంలో 80 లోక్‌సభ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గం నుంచి కనీసంగా 10 వేల మందికి ఉచితంగా అయోధ్య రాముడి దర్శనం కల్పించింది. ప్రత్యేక రైళ్లు, బస్సులు ఏర్పాటు చేసి వృద్ధులు, మహిళలు, యువతను పెద్ద ఎత్తున ఆకర్షించింది. దర్శనం అనంతరం భక్తుల తిరుగు ప్రయాణ ఏర్పాట్లతో పాటు, వారి వారి ప్రాంతాలకు తిరిగి రాగానే స్థానిక ప్రజలు స్వాగతం పలికేలా, ఈ సందర్భంగా ప్రసాదం, అక్షింతల వితరణ జరిపేలా కార్యక్రమాలు నిర్వహించింది. ఈ తరహా కార్యక్రమాలనే హిందీ భాష మాట్లాడే అన్ని రాష్ట్రాల నుంచి కొనసాగించి సుమారు 2 కోట్ల మంది భక్తులకు ఉచితంగా రాముడి దర్శనం కల్పించింది. ఇది ప్రస్తుత ఎన్నికల్లో తీవ్ర ప్రభావం చూపుతోంది. దీనికి తోడు యావత్ భారతావనిని విశేషంగా అలరించి రామాయణం టీవీ సీరియల్ ఫేమ్ అరుణ్ గోవిల్‌ను మీరట్ నుంచి రంగంలోకి దింపడమే గాక, ప్రధాని మోదీ తన తొలి ఎన్నికల ప్రచార సభను అక్కడి నుంచే ఆరంభించి, తన ప్రచారాస్త్రం రాముడని చెప్పకనే చెప్పారు. ఇక మధ్యప్రదేశ్‌లో బీజేపీ హిందుత్వ కార్డును ఎదుర్కోవడానికి కాంగ్రెస్ అగ్రనేత కమల్‌నాథ్ తనను తాను హనుమంతుడి భక్తుడిగా ప్రకటించుకుంటూ ముందుకు వెళుతున్నారు. ఎక్కడ రామాలయం కనిపిస్తే అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. చత్తీస్‌గఢ్‌లో బీజేపీ ప్రచారాన్ని తట్టుకునేందుకు తమ ప్రభుత్వ హయాంలోనే రామాయణ, కౌసల్య ఉత్సవాలను ఘనంగా నిర్వహించామని.. రాముడు, సీత బసచేసిన అన్ని ప్రదేశాలను అభివృద్ధి చేసే లక్ష్యంతో రామ్ వాన్ గమన్ టూరిజం సర్క్యూట్‌ను ప్రారంభించామని కాంగ్రెస్ ప్రచారం చేసుకుంటోంది.

మిగతా రాష్ట్రాల్లోనూ ఆయనే..

హిందీ మాట్లాడే రాష్ట్రాలతో పాటు పశ్చిమబెంగాల్, తమిళనాడు, తెలంగాణ, మహారాష్ట్రలోనూ రాముడి ఆలయం, రామరాజ్యం చుట్టూతే ఎన్నికలు ప్రదక్షిణం చేస్తున్నాయి. రాముడి ఆలయ ప్రారంభోత్సవానికి ముందు ప్రధాని మోదీ తమిళనాడు రామేశ్వరంలోని శ్రీరామనాథస్వామి ఆలయం, శ్రీరంగంలోని రంగనాథ స్వామి ఆలయం, ధనుష్‌కోటి ఆలయాలను దర్శించారు. హిందూత్వ అజెండాతో బీజేపీ ప్రచారాన్ని ముందు పెట్టడంతో అక్కడి అధికార డీఎంకే దీన్ని ఎదుర్కొనేందుకు సనాతన ధర్మానికి తాము వ్యతిరేకమని ప్రచారం చేస్తోంది. ఆ పార్టీ నేత డి.రాజా ఒకడుగు ముందుకేసి 'జై శ్రీరామ్ నినాదాన్ని తమిళనాడు అంగీకరించదు. బీజేపీ ఐడియాలజీ ఇక్కడ పనిచేయదు' అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలను బీజేపీ తప్పుపట్టి తన స్టైల్‌లో ప్రచారం చేస్తోంది. ఇక పశ్చిమ బెంగాల్‌లో ప్రచారం అంతా రాముడి చుట్టూ తిరుగుతోంది. రామనవమి సందర్భంగా ప్రతి వార్డు, బూత్, మండల, జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు, హనుమాన్ మందిరాల్లో పూజలు సహా రాష్ట్ర వ్యాప్తంగా 5 వేల కార్యక్రమాలు నిర్వహించింది. బీజేపీ చేస్తున్న ప్రచార హోరుకు తలొగ్గిన ఆ రాష్ట్ర ప్రభుత్వం తొలిసారి రామనవమికి సెలవుగా ప్రకటించింది. మొత్తం మీద రామనామమే ఎన్నికల బాణంగా బీజేపీ తమ ప్రచారాన్ని పరుగులు పెట్టిస్తోంది.

చీలికకు కేంద్రమే కారణం



రైతుల్లో మోదీ సర్కార్ విభజన తీసుకొస్తోంది

- బీజేపీ మేనిఫెస్టోను రైతాంగం నమ్మదు
- పీటీఐ ఇంటర్వ్యూలో తికాయత్ ఆరోపణలు

ఇంటర్వ్యూ

వివాదాస్పద మూడు సాగు చట్టాలకు వ్యతిరేకంగా నెలల తరబడి పోరాడి మోదీ మెడలు వంచిన రైతు ఉద్యమంలో సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) ప్రధానభూమిక పోషించింది. అలాంటి ఎస్‌కేఎంలో తాజా చీలిక కుట్ర వెనుక కేంద్రప్రభుత్వ హస్తం ఉందని భారతీయ కిసాన్ యూనియన్ నేత రాకేశ్ తికాయత్ ఆరోపించారు. బీజేపీ కుట్రలు ఫలించడం వల్లే సంయుక్త కిసాన్ మోర్చా(రాజకీయేతర)పేరిట మరో రైతు సంఘం పురుడుపోసుకుందని ఆయన వెల్లడించారు. ఎస్‌కేఎంకు ఎస్‌కేఎం (రాజకీయేతర)కు సంబంధం లేదని ఆయన స్పష్టంచేశారు. బుధవారం పీటీఐ ఇంటర్వ్యూలో తికాయత్ ప్రస్తావించిన అంశాలు ఆయన మాటల్లోనే..

ఆర్‌ఎస్‌ఎస్ నేతలే రైతులుగా..

'' ఒక్కటిగా ఉంటే మమ్మల్ని ఎదుర్కోలేమని గ్రహించే 41 రైతుల సంఘాల కూటమి అయిన ఎస్‌కేఎంలో సర్కార్ చీలిక తెచ్చింది. కొత్త సంఘం ఎస్‌కేఎం(రాజకీయేతర) ఢిల్లీ ఛలో అని పంజాబ్ నుంచి రైతులను తీసుకొచ్చి హరియాణాలోని శంభూ సరిహద్దు వద్ద ఉద్యమం చేస్తోంది. అసలు ఈ కార్యక్రమంపై మాతో వాళ్లు మాటవరసకైనా చెప్పలేదు. రాష్ట్రీయస్వయంసేవక్ సంఘ్ నేతలే రైతులుగా నటిస్తూ పంజాబ్ నుంచి వచ్చిన రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారు'

జిల్లాకు 40 దొంగ సంఘాలు

''ఒక్క నోయిడాలోనే భారతీయ కిసాన్ యూనియన్ పేరిట 37 రైతు సంఘాలను తెరిపించారు. వీటికి ఎమ్మెల్యేలే నడిపిస్తున్నారు. పంటలు, ఆ పంటల్ని పండించే కులాలవారీగా సంఘాలు తెరిచారు. జిల్లాకు 30-40 దొంగ సంఘాలు తెరచి రైతులందరినీ గందరగోళపరిచి, విభజించడమే మోదీ సర్కార్ లక్ష్యం''

ఎర్రకోట ఘటన పోలీసు కుట్ర

'' 2021 జనవరి 26 సంబంధ ఘటనల్లో పోలీసుల పాత్ర ఉంది. ఢిల్లీ ఐటీఓ ప్రాంతంలో నిలిపిఉంచిన ట్రాక్టర్లను పోలీసులే ఎర్రకోట వైపు నడిపేలా ఉసిగొల్పారు. నాడు ఉద్యమకారులను పోలీసులే తప్పుదోవ పట్టించారు.

సిఫార్సులపై మరోమారు నమ్మం

స్వామినాథన్ సిఫార్సులు అమలుచేస్తామని బీజేపీ 2014 మేనిఫెస్టోలో చెప్పింది. పదేళ్లయినా అమలుచేయలేదు. అందుకే 2024 బీజేపీ అజెండాను రైతులు నమ్మట్లేరు. విత్తనాలు, పురుగుమందులు, కూలీ ఖర్చులు, లీజు ఒప్పందం, ఇంధనం, సాగు ఖర్చులకు రైతు కుటుంబం ఉమ్మడి శ్రమ(ఏ2+ఎఫ్ఎల్)కు వెలకట్టి స్వామినాథన్ సిఫార్సుల్నే అమలుచేశామని కేంద్రం అబద్ధం చెబుతోంది. మేం సాగు ఖర్చుకు 50 శాతం విలువ జోడింపు అంటే సీ2+ 50 శాతం ఫార్ములా(స్వామినాథన్ సిఫార్సు) అమలుచేయాలని డిమాండ్ చేస్తున్నాం''

- న్యూఢిల్లీ


తొలి దశలో దిగ్గజాల పోరు

బరిలో 8 మంది కేంద్ర మంత్రులు, ఇద్దరు మాజీ సీఎంలు, ఒక మాజీ గవర్నర్

కేంద్ర మంత్రులుగా, ఏకంగా ముఖ్యమంత్రులుగా పదవీ బాధ్యతలు మోసి దిగపోయిన నేతలు మళ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో తమ సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు. ఒక మాజీ గవర్నర్‌సహా 8 మంది కేంద్ర మంత్రులు, ఇద్దరు సీఎంలు రేపు జరగబోయే లోక్‌సభ ఎన్నికల తొలి దశ పోరులో పోటీపడుతున్నారు. రేపు పోలింగ్ జరగబోయే 21 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 102 స్థానాలకు ప్రచారం బుధవారంతో ముగిసింది. తమ తమ నియోజకవర్గాల్లో గట్టిపోటీ ఎదురవుతున్నాసరే పక్కా వ్యూహరచనతో ముందడుగు వేస్తున్నారు.

- సాక్షి, న్యూఢిల్లీ

నితిన్ గడ్కరీ



మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నియోజకవర్గంలో హ్యాట్రిక్ కొట్టేందుకు సిద్ధమైన బీజేపీ నేత నితిన్ గడ్కరీ తన గెలుపుపై ధీమాగా ఉన్నారు. 2014లో ఏడుసార్లు ఎంపీగా గెలిచిన విలాస్ ముట్టెంవార్‌పై 2.84 లక్షల ఓట్ల తేడాతో విజయం సాధించి గడ్కరీ తన సత్తా ఏమిటో అందరికీ తెలిసేలా చేశారు. ప్రస్తుత మహారాష్ట్ర కాంగ్రెస్ సారథి నానా పటోలేను 2019లో ఇదే నాగ్‌పూర్‌లో 2.16 లక్షల మెజారిటీతో మట్టికరిపించి తనకు ఎదురులేదని గడ్కరీ నిరూపించారు. అయితే ఇటీవల స్థానికంగా బాగా పట్టు సాధించిన కాంగ్రెస్ నేత వికాస్ థాకరే(57) గడ్కరీకి గట్టి సవాలు విసురుతున్నారు. నాగ్‌పూర్ వెస్ట్ ఎమ్మెల్యేగా ఉన్న థాకరే కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు. ప్రకాశ్ అంబేద్కర్‌కు చెందిన వంచిత్ బహుజన్ అఘాడి పార్టీ సైతం థాకరేకి మద్దతు పలికింది. కాంగ్రెస్‌లో అన్ని వర్గాలు ఒక్కటై థాకరే విజయం కోసం పనిచేస్తుండడంతో గడ్కరీ అప్రమత్తమయ్యారు. కాంగ్రెస్ నేతలు నిరుద్యోగం, స్థానిక సమస్యలను ప్రధానంగా ప్రస్తావిస్తూ ఓటర్లకు దగ్గర అవుతున్నారు. దీంతో గడ్కరీ ఆయన సతీమణి, కుమారుడు, కోడలు సైతం నిప్పులు కక్కే ఎండల్లో విరివిగా ప్రచారం చేశారు.



కిరెన్ రిజిజు: 2004 నుంచి అరుణాచల్ ప్రదేశ్ నుంచి మూడు సార్లు ఎంపీగా గెలిచిన బీజేపీ నేత, కేంద్ర మంత్రి కిరెన్ రిజిజు నాలుగోసారి సార్వత్రిక సమరంలో దూకారు. 52 ఏళ్ల రిజిజుకు ఈసారి నబాం టుకీ రూపంలో గట్టి ప్రత్యర్థి ఎదురయ్యారు. టుకీ అరుణాచల్ మాజీ ముఖ్యమంత్రి మాత్రమే కాదు ప్రస్తుతం ఆ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు కూడా. టుకీకి కరిష్మా తక్కువేం లేదు. దీంతో ఆసక్తి సర్వత్రా నెలకొంది.



భూపేంద్ర యాదవ్: రాజ్యసభ సభ్యుడైన భూపేంద్ర మోదీ మంత్రివర్గంలో పర్యావరణ, అటవీ శాఖ మంత్రిగా సేవలందిస్తున్నారు. రాజస్థాన్‌లోని అల్వార్ నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్నారు. బీజేపీ సిట్టింగ్ ఎంపీ బాలక్‌నాథ్‌ను పక్కనబెట్టిమరీ పార్టీ ఈయనకు టికెట్ ఇచ్చింది. జిల్లాలో సిట్టింగ్ కాంగ్రెస్ ఎమ్మెల్యే లలిత్ యాదవ్ ఈయనకు గట్టిపోటీ ఇస్తున్నారు. జిల్లాలోని మత్స్య ప్రాంతంలో యాదవుల మద్దతు ఇద్దరికీ ఉండటంతో ఎవరు గెలుస్తారో చెప్పలేని పరిస్థితి నెలకొంది.



అర్జున్‌రాం మేఘ్వాల్: రాజస్థాన్‌లోని బికనీర్ నుంచి తలపడుతున్న కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్‌తో మాజీ కాంగ్రెస్ మంత్రి గోవింద్ రామ్ మేఘ్వాల్ తలపడుతున్నారు.



సర్బానంద సోనోవాల్: నౌకాశ్రయాలు, షిప్పింగ్, నదీజలాల రవాణా మంత్రిత్వ శాఖ కేంద్ర మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సోనోవాల్ సైతం ఈసారి అస్సాంలోని దిబ్రూగఢ్ నుంచి బరిలో దిగారు. రాజ్యసభ సభ్యుడైన సోనోవాల్ ఈసారి లోక్‌సభలో తన అదృష్టం పరీక్షించుకుంటున్నారు. పెట్రోలియం, సహజవాయు మంత్రిత్వ శాఖ సహాయమంత్రి రామేశ్వర్ తేలికి బీజేపీ ఈసారి టికెట్ నిరాకరించి సోనోవాల్‌ను నిలబెట్టింది.



ఎల్.మురుగన్: తమిళనాడులోని నీలగిరి నియోజకవర్గంలో కేంద్ర మంత్రి, బీజేపీ నేత ఎల్.మురుగన్ తన అదృష్టం పరీక్షించుకోనున్నారు. ఇక్కడ డీఎంకే సిట్టింగ్ ఎంపీ, మాజీ కేంద్ర టెలికం మంత్రి ఏ.రాజా నుంచి మురుగన్‌కు గట్టి పోటీ ఎదురవుతోంది. మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు ఎన్నికైన మురుగన్ తొలిసారిగా నీలగిరి నుంచి నిలబడ్డారు.



సంజీవ్ భలియా: ఉత్తరప్రదేశ్‌లో కులరాజ కీయాలకు పేరొందిన ముజఫర్‌నగర్‌లో కేంద్ర మంత్రి సంజీవ్ భలియా పోటీకి నిలబడ్డారు. ఈయనకు సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థి హరీంద్ర మాలిక్, బహుజన్‌సమాజ్ పార్టీ అభ్యర్థి దారాసింగ్ ప్రజాపతి నుంచి గట్టిపోటీ ఉంది. ఈ త్రిముఖపోరులో గెలుపు ఎవరిని వరిస్తుందో.



తమిళిసై సౌందరరాజన్: తెలంగాణ గవర్నర్‌గా పనిచేసి రాజీనామా చేసి మళ్లీ రాజకీయరంగప్రవేశం చేసిన తమిళనాడు బీజేపీ నాయకురాలు తమిళిసై సౌందరరాజన్ చెన్నై సౌత్ స్థానం నుంచి పోటీచేస్తున్నారు. గతంలో తూత్తుకుడి నుంచి తమిళిసై పోటీచేసి డీఎంకే నాయకురాలు కనిమొళి చేతిలో ఓటమిని చవిచూశారు.



జితేంద్ర సింగ్: జమ్మూకశ్మీర్‌లోని ఉధంపూర్ నుంచి రెండుసార్లు ఎంపీగా గెలిచారు. మోదీ హయాంలో సహాయ మంత్రిగా సేవలందించారు. హ్యాట్రిక్ కొట్టాలని లక్ష్యంగా పెట్టుకుని తెగ ప్రచారం చేశారు.



బిప్లవ్‌కుమార్ దేవ్: త్రిపుర మాజీ ముఖ్యమంత్రి బిప్లవ్ కుమార్ దేవ్ ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేస్తున్నారు. వెస్ట్ త్రిపురలో బిప్లవ్ దేవ్‌కు పోటీగా రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు ఆశిశ్ కుమార్ సాహా నిలబడ్డారు. ఇద్దరికీ ఈ నియోజకవర్గంపై గట్టిపట్టుంది. దీంతో ఎవరు గెలుస్తారో చెప్పడం కష్టంగా మారింది.

భారతదేశ జనాభా 144.17 కోట్లు!

న్యూఢిల్లీ: భారతదేశ జనాభా 144.17 కోట్లకు చేరినట్లు ఐక్యరాజ్యసమితి పాపులేషన్ ఫండ్(యూఎన్ఎఫ్‌పీఏ) అంచనా వేసింది. ఈ మేరకు స్టేట్ ఆఫ్ వరల్డ్ పాపులేషన్-2024 నివేదికను విడుదల చేసింది. ఇండియాలోని మొత్త జనాభాలో 24 శాతం మంది 14 ఏళ్లలోపువారే ఉన్నారని వెల్లడించింది. 10 నుంచి 19 ఏళ్లలోపు వారు 17 శాతం, 10 నుంచి 24 ఏళ్లలోపువారు 26 శాతం, 15 నుంచి 64 ఏళ్లలోపు వయసున్నవారు 68 శాతం మంది ఉన్నారని వివరించింది. 65 ఏళ్లు దాటినవారు దేశ జనాభాలో 7 శాతం ఉన్నట్లు తెలిపింది. ఇండియాలో పురుషుల్లో సగటు జీవన కాలం 71 ఏళ్లు కాగా, మహిళల్లో 74 ఏళ్లుగా ఉన్నట్లు పేర్కొంది. దేశంలో జనాభా మరో 77 సంవత్సరాల్లో రెట్టింపు కానుందని తెలియజేసింది. భారత్ పొరుగుదేశమైన చైనాలో జనాభా 142.5 కోట్లకు చేరినట్లు పేర్కొంది.

ఎలక్షన్ బీట్

నాలుగో విడతకు నేడే నోటిఫికేషన్

మే 13న దేశవ్యాప్తంగా 96 లోక్‌సభ స్థానాల్లో పోలింగ్

సాక్షి, న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల్లో నాలుగో విడత ఎన్నికల ప్రక్రియకు రంగం సిద్ధం అయ్యింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా దేశంలోని 10 రాష్ట్రాల్లోని 96 లోక్‌సభ నియోజకవర్గాలకు మే 13న పోలింగ్ జరుగనుంది. గురువారం ఉదయం నాలుగో విడత ఎన్నికల ప్రక్రియకు గెజిట్ నోటిఫికేషన్ జారీ అయిన తర్వాత ఈ విడతకు నామినేషన్ల దాఖలు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ 96 లోక్‌సభ స్థానాల్లో పోటీకి సిద్ధమయ్యే అభ్యర్థులకు ఏప్రిల్ 25 వరకు నామినేషన్లు దాఖలు చేసుకొనేందుకు అవకాశం కల్పించారు. 10 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సంబంధించిన నామినేషన్ల పరిశీలన ఏప్రిల్ 26 న జరుగనుంది. అనంతరం ఏప్రిల్ 29 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించారు. కాగా నాలుగో విడతలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిషా, ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్, బిహార్, జార్ఖండ్, ఢిల్లీ రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగనున్నాయి. తెలంగాణలోని 17, ఆంధ్రప్రదేశ్‌లోని 25 లోక్‌సభ స్థానాలకు నాలుగో విడతలో ఎన్నికలు జరుగనున్నాయి. వీటితో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని 175 అసెంబ్లీ స్థానాలు, ఒడిషాలోని 28 అసెంబ్లీ నియోజకవర్గాలకు నాలుగో విడతలో పోలింగ్ జరుగనుంది

2014లో ఆశ.. 2019లో విశ్వాసం.. 2024లో గ్యారంటీలు: మోదీ

నల్బారీ: 'మోదీ గ్యారంటీల' గురించి దేశమంతటా చర్చ జరుగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ గ్యారంటీలను కచ్చితంగా నెరవేరుస్తానన్న గ్యారంటీని దేశ ప్రజలకు ఇస్తున్నానని చెప్పారు. 2014లో ఆశతో, 2019లో విశ్వాసంతో ప్రజల వద్దకు వెళ్లానని, 2024లో గ్యారంటీలతో వెళ్తున్నానని తెలియజేశారు. బుధవారం అస్సాంలోని నల్బారీ, త్రిపురలోని అగర్తలాలో సార్వత్రిక ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాని మోదీ ప్రసంగించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు 'లూట్ ఈస్ట్' విధానం అమలు చేసిందని, తాము వచ్చాక దాన్ని 'యాక్ట్ ఈస్ట్' పాలసీగా మార్చేశామని తేల్చిచెప్పారు. కాంగ్రెస్ హయాంలో ఈశాన్య ప్రాంతం అవినీతిపరులకు అడ్డాగా మారిందన్నారు. ఈ ప్రాంతాన్ని దోచుకోవడం తప్ప కాంగ్రెస్ చేసిందేమీ లేదన్నారు. కమ్యూనిస్టులు ఈశాన్య రాష్ట్రాల ప్రతిష్ఠను దెబ్బతీశారని మండిపడ్డారు. 'సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్' ఫలితాలను ఈశాన్య రాష్ట్రాలు అనుభవిస్తున్నాయని తెలిపారు. బీజేపీ మేనిఫెస్టోలోని అంశాలను మోదీ మరోసారి ప్రస్తావించారు.

సిద్ధాంతాల మధ్య సమరమిది: రాహుల్

మాండ్య/ఘజియాబాద్: తాజా లోక్‌సభ ఎన్నికలను రాజ్యాంగ పరిరక్షణ, రాజ్యాంగ విధ్వంసక భిన్న సిద్ధాంతాల మధ్య పోరాటంగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అభివర్ణించారు. ప్రచారంలో భాగంగా బుధవారం కర్ణాటకలోని మాండ్య జిల్లాలో పార్టీ అభ్యర్థి తరఫున ప్రచారం చేసి ప్రసంగించారు. '' విపక్షాల 'ఇండియా' కూటమికి ఓటేసి అధికార పగ్గాలు చేతికిస్తే అది ప్రజా ప్రభుత్వమవుతుంది. ఇన్నాళ్లూ మోదీ సర్కార్ ఓ పాతికమంది సంపన్నులకు సేవచేస్తే, మా 'ఇండియా' కూటమి సర్కార్ సాధారణ ప్రజానీకం, రైతులు, కార్మికులు, వ్యాపారుల మేలుకోరుతుంది. ఎలక్టోరల్ బాండ్ల పథకం ప్రపంచంలోనే అతిపెద్ద బెదిరింపు వసూళ్ల కుంభకోణం. మోదీ ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూను చూస్తే అది ఇట్టే అర్థమవుతుంది. ఇంటర్వ్యూలో ఎలక్టోరల్ బాండ్లు మంచివే అని వివరణ ఇచ్చినంతసేపూ ఆయన చేతులు వణుకుతూనే ఉన్నాయి. కావాలంటే ఇంటర్నెట్‌లో ఆయన ఇంటర్వ్యూ చూడండి' అని రాహుల్ ఎద్దేవాచేశారు.

ముగ్గురు బీజేపీ ఎంపీ అభ్యర్థులను బహిష్కరించిన రాజ్‌పుత్‌లు


సాక్షి, న్యూఢిల్లీ: ఉత్తర్‌ప్రదేశ్‌లోని మూడు పార్లమెంటు స్థానాల్లో పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థులను బహిష్కరిస్తున్నట్లు రాజ్‌పుత్‌లు ప్రకటించారు. మూడు స్థానాల్లో ఇద్దరు సిట్టింగ్ ఎంపీలు కాగా.. అందులో ఒకరు కేంద్ర సహాయమంత్రిగా ఉన్నారు. మంగళవారం ఖేడా ప్రాంతంలో నిర్వహించిన మహాపంచాయత్‌లో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. తాము తీసుకున్న ఈ నిర్ణయం పశ్చిమ యూపీలో బీజేపీ పతనానికి దారితీస్తుందని 'మహాపంచాయత్' పేర్కొంది. ముజఫర్‌నగర్ నుంచి సంజీవ్ బల్యాన్ (కేంద్ర సహాయమంత్రి), కైరానా నుంచి ప్రదీప్ చౌదరి, సహరాన్‌పూర్ నుంచి రాఘవ్ లఖన్‌పాల్ శర్మ బరిలో ఉన్నారు.

'ఆప్ కా రామ్‌రాజ్య' వెబ్‌సైట్

సాక్షి, న్యూఢిల్లీ: శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఆమ్ ఆద్మీ పార్టీ 'aapkaramrajya.com' పేరుతో వెబ్‌సైట్ ప్రారంభించింది. బుధవారం ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో మంత్రులు అతిశి, సౌరభ్ భరద్వాజ్, ఎంపీ సంజయ్ సింగ్, సీనియర్ నేత జాస్మిన్ షా 'ఆప్ కా రామ్ రాజ్య' వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఆతిశీ మీడియాతో మాట్లాడుతూ.. ప్రజల కోసం, వారికి ఇచ్చిన మాట కోసం ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కూడా శ్రీరాముడి తరహాలోనే కష్టాలు ఎదుర్కొంటున్నారని అన్నారు. నాటి రామరాజ్యం స్ఫూర్తితోనే కేజ్రీవాల్ నేతృత్వంలో ఢిల్లీ, పంజాబ్ ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.

యూఏఈలో అనూహ్య వర్షాలు

నీట మునిగిన దుబాయ్ ఎయిర్‌పోర్ట్!




దుబాయ్: మాడ పగిలిపోయే ఎండ వేడికి, ఎడారులకు నిలయమైన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌ను భారీ వర్షాలు పలకరించాయి. బుధవారం కుండపోత వర్షాలతో యూఏఈ తడిసి ముద్దయింది. భారీ వర్షాలను తట్టుకునే ఏర్పాట్లేవీ పెద్దగా లేకపోవడంతో దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం రన్‌వే మొత్తం నీట మునిగింది. దీంతో ప్రపంచంలోనే అత్యంత రద్దీ ఎయిర్‌పోర్ట్‌గా ఖ్యాతికెక్కిన దుబాయ్ ఎయిర్‌పోర్ట్ నుంచి విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎయిర్‌పోర్ట్ పార్కింగ్ ప్రాంతంలోని కార్లు మునిగిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఒకటిన్నర సంవత్సరంలో పడాల్సిన వర్షపాతం బుధవారం ఒక్కరోజే నమోదైందని సిటీ వాతావరణ శాఖ వెల్లడించిన గణాంకాల్లో తేలింది. 14.2 సెంటీమీటర్లమేర వర్షపాత నమోదైందని అధికారులు తెలిపారు. దేశవ్యాప్తంగా స్కూళ్లు మూసేశారు. సమీప బహ్రెయిన్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియాల్లోనూ వర్షాలు కురిశాయి. భారీ వర్షాల కారణంగా జరిగిన ఆస్తినష్టాల వివరాలను ప్రభుత్వం బయటపెట్టలేదు. వర్షాల కారణంగా భారత్ నుంచి దుబాయ్‌కు విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అయితే మేఘమథనం వల్లే ఈ వర్షాలు కురిశాయని నిపుణుల అంచనా.

సాక్షి విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

గురువారం । 18 । ఏప్రిల్ । 2024



జెండాచెట్టు వద్ద ప్రార్థనలు
గుడివాడ టౌన్: ఎమ్మెల్యే కొడాలి నాని బుధవారం గుడివాడలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పవిత్ర జెండా చెట్టు వద్ద జరిగిన ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు.



సాగర్ నీటిమట్టం
విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 508.40 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 5,598, ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.



వైభవంగా శోభాయాత్ర
శ్రీ రామనవమి సందర్భంగా శ్రీరామ శోభా యాత్ర సమితి ఆధ్వర్యంలో దుర్గాపురంలోని బీఆర్టీఎస్ రోడ్డులో నిర్వహించిన బైక్ ర్యాలీ వైభవంగా సాగింది. -8లో▸

న్యూస్‌రీల్

ఘనంగా శ్రీరామనవమి వేడుకలు



విజయవాడస్పోర్ట్స్: సాయుధ రిజర్వ్ పోలీస్ రామాలయంలో సీతారాముల కల్యాణ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా సతీసమేతంగా పట్టువస్త్రాలు ధరించి ఉత్సవ మూర్తులకు వైభవంగా కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు అధిరాజ్ సింగ్‌రాణా, కె.చక్రవర్తి, ఉదయరాణి, బి.రామకృష్ణ, ఏడీసీపీలు కృష్ణమూర్తినాయుడు, టి.కనకరాజు, కె.శ్రీహరిబాబు, కె.కోటేశ్వరరావు, ఏసీపీలు బి.పార్థసారథి, తేజేశ్వరరావు, కృష్ణంరాజు, డాక్టర్ స్రవంతిరాయ్, ప్రసాద్ , కమిషనరేట్ కార్యాలయ సిబ్బంది, పోలీస్ రామాలయం కమిటీ సభ్యులు, పోలీస్ అసోషియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

'108'లో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కంకిపాడు: జిల్లాలో పలుచోట్ల 108 వాహనాల్లో ఖాళీగా ఉన్న ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, పైలెట్ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మేనేజర్ హరీష్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ పోస్టులకు జీఎన్ఎం, బీఎస్సీ, నర్సింగ్, బీఎస్సీ ఎంఎల్‌టీ, బీఎస్సీ మైక్రోబయాలజీ/బయోటెక్నాలజీ మొదలైన కోర్సులు చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. హనుమాన్‌జంక్షన్, ఉంగుటూరు, నందివాడ, మచిలీపట్నం, పెనమలూరు, మొవ్వ, పమిడిముక్కల, కోడూరు, అవనిగడ్డ ప్రాంతాల్లో ఈఎంటీ ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఈ నెల 19న మచిలీపట్నం నోబుల్ కాలేజ్‌లో జరిగే ఇంటర్వ్యూలకు బయోడేటాతో హాజరుకావాలని సూచించారు. వివరాలకు 89191 97050, 98488 47042, 70931 23579 నంబర్లను సంప్రదించాలని కోరారు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో 108, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల పోస్టులకు 10వ తరగతి పాసై, హెవీలైసెన్స్ కలిగి ఉండాలని, 35 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉండాలని తెలిపారు. ఈ నెల 19న ఎన్టీఆర్ జిల్లా భవానీపురం మార్కెట్‌యార్డు వద్ద నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు. పైలెట్ పోస్టులు గుడ్లవల్లేరు, పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను, పామర్రు, మొవ్వ ప్రాంతాల్లో ఖాళీలు ఉన్నాయని, మరిన్ని వివరాలకు 99630 06867 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అగ్నిప్రమాదాల నియంత్రణపై అవగాహన



హనుమాన్‌జంక్షన్ రూరల్: అగ్నిప్రమాదాల నివారణ, నియంత్రణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని హనుమాన్‌జంక్షన్ అగ్నిమాపక కేంద్రం అధికారి జీఆర్ మోహనరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక విజయవాడరోడ్డులోని భారత్ పెట్రోల్ బంక్‌లో బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పెట్రోల్ బంక్‌లో అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలను అక్కడ పని చేస్తున్న సిబ్బందికి వివరించారు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు నష్టం వాటిల్లకుండా తీసుకోవాల్సిన నియంత్రణ చర్యలు, మంటలను అదుపు చేసే పద్ధతులను ప్రత్యక్షంగా ప్రదర్శనల ద్వారా వివరించారు. అనంతరం వీరవల్లిలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలోనూ అగ్నిప్రమాదాల నియంత్రణపై అవగాహన నిర్వహించారు.

కామాంధుడిపై కఠిన చర్యలు తీసుకోండి

సాక్షి, అమరావతి: చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం మల్లనూరులో దివ్యాంగురాలిపై లైంగికదాడి చేసిన కామాంధుడు రమేష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి ఆ జిల్లా ఎస్పీని ఆదేశించారు. ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడినట్లు వెంకటలక్ష్మి తెలిపారు. బాలికకు మెరుగైన వైద్యసాయం అందించి ఐసీడీఎస్ వసతి గృహానికి తరలించాలని సూచించినట్లు చెప్పారు. ఇప్పటికే నిందితుడిని అరెస్టు చేశామని, మద్యం మత్తులో అతడు ఈ దురాగతానికి పాల్పడినట్లు గుర్తించామని ఎస్పీ చెప్పినట్లు తెలిపారు. బాధితురాలికి మెరుగైన వైద్యం అందించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారని ఆమె చెప్పారు.





జయ జానకీ నాయక

జగదానందకారకుడు శ్రీరామచంద్రుడు.. సుగుణాల రాశి సీతమ్మల కల్యాణ వేడుక అంబరాన్ని తాకింది. లోక కల్యాణం కోసం ఏటా నిర్వహించే ఈ వేడుక భక్తుల మదిని పులకింపజేసింది. వేలాదిగా తరలివచ్చిన భక్తజనంతో రామాలయాలు కిటకిటలాడాయి. బుధవారం శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణం కమనీయమై సాక్షాత్కరించింది. జైశ్రీరామ్ నినాదాలతో పుణ్యక్షేత్రాలు మార్మోగాయి. విజయవాడ గవర్నర్‌పేట పోస్టాఫీస్ రోడ్డులోని రామాలయంలో ఉత్సవమూర్తులు, వేడుకలకు హాజరైన భక్తులను చిత్రాల్లో చూడొచ్చు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ విజయవాడ

పోరుకు వేళాయె


నేడు సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్



- నామినేషన్ల స్వీకరణకు అధికారుల ఏర్పాట్లు
- తొలిరోజే మంచి రోజు కావడంతో అభ్యర్థులు నామినేషన్‌లు వేసేందుకు సన్నాహాలు
- చివరి రెండు రోజుల్లో పెద్ద ఎత్తున నామినేషన్లు
- ఇకపై ఊపందుకోనున్న ప్రచారం

సాక్షి ప్రతినిధి, విజయవాడ: సార్వత్రిక సమరానికి వేళైంది. గురువారం ఎన్నికల నోటిఫికేషన్‌ను ఎన్నికల సంఘం విడుదల చేయనుంది. దీంతో నామినేషన్ల ఘట్టానికి తెరలేవనుంది. అన్ని పార్టీల అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు ఏర్పాట్లు చేసుకొంటున్నారు. ఇప్పటికే వైఎస్సార్ సీపీ, కూటమి తరఫున అభ్యర్థులను ఖరారు చేశారు. ఈ నేపథ్యంలో నేటి నుంచి 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణకు రిటర్నింగ్ అధికారులు కార్యాలయాల్లో పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేశారు. తొలి రోజు దశమి మంచి రోజు కావడంతో పలువురు అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు అంతా సిద్ధం చేసుకుంటున్నారు. అభ్యర్థి తమ పేరు బలం, తిథి వార నక్షత్రాలు, రాశి ఫలాలు చూసుకొని అందుకు అనుగుణంగా ముహూర్తం ఖరారు చేసుకుంటున్నారు. ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధం అవుతున్నారు.

- తొలిరోజు పామర్రులో వైఎస్సార్ సీపీ అభ్యర్థి కైలే అనిల్‌కుమార్ గురువారం నామినేషన్‌ను వేయనున్నారు.
- తిరువూరులో వైఎస్సార్ సీపీ అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు రిటర్నింగ్ అధికారికి నేడు నామినేషన్ సమర్పించనున్నారు.
- విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి సుజనాచౌదరి కూడా నామినేషన్ వేయనున్నట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.
- 19న పశ్చిమ నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థి షేక్ ఆసిఫ్, విజయవాడ టీడీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్ని, సీపీఎం అభ్యర్థి చిగురుపాటి బాబూరావు నామినేషన్లు వేయనున్నారు.
- 20వ తేదీన మైలవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి సర్నాల తిరుపతిరావు యాదవ్ నామినేషన్ సమర్పించనున్నారు.
- 22వ తేదీన విజయవాడ ఎంపీ వైఎస్సార్ సీపీ అభ్యర్థి కేశినేని నాని, మచిలీపట్నం వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, విజయవాడ సెంట్రల్ అసెంబ్లీ వైఎస్సార్ సీపీ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాస్, నందిగామ టీడీపీ అభ్యర్థి తంగిరాల సౌమ్య, మైలవరం టీడీపీ అభ్యర్థి వసంత కృష్ణ ప్రసాద్‌లు నామినేషన్లు వేయనున్నారు.
- 24వ తేదీ జగ్గయ్యపేట, నందిగామ, విజయవాడ తూర్పు, పెనమలూరు, అవనిగడ్డ, పెడన వైఎస్సార్ సీపీ అభ్యర్థులు సామినేని ఉదయభాను, మొండితోక జగన్‌మోహనరావు, దేవినేని అవినాష్, జోగి రమేష్, సింహాద్రి రమేష్‌బాబు, ఉప్పాల రాము నామినేషన్లు దాఖలు చేయనున్నారు.
- చివరిరోజు ఈ నెల 25న గన్నవరం, మచిలీపట్నం అసెంబ్లీ వైఎస్సార్ సీపీ అభ్యర్థులు వల్లభనేని వంశీమోహన్, పేర్ని కిట్టు నామినేషన్లు వేయనున్నారు. ఇలా పలువురు పార్టీల అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు వీలుగా ముహూర్తాలు ఇప్పటికే ఖరారు చేసుకున్నారు.



నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థులు పార్టీ ప్రచారం పై పూర్తి స్థాయిలో దృష్టి సారించనున్నారు. ఇప్పటికే ఉమ్మడి కృష్ణా జిల్లాలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు, గడపగడపకు మన ప్రభుత్వంతో పాటు నియోజకవర్గంలో పార్టీ పిలుపు ఇచ్చిన పలు కార్యక్రమాల ద్వారా నియోజకవర్గాన్ని రెండు, మూడు సార్లు చుట్టేశారు. ప్రతి గడపను సందర్శించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను, వ్యక్తిగతంగా ఐదేళ్లలో తమ కుటుంబాలకు జరిగిన ఆర్థిక లబ్ధిని వివరించారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ప్రచారంలో ముందంజలో ఉన్నారు. సిద్ధం సభలు, మేమంతా సిద్ధం బస్సు యాత్ర కార్యక్రమాలు మరింత జోష్ నింపాయి. దీంతో రెట్టించిన ఉత్సాహంతో అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. టీడీపీ అభ్యర్థులు తమ పాలనలో చేసిన అవినీతి, జన్మభూమి కమిటీల దాష్టీకాలను ప్రజలు గుర్తు చేసుకొంటూ, అభ్యర్థులకు సహకరించడం లేదు. వీరి ప్రచారాలకు స్పందన కరువు అవుతోంది. కార్యకర్తల్లోనూ నైరాశ్యం ఆవహిస్తోంది. దీంతో టీడీపీ అభ్యర్థులు తలలు పట్టుకొంటున్నారు.

సర్వ సన్నద్ధం


నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియకు శ్రీకారం

- షెడ్యూల్ ప్రకారం ఈ నెల 25 వరకు నామినేషన్ల స్వీకరణ
- ఆర్వో కార్యాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు
- పొరపాట్లకు ఆస్కారం లేకుండా ఆర్వోలకు మూడు విడతల్లో ప్రత్యేక శిక్షణ
- ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఢిల్లీరావు



మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు. చిత్రంలో జేసీ సంపత్‌కుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్నికల నిర్వహణలో కీలకమైన నామినేషన్ల ప్రక్రియకు పూర్తిస్థాయిలో సమాయత్తమైనట్లు ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు తెలిపారు. నామినేషన్ల స్వీకరణకు ఆర్వో కార్యాలయాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. నగరంలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లోని సమాచార, పౌర సంబంధాల శాఖ కార్యాలయ ఎన్నికల మీడియా కేంద్రంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్‌తో కలిసి మాట్లాడారు. ఏప్రిల్ 18వ తేదీ ఉదయం 11 గంటలలోపు ఆర్వోల సంతకంతో తెలుగు, ఇంగ్లిష్‌లో నామినేషన్లకు సంబంధించి ఫారం-1 పబ్లిక్ నోటీస్ జారీ చేస్తామన్నారు. దీన్ని జిల్లా, డివిజన్, మండల, గ్రామ స్థాయిలోని ముఖ్యమైన కార్యాలయాల్లో పబ్లిష్ చేయనున్నట్లు వివరించారు.



అవగాహన కార్యక్రమం..

నామినేషన్ల దాఖలుపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించినట్లు కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. నామినేషన్ల సమర్పణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు సంబంధిత ఫారాల గురించి అవగాహన కల్పించినట్లు చెప్పారు. ప్రభుత్వ సెలవు దినాల్లో మినహా మిగిలిన అన్ని రోజుల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు తెలిపారు. నామినేషన్ల స్వీకరణకు సంబంధించి అవగాహన కల్పించేందుకు పార్లమెంటు, అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

సెక్యూరిటీ డిపాజిట్..

అభ్యర్థితో కలుపుకొని గరిష్టంగా అయిదుగురికి మాత్రమే ఆర్వో చాంబర్‌లోకి అనుమతి ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆర్వో కార్యాలయం బయట, లోపల కూడా సీసీటీవీలు ఏర్పాటు చేశామని.. వీడియోగ్రఫీ చేస్తామని చెప్పారు. ఒక అభ్యర్థి గరిష్ఠంగా నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉందన్నారు. రెండు కంటే ఎక్కువ నియోజకవర్గాల నుంచి అభ్యర్థులు నామినేషన్లను ఫైల్ చేయడం కుదరదని స్పష్టం చేశారు. పార్లమెంటరీ నియోజకవర్గానికి పోటీ చేసే అభ్యర్థి రూ. 25 వేలు, అసెంబ్లీ నియోజకవర్గానికి పోటీచేసే అభ్యర్థి రూ. 10 వేలు సెక్యూరిటీ డిపాజిట్ చేయాల్సి ఉంటుందని.. అభ్యర్థులు ఎస్సీ, ఎస్టీలకు చెందిన వారైతే 50 శాతం మేర మొత్తాన్ని సెక్యూరిటీ డిపాజిట్ చేస్తే సరిపోతుందన్నారు.

ఎక్కడికక్కడే స్వీకరణ..

విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గానికి నామినేషన్లను కలెక్టర్ కార్యాలయంలో స్వీకరించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అదే విధంగా తిరువూరు నియోజకవర్గానికి సంబంధించి అక్కడి ఆర్డీఓ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరిస్తారన్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి పశ్చిమ తహసీల్దార్ కార్యాలయంలో.. విజయవాడ సెంట్రల్‌కు సంబంధించి వీఎంసీ కార్యాలయంలో, విజయవాడ తూర్పునకు సంబంధించి సబ్ కలెక్టర్ కార్యాలయంలోనూ, మైలవరం నియోజకవర్గానికి అక్కడి తహసీల్దార్ కార్యాలయంలో, నందిగామకు సంబంధించి ఆర్డీఓ కార్యాలయం, నందిగామలోనూ, జగ్గయ్యపేటకు సంబంధించి అక్కడి తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరిస్తారని కలెక్టర్ వివరించారు.

26వ తేదీన నామినేషన్ల పరిశీలన..

ఈ నెల 26వ తేదీన నామినేషన్ల స్క్రూటినీ ఉంటుందని.. అదే విధంగా 29వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను ఉపసంహరించుకునేందుకు వీలుంటుందని కలెక్టర్ తెలిపారు. అనంతరం సింబల్ అలాట్‌మెంట్ జరుగుతుందని వివరించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఉండేందుకు ఆర్వోలకు మూడు రౌండ్ల శిక్షణ ఇస్తామని తెలిపారు. అభ్యర్థి ఎన్నికల వ్యయ పరిశీలన కోసం ప్రత్యేక బ్యాంక్ అకౌంట్ వివరాలు సమర్పించాల్సి ఉంటుందన్నారు. మే 7 నుంచి 9 తేదీల్లో హోం ఓటింగ్‌కు చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ జరుగుతుందన్నారు. ప్రస్తుతం జిల్లాలో దాదాపు 16,98,000 ఓటర్లు ఉన్నారని.. ఈ నెల 24వ తేదీలోపు కొత్తగా ఓటు నమోదు, బదిలీకి సంబంధించిన దరఖాస్తులను పరిష్కరించనున్నట్లు తెలిపారు.

ఇక ఆంధ్రా రైతు బ్రాండ్!

అన్నదాతకు తీరని కల ఒకటి ఉంది. తన పంటను నచ్చిన చోట.. నచ్చిన వారికి.. నచ్చిన ధరకు విక్రయించుకోవడం! దీనిని సుసాధ్యం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుంబిగించింది. పండించిన పంటను ప్రీమియం ధరకు అమ్ముకునేందుకు వీలుగా గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీసెస్(జీఏపీ) సర్టిఫికేషన్‌ను తీసుకొచ్చింది. మన దేశంలో ఇది అమలు చేస్తున్న మొదటి రాష్ట్రం ఆంధ్రప్రదేశే కావడం విశేషం.

- ఆర్గానిక్ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు వైఎస్సార్ 'గ్యాప్' పొలంబడి
- గ్లోబల్ మార్కెటింగే లక్ష్యంగా అంతర్జాతీయ ప్రమాణాలతో శిక్షణ
- ఉమ్మడి కృష్ణా జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా కుంటముక్కలలో నిర్వహణ
- ఒక్కొక్క రైతుపై రూ.12వేలు ఖర్చు చేసిన రాష్ట్ర ప్రభుత్వం

ఆరోగ్యం, అధికాదాయమే లక్ష్యం



మేలైన సేద్య పద్ధతులను చిత్రాల ద్వారా రైతులకు వివరిస్తున్న అధికారులు (ఫైల్)

జి.కొండూరు: ఆంధ్రప్రదేశ్ రైతులను గ్లోబల్ మార్కెట్‌లో నిలబెట్టేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విప్లవాత్మక నిర్ణయాన్ని తీసుకుని అమలు చేశారు. వైఎస్సార్ పొలంబడి పేరుతో సాధారణంగా నిర్వహించే అవగాహన కార్యక్రమాలతో పాటు మేలైన సేద్య పద్ధతులపై అవగాహన కల్పిస్తూనే.. ఆర్గానిక్ వ్యవసాయంపై సంపూర్ణ శిక్షణతో జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లో నేరుగా రైతులే తమ ఆహార ధాన్యాలను విక్రయించే విధంగా ప్రణాళికను రూపొందించారు. ఈ ప్రణాళికలో భాగంగా ఎన్టీఆర్ జిల్లాలోని జి.కొండూరు మండల పరిధి కుంటముక్కల గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి వైఎస్సార్ ఇండ్‌గ్యాప్(జీఏపీ) పొలంబడి పేరుతో 16మంది రైతులకు శిక్షణ ఇచ్చి ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆర్గానిక్ ప్రోడక్ట్ సర్టిఫికేషన్ అథారిటీ(ఏపీఎస్‌ఓపీసీఏ) ద్వారా స్కోప్ సర్టిఫికెట్‌లను సైతం అందజేశారు.

శిక్షణ ఇలా..

వైఎస్సార్ ఇండ్ గ్యాప్ పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించేందుకు 2023–24 సంవత్సరానికి గానూ ఖరీఫ్, రబీ రెండు సీజన్‌లలో వరి పండించే కుంటముక్కల గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. అనంతరం ప్రేమధార ఫార్మర్ ప్రొడ్యూసింగ్ మ్యూచువల్లి ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్‌లో సభ్యులుగా ఉన్న పదహారు మంది రైతులను ఎంపిక చేశారు. ఈ పదహారు మంది రైతులు సాగు చేస్తున్న 61.65ఎకరాల భూమిలో శిక్షణ ప్రారంభించారు.

వీటిపైనే శిక్షణ..

జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో వ్యవసాయ యాంత్రీకరణ, నీటి యాజమాన్యం, సమగ్ర కలుపు నివారణ యాజమాన్యం, సమగ్ర పోషక యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ యాజమాన్యం, పురుగు మందుల వినియోగం తగ్గించి సేంద్రియ పద్ధతిలో సాగు చేపట్టడం, సేంద్రియ ఎరువులు, పురుగు మందులు తయారు చేయడం, రైతులే తమ పొలాల్లో పర్యావరణ కారకాలపై అధ్యయనం చేసి సాధికారతను సాధించడం, వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు.


కేంద్ర బృందాల పర్యవేక్షణ..

ఈ శిక్షణకు ఎంపిక చేసిన రైతులకు ఖరీఫ్ సీజన్‌లో 14వారాల చొప్పున ప్రతి శుక్రవారం ఇండ్ గ్యాప్ పొలంబడి శిక్షణ ఇచ్చారు. శిక్షణ కాలంలో రైతులు పండిస్తున్న వరి పైరుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సేంద్రియ ఉత్పత్తుల ధ్రువీకరణ అథారిటీ (ఏపీఎస్‌ఓపీసీఏ)కి చెందిన క్వాలిటీ మేనేజ్‌మెంట్ బృందం ఎప్పటికప్పుడు పర్యవేక్షించింది. పంట కాలం పూర్తయిన తర్వాత ధాన్యాన్ని పరీక్షలకు పంపింది. ఈ పరీక్షలలో పంట ఉత్పత్తులలో ఆర్సెనిక్, కాడ్మియం, కాపర్, మెర్కురీ, టిన్ వంటి ఇన్ ఆర్గానిక్ అవశేషాలతో పాటు సూక్ష్మ విష పదార్థాలైన ఎఫ్లోటాక్సిన్స్, రసాయనిక అవశేషాలు కూడా లేనట్లు గుర్తించారు.

సర్టిఫికెట్ల జారీ..

నాణ్యతా పరీక్షల అనంతరం ఈ పదహారు మంది రైతులు పండించిన ధాన్యం నమూనాలు ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ రెగ్యులేషన్-2011కి అనుగుణంగా ఉన్నట్లు తేల్చి రైతుల ఉత్పత్తులు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లో విక్రయానికి అనుకూలంగా ఉన్నట్లు నిర్ధారిస్తూ.. ఏపీఎస్‌ఓపీసీఏ పదహారు మంది రైతులకు సర్టిఫికెట్‌లను జారీ చేసింది. సర్టిఫికెట్‌లను పొందిన రైతులకు ప్రస్తుతం రబీ సీజన్‌లో కూడా శిక్షణ కొనసాగుతుంది. ఈ శిక్షణలో రైతుల ధాన్యం ఉత్పత్తులను క్వాలిటీ పరీక్షలు జరిపి సర్టిఫికెట్‌లను ఇచ్చేందుకు ఈ పదహారు మంది రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్క రైతుపై రూ.12వేలు ఖర్చు చేసింది.

సేంద్రియమే మేలు



సేంద్రియ పద్ధతిలో సాగు చేసే విధానంపై 14వారాలు శిక్షణ ఇచ్చారు. నేను 7.70ఎకరాలలో ఎంటీయూ–1061 రకం వరిని సాగు చేశా. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు వచ్చాయి. మా పంటను ఇతర రాష్ట్రాలు, దేశాలకు అమ్ముకునేలా సర్టిఫికెట్‌లు కూడా ఇచ్చారు.

– పొమర్తి సాంబయ్య, రైతు, కుంటముక్కల గ్రామం

రైతులకు సువర్ణావకాశం



వైఎస్సార్ ఇండ్ గ్యాప్ పొలంబడి రైతులకు సువర్ణావకాశం. ఈ శిక్షణ కార్యక్రమం వల్ల రైతులు తమ ధాన్యాన్ని గ్లోబల్ మార్కెట్‌లో నేరుగా అమ్ముకునేలా వీలు కలుగుతుంది. ఈ కార్యక్రమాన్ని ప్రోత్సహించి రాష్ట్ర ప్రభుత్వం ఖర్చుతో గ్లోబల్ మార్కెటింగ్ సర్టిఫికెట్‌లు ఇవ్వడం గొప్ప నిర్ణయం.

– ఎం. రాంకుమార్, వ్యవసాయాధికారి, జి.కొండూరు

దుర్గమ్మకు కనకాంబరాలు, గులాబీలతో అర్చన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వసంత నవరాత్రోత్సవాలలో భాగంగా 9వ రోజైన బుధవారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు కనకాంబరాలు, గులాబీలతో అర్చన నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ గణపతి విగ్రహం వద్ద అమ్మవారి ఉత్సవ మూర్తికి విశేష పుష్పార్చన నిర్వహించారు. తొలుత ఆలయ ఈవో కేఎస్ రామరావు, స్థానాచార్య శివప్రసాద్ శర్మ, ఏఈవో ఎన్. రమేష్‌బాబు, వైదిక కమిటీ సభ్యులు రంగావజ్ఝల శ్రీనివాసశాస్త్రి, ఇతర అర్చకులు అమ్మవారి పుష్పార్చన నిమిత్తం సేకరించిన పుష్పాలతో ఆలయ ప్రాంగణంలో ఊరేగింపు నిర్వహించారు. రాజగోపురం వద్ద నుంచి ఊరేగింపుగా బయలుదేరిన ఆలయ అధికారులు, అర్చకులు ప్రధాన ఆలయంలోని అమ్మవారి మూలవిరాట్‌ను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం వేదిక వద్ద ఆలయ అర్చకులు, వేద పండితులు అమ్మవారికి కనకాంబరాలు, గులాబీలు, చామంతి, మందార పుష్పాలు, మొరం, దవళంతో పుష్పార్చన నిర్వహించారు. పూజ అనంతరం అమ్మవారికి పంచహారతుల సేవ నిర్వహించారు.

నేడు పూర్ణాహుతి..

వసంత నవరాత్రోత్సవాలు గురువారంతో ముగియనున్నాయి. గురువారం ఉదయం 10 గంటలకు మల్లేశ్వర స్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాలలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా గురువారం అమ్మవారికి అన్ని రకాల పుష్పాలతో అర్చన నిర్వహించనున్నారు.

క్లుప్తంగా

మంత్రముగ్ధులను చేసిన తీర్థతరంగాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై నిర్వహిస్తున్న వసంత నవరాత్రోత్సవాల్లో భాగంగా బుధవారం ధర్మపథం వేదికపై కృష్ణ సంపత్‌కుమార్ బృందం ఆలపించిన నారాయణ తీర్థతరంగాలు భక్తులను మంత్ర ముగ్ధులను చేశాయి. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ధర్మపథం వేదికపై సంపత్‌కుమార్ పలు కీర్తనలను మనోహరంగా ఆలపించారు. సంపత్ కుమార్‌కు పాలవర్తి నాగేశ్వరరావు వయోలిన్, డి.అనిల్‌కుమార్ మృదంగంపై సహకారం అందించారు. అంతకు ముందు సంపత్‌కుమార్ బృందానికి ఆలయ ఈవో కె.ఎస్.రామరావు అమ్మవారి శేష వస్త్రాలు, ప్రసాదాలను ఇచ్చి సత్కరించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి ఇండస్ట్రియల్ ఏరియాలోని ఓ లాడ్జిలో అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన బుధవారం జరిగింది. సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం పెడన మండలం గాయంపాడు గ్రామ వాసి అర్జా పవన్(27) ఐడీఏలోని ఓ లాడ్జిలోని రూమ్‌లో అద్దెకు ఉంటూ రాణి లైఫ్ సైన్సెస్ కెమికల్ కంపెనీలో పనిచేస్తున్నాడు. లాడ్జి గదిలో పవన్ బోర్లా పడుకుని మృతి చెంది ఉండటాన్ని సిబ్బంది గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుని తండ్రి అర్జా రాంబాబు ఫిర్యాదుపై మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ పాపారావు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న సీఐ తెలిపారు.

చిన్నారిపై లైంగికదాడి

పోక్సో కేసు నమోదు

కంకిపాడు: చిన్నారిపై లైంగికదాడికి పాల్పడ్డ యువకుడిపై కంకిపాడు పోలీసుస్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. ఎస్ఐ సందీప్ తెలిపిన వివరాల ప్రకారం.. కంకిపాడుకు చెందిన వంగా ప్రవీణ్ క్లీనర్‌గా చేసి చేసి ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. గతంలో అతని ఇంటి సమీపంలో ఉండే కుటుంబంతో సన్నిహితంగా మెలిగేవాడు. ప్రస్తుతం ఆ బాలిక కుటుంబం వేరే చోట ఉంటోంది. ఆ కుటుంబం ఉంటున్న ప్రాంతానికి మంగళవారం రాత్రి వచ్చి బాలిక (5)పై అత్యాచారయత్నం చేశాడు. బాలిక కుటుంబ సభ్యులు వెంటనే గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై లైంగికదాడికి పాల్పడ్డ నిందితుడు ప్రవీణ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రామదర్శనం.. జన్మధన్యం..

- ఇంద్రకీలాద్రిపై సీతారాముల కల్యాణం
- వైభవంగా శ్రీరామ నవమి వేడుకలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీరామచంద్రుడి దర్శనం.. జన్మధన్యం అంటూ భక్తజనం రఘురాముడిని మనసారా కొలిచారు. శ్రీదుర్గా మల్లేశ్వరస్వామివార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై శ్రీరామ నవమి వేడుకలను బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై శ్రీ సీతారాముల కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. తొలుత అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రావిచెట్టు వద్ద ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామివారి సన్నిధి నుంచి హనుమత్ సమేత సీతారామలక్ష్మణస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై ఊరేగింపుగా ఆలయ ఈవో కె.ఎస్.రామరావు, వైదిక కమిటీ సభ్యులు, వేద పండితులు పల్లకీని మోసుకుంటూ కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చారు. వేద పండితులు సీతారామ కల్యాణ విశిష్టతను వివరిస్తుండగా, అభిజిత్ లగ్నంలో స్వామి వారు అమ్మవారికి మాంగల్యధారణ చేశారు. ఆలయ ఈవో రామరావు స్వామివారికి, సీతాదేవికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. కల్యాణోత్సవాన్ని వీక్షించడానికి పెద్ద ఎత్తున భక్తులు వేదిక వద్దకు తరలిరాగా, వారికి అవసరమైన ఏర్పాట్లను దేవస్థానం చేసింది. చలువ పందిరి కింద కూలర్లు, మంచినీటి సదుపాయాన్ని కల్పించారు. కల్యాణోత్సవం అనంతరం భక్తులకు స్వామి వారి తలంబ్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానాచార్య శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు శ్రీనివాసశాస్త్రి, యజ్ఞనారాయణ మూర్తి, కోట ప్రసాద్, లింగంభోట్ల బద్రీనాథ్‌బాబు, ఇతర అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.



ఊరేగింపుగా కల్యాణ వేదిక వద్దకు ఉత్సవమూర్తులు



కల్యాణోత్సవాన్ని జరిపిస్తున్న అర్చకులు

చంద్రబాబు మాటలు నమ్మరు

వైఎస్సార్ సీపీ బందరు ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావు

రామవరప్పాడు: చంద్రబాబు దొంగ మాటలను రాష్ట్ర ప్రజలు నమ్మే స్థితిలో లేరని వైఎస్సార్ సీపీ బందరు ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావు చెప్పారు. రామవరప్పాడులో బుధవారం మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్‌తో కలిసి గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖరరావు మాట్లాడుతూ ఇప్పటికే ఎన్నో అమలు కాని హామీలిచ్చి చంద్రబాబు మోసం చేసిన విషయాన్ని ప్రజలు మరిచి పోలేదన్నారు. ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రజల నుంచి వస్తున్న అపూర్వ ఆదరణే జగన్‌ను రెండోసారి ముఖ్యమంత్రిని చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

తోక పార్టీల కుట్ర రాజకీయం

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కోలేక తోక పార్టీలన్నీ కుట్రరాజకీయాలు చేస్తున్నాయని తమ విలువైన ఓట్ల ద్వారా వారికి బుద్ధి చెప్పి తరిమి కొట్టాలని వైఎస్సార్ సీపీ గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్ అన్నారు. మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా విజయవాడలో పర్యటిస్తున్న జగన్‌పై ఉద్దేశపూర్వకంగా హత్యాయత్నం చేయించడం దుర్మార్గ చర్య అన్నారు. సంక్షేమమే అజెండాగా జగన్ ప్రజల మధ్యే పర్యటిస్తున్నారన్నారు. జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే తమకు విజయం చేకూరుస్తాయన్నారు. సీఎం జగన్‌కు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని, తమ రెండు ఓట్లను ఫ్యాను గుర్తుపై వేసి అఖండ విజయం చేకూరుస్తారన్న నమ్మకం ఉందని పేర్కొన్నారు. గ్రామంలోని ఒకటో వార్డు సభ్యురాలు బర్రె దేవుడమ్మతో పాటు పలు కుటుంబాలు వంశీమోహన్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారిని సాదరంగా ఆహ్వానించి పార్టీ కండువా కప్పారు. కార్యక్రమంలో గొల్లపూడి మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు, ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు సువర్ణరాజు, నియోజకవర్గ ఎలక్షన్ ఇన్‌చార్జి ఆర్.వెంకటేశ్వరరావు, పార్టీ రూరల్ మండల అధ్యక్షుడు శీలం రంగారావు, గ్రామ సర్పంచి వరి శ్రీదేవి, పలు గ్రామాల సర్పంచ్‌లు, సొసైటీ చైర్మన్లు, ఎంపీటీసీ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావుతో కలిసి ప్రచారం నిర్వహిస్తున్న వంశీమోహన్

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ కూలింగ్ కెనాల్‌లో గుర్తు తెలియని మృతదేహం పోలీసులకు లభించింది. స్టేజ్–2 గేటు వద్ద మృతదేహాన్ని గుర్తించిన సంస్థ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.రాంబాబు బుధవారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ బి.అనూష ఘటన స్థలంలో మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుని ఎత్తు ఐదు అడుగులు, వయస్సు సుమారు 35–40ఏళ్ల మధ్య ఉంటుంది. మృతదేహాన్ని విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వివరాలు తెలిసిన వారు ఎస్‌హెచ్‌వో 94406 27084, ఎస్ఐ 93906 81266 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

కృష్ణా నదిలో..

చందర్లపాడు (నందిగామ): కృష్ణానదిలో గుర్తుతెలియని ఓ మహిళ మృతదేహాన్ని బుధవారం చందర్లపాడు పోలీసులు గుర్తించారు. ఎస్సై ఆర్.ధర్మరాజు తెలిపిన వివరాల ప్రకారం చందర్లపాడు మండలం రామన్నపేట గ్రామ సమీపంలోని కృష్ణా నదిలో ఉన్న పంపింగ్ స్కీం వద్ద నీటిలో పూర్తిగా నాని పోయి ఉన్న మృతదేహాన్ని స్కీం వద్ద పని చేసే సిబ్బంది గుర్తించారు. వెంటనే చందర్లపాడు పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు మృతదేహం కృష్ణా నదిలో ఎగువ ప్రాంతంనుంచి కొట్టుకు వచ్చినట్లుగా గుర్తించారు. మృతురాలి వయసు సుమారు 35నుంచి 45 సంవత్సరాలు ఉంటాయన్నారు. మృతురాలి శరీరంపై నీలిరంగు చీర, జాకెట్‌తోపాటు ఎర్ర గాజులు ఉన్నట్లు తెలిపారు. మృతదేహం నీటిలో పూర్తి గా నాని పోయిందన్నారు. కేసు నమోదు చేసి అన్ని పోలీస్‌స్టేషన్లకు సమాచారమిచ్చినట్లు ఎస్సై తెలిపారు.

మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలి

పామర్రు ఎమ్మెల్యే అనిల్‌కుమార్

ఎలకుర్రు(పామర్రు): రానున్న ఎన్నికల్లో లంచాలు లేని ప్రభుత్వం కావాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించుకోవాలని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని ఎలకుర్రు గ్రామంలో బుధవారం ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. తొలుత పామర్రులోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా ఎలకుర్రు గ్రామం బయలుదేరారు. ఎలకుర్రు, కొరిమెర్ల ప్రాకర్ల గ్రామాల్లో ఉదయం, నిమ్మలూరు, మలయప్పన్నపేట, కాపవరం, సఫ్దర్‌ఖాన్‌పాలెం, మల్లవరం, పరిశేపల్లి, పసుమర్రు గ్రామాల్లో సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పామర్రు ఎమ్మెల్యేగా తనను, మచిలీపట్నం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సింహాద్రి చంద్రశేఖరరావును గెలిపించాలని కోరారు. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక మన ఇంటి దగ్గరకే సంక్షేమ పథకాలు అందేలా సచివాలయ, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. పెత్తందార్ల పక్షాన నిలిచే చంద్రబాబు అధికారంలోకి వస్తే ఈ వ్యవస్థను రద్దు చేస్తారన్నారు. కార్యక్రమంలో పామర్రు, మొవ్వ ఎంపీపీలు దాసరి అశోక్‌కుమార్, కుందేటి ఇందిర, పామర్రు, తోట్లవల్లూరు జెడ్పీటీసీ సభ్యులు కె. స్వరూపరాణి, జొన్నల రామ్మోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ల రమాదేవి, ఎంపీటీసీ సభ్యులు రత్నకుమారి, నాగమల్లేశ్వరరావు, కాకొల్లు రాజ్యలక్ష్మి, నాయకులు కాకర్ల వెంకటేశ్వరరావు, పెయ్యల రాజు, ముప్పిడి సురేష్‌రెడ్డి, ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రాకర్లలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

కౌంటింగ్ కేంద్రం పరిశీలన

- ఎన్నికల అధికారులకు కలెక్టర్ బాలాజీ పలు సూచనలు
- బందోబస్తు ఏర్పాట్లపై ఆదేశాలు

కోనేరుసెంటర్: సాధారణ ఎన్నికల సందర్భంగా కృష్ణా విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేస్తున్న ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పోలింగ్ అనంతరం కృష్ణా విశ్వవిద్యాలయానికి ఈవీఎంల తరలింపు, కౌంటింగ్ కేంద్రంలో సెగ్మెంట్ల వారీగా కేటాయించిన స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచే విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. కౌంటింగ్ కేంద్రానికి ఈవీఎంలతో వచ్చే వాహనాలకు పార్కింగ్ ప్రాంత చదును పనులను పరిశీలించారు. కృష్ణా విశ్వవిద్యాలయ భవనాలకు నలువైపులా ఏర్పరచిన మార్గాలకు వాహనాలు చేరేలా చదును చేయాలని సిబ్బందికి సూచించారు. నియోజకవర్గాల వారీగా మార్గ సూచికలు (సైనేజ్ బోర్డులు) ఏర్పాటు చేయాలని చెప్పారు. విశ్వవిద్యాలయం చుట్టూ నిర్మిస్తున్న ప్రహరీ పనులను మరింత వేగంగా చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఆర్వో కె. చంద్రశేఖరరావు, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, సర్వే ఏడీ మనీషా త్రిపాఠి, పీఆర్ ఈఈ శ్రీనివాసరావు, కృష్ణా విశ్వవిద్యాలయ ప్రిన్సిపాల్ సుందరకృష్ణ, తదితరులు ఉన్నారు.



ఎన్నికల అధికారులకు పలు సూచనలు జారీ చేస్తున్న కృష్ణా కలెక్టర్ బాలాజీ

మతసామరస్యానికి ప్రతీక ఈద్ మిలాప్



ఈద్ మిలాప్‌లో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని నాని, కర్నూల్ ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, వైఎస్సార్ సీపీ పశ్చిమ అభ్యర్థి ఆసిఫ్, నిర్వాహకుడు మునీర్ అహ్మద్

వైఎస్సార్ సీపీ విజయవాడ పార్లమెంటు, తూర్పు అభ్యర్థులు కేశినేని శ్రీనివాస్, దేవినేని అవినాష్

లబ్బీపేట(విజయవాడతూర్పు): రంజాన్ తర్వాత మతసామరస్యానికి ప్రతీకగా ఈద్ మిలాప్ నిలుస్తుందని వైఎస్సార్ సీపీ విజయవాడ పార్లమెంటు, తూర్పు అసెంబ్లీ అభ్యర్థులు కేశినేని శ్రీనివాస్, దేవినేని అవినాష్ అన్నారు. అల్ మునీర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఈద్‌మిలాప్ కార్యక్రమం ఘనంగా జరిగింది. మహాత్మాగాంధీ రోడ్డులోని శ్రీ శేషసాయి కల్యాణ మండపంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు మునీర్ అహ్మద్ షేక్ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. దీనిలో కేశినేని శ్రీనివాస్, దేవినేని అవినాష్, వెల్లంపల్లి శ్రీనివాస్, షేక్ ఆసిఫ్‌లతో పాటు, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నెలరోజుల పాటు ఎంతో నిష్ఠగా ఉపవాసాలు పాటించి జరుపుకునే పండుగ రంజాన్ అన్నారు. కులం, మతం, వర్గం, వర్ణం ప్రాంతాల కతీతంగా మానవులంతా ఒక్కటే అందరి దేవుడు ఒక్కడే అనే విశ్వజనీన సుహృద్భావం ఈద్‌మిలాప్ సందేశంగా పేర్కొన్నారు. రాష్ట్రంలో అన్ని మతాలు, కులాలకు సమాన అవకాశాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పిస్తూ పారదర్శక పాలన సాగిస్తున్నట్లు తెలిపారు. అందరికీ అన్ని వేళలా అండగా ఉంటామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మత పెద్దలు రఫీక్‌సాహెబ్, ముఫ్తీ యూసఫ్ సాహెబ్, మతీన్, ఫారూఖ్ సాహెబ్, ముఖ్తియార్, మహిందర్‌సింగ్ సహాని, నత్తా బాలస్వామి, కసగోని దుర్గారావుగౌడ్, పాల భాగ్యరాజ్‌లతో పాటు, పలువురు కార్పొరేటర్లు, మత పెద్దలు పాల్గొన్నారు.



వేదికపై దేవినేని అవినాష్, కేశినేని నాని తదితరులు

వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్, వేమా రోజారమణి



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న విప్ సామినేని ఉదయభాను

కంచికచర్ల : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పేదవారి జీవితాల్లో వెలుగులు నింపుతుండటంతో పలువురు టీడీపీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి చేరుతున్నారని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. కంచికచర్ల ఇందిరాకాలనీ నుంచి 10 కుటుంబాలవారు బుధవారం టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్సీ అరుణకుమార్ కండువాలు కప్పి వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అరుణకుమార్ మాట్లాడుతూ నందిగామ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావును మరోసారి గెలిపించాలని కోరారు. టీడీపీ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో ఉప్పుతల జమలయ్య, బత్తుల ప్రసాద్, బత్తుల కోటి, తమ్మిశెట్టి శ్రీను, కుమార్, రాజు, బండి నాగరాజు, చంద్రగిరి వసంత్, బత్తుల వెంకటకోటయ్య, వేముల వెంకటేశ్వరరావు, చల్లా నాగేశ్వరరావు ఉన్నారు. వైఎస్సార్ సీపీ మండల, పట్టణ కన్వీనర్లు నన్నపనేని నరసింహారావు, వేమా సురేష్‌బాబు, సొసైటీ అధ్యక్షుడు కాలవ పెదబాబు, ఎంపీటీసీ సభ్యులు వేమా రోజారమణి, నాయకులు గుగులోతు శివనాయక్, వేముల గోపీ మోగులూరు జగన్‌మోహనరావు, యర్రంశెట్టి బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

మరో 25 కుటుంబాలు చేరిక...

నందిగామ టౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించేందుకు అన్ని పార్టీలు కలిసి కుట్ర పన్ని కట్టిన కూటమిని ప్రజలు విశ్వసించడం లేదని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో చందర్లపాడు మండలం గుడిమెట్ల, చింతలపాడు గ్రామాలకు చెందిన 25కుటుంబాలు మంగళవారం రాత్రి టీడీపీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. మరిబోయిన పెద్ద అంకమ్మ, నర్సింగుల నరసింహారావు, పూర్ణ, రంగ, కామా కోటేశ్వరరావు, కురగంటి నాగార్జున, కురగంటి నవీన్‌లతోపాటు పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్సీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. రాయల జానకి రామయ్య, గుడేటి శ్రీనివాసరావు, లక్ష్మీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో..

జగ్గయ్యపేట అర్బన్: పేట మండలం గౌరవరం గ్రామానికి చెందిన కనపర్తి ఏసుపాదం, కనపర్తి బుజ్జి, కనపర్తి ప్రభాస్, దారమళ్ల రాజేష్ టీడీపీని వీడి ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సమక్షంలో బుధవారం వైఎస్సార్ సీపీలోకి చేరారు. వారికి ఉదయభాను పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అదేవిధంగా ఇటీవల టీడీపీలో చేరిన గౌరవరం గ్రామానికి చెందిన కత్తుల రమేష్, ఆదూరి లక్ష్మణరావు, కత్తుల ఇశ్రాయేలు, గజ్జల బుజ్జి తిరిగి వైఎస్సార్ సీపీలో చేరారు.

వైభవంగా శ్రీరామచంద్రుని శోభాయాత్ర



విజయవాడ బీఆర్టీఎస్ రోడ్డులో జరిగిన శోభాయాత్ర



విజయవాడకల్చరల్: శ్రీ రామనవమి సందర్భంగా శ్రీరామ శోభాయాత్ర సమితి ఆధ్వర్యంలో దుర్గాపురంలోని బీఆర్టీఎస్ రోడ్డులో నిర్వహించిన బైక్ ర్యాలీ వైభవంగా సాగింది. తాళ్లాయపాలెం శైవ పీఠాధిపతి శివస్వామి ర్యాలీని ప్రారంభించారు. శారదా కళాశాలలోని ఆదిశంకరా మార్గ్‌లో ప్రారంభమైన శోభాయాత్ర, సంగీత కళాశాల, బీఆర్టీఎస్ రోడ్డు, సత్యనారాయణ పురం, ఏలూరు రోడ్డు మీదుగా సాగింది. జై శ్రీరాం అంటూ వందలాది మంది శోభాయాత్రలో పాల్గొన్నారు. శోభాయాత్ర కన్వీనర్ నాగలింగం శివాజీ మాట్లాడుతూ.. 500 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం వల్ల భవ్య రామమందిరం నిర్మాణం సాధ్యమైందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి

గూడూరు: విజయవాడ– మచిలీపట్నం జాతీయ రహదారిపై గూడూరు సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య అక్కడికక్కడే మృతి చెందగా, భర్త తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కృష్ణా జిల్లా తోట్లవల్లూరు మండలం గరికిపర్రు గ్రామానికి చెందిన బోలెం నాగమల్లేశ్వరరావు, శివకుమారి (55) మచిలీపట్నంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చూపించుకుని మధ్యాహ్నం 3 గంటల సమయంలో తోట్లవల్లూరు తిరుగు ప్రయాణమయ్యారు. గూడూరు సమీపంలో నర్సరీలో పూలమొక్కలు కొనుగోలు చేద్దామని ద్విచక్ర వాహనాన్ని గూడూరు సెంటరులో యూ టర్న్ తీసుకుని నర్సరీ వైపుగా కరెక్ట్ రూట్‌లో వెనక్కు బయల్దేరారు. అదే సమయంలో విజయవాడ నుంచి మచిలీపట్నం వైపు వచ్చే కారు అతివేగంగా వీరి ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీ కొట్టింది.

ద్విచక్ర వాహనాన్ని కొద్ది దూరం ఈడ్చుకుపోయింది. ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలైన శివకుమారి అక్కడిక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన నాగమల్లేశ్వరరావును తొలుత 108లో మచిలీపట్నం ఆస్పత్రికి ఆ తర్వాత అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం విజయవాడకు తరలించారు. ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన కారు అదే వేగంతో వెళ్లి మరో కారుని కూడా ఢీ కొట్టినట్లు పోలీసులు గుర్తించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శివకుమారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చిట్టీల పేరుతో మోసం

- నిర్వాహకుడు ప్రభుత్వ టీచర్ పుల్లయ్య
- జంక్షన్ నుంచి పరారు
- కేసు నమోదు

హనుమాన్‌జంక్షన్ రూరల్: చిట్టీల వ్యాపారం పేరుతో రూ.కోట్లలో సొమ్ము వసూలు చేసి పరారైన ప్రభుత్వ ఉపాధ్యాయుడు తురకా పుల్లయ్యపై హనుమాన్‌జంక్షన్ పోలీసులు కేసు నమోదు చేశారు. విజయవాడరోడ్డులో శ్రీలక్ష్మీ వెంకటేశ్వర చిట్‌ఫండ్స్ కంపెనీ ఏర్పాటు చేసి తోటి టీచర్లు, ఉద్యోగులను నుంచి రూ.కోట్లలో చిట్టీలు, డిపాజిట్లు కట్టించుకుని చివరికి ఉడాయించాడు. ఖాతాదారులంతా లబోదిబోమంటూ తురకా పుల్లయ్య బాధితుల సంఘంగా ఏర్పడి పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. బాధితుల ఫిర్యాదుపై ఐపీసీ సెక్షన్ 420, 406, ఏపీ ఆర్థిక సంస్థల డిపాజిట్ల రక్షణ చట్టం కింద తురకా పుల్లయ్య, ఆయన కుమారుడు అశోక్‌రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ ఏడీఎల్ జనార్దన్ బుధవారం తెలిపారు. పక్కా పథకం ప్రకారం ముందస్తుగా స్వచ్ఛంద ఉద్యోగ విరమణ (వీఆర్ఎస్) చేయటంతో పాటుగా, స్థిరాస్తులను ఇతరుల పేరిట బదలాయించి కుటుంబ సభ్యులతో సహా గ్రామం నుంచి పరారయ్యాడు. అతని ఆచూకీ తెలుసుకునేందుకు ఇప్పటికే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ చెప్పారు. ఇప్పటికే కొందరు బాధితులు పోలీసులను ఆశ్రయించగా, మిగిలిన బాధితుల వివరాలను కూడా పోలీసులు ఆరా తీస్తున్నారు.

క్లుప్తంగా

దేవుని దయతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి



గుణదల (విజయవాడ తూర్పు): శ్రీరాముని కృపా వీక్షణతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని వైఎస్సార్ సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ ఆకాంక్షించారు. గుణదల గాంధీబొమ్మ సెంటర్‌లో గల రామాలయంలో శ్రీరామనవమి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న అవినాష్ మాట్లాడుతూ దేవుని దయ వలన రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని కోరారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. పేదల సంక్షేమానికి జగనన్న కృషి చేశారని వివరించారు. ప్రజా సమస్యలు పరిష్కరించి మౌలిక వసతులు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేసిందని తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి సాధించాలంటే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావాలని చెప్పారు. అనంతరం సీతారామ కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. పానకం తయారీకి యువకులతో కలసి రోకళ్లతో బెల్లాన్ని దంచారు. ఈ కార్యక్రమంలో 3వ డివిజన్ కార్పొరేటర్ భీమిశెట్టి ప్రవల్లిక, వైఎస్సార్ సీపీ నాయకులు గణేష్, లక్ష్మణరావు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



విజయవాడకల్చరల్: గీతాంజలి మ్యూజిక్స్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. డాక్టర్ జయంతి చక్రవర్తి, డాక్టర్ దామోదర గణపతిరావు ఆధ్వర్యంలో గాయనీ గాయకులు సుశీల్ కుమార్, వెంకటేశ్వరరావు, భారతి, సౌజన్య, రూపశ్రీ భక్తి గీతాలతో పాటు పలు తెలుగు, హిందీ చిత్ర గీతాలను ఆలపించారు. సంస్థ వ్యవస్థాపకుడు జయంతి చక్రవర్తి సంస్థ భవిష్యత్ లక్ష్యాలను వివరించారు. డాక్టర్ దామోదర గణపతిరావు మాట్లాడుతూ సంస్థ ద్వారా నూతన గాయనీ గాయకులకు వేదిక కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు పరచూరి విజయలక్ష్మి, ప్రసూనా రామన్, బి.వీరభద్రరావు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు కొనసాగించే వారికే ఓటేయాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించే వారికే ఈ ఎన్నికల్లో ఓటు వేయాలని మాల మహానాడు మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ మంచా నాగమల్లేశ్వరి పిలుపునిచ్చారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ చంద్రబాబుకు దళితులంటే చులకన అన్నారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే దళితులను అవమానించారని గుర్తుకు చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడ నగరం నడిబొడ్డులో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసి దళితుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టారన్నారు. వైఎస్ జగన్ తన పాలనలో అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించారన్నారు. దళితులంతా వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

పెనమలూరు: పోరంకి గ్రామంలోని అపార్టుమెంట్‌లో పేకాటాడుతున్న 16 మందిని పోలీసులు బుధవారం అరెస్టు చేశామని ఎస్‌ఐ శేషుకుమార్ తెలిపారు. శ్రావణ ఎన్‌క్లేవ్‌లో పేకాటాడుతున్నారన్న సమాచారంతో దాడి చేశామని పేర్కొన్నారు. 16 మందిని అదుపులోకి తీసుకొని రూ. 54,300 సొమ్ము స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని చెప్పారు.

కనులపండువగా సీతారాముల కల్యాణం

కృష్ణలంక(విజయవాడతూర్పు):శ్రీరామనవమి సందర్భంగా కృష్ణలంక, పాత పోలీస్ రోడ్డులోని కోదండరామ స్వామి దేవస్థానంలో బుధవారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేద పండితులు సీతారాముల స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి సీతారాముల వారి కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. భక్తులకు పానకం, వడపప్పు పంపిణీ చేశారు.

రామాలయంలో అవినాష్ ప్రత్యేక పూజలు

శ్రీరామనవమి సందర్భంగా రాణిగారితోటలోని శ్రీ కోదండ రామాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం శ్రీరామనవమి ఉత్సవాలు కనులపండువగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవ విగ్రహాలకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి దంపతుల చేత కల్యాణం జరిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు సీతారామచంద్రులను దర్శించుకుని కల్యాణాన్ని కనులారా తిలకించారు. వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ సీతారామచంద్రులను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. అవినాష్ మాట్లాడుతూ త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించాలని, సీతారాముల ఆశీర్వచనాలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఎల్లప్పుడు ఉండేలా దీవించాలని ప్రార్థించినట్లు తెలిపారు. భక్తులకు వడపప్పు, పానకం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 17వ డివిజన్ కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి, ఆలయ కమిటీ ప్రెసిడెంట్ కె.నాగేశ్వరరావు, బిక్షాలురెడ్డి, డి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పటమటలో ఘనంగా నవమి వేడుకలు

పటమట(విజయవాడతూర్పు):శ్రీరామనవమి వేడుకలు పటమటలో ఘనంగా నిర్వహించారు. ఎలక్ట్రిసిటీ కాలనీ ఎనిమిదోలైన్ నల్లూరు చక్రదర్ రావు వీధిలో పంచముఖ ఆంజనేయస్వామి గుడిలో కాలనీవాసులు, కమిటీ సభ్యులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. వేదికపై రాములవారి ఉత్సవ విగ్రహాలు ఏర్పాటు చేసి మేళతాళాలతో కనులపండువగా కల్యాణం చేశారు. వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదమూడేళ్లుగా కమిటీ సభ్యులు, కాలనీ వాసులు నవమి వేడుకలు ఘనంగా నిర్వహించటం అభినందనీయమని పేర్కొన్నారు. కమిటీ సభ్యులు నల్లూరి కాశీ మాట్లాడుతూ పదేళ్ల నుంచి కాలనీలో నూతన ఆలయం నిర్మించుకోవాలని తలపెట్టిన తమ కోరిక ఈ ఏడాది తీరిందన్నారు. నూతన ఆలయంలో కృష్ణశిలతో విగ్రహాన్ని తయారుచేయించటం ఆలయ ప్రత్యేకను చాటుతుందన్నారు. ఈ నెల 21వతేదీన విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నామన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిటీ సభ్యులు గర్నేని చలపతిరావు, గద్దె తిలక్, పి. మధుసూదన్‌రావు, నల్లూరి అఖిల్ తదితరులు పాల్గొన్నారు.





రాణిగారితోటలోని కోదండ రామాలయంలో సీతారాముని ప్రత్యేక పూజలో దేవినేని అవినాష్, నవమి పూజలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ



కోదండ రామాలయంలో రాములోరి కల్యాణం చేస్తున్న అర్చకులు

వైభవంగా సీతారాముల కల్యాణం

కృష్ణలంక(విజయవాడతూర్పు):కృష్ణలంక, మెట్లబజార్‌లోని వాసవీ కల్యాణ మండపంలో వాసవీ సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. దంపతులు పాల్గొని సామూహికంగా కల్యాణాన్ని జరిపించారు. ఈ సందర్భంగా నూతన దంపతులకు వస్త్రాలు బహూకరించారు. భక్తులు కల్యాణాన్ని కనులారా తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను పలు వీధుల్లో ఊరేగించారు. వాసవీ సేవా సంఘం అధ్యక్షుడు మానేపల్లి మాణిక్యాలరావు, ప్రధాన కార్యదర్శి గొంట్ల రామ్మోహనరావు, కోశాధికారి చందలూరి వెంకట సుబ్బారావు, సభ్యులు మట్టా సుబ్బారావు, చేగు తిరుపతి రావు, మల్లిఖార్జునరావు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజల్లో డెప్యూటీ మేయర్

ఆటోనగర్ (విజయవాడ తూర్పు): శ్రీరామనవమి సందర్భంగా పలు చోట్ల ఏర్పాటుచేసిన రాములవారి మండపాల్లో బుధవారం డెప్యూటీ మేయర్ బెలం దుర్గ ప్రత్యేక పూజలు చేశారు. తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్, ఎంపీ అభ్యర్థి కేశినేని నాని గెలవాలని పూజించినట్లు ఆమె తెలిపారు. గాంధీనగర్‌లో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. మాజీ డెప్యూటీ మేయర్ ఆళ్ళ చెల్లా రావు, పార్టీ డివిజన్ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

బృందావనకాలనీలో నవమి వేడుకలు

లబ్బీపేట(విజయవాడతూర్పు):బృందావనకాలనీ అనంత్ డైమండ్స్ షోరూమ్ వద్ద బుధవారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం షోరూమ్‌కు వచ్చే కస్టమర్స్‌కు, టిక్కిల్‌రోడ్డులో రాకపోకలు సాగించే సుమారు 1500 మందికి పానకం, ప్రసాదాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో షోరూమ్ అధినేతలు జాస్తి వెంకట భానుప్రకాష్, విష్ణుప్రియ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాలు కిటకిట

విజయవాడకల్చరల్: శ్రీ రామనవమి సందర్భంగా నగరంలోని పలు దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. 80 సంవత్సరాలుగా అవిచ్ఛంగా సాగుతున్న సీతారామ కల్యాణాన్ని శివరామ కృష్ణ క్షేత్రంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. క్షేత్ర ధర్మాధికారి శిష్ట్లా హనుమత్ ప్రసాద్ నిర్వహణలో రుత్వికులు కల్యాణోత్సవాన్ని జరిపారు. ఆయన మాట్లాడుతూ.. 73 రోజులుగా దేవాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న వేడుకలు గురువారంతో ముగుస్తాయని తెలిపారు.

లబ్బీపేట శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో..

కంచికామకోటి పీఠపాలిత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీ రామనవమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



దేవినేని అవినాష్‌ను ఆశీర్వదిస్తున్న అర్చకులు



రామకోటిలో సీతారామ కల్యాణం నిర్వహిస్తున్న పండితులు



భక్తులకు పానకం, ప్రసాదాలు అందిస్తున్న దృశ్యం



సీతారాముల కల్యాణంలో పాల్గొన్న దంపతులు

అవినాష్, కేశినేని నాని గెలుపే లక్ష్యంగా..

- తూర్పులో అవినాష్‌కు విశేష ప్రజాదరణ
- వివక్షకు తావు లేకుండా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు
- పదేళ్లలో గద్దె చేసింది ఏమీ లేదు
- సొంత ప్రచారం తప్ప ప్రజలకేమీ చేయలేదంటున్న ప్రజలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): నాలుగున్నరేళ్లగా అన్ని రకాలుగా అండగా ఉన్న దేవినేని అవినాష్ వెంటే నడుస్తామని తూర్పు నియోజకవర్గ ప్రజలు ముక్తకంఠంతో నినదిస్తున్నారు. అర్ధరాత్రి ఆపదవస్తే అన్నా అని ఫోన్ చేస్తే పలికే నాయకుడికే అండగా ఉంటామని అంటున్నారు. నియోజకవర్గంలో వివక్షకు తావులేకుండా రూ.2 వేల కోట్లతో సంక్షేమం పథకాలు అందించి, అభివృద్ధి పనులు చేపట్టిన దమ్మున్న నేతకు మద్దతుగా నిలుస్తామని చెబుతున్నారు. నియోజకవర్గంలోని 21 డివిజన్‌లలో ఏ ప్రాంతానికి వెళ్లినా అభివృద్ధి కళ్లకు కనిపిస్తుందనీ, ఏ ఇంటికి వెళ్లినా తమకు నాలుగైదు సంక్షేమ పథకాలు అందాయని మహిళలు ఆనందంగా వెల్లడిస్తున్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా దేవినేని అవినాష్, ఎంపీగా కేశినేని శ్రీనివాస్ (నానీ)లను గెలిపించడమే తమ ముందున్న లక్ష్యమంటున్నారు.

వివక్షకు తావులేదు....

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సి వచ్చేది. వారి ఇళ్ల చుట్టూ తిరిగితే కానీ వచ్చేవి కాదు. కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎవరి చుట్టూ తిరిగాల్సిన అవసరం లేకుండా, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించారు. వలంటీర్ ఇంటికి వచ్చి కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా అందరికీ సంక్షేమ పథకాలు అందించారు. అలా విజయవాడ తూర్పు నియోజకవర్గంలో ఐదేళ్లలో రూ.924 కోట్లు సంక్షేమ పథకాలు ప్రజలకు అందాయి. దీంతో లబ్ధిదారులు అవినాష్‌కు జై కొడుతున్నారు.



పటమటలంకలో మంచంలో ఉన్న వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న దేవినేని అవినాష్

అన్ని ప్రాంతాలు అభివృద్ధి.....

గత టీడీపీ ప్రభుత్వంలో వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు ఉన్న డివిజన్‌లలో అభివృద్ధిని విస్మరించారు. కేవలం టీడీపీ కార్పొరేటర్లు ఉన్న ప్రాంతాల్లోనే అభివృద్ధి చేశారు. కానీ నేడు నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లను సమాంతరంగా అభివృద్ధి చేశారు. అంతేకాదు టీడీపీ కార్పొరేటర్లు ఉన్న డివిజన్‌లలోనే మరింత ఎక్కువ అభివృద్ధి చేశారు. మా ప్రాంతంలో పలానా పని కావాలని అవినాష్‌ను కలిస్తే చాలు వాళ్లు ఏ పార్టీ వాళ్లో కూడా చూడకుండా, కోరిన పనిని సత్వరమే పూర్తి చేయించారు. మంచి పనులు చేయడంతో అందరి నోళ్లలో అవినాష్ గెలవాలనే మాటే వినిపిస్తుంది.

అన్నా అంటే అండగా...

నియోజకవర్గంలో ఏ ప్రాంతం వారికైనా అర్ధరాత్రి సమయంలో ఆపద వచ్చినా అన్నా అంటూ ఫోన్ చేస్తే చాలు అండగా నిలుస్తూ వచ్చారు. అర్ధరాత్రి సమయంలో ఏదైనా సంఘటన జరిగితే వెంటనే అక్కడకు చేరుకునే వారు. తన తండ్రి దేవినేని రాజశేఖర్ నెహ్రూ పేరుతో ట్రస్టును ఏర్పాటు చేసి విద్య, ఉపాధి, వైద్య అవసరాలకు విరివిగా సహాయం అందచేశారు. అలా నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతానికి ట్రస్టు తరపున సాయం అందించారు.

పదేళ్లలో గద్దె ఏమి చేశారు...

తూర్పుకు పదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న గద్దె రామ్మోహన్ చేసిన అభివృద్ధి ఏమీ లేదు. నియోజకవర్గంలో అభివృద్ధి కంటే సొంత ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారని ప్రజలు అంటున్నారు.

ఆయన ఉండే సొంత డివిజన్, దత్తత తీసుకున్న డివిజన్‌లలో సైతం అభివృద్ధి చేసిందేమి లేదంటున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రస్తుతం 12, 15,16 డివిజన్‌లలో అభివృద్ధి చేశారని ప్రజలు చెబుతున్నారు. ప్రజల సమస్యలు పట్టని గద్దెకు ఈ సారి బుద్ధి చెబుతామంటున్నారు.

అవినాష్‌ను గెలిపించుకుంటాం



నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటూ, అభివృద్ధి, సంక్షేమం అందించిన అవినాష్‌ను గెలిపించుకునేందుకు తూర్పు ప్రజలు ఎదురు చూస్తున్నారు. తన తండ్రి పేరిట ట్రస్టు ఏర్పాటు చేసి ఎందరికో సాయం అందించారు. అలాంటి నాయకుడే తూర్పు నియోజకవర్గానికి అవసరం. షో రాజకీయాలు చేసే వారికి బుద్ధి చెబుతాం.

–పాల ఝాన్సీలక్ష్మి, మాజీ కార్పొరేటర్

అభివృద్ధి చేసిన వారికే ఆదరణ



విజయవాడ తూర్పులో అభివృద్ధి చేసిన వారికే పట్టం కట్టేందుకు ఎదురు చూస్తున్నారు. ఏ ప్రాంతానికి వెళ్లినా అభివృద్ధి కళ్లకు కనిపిస్తుంది. టీడీపీ నేతలు గుడ్డివారిలా మాట్లాడుతున్నారు. ప్రజలకు మంచి చేసిన, మంచి మనస్సున్న అవినాష్‌ను, కేశినేని శ్రీనివాస్‌ను గెలిపించడమే లక్ష్యంగా ప్రజలంతా నిర్ణయించుకున్నారు.

–గల్లా పద్మావతి, డైరెక్టర్, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్

లేబర్‌కాలనీ గ్రౌండ్‌లో ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న విద్యాశ్రీ, నానయ్య చౌదరి

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి బైపాస్ రోడ్ పక్కన, సితార సెంటర్ సమీపంలోని విద్యాధరపురం లేబర్‌కాలనీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సమ్మర్ స్పెషల్ ఎగ్జిబిషన్‌ను బుధవారం సాయంత్రం నిర్వాహకులు గరిమెళ్ల విద్యాశ్రీ, నానయ్య చౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైపూర్ పింక్ ప్యాలెస్ నమూనా ముఖద్వారంతో ఎంతో ఆకర్షణీయంగా ఈ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. వేసవి కాలంలో పిల్లలు, పెద్దలకు సాయంత్రం సమయంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆట విడుపుగా ఉంటుందని తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం 6 గంటల నుంచి 10 గంటల వరకు ఉండే ఈ ఎగ్జిబిషన్‌లో జైంట్ వీల్, మేరి కొలంబస్, బ్రేక్ డాన్స్, డ్రాగన్ ట్రెన్, ఇండియన్ టోరా టోరా, ఇటాలియన్ ఐటెమ్స్ వంటి ప్రత్యేకమైన ఆట వస్తువులు ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే బెడ్ షీట్స్, బెంగాలీ కాటన్ శారీస్, లక్నో శారీస్, నైటీస్, హ్యాండ్లూమ్స్, హ్యాండీక్రాఫ్ట్స్ స్టాల్స్‌తోపాటు అనేక రకాల ఫుడ్ స్టాల్స్‌కూడా ఎగ్జిబిషన్‌లో ఉన్నాయని వివరించారు. ప్రతి రోజూ సాయంత్రం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై సాంస్కృతిక ప్రదర్శనలు జరుగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా నాట్యాచార్యులు సప్పా శివకుమార్ శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం అలరించింది.



నృత్యం చేస్తున్న కళాకారులు

నెమలిలో వైభవంగా విగ్రహ ఆవిర్భావ దినోత్సవం

నెమలి(గంపలగూడెం): నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం విగ్రహ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 1952లో శ్రీరామ నవమి రోజు స్వామి భూమి నుంచి ఆవిర్భవించి భక్తులకు దర్శనం ఇచ్చారు. దీంతో ప్రతి ఏటా విగ్రహ ఆవిర్భావ వేడుకలను నిర్వహిస్తారు. తెల్లవారు ఝామున సుప్రభాత సేవతో ప్రత్యేక కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలాచార్యులు, అర్చక బృందంచే ప్రారంభించారు. స్వామి మూలవిరాట్‌కు పంచామృతాలు, నవఫల రసాలతో అభిషేకం కనులవిందుగా జరిపారు. అనంతరం నూతన వస్త్రాలు, సువర్ణాభరణాలు, వివిధ రకాల పూల మాలలతో అలంకరణ చేయగా భక్తులు స్వామిని దర్శించుకొని తరించారు. మధ్యాహ్నం రాజ్యలక్ష్మీదేవి సామూహిక కుంకుమార్చన చేశారు. సంప్రదాయబద్ధంగా తొమ్మిది రకాల ప్రత్యేక ప్రసాదాలను తయారుచేసి స్వామికి నివేదన సమర్పించారు. అనంతరం వాటిని భక్తులకు వితరణ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కావూరి శశిరేఖ, పాలకవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో నెమలి వేణుగోపాలుడు

దేవినేని నెహ్రూకు ఘన నివాళి

గుణదల(విజయవాడ తూర్పు): నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, విలువలు గల రాజకీయాలకు కట్టుబడి దేవినేని రాజశేఖర్ నెహ్రూ పనిచేశారని ఆయన తనయుడు వైఎస్సార్ సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ తెలిపారు. గుణదలలోని పార్టీ కార్యాలయంలో దేవినేని నెహ్రూ వర్ధంతి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవినేని కుటుంబ సభ్యులు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. దేవినేని అవినాష్ మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం దేవినేని నెహ్రూ పనిచేశారని గుర్తు చేశారు. కృష్ణా జిల్లాలో ఐదు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజాసేవ చేసిన రికార్డును దేవినేని నెహ్రూ సొంతం చేసుకున్నారని తెలిపారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని ఎందరో రాజకీయనేతలుగా ఎదిగారని పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రజాసేవ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. అనంతరం గుణదల రైల్వే స్టేషన్ సమీపంలోని దేవినేని నెహ్రూ ఘాట్ వద్దకు చేరుకుని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ వెంకట సత్య నారాయణ, సీనియర్ నాయకులు కడియాల బుచ్చిబాబు, కార్పొరేటర్లు కలపాల అంబేడ్కర్, భీమిశెట్టి ప్రవల్లిక, అంబడిపూడి నిర్మలకుమారి తదితరులు పాల్గొన్నారు.



నెహ్రూ కు నివాళులర్పిస్తున్న దేవినేని అవినాష్

మద్యం షాపు ఉద్యోగిపై దాడి

పెనమలూరు: గోసాల ప్రభుత్వ మద్యం షాపులో పని చేసే వ్యక్తిపై ఇద్దరు వ్యక్తులు దాడి చేయడంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ.రామారావు తెలిపిన వివరాల ప్రకారం గోసాల మద్యం షాపులో కంకిపాడుకు చెందిన చిలుకూరు సాయిగోపాల్ సేల్స్‌మెన్‌గా పని చేస్తున్నాడు. అయితే కంకిపాడుకు చెందిన ఎస్.నాగరాజు, ధర్మతేజ వచ్చి మద్యం అడిగారు. వారు అడిగిన మద్యం బ్రాండ్ లేకపోవడంతో ఆగ్రహంతో సాయిగోపాల్‌పై దాడి చేశారు. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

పచ్చవన్నె మేధావులు

సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ముసుగులో చంద్రబాబుకు కొందరు రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్‌ల ఊడిగం

- వారికున్నది రాష్ట్రంపై ప్రేమ కాదు.. సీఎం జగన్‌పై కక్ష
- ముఖ్యమంత్రిపై బురద జల్లడమే వారి ఎజెండా
- సర్వీసులో ఉన్నప్పుడే చంద్రబాబు కోసం పరితపించిన 'నిమ్మగడ్డ'
- చట్ట పరిధిని దాటి స్థానిక ఎన్నికల్లో టీడీపీకి గులాంగిరి
- సీబీఐ డైరెక్టర్‌గా పనికిరాడని సుప్రీంకోర్టు తేల్చిన వ్యక్తి నాగేశ్వరరావు
- సర్వీసు పొడిగించలేదనే అక్కసుతో విషం కక్కుతున్న మరో మేధావి పీవీ రమేష్
- ఇప్పుడు వీళ్లంతా రాష్ట్రంలో ప్రజాస్వామ్య పరిరక్షకుల అవతారం
- సొంత ప్రయోజనాలు, రాజకీయ ఎజెండాతో ఇష్టారాజ్యంగా అవాకులు చవాకులు

ప్రజాస్వామ్య పరిరక్షణ ముసుగులో కొందరు రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్‌లు నిత్యం సీఎం వైఎస్ జగన్ పైనా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపైనా కక్ష పూరితమైన ఆరోపణలు చేస్తూ ప్రజాస్వామ్య భక్షకులుగా మారడం మేధావులను నివ్వెరపరుస్తోంది. వీళ్లు నిజంగా సివిల్ సర్వీసుల్లో పనిచేసిన అధికారులేనా అని అనుమానం వచ్చేలా వారి వ్యవహారశైలి ఉంటోంది. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ పేరుతో చంద్రబాబుకు అనుకూలంగా, వైఎస్ జగన్‌పై మితిమీరిన అక్కసుతో వారు చేస్తున్న ఆరోపణలు సమాజాన్నే తప్పుదోవ పట్టించడానికేనన్నది స్పష్టమవుతోంది. రాజకీయ నాయకులు, గల్లీ లీడర్ల మాదిరిగా ఎల్లో మీడియాలో వారు చేస్తున్న రచ్చను చూసిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇంతకాలం తాము కలిసి పనిచేసింది ఇంతలా దిగజారిన మనుషులతోనా అని ఆశ్చర్యపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, సీఎం జగన్‌పై అదే పనిగా అక్కసు వెళ్లగక్కుతున్న వీరి నిజస్వరూపం తెలుసుకోండి. - సాక్షి, అమరావతి

సిటిజన్ ఫర్ డెమోక్రసీ కార్యదర్శిగా పనిచేస్తున్న నిమ్మగడ్డ రమేష్‌కుమార్ 2021 వరకు మన రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా పనిచేశారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఈయనను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ బాధ్యతలకు సిఫార్స్ చేశారు. అప్పట్లో పంచాయతీల సర్పంచుల పదవీ కాలం 2018 ఆగస్టుతో ముగిసినప్పటికీ.. చంద్రబాబు రాజకీయ ప్రయోజనాలు ఎక్కడ దెబ్బతింటాయోనని నిమ్మగడ్డ అప్పట్లో వాటిని నిర్వహించలేదు. ఇక 2019లో జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలన్నింటినీ ఒకే విడతలో నిర్వహించాలని 2020 ఫిబ్రవరి–మార్చి నెలల్లో నోటిఫికేషన్ జారీచేయగా.. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ముగిసేసరికి అధికారిక వైఎస్సార్‌సీపీకే దాదాపు సగం స్థానాలు ఏకగ్రీవంగా గెలిచే పరిస్థితి ఉండడంతో ప్రభుత్వానికి కనీసం ముందస్తు సమాచారం కూడా ఇవ్వకుండా కరోనా పేరుతో వాటిని అర్ధంతరంగా వాయిదా వేసి వివాదానికి కేంద్ర బిందువయ్యారు. ఇక జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన వలంటీర్లు–గ్రామ సచివాలయాల వ్యవస్థల ద్వారా నాలుగున్నర ఏళ్లుగా రాష్ట్రంలో పింఛన్ల పంపిణీ సహా అన్ని ప్రభుత్వ పథకాలను ప్రజల గడప వద్దకే తీసుకొస్తే.. నిమ్మగడ్డ రమేష్‌కుమార్ సిటిజన్ ఫర్ డెమోక్రసీ పేరున వలంటీర్ల వ్యవస్థకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు, ఢిల్లీ హైకోర్టుతో పాటు రాష్ట్ర హైకోర్టులోనూ కేసులు వేశారు. ఈయన ఫిర్యాదు కారణంగా అవ్వాతాతల పింఛన్లను ఇంటివద్దే పంపిణీ చేసే ప్రక్రియకు బ్రేకులు పడ్డాయి.

తాను ఆశించిన విధంగా సర్వీసు పొడిగింపు ఇవ్వలేదని అక్కసుతో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పీవీ రమేష్ సీఎం జగన్‌పై కక్ష పెంచుకుని నిమ్మగడ్డ బృందంతో చేతులు కలిపారు. తనను తాను మేధావిగా ఊహించుకునే ఈయన రిటైరైన వెంటనే సిగ్గూఎగ్గూ లేకుండా ప్రభుత్వ కాంట్రాక్టులు చేసే ఒక కార్పొరేట్ కంపెనీలో చేరాడు. తన పలుకుబడిని ఆ కంపెనీ కోసం ఉపయోగిస్తానని చెప్పి ఉద్యోగం దక్కించుకున్న ఈయన ఇప్పుడు ప్రజాస్వామ్య పరిరక్షణ గురించి చిలక పలుకులు చెబుతున్నారు.





పీవీ రమేష్



నిమ్మగడ్డ రమేష్‌కుమార్



మన్నెం నాగేశ్వరరావు

ఈయన అత్యంత అవినీతిపరుడు.. వాదాస్పద రిటైర్డ్ ఐపీఎస్ అధికారి. దేశంలోనే అత్యున్నత దర్యాప్తు సంస్థ సీబీఐ డైరెక్టర్ జనరల్ (డీజీ)గా చేసిన ఈయన యథేచ్ఛగా అవినీతికి పాల్పడ్డారు. బీహార్‌లో ఓ ప్రభుత్వ వసతి గృహంలో బాలికపై అత్యాచారం కేసులో దర్యాప్తు అధికారిని హఠాత్తుగా బదిలీ చేయడం ద్వారా నిందితులకు ఈయన కొమ్ముకాశారన్నది తేలింది. ఈ కేసును ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్న సుప్రీం కోర్టు ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ మరీ ఈయన దర్యాప్తు అధికారిని బదిలీ చేయడం గమనార్హం. దీంతో సుప్రీంకోర్టు ఆదేశాలతో కేంద్ర ప్రభుత్వం నాగేశ్వరరావును సీబీఐ డైరెక్టర్ పదవి నుంచి తొలగించి ఫైర్ సర్వీసెస్, హోంగార్డు విభాగానికి బదిలీ చేసింది. నిజానికి..

- నాగేశ్వరరావు ఎక్కడ ఏ పోస్టులో ఉన్నా యథేచ్ఛగా అవినీతికి పాల్పడ్డారు.
- ప్రముఖ ఇంగ్లీష్ వెబ్‌సైట్ 'ద వైర్'తోపాటు జాతీయ మీడియా ఆయన అవినీతి బాగోతాలను ఎన్నోసార్లు బయటపెట్టింది.
- అప్పట్లో సీబీఐ డీజీగా ఉన్న అలోక్ శర్మ, ప్రత్యేక డైరెక్టర్‌గా రాకేశ్ ఆస్థానా మధ్య విభేదాలు ఏర్పడటంతో మధ్యేమార్గంగా ఎం.నాగేశ్వరరావును సీబీఐ డైరెక్టర్‌గా నియమించారు. అప్పట్లో చీఫ్ విజిలెన్స్ కమిషనర్ (సీవీసీ)గా ఉన్న కేవీ చౌదరి అండదండలతోనే ఈయనకు ఆ పదవి దక్కిందని కేంద్ర హోంశాఖ వర్గాల సమాచారం.
- ఇక ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో ఫైర్ సర్వీసెస్ డీజీగా ఉన్నప్పటి నుంచే ఈయనపై తీవ్రమైన అవినీతి ఆరోపణలున్నాయి.
- అలాగే, 2018లో సీబీఐ చెన్నై జోన్ డైరెక్టర్‌గా ఉండగా ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్న కేసుల్లో అభియోగాలు ఎదుర్కొంటున్న 70మంది ఐఆర్ఎస్ అధికారుల నుంచి భారీగా ముడుపులు తీసుకుని వారికి అనుకూలంగా వ్యవహరించారనే తీవ్రమైన ఆరోపణలు ఈయనపై వచ్చాయి. దీంతో ఆయన్ని అప్పట్లోనే హఠాత్తుగా బదిలీచేశారు.
- ఇక నాగేశ్వరరావు తన భార్య పేరుతో ఏకంగా ఓ షెల్ కంపెనీలో భాగస్వామిగా భారీగా అక్రమ నిధులు తరలించారు. వాటితో ఆమె గుంటూరు జిల్లాలో భూములు కొనుగోలు చేశారన్నది వెలుగులోకి రావడం అప్పట్లోనే సంచలనం సృష్టించింది. ఆమె ఆ షెల్ కంపెనీలోని 100 షేర్లను కేవలం రూ.వెయ్యికి కొనుగోలు చేసి వాటిని వెంటనే భారీ విలువకు విక్రయించడం గమనార్హం. ఆ షెల్ కంపెనీ షేర్ల ముసుగులోనే భారీ అవినీతికి పాల్పడినట్టు వెల్లడైంది.
- అంతేకాదు.. ఒడిశాలోని ఖుర్దాలో ఫోర్జరీ పత్రాలతో ఓ ప్రభుత్వ భూమిని కొనుగోలు చేసినట్లు చూపించి భూకబ్జాకు తెగబడ్డారు.
- బెంగాల్‌లో సంచలనం సృష్టించిన శారదా చిట్‌ఫండ్ కుంభకోణంలో కూడా నిందితులకు అనుకూలంగా నాగేశ్వరరావు వ్యవహరించడంతోనే ఆయన్ని కేంద్ర ప్రభుత్వం బదిలీ చేసింది.
- సీబీఐ డైరెక్టర్ పోస్టుకు నాగేశ్వరరావు అనర్హుడని కోర్టు తేల్చడంతో కేంద్ర ప్రభుత్వం ఆయన్ను ఆ పోస్టు నుంచి తొలగించింది.
- ఇలా తన పదవిని దుర్వినియోగం చేశాడని కోర్టు ఛీవాట్లు పెట్టిన ఆ అధికారి రిటైర్ అయ్యాక ప్రజాస్వామ్య పరిక్షరణ ఉద్ధారకుడి అవతారమెత్తి వైఎస్ జగన్‌పై ఆరోపణలు చేస్తుండడం, అది కూడా చంద్రబాబుకి మద్దతుగా చేస్తుండడాన్ని ఎలా చూడాలి? వీళ్ల నినాదం సేవ్ ఫర్ డెమొక్రసీ.. కానీ, వీరు సేవ్ ఫర్ చంద్రబాబు కోసం పనిచేస్తున్నారు.

'సెకీ' ఒప్పందానికి 'ఏపీఈఆర్సీ' గ్రీన్ సిగ్నల్

సోలార్ ఎనర్జీ కార్పొరేషన్‌తో ఏపీ ప్రభుత్వం, డిస్కంల ఒప్పందం

- యూనిట్ రూ.2.49 చొప్పున 7 వేల మెగావాట్ల సౌర విద్యుత్ కొనుగోలు
- పాతికేళ్ల పాటు వ్యవసాయ అవసరాల కోసం రైతులకు నిరంతర ఉచిత విద్యుత్తు
- ఈ ఏడాది నుంచి 3 వేల మెగావాట్లు, వచ్చే ఏడాది నుంచి మరో 3 వేలు
- ఆ తర్వాత ఏడాది నుంచి మరో వెయ్యి మెగావాట్లు సరఫరా
- సెకీతో ఒప్పందం వల్ల ఏటా దాదాపు రూ.3,750 కోట్లు ఆదా
- టీడీపీ హయాంలో చంద్రబాబు తప్పుల వల్ల ఏడాదికి రూ.3,500 కోట్ల భారం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వ్యవసాయానికి నిరంతరం ఉచిత విద్యుత్‌ను సరఫరా చేయడానికి వైఎస్ జగన్ ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ (సెకీ)తో చేసుకున్న త్రైపాక్షిక (ట్రై పార్టీ) ఒప్పందానికి ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) ఆమోదం తెలిపింది. ఈ ఏడాది అక్టోబర్ నుంచి 3 వేల మెగావాట్లు, 2025 అక్టోబర్ నుంచి మరో 3 వేల మెగావాట్లు, 2026 అక్టోబర్ నుంచి మరో వెయ్యి మెగావాట్లు చొప్పున సెకీ నుంచి మూడు విడతల్లో మొత్తం 7 వేల మెగావాట్ల సౌర విద్యుత్ కొనుగోలుకు ప్రభుత్వం, మూడు డిస్కంలు 2021 డిసెంబర్ 1న ఈ ఒప్పందం చేసుకున్నాయి. సోలార్ పవర్ డెవలపర్లు రాజస్థాన్‌లో ఏర్పాటు చేస్తున్న యూనిట్ల నుంచి ఈ విద్యుత్ సేకరణ కోసం లెవలైజ్డ్ టారిఫ్ 25 సంవత్సరాలకు ట్రేడింగ్ మార్జిన్‌తో సహా యూనిట్‌కు రూ.2.49 చొప్పున చెల్లించేందుకు కూడా ఏపీఈఆర్సీ ఆమోదం తెలిపింది. ఈ సేకరణ ఖర్చు రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది. దీంతో రైతులకు ఉచిత విద్యుత్ సరఫరా కోసం సెకీ ద్వారా సౌర విద్యుత్ కొనుగోలుకు చట్టబద్ధంగా అన్ని ప్రక్రియలు పూర్తయ్యాయి.

ఒప్పందంతో ప్రయోజనాలు ఇలా

రాత్రనక, పగలనకా రైతులు పొలాల్లో విద్యుత్ కోసం పడిగాపులు కాస్తూ, ప్రాణాలు పోగొట్టుకున్న చీకటి రోజుల నుంచి విముక్తి కలిగిస్తూ పగటిపూటే నిరంతరాయంగా తొమ్మిది గంటలు ఉచిత విద్యుత్ అందిస్తోంది వైఎస్ జగన్ ప్రభుత్వం. వ్యవసాయానికి విద్యుత్‌ను తమ హక్కుగా రైతులు భావించేలా చర్యలు చేపడుతూ, రానున్న 30 ఏళ్లలో అన్నదాతలకు ఎలాంటి విద్యుత్ కష్టాలు లేకుండా చేయడం కోసం సౌర విద్యుత్‌ను సమకూరుస్తోంది. ప్రైవేటు వ్యక్తుల నుంచి కాకుండా, వంద శాతం కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ, 'ఏఏఏ' రేటింగ్ కలిగిన సెకీ నుంచి 7 వేల మెగావాట్లు తీసుకుని 2024 నుండి దాదాపు 19 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు పగటిపూట 9 గంటల పాటు విద్యుత్ అందించాలని సంకల్పించింది. ఇందుకోసం ప్రత్యేక డిస్కమ్ రూరల్ అగ్రికల్చర్ పవర్ లిమిటెడ్ ద్వారా ఈ విద్యుత్తు అందించాలని నిర్ణయించింది. సెకీ నుంచి విద్యుత్ తీసుకోవడం వల్ల 25 సంవత్సరాల పాటు ఇంటర్ స్టేట్ ట్రాన్స్‌మిషన్ చార్జీల నుంచి మినహాయింపు వస్తోంది. అదే రాష్ట్రంలోని యూనిట్ల నుంచి విద్యుత్తు తీసుకొంటే సెంట్రల్ గ్రిడ్ ఛార్జీలు 25 సంవత్సరాలు చెల్లించాల్సి వచ్చేది. రాష్ట్రంలోనే సౌర ప్రాజెక్టులు కడితే వాటికి విద్యుత్ లైన్లు, అంతర్గతంగా విద్యుత్ ప్రసార వ్యవస్థ బలోపేతానికి అయ్యే ఖర్చు, బయటి రాష్ట్రం నుంచి నేరుగా సౌర విద్యుత్ తీసుకున్నప్పుడు దానికి కావలసిన అంతర్గత వ్యవస్థకు అయ్యే ఖర్చుల మధ్య తేడా ఉంటుంది. ప్రాథమికంగా ఇప్పుడు ఉన్న అంతర్రాష్ట్ర, అంతర్గత రాష్ట్ర విద్యుత్ ప్రసార వ్యవస్థల సామర్థ్యాన్ని బేరీజు వేసుకుంటే బయటి రాష్ట్రాల నుంచి సౌర విద్యుత్ తీసుకున్నప్పుడే ఖర్చు తక్కువ అవుతుంది. అందుకే తొలుత రాష్ట్రంలోనే సౌర విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టు పెట్టాలనుకున్నప్పటికీ, ఆ ప్రతిపాదన విరమించుకొని సెకీ ప్రతిపాదనకు మంత్రి మండలి కూడా ఆమోదం తెలిపింది.

బాబు నుంచి షర్మిలకు రూ. 60 కోట్లు

చంద్రబాబు ఫైనాన్స్ చేయకపోతే ఆమెకు అంత డబ్బు ఎక్కడిది?

- చంద్రబాబు డ్రామాలో షర్మిల, సునీత పాత్రధారులు
- వైఎస్ వివేకా హత్య కేసులో రాజకీయ కోణం లేదు.. మరో సంబంధం ఉంది
- సునీత, రాజశేఖర్ రెడ్డికి నార్కో అనాలసిస్ టెస్టులు చేయాలి
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్. రమేష్‌కుమార్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రమేష్ కుమార్‌రెడ్డి. పక్కన డాక్టర్ చైతన్యరెడ్డి

కడప కార్పొరేషన్: ఎన్నికల్లో పీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు చంద్రబాబు భారీగా ఫైనాన్స్ చేశారని, సుమారు రూ. 60 కోట్లు ఇచ్చినట్లు తమ వద్ద సమాచారం ఉందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఆర్. రమేష్‌కుమార్ రెడ్డి తెలిపారు. వైఎస్సార్ జిల్లాలో 10 మంది టీడీపీ అభ్యర్థులకు మొండిచేయి చూపి షర్మిలకు డబ్బులిచ్చి కడప పార్లమెంటుకు పోటీ చేయిస్తున్నారని చెప్పారు. డా. చైతన్యరెడ్డితో కలిసి బుధవారం ఇక్కడ నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు ఫైనాన్స్ చేయకపోతే షర్మిలకు అంత డబ్బు ఎక్కడిదని ప్రశ్నించారు. రోజురోజుకు ప్రజాదరణ పెరుగుతున్న వైఎస్సార్‌సీపీపై బురద జల్లేందుకు వైఎస్ కుటుంబంలో షర్మిల, సునీతను చంద్రబాబు పావులుగా మార్చారని చెప్పారు. ఇందులో భాగంగానే షర్మిల పీసీసీ అధ్యక్షురాలయ్యారని తెలిపారు. అరుంధతి సినిమాలోలాగా వారిని పశుపతి ఆవహించారని ఎద్దేవా చేశారు. కుటుంబాలను విడదీయడంలో చంద్రబాబు దిట్ట అని, తల్లీబిడ్డలకు కూడా తగవు పెట్టే సమర్థుడని చెప్పారు. సునీత లక్ష్యం వైఎస్ వివేకా హత్య కేసులో నిజమైన నేరస్తులను వెలికితీయడమా లేక తప్పు చేయని వారిని శిక్షించడమా అని ప్రశ్నించారు. ఆమె సైకో ఆలోచనకు ఇది నిదర్శనమన్నారు. ఒక పథకం ప్రకారం కథ అల్లుతూ వారు అనుకున్న వ్యక్తులను నిందితులుగా చేరుస్తూ కేసును పూర్తిగా పక్కదారి పట్టించారన్నారు. సిట్ దర్యాప్తును సీబీఐ పరిగణనలోకి తీసుకొని ఉంటే అసలు నేరస్తులు దొరికేవారని చెప్పారు. బాబు ఇచ్చిన తప్పుడు సమాచారంతో, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, అవినాశ్‌రెడ్డిపై ఉన్న కోపంతో షర్మిల, సునీత ఇష్టారీతిన మాట్లాడుతున్నారన్నారు. కేసు ట్రయల్‌కు వచ్చాక నిజాలు బయటికి వస్తాయని, ఆ లోపే ఒకరిని లక్ష్యం చేసుకొని దుష్ప్రచారం చేయడం సరైంది కాదన్నారు.

వేరే సంబంధాలతోనే వివేకా హత్య

వేరే సంబంధాలతోనే వివేకా హత్య జరిగిందని, రాజకీయ కోణం లేదని తెలిపారు. హత్యకు ఒక రోజు ముందు ఇంట్లో పని చేసే పందింటి రాజశేఖర్‌ను సౌభాగ్యమ్మ, నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి కాణిపాకం పంపించారని, చెవులు వినపడని వాచ్‌మేన్ రంగయ్య ఇంటి బయట ఉన్నారని చెప్పారు. అదే సమయంలో దుండగులు వివేకా ఇంటి తలుపులు పగులగొట్టి ఇంట్లోకి చొరబడినట్లు ఆధారాలు ఉన్నాయన్నారు. సీబీఐని ఎవరో మేనేజ్ చేశారని, అందువల్లే వీటిని సీబీఐ పరిగణనలోకి తీసుకోలేదని చెప్పారు. వైఎస్ వివేకాతో ఎర్ర గంగిరెడ్డి, ఉమాశంకర్‌రెడ్డి, సునీల్ యాదవ్, దస్తగిరికి సాన్నిహిత్యం ఉందని, తరచూ కలిసి భోజనం చేస్తారని సీబీఐకి సాక్షులు చెప్పారని గుర్తుచేశారు. అవినాశ్‌రెడ్డిని ఎంపీగా చేసేందుకు వివేకా కష్టపడ్డారని తొలుత చెప్పిన సునీత.. ఆ తర్వాత మాటమార్చిందన్నారు. హార్ట్ ఎటాక్ డ్రామా ఆడింది కూడా సునీతేనని చెప్పారు. కేసును పక్కదారి పట్టించేందుకే వివేకా రాసిన లేఖను దాచిపెట్టారని ఆరోపించారు. సునీత, నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి చెబితేనే లేఖను దాచిపెట్టినట్లు పీఏ కృష్ణారెడ్డి చెప్పారన్నారు. వారికి నార్కో అనాలసిస్ టెస్టులు చేస్తే నిజాలు వెలుగులోకి వస్తాయన్నారు. రక్తపు మరకలను ఎవరూ తుడవలేదని, బెడ్ వద్ద మాత్రమే తుడిచారని, ఆ వస్త్రం కూడా అక్కడే ఉందని అన్నారు. కడప ఎంపీగా పోటీ చేయాలని వైఎస్ వివేకా బలవంతపెట్టారని షర్మిల చెప్పడంలో అర్థం లేదన్నారు. 2014లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కడప ఎంపీ అభ్యర్థిగా వైఎస్ అవినాశ్‌రెడ్డిని నిర్ణయించారని, 2019లోనూ ఆయన్నే కొనసాగించారని చెప్పారు.

పబ్లిక్ ఫోరం, మీడియాలో ట్రయల్స్ ఆపండి : డా. చైతన్యరెడ్డి

వివేకా హత్య కేసులో పబ్లిక్ ఫోరం, మీడియా ట్రయల్స్ ఆపాలని దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి కుమారుడు డా. చైతన్యరెడ్డి విజ్ఞప్తి చేశారు. వైఎస్ భాస్కర్‌రెడ్డికి హార్ట్ చెకప్ చేసి, సర్జరీ చేయాలని, బెయిలివ్వాలని కోర్టులో అఫిడవిట్ దాఖలు చేస్తే, సీబీఐ వ్యతిరేకించకపోయినా సునీత మాత్రం వ్యతిరేకించిందన్నారు. ఉమాశంకర్‌రెడ్డి, సునీల్ యాదవ్‌ల బెయిల్‌ను వ్యతిరేకించకుండా, తన తండ్రి శంకర్‌రెడ్డి బెయిల్‌ను మాత్రం వ్యతిరేకించారన్నారు. ఇది కక్ష సాధింపు కాక మరేమిటని ప్రశ్నించారు. గూగుల్ టేకౌట్‌కు ఎలాంటి శాస్త్రీయత లేదని, ఖచ్చితత్వం అంతకంటే లేదన్నారు. సీబీఐ పేర్కొన్నది వాట్సాప్ చాట్స్ అని, వాట్సాప్ కాల్స్ కానేకాదన్నారు. అందులో ఔట్‌గోయింగ్ చాట్స్ అసలే లేవన్నారు.

మహానటి.. సునీత

తన తండ్రి వివేకా రెండో వివాహం గురించే తెలియదట

- షమీమ్‌ను రెండో పెళ్లి చేసుకోవడంతోనే ఆయన కుటుంబంలో విభేదాలు
- వివేకా ఆస్తిపై సునీత భర్త రాజశేఖరరెడ్డి కన్ను
- రాజకీయ వారసత్వం కోసం వివేకా బావమరిది శివప్రకాష్‌రెడ్డి పట్టు
- షమీమ్‌ను బెదిరించిన సునీత భర్త, ఆయన సోదరుడు
- సునీత సైతం వాట్సాప్‌లో తీవ్ర దూషణలు
- కుమార్తెపై వివేకాకు ఫిర్యాదు చేసిన షమీమ్
- ఆ వాట్సాప్ సందేశాలను అప్పట్లోనే వెలికి తీసిన సిట్

సాక్షి, అమరావతి: మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి.. షమీమ్ అనే మహిళను పెళ్లి చేసుకోవడం, ఆమెతో ఒక కుమారుడిని కూడా కనడం వల్లే ఆయన కుటుంబంలో విభేదాలు చెలరేగి.. హత్యకు దారితీశాయని ఊరువాడా కోడై కూస్తున్నా.. వివేకా కుమార్తె నర్రెడ్డి సునీత మాత్రం తన తండ్రి రెండో వివాహం గురించి తనకు తెలియదని చెబుతుండటం పట్ల విస్మయం వ్యక్తమవుతోంది. 'వివేకానంద రెడ్డి రెండో వివాహం చేసుకున్నారట కదా.. ఆమెతో ఆయనకు ఓ కుమారుడు ఉన్నాడట కదా.. అందుకే మీ కుటుంబంలో విభేదాలు ఏర్పడ్డాయంట కదా' అని కొద్దిరోజుల క్రితం నర్రెడ్డి సునీత హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఒక మీడియా ప్రతినిధి ఆమెను ప్రశ్నించారు. దీనికి ఆమె తన రెండు భుజాలు ఎగురవేస్తూ చెప్పిన సమాధానం ఏంటో తెలుసా.. 'ఐ డోంట్ నో (నాకు తెలియదు)' అని. నిజంగానే వివేకానందరెడ్డి రెండో వివాహం చేసుకున్న విషయం సునీతకు తెలీదా అంటే ఎందుకు తెలీదు...పూర్తిగా తెలుసు అనే సమాధానమే వస్తోంది. షమీమ్ అనే ముస్లిం మహిళను వివేకానందరెడ్డి రెండో వివాహం చేసుకున్న విషయం బహిరంగ రహస్యం. షమీమ్‌ను వివేకా 2010లో ముస్లిం సంప్రదాయం ప్రకారం రెండో వివాహం చేసుకున్నారు. వారిద్దరికీ 2014లో ఓ కుమారుడు జన్మించారు. ఆ కుమారుడికి షెహెన్ షా అనే పేరు కూడా పెట్టారు. వివేకా తన రెండో భార్య షమీమ్, కుమారుడు షెహెన్ షాతో కలసి ఉన్న ఫొటోలు, వీడియోలు కూడా వెలుగులోకి వచ్చాయి. వివేకా రెండో వివాహం వల్లే ఆయన కుటుంబంలో విభేదాలు తలెత్తాయి. తన రెండో భార్య షమీమ్‌కు ఆస్తిలో వాటా ఇస్తానని.. తన కుమారుడిని రాజకీయ వారసుడిగా ప్రకటిస్తానని వివేకా చెప్పారు. దీంతో ఉలిక్కిపడ్డ వివేకా అల్లుడు, సునీత భర్త నర్రెడ్డి రాజశేఖరరెడ్డి ఆస్తి వారసత్వం తనకే దక్కాలని, రాజకీయ వారసత్వం తనకే దక్కాలని వివేకా పెద్ద బావమరిది నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డి పట్టుబట్టారు. ఆ విభేదాలతోనే వివేకా మొదటి భార్య సౌభాగ్యమ్మ పులివెందులను వదిలేసి హైదరాబాద్‌లో కుమార్తె సునీత నివాసంలో ఉండేవారు. ఇక సునీత.. షమీమ్‌ను తీవ్రంగా దూషిస్తూ వాట్సాప్ సందేశాలు పంపారు. ఆ విషయాన్ని కూడా షమీమ్.. వివేకా దృష్టికి తీసుకువెళ్లారు. ఈ విషయాలను షమీమ్ సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలంలోనూ స్పష్టంగా పేర్కొన్నారు. షమీమ్ తన వాంగ్మూలంలో వెల్లడించిన విషయాలు ఇవీ..



రెండో భార్య షమీమ్, కుమారుడితో వివేకా (ఫైల్)

రెండో పెళ్లిని తీవ్రంగా వ్యతిరేకించారు..

వివేకా రెండో పెళ్లిని ఆయన కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, పెద్ద బావమరిది నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. సునీత ఏకంగా షమీమ్‌కు ఫోన్ చేసి తీవ్రంగా బెదిరించారు. శివప్రకాశ్‌రెడ్డి కూడా షమీమ్ బావకు ఫోన్ చేసి తీవ్రంగా దూషించడంతో ఆయన కుటుంబం పులివెందుల వదిలివెళ్లిపోయింది. ఆ విషయం తెలిసి వివేకా తీవ్ర ఆగ్రహంతో శివప్రకాశ్‌రెడ్డి కాలర్ పట్టుకుని నిలదీశారు. షమీమ్‌ను తాను రెండో పెళ్లి చేసుకున్నానని.. ఆమె తన భార్యని స్పష్టం చేశారు.

ఆస్తి, రాజకీయ వారసత్వం కోసమే కక్ష గట్టారు..

2013 నుంచి సునీత, నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, నర్రెడ్డి శివ ప్రకాశ్‌రెడ్డిల నుంచి షమీమ్‌కు వేధింపులు తీవ్రమయ్యాయి. 2014లో వివేకా, షమీమ్‌లకు బాబు పుట్టాడు. ఆ బాబుకు షెహెన్ షా అనే పేరుపెట్టి ఆస్తిలో వాటా ఇస్తాననడంతో పాటు తన రాజకీయ వారసుడిగా ప్రకటిస్తానని కూడా వివేకా చెప్పారు. వివేకా మొదటి భార్యకు కుమారుడు లేకపోవడంతో ఆయన ఆస్తికి ఏకైక వారసుడిని కావాలని అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి భావించారు. ఆయన రాజకీయ వారసుడిని కావాలని నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డి పట్టుదలగా ఉండేవారు. దీంతో వారిద్దరూ వివేకానందరెడ్డిపై కక్ష గట్టారు. బైరటీస్ గనులు ఉన్న నాలుగు ఎకరాల భూమిని షమీమ్ కుమారుడి పేరున రాయాలని వివేకా భావించారు. కానీ అందుకు సునీత, నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, శివప్రకాశ్‌రెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. ఆ నాలుగు ఎకరాల భూమిని శివప్రకాశ్‌రెడ్డి తన పేరున రాయించేసుకున్నారు. అంతేకాకుండా వివేకా అప్పటికే షమీమ్‌కు ఇచ్చిన ఓ ఇంటి పత్రాలను కూడా బలవంతంగా శివప్రకాశ్‌రెడ్డి తీసేసుకున్నారు.

షమీమ్‌ను దూషించిన సునీత

సునీత.. వివేకా రెండో భార్య షమీమ్‌కు ఫోన్ చేసి బెదిరించారు. ఆమెను తీవ్రంగా దూషించారు. సునీత తనను ఎలా దూషించిందీ చెబుతూ షమీమ్.. వివేకాకు వాట్సాప్ సందేశాలు పంపారు. వివేకా హత్య కేసును దర్యాప్తు చేసిన సిట్ అధికారులు ఆ వాట్సాప్ చాటింగ్‌లను అప్పట్లోనే వెలికి తీశారు కూడా. అయినా సరే తన తండ్రి వివేకా రెండో వివాహం గురించి తనకు తెలీయదని సునీత చెప్పడం పట్ల విస్మయం వ్యక్తమవుతోంది. వివేకా హత్య కేసు వెనుక ఉన్న కుట్రను బయటకు రాకుండా చేసేందుకే ఆమె ఇలా అవాస్తవాలు మాట్లాడుతున్నారన్నది స్పష్టమవుతోంది.

ఒంటరి అయిన వివేకా..

వివేకానందరెడ్డిని ఆయన మొదటి భార్య సౌభాగ్యమ్మ, కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, పెద్ద బావమరిది శివ ప్రకాశ్ రెడ్డి తీవ్రంగా వేధించారు. కుటుంబానికి చెందిన కంపెనీలలో డైరెక్టర్‌గా ఆయనకు ఉన్న చెక్ పవర్‌ను తొలగించారు. ఆయన్ని ఒంటరిగా పులివెందులలో విడిచిపెట్టి కుటుంబసభ్యులు అందరూ హైదరాబాద్‌లో ఉండేవారు. దీంతో రోజువారి ఖర్చులకు కూడా ఆయన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అప్పులు తీర్చడానికి హైదరాబాద్ మణికొండలో ఉన్న తన ఇంటిని కూడా 2018లో విక్రయించారు.

నీట్ ర్యాంకు.. మాక్ టెస్టులే కీలకం

రోజుకొకటి చొప్పున మాక్ టెస్టులు రాయాలి

- బలహీనంగా ఉన్న అంశాలపై పట్టు సాధించాలి
- ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను బాగా అధ్యయనం చేయాలి
- ముఖ్యాంశాలను షార్ట్ నోట్స్‌లా రాసుకోవాలి
- విద్యార్థులకు నిపుణుల సూచనలు
- 5న దేశవ్యాప్తంగా నీట్–యూజీ నిర్వహణ



సాక్షి, అమరావతి: దేశంలో ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే నీట్ యూజీని మే 5న నిర్వహించనున్నారు. పరీక్షకు మరికొద్ది రోజుల సమయం మాత్రమే ఉంది. ఈ నేపథ్యంలో మంచి ర్యాంక్ సాధించడంలో మాక్ టెస్టులు కీలక పాత్ర పోషిస్తాయని నిపుణులు చెబుతున్నారు. నీట్‌కు సిద్ధమవుతున్న విద్యార్థులు రోజుకు ఒకటి చొప్పున మాక్ టెస్ట్ రాయడం మంచిదంటున్నారు. ప్రతి మాక్ టెస్ట్ తర్వాత స్వయంవిశ్లేషణ చేసుకుని.. బలహీనంగా ఉన్న విభాగాలపై దృష్టి సారించాలని సూచిస్తున్నారు.

ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలతో ప్రయోజనం..

ఈ ఏడాది నీట్ సిలబస్‌లో చాలా మార్పులు చేశారు. దాదాపు 18 అంశాలను సిలబస్ నుంచి తొలగించారు. బయాలజీ, కెమిస్ట్రీల్లో కొన్ని కొత్త అంశాలను జోడించారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని సిలబస్‌లో లేని అంశాల జోలికి విద్యార్థులు వెళ్లకపోవడం ఉత్తమం. ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాలు నీట్ విజయంలో కీలకపాత్ర పోషిస్తాయని.. వీటిని క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని నిపుణులు చెబుతున్నారు.

రాష్ట్రం నుంచి 70 వేల మంది..

నీట్ యూజీ రాస్తున్న విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతోంది. ఈ ఏడాది 23.80 లక్షల మందికి పైగా విద్యార్థులు దరఖాస్తు చేశారు. గతేడాది 20.87 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. అలాగే గతేడాది ఆంధ్రప్రదేశ్ నుంచి 68 వేల మంది నీట్ రాయగా 42 వేల మంది అర్హత సాధించారు. ఈ ఏడాది మన రాష్ట్రం నుంచి 70 వేల మందికిపైగా నీట్ రాసే అవకాశాలున్నాయి. గతేడాది శ్రీకాకుళం జిల్లాకు చెందిన వరుణ్ చక్రవర్తి అఖిల భారత స్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన సంగతి తెలిసిందే.

తరచూ పునశ్చరణ చేయాలి..

ఎన్‌సీఈఆర్‌టీ బయాలజీ, కెమిస్ట్రీ ప్రతి అధ్యాయంలో ముఖ్యమైన అంశాలతో షార్ట్ నోట్స్ రాసుకోవాలి. వాటిని తరచూ పునశ్చరణ చేస్తూ ఉండాలి. బయాలజీలో ప్లాంట్ అండ్ యానిమల్, హ్యూమన్ ఫిజియాలజీ, మార్ఫాలజీ, జెనెటిక్స్, ఎకాలజీ, బయోటెక్నాలజీ, రీప్రొడక్షన్ వంటివి ముఖ్యమైన అధ్యాయాలు. వీటిని ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయొద్దు. పరీక్షకు తక్కువ సమయం మాత్రమే ఉన్న నేపథ్యంలో కొత్త విషయాలు, అంశాలు నేర్చుకోవడానికి ఎక్కువ సమయాన్ని కేటాయించకపోవడం ఉత్తమం.

– కె. రవీంద్రకుమార్, నీట్ కోచింగ్ నిపుణులు, శ్రీ చైతన్య విద్యా సంస్థలు

ఏ రోజు సిలబస్ ఆ రోజే పూర్తి చేయాలి..

పరీక్షలకు అందుబాటులో ఉన్న సమయాన్ని సరిగ్గా సద్వినియోగం చేసుకోవాలి. ఏ రోజు సిలబస్‌ను ఆ రోజే పూర్తి చేస్తే ఒత్తిడి ఉండదు. నా స్నేహితులతో కలిసి గ్రూప్ స్టడీ చేసేవాడిని. వారితో కలిసి మాక్ టెస్టులు రాయడం వల్ల మాలో మాకు మంచి పోటీ ఉండేది. అత్యుత్తమ ప్రతిభ కనబరచడంలో గ్రూప్ స్టడీ నాకు ఎంతో మేలును చేకూర్చింది. ప్రశ్నను చదవడం, అర్థం చేసుకోవడంలో పొరపాటు చేయొద్దు. పరీక్ష రాసేప్పుడు తొలుత బయాలజీ సెక్షన్ పూర్తి చేసి, తర్వాత ఫిజిక్స్, చివరలో కెమిస్ట్రీ రాయడం మంచిదని నా అభిప్రాయం.

– వరుణ్ చక్రవర్తి, నీట్ యూజీ–2023, ఆలిండియా ఫస్ట్ ర్యాంకర్

'అటానమస్'లోనూ ఏపీ అదుర్స్!

▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్రం	స్వయం ప్రతిపత్తి కళాశాలల సంఖ్య
తమిళనాడు	252
మహారాష్ట్ర	197
ఆంధ్రప్రదేశ్	165
తెలంగాణ	124
కర్ణాటక	83
కేరళ	33
మధ్యప్రదేశ్	23
పశ్చిమబెంగాల్	19
ఒడిశా	16
గుజరాత్	13
ఛత్తీస్‌గఢ్, పంజాబ్	12

ఏపీ విశ్వవిద్యాలయాలకు అనుబంధంగా ఎక్కువ కళాశాలలు అటానమస్ హోదాను పొందుతున్నాయి. ఈ స్వయం ప్రతిపత్తి కళాశాలలు వర్సిటీలతో సంబంధం లేకుండా సొంత పాఠ్యాంశాలను అభివృద్ధి చేసుకోవడంతో పాటు.. ప్రశ్నపత్రాల నిర్వహణ, ఫలితాల విడుదల వంటి విద్యా సంబంధ, పరిపాలనాపరమైన నిర్ణయాలు తీసుకోవడంలో స్వేచ్ఛగా పనిచేస్తాయి.

యూజీసీ కంటే ముందుచూపు

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) 2023లో కొత్త జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా అనుబంధ కళాశాలలకు స్వయం ప్రతిపత్తిని అనుమతించడానికి విశ్వవిద్యాలయాల కోసం ప్రత్యేక నిబంధనలు తెచ్చింది. కానీ, చాలా రాష్ట్రాలు వాటిని అనుమలు చేయడం లేదు. అంతకుముందే ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుచూపుతో ప్రతి కళాశాలకు న్యాక్ గుర్తింపుతో పాటు.. మల్టీ డిసిప్లినరీ సంస్థలుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక సంస్కరణలు తెచ్చారు. ఇందుకు అనుగుణంగా కాలేజీలకు అక్రిడిటేషన్ వచ్చేలా సహకారం అందించేందుకు రాష్ట్ర ఉన్నత విద్యామండలిలో క్వాలిటీ అస్యూరెన్స్ సెల్‌ను ఏర్పాటు చేయించారు. దీని ద్వారా అన్ని కాలేజీలు న్యాక్ అక్రిడిటేషన్, ఏ గ్రేడ్‌తో పాటు నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్‌ఐఆర్‌ఎఫ్) ర్యాంకులు సాధించేలా కార్యాచరణ చేపట్టారు. క్వాలిటీ అస్యూరెన్స్ సెల్‌లో వర్సిటీలు, అటానమస్ కాలేజీలు, పరిశ్రమల ప్రముఖులతో పాటు ఉన్నత విద్యాశాఖ నుంచి సలహా కమిటీని ఏర్పాటు చేశారు. న్యాక్‌లో గుర్తింపు పొందిన కళాశాలలను స్వయం ప్రతిపత్తి దిశగా తీసుకెళుతున్నారు.

వీసీలతో యూజీసీ చర్చలు..

2035 నాటికి దేశంలోని అన్ని కాలేజీలు స్వయం ప్రతిపత్తితో డిగ్రీలను ప్రదానం చేసే సంస్థలుగా ఎదిగేలా చేయాలన్నది యూజీసీ లక్ష్యంగా పెట్టుకుంది. 2030 నాటికి ప్రతి జిల్లాలో కనీసం ఒక్కటైనా పెద్ద సంస్థ ఈ విధమైన స్వయం ప్రతిపత్తి కలిగిన స్థాయికి ఎదగాలని భావిస్తోంది. అయితే చాలా వర్సిటీలు అనుబంధ కళాశాలలను ఆ దిశగా ప్రోత్సహించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయి. ఈ క్రమంలోనే యూజీసీ స్వయం ప్రతిపత్తి అజెండాను ముందుకు తీసుకెళ్లడంపై విశ్వవిద్యాలయాల వీసీలతో చర్చలు జరపాలని యూజీసీ యోచిస్తోంది. 2023లో నిబంధనలు ప్రవేశపెట్టినప్పటి నుంచి స్వయం ప్రతిపత్తి హోదా కోసం యూజీసీకి 590 కళాశాలలు దరఖాస్తులు చేసుకున్నాయి. వీటిలో 460కి పైగా దరఖాస్తులను కమిషన్ పరిశీలించి ఆమోదించింది. 'స్వయం ప్రతిపత్తి హోదా కళాశాలలకు ఇప్పటికే ఉన్న కోర్సులను పునర్నిర్మించడానికి, రీడిజైన్ చేయడానికి స్వేచ్ఛనిస్తుంది. వారు పరిశ్రమ అవసరాలకనుగుణంగా కొత్త కోర్సులను ప్రవేశపెట్టుకోవచ్చు. విశ్వవిద్యాలయాల మాదిరిగా బోధన–అభ్యాస ప్రక్రియలను, ఫలితాల ఆధారిత అభ్యాసాన్ని ఆవిష్కరించొచ్చు. విద్యాసంస్థలు విద్యార్థుల పనితీరును అంచనా వేయడానికి కొత్త పద్ధతులను రూపొందించొచ్చు. డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులను ఆఫర్ చేయొచ్చు' అని యూజీసీ చైర్మన్, మామిడాల జగదీశ్‌కుమార్ 'సాక్షి'తో చెప్పారు.

ఏవోబీలోకి మావోయిస్టులు?

- ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్ నుంచి తప్పించుకుని షెల్టర్ కోసం వచ్చినట్లు అనుమానం
- ఏవోబీ దండకారణ్యంలో జల్లెడపడుతున్న కేంద్ర బలగాలు
- సరిహద్దులో పోలీసులు అప్రమత్తం.. ఔట్ పోస్టుల్లో రెడ్ అలర్ట్



ఏవోబీలో గాలింపు చర్యలు చేపడుతున్న ప్రత్యేక పోలీసు బలగాలు

సాక్షి, పాడేరు(అల్లూరి సీతారామరాజు జిల్లా): ఛత్తీస్‌గఢ్‌లో మంగళవారం జరిగిన భీకర ఎదురుకాల్పుల్లో తప్పించుకున్నమావోయిస్టులు షెల్టర్ కోసం ఆంధ్ర–ఒడిశా సరిహద్దు(ఏవోబీ)లోని దండకారణ్యం ప్రాంతానికి చేరుకుని ఉండవచ్చని కేంద్ర పోలీసు బలగాలు భావిస్తున్నాయి. ఈ మేరకు ఏవోబీలోని దండకారణ్యంలో కేంద్ర బలగాలు కూంబింగ్ చేపట్టాయి. కొన్నేళ్లుగా ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాల్లో మావోయిస్టుల ప్రాబల్యం తగ్గింది. అయితే, ఏపీ, ఒడిశా రాష్ట్రాలకు సరిహద్దులోని ఛత్తీస్‌గఢ్ దండకారణ్య ప్రాంతం మావోయిస్టు పార్టీకి అడ్డాగా మారింది. ఆ రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాల పరిధిలో ఉన్న బస్తర్ అటవీ ప్రాంతం మావోయిస్టులకు సురక్షితంగా ఉంది. అక్కడి నుంచే మూడేళ్లుగా మావోయిస్టులు తమ కార్యకలాపాలు సాగిస్తున్నారు. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్‌లోని దండకారణ్యం కేంద్ర పోలీసు బలగాల నిర్బంధంలో ఉంది. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా పెద్ద సంఖ్యలో పోలీసు పార్టీలు అటవీ ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు జరిగిన వరుస ఎన్‌కౌంటర్లలో మావోయిస్టు పార్టీ సుమారు 79మంది కీలక నేతలు, సభ్యులను కోల్పోయింది. కాంకేరు జిల్లాలోని మాడ్ అటవీ ప్రాంతంలో మంగళవారం జరిగిన భీకర ఎదురుకాల్పుల్లో ఏకంగా 29మంది మావోయిస్టులు మృతిచెందారు. దీంతో మిగిలిన క్యాడర్ ఛత్తీస్‌గఢ్ దండకారణ్యానికి సరిహద్దులో ఉన్న ఏపీకి చెందిన అల్లూరు సీతారామరాజు జిల్లా చింతూరు, ఒడిశాలోని మల్కన్‌గిరి, కోరాపుట్ జిల్లాల అటవీ ప్రాంతానికి వచ్చి తలదాచుకుంటారని పోలీసులు భావిస్తున్నారు. ఈ ప్రాంతం ఒకప్పుడు మావోయిస్టు పార్టీకి సురక్షితమైనదిగా గుర్తింపు పొందింది. మరోవైపు మావోయిస్టుల కార్యకలపాలను నియంత్రించాలనే లక్ష్యంతో అల్లూరు సీతారామరాజు జిల్లా పోలీసులు కూడా అప్రమత్తంగా ఉన్నారు. ఒడిశా పోలీసు బలగాలతో సమన్వయం చేసుకుంటూ జిల్లాలో గాలింపు చర్యలు చేపడుతున్నారు. చింతూరుకు సరిహద్దులోని ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతంపై నిఘా పెట్టారు.

అప్రమత్తంగా ఉన్నాం

ఏవోబీలో పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉంది. ఛత్తీస్‌గఢ్‌లో వరుస ఎన్‌కౌంటర్లు, మావోయిస్టుల మరణాలు తదితర పరిణామాలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం. సరిహద్దులో పోలీసు బలగాలు గాలింపు చర్యల్లో నిమగ్నమయ్యాయి. మావోయిస్టుల కదలికలపై నిఘా అధికంగా ఉంది. ఒడిశా పోలీసు యంత్రాంగం సహకారం తీసుకుంటున్నాం. అన్ని ఔట్ పోస్టుల పరిధిలో రెడ్ అలర్ట్ అమలులో ఉంది.

– తుహిన్ సిన్హా, ఎస్పీ, పాడేరు

బాబు అవకాశవాద రాజకీయాలు ఇక చెల్లవు

మళ్లీ బీజేపీతో పొత్తుపెట్టుకొని మాయమాటలు చెబుతున్నాడు

- చంద్రబాబు జిమ్మిక్కుల్ని ముస్లిం సమాజం నమ్మదు
- సాక్షితో ముస్లిం జేఏసీ కన్వీనర్ మునీర్ అహ్మద్



సాక్షి, అమరావతి: చంద్రబాబు మళ్లీ బీజేపీతో పొత్తుపెట్టుకుని మాయమాటలు చెబుతున్నాడని, ఆయన అవకాశవాద రాజకీయాలు ఇక చెల్లవని ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) రాష్ట్ర కన్వీనర్ షేక్ మునీర్ అహ్మద్ చెప్పారు. చంద్రబాబు తీరును తప్పుబడుతూ మునీర్ అహ్మద్ మంగళవారం సాక్షితో మాట్లాడారు. సొంత అవసరం, అవకాశాన్ని బట్టి పార్టీలతో పొత్తులు పెట్టుకునే చంద్రబాబు ముస్లిం మైనార్టీలను మాయమాటలతో మోసం చేస్తూ వచ్చారన్నారు. ప్రతిసారి బీజేపీతో పొత్తుపెట్టుకోవడం, ఇంకెప్పుడూ మళ్లీ బీజేపీతో పొత్తుపెట్టుకోనని నమ్మబలకడం చంద్రబాబుకు అలవాటుగా మారిందని విమర్శించారు. మళ్లీ ఇప్పుడు యూటర్న్ తీసుకుని బీజేపీ, జనసేనతో పొత్తుపెట్టుకుని సిగ్గులేకుండా జనం ముందుకు వస్తున్నాడన్నారు. చంద్రబాబు జీవితం మొత్తం నైతిక విలువలు లేని స్వార్థ రాజకీయ చరిత్రేనని చెప్పారు. ఈ అనైతిక పొత్తును ప్రజలు తిరస్కరిస్తున్నారన్నారు. ఎన్నికల అనంతరం టీడీపీ, జనసేన పార్టీలు బీజేపీలో విలీనం కావడం ఖాయమని చెప్పారు. చంద్రబాబు తొలినుంచి ముస్లిం ఓట్లు రాబట్టుకుని వారిని ధోకా (మోసం) చేయడం అలవాటుగా మారిందన్నారు. బీజేపీతో జట్టుకట్టిన చంద్రబాబు వివక్షపూరిత స్వభావం కలిగిన సీఏఏ బిల్లుకు మద్దతు తెలపడం స్వార్థ రాజకీయాలకు నిదర్శనమని చెప్పారు. మైనారిటీలకు పదవులు ఇవ్వలేదని ప్రశ్నించిన ముస్లిం సోదరులపై చంద్రబాబు దేశద్రోహం కేసులు పెట్టించిన దురాగతాలను ముస్లిం సమాజం మరచిపోలేదన్నారు. చంద్రబాబు ముస్లింలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేశారన్నారు. ఐదేళ్లలో చంద్రబాబు ప్రభుత్వం ముస్లింల కోసం రూ.3,495 కోట్లు కేటాయిస్తే.. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఐదేళ్లలో రూ.23 వేల కోట్లు ముస్లిం సంక్షేమానికి ఖర్చు చేసిందని చెప్పారు. ముస్లింలకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇచ్చిన నాలుగుశాతం రిజర్వేషన్లను కొనసాగిస్తున్న సీఎం జగన్ ముస్లిం మైనార్టీలకు ఇళ్లస్థలాలు, ఇళ్లు, అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నారని వివరించారు. ముస్లింలకు ఇచ్చిన నాలుగుశాతం రిజర్వేషన్లు తొలగిస్తామని చెబుతున్న బీజేపీతో పొత్తుపెట్టుకున్న చంద్రబాబు ముస్లింలను దగాచేయడానికి జట్టుకట్టారని మండిపడ్డారు. ముస్లింలకు ఉప ముఖ్యమంత్రి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌తోపాటు అనేక రాజకీయ అవకాశాలు ఇచ్చి ప్రోత్సహించిన సీఎం జగన్ ప్రస్తుత ఎన్నికల్లో ఏడు అసెంబ్లీ స్థానాలు కేటాయించి అండగా నిలిచారని గుర్తుచేశారు. ముస్లింలలో వ్యతిరేకతను గమనించిన చంద్రబాబు కొందర్ని చుట్టూ పెట్టుకుని మళ్లీ మభ్యపెట్టే మాటలు మాట్లాడుతున్నారన్నారు. గత అనుభావాలను దృష్టిలో పెట్టుకుని ముస్లిం సమాజం చంద్రబాబు జిమ్మిక్కులను నమ్మేస్థితిలో లేదని, సీఎం జగన్‌కే ముస్లింల మద్దతు దక్కుతుందని మునీర్ అహ్మద్ స్పష్టం చేశారు.

జిల్లా వార్తలు

అన్నదాతల సంక్షేమమే ధ్యేయం

- అందుబాటులో అగ్రి టెస్టింగ్ ల్యాబ్
- ఉచితంగా నాణ్యత నిర్ధారణ పరీక్షలు
- నకిలీ విత్తనాలు, పురుగు మందులకు చెక్
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



జగ్గయ్యపేటలోని వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్



ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది(ఫైల్)

పెనుగంచిప్రోలు: అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తూ రైతులకు అండగా నిలుస్తున్నారు. ముఖ్యంగా నకిలీ విత్తనాలు, పురుగు మందులు, ఎరువులతో రైతులు నష్టపోకుండా ఉండేందుకు జగ్గయ్యపేట పట్టణంలో అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. సుమారు రూ.90 లక్షలతో అత్యాధునిక పరికరాలతో ఈ ల్యాబ్ ఏర్పాటు చేశారు. సాగుకు రైతులు వినియోగించే ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు తదితర వాటిని తనిఖీ చేసి నాణ్యతను పరిశీలించి తర్వాతనే రైతులు కొనుగోలుకు మార్కెట్‌లోకి సరఫరా చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అంతేకాకుండా జగనన్న ప్రభుత్వంలో వ్యవసాయానికి పగటి పూట 9 గంటలు విద్యుత్, రైతులకు విత్తనం నుంచి విక్ర యం దాకా సేవలు అందించేందుకు రైతు భరోసా కేంద్రాలు, ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీకే బ్యాంక్ రుణాలు, వైఎస్సార్ యంత్ర సేవా, వైఎస్సార్ జలకళ పథకంతో పాటు ఎన్నో విప్లవాత్మక మార్పులు వ్యవసాయ రంగంలో చేపట్టారు.

రైతులకు అనుకూలంగా..


నియోజకవర్గంలోని జగ్గయ్యపేట పట్టణంలో ఏర్పాటు చేసిన అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌తో జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లోని సుమారు 32 వేల మంది రైతులకు అనుకూలంగా మారింది. ల్యాబ్‌లో టెస్టింగ్ తరువాత ఫలితాలను సకాలంలో అందిస్తున్నారు. కేవలం జగ్గయ్యపేట నియోజకవర్గానికి సంబంధించి మాత్రమే కాకుండా ఇతర జిల్లాల నుంచి వచ్చిన వాటి పరీక్షలు నిర్వహిస్తారు. రైతులకు పైసా ఖర్చు లేకుండా ల్యాబ్‌లో పురుగు మందులు, ఎరువులు, విత్తనాలు నాణ్యతను పరీక్షించి ఫలితాలను ఆర్బీకేల ద్వారా రైతుల ఇంటికే చేరుస్తున్నారు. ల్యాబ్‌లో ఒక ఏఓ, ఇద్దరు ఏఈఓలు పనిచేస్తున్నారు. శిక్షణ పొందిన వారు పరీక్షలు నిర్వహిస్తారు. వ్యవసాయ శాఖ ఏడీఏ పర్యవేక్షిస్తారు.

578 పరీక్షలు..

గతేడాది రైతులకు సంబంధించి విత్తనాలు 350, ఎరువులకు సంబంధించి 60, ఇతర జిల్లాల నుంచి వచ్చిన విత్తనాలు 123, ఎరువులు 45 పరీక్షలు నిర్వహించామని అధికారులు తెలిపారు. ఎరువులకు సంబంధించి ఆరు శాంపిల్స్ నిర్ణయించిన నాణ్యత లేకపోవటంతో కేసులు నమోదు చేశారు. అలాగే వ్యాపారులు కూడా విత్తనాలు అయితే రూ.500, ఎరువులు అయితే రూ.1000లకు చలానా తీసి పరీక్షలు చేయించుకోవచ్చు. రైతులు తప్పనిసరిగా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలుకు సంబంధించి రశీదులు తీసుకోవాలి. అలాగే ఆర్బీకేల ద్వారా 2,130 మట్టి నమూనా పరీక్షలు నిర్వహించారు.

పెరిగిన దిగుబడులు..

జగ్గయ్యపేట పట్టణంలో మార్కెట్‌యార్డు ఆవరణలో ఏర్పాటు చేసిన అగ్రి టెస్టింగ్ ల్యాబ్ రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంది. ల్యాబ్ ద్వారా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను పరీక్షించటంతో దిగుబడులు పెరుగుతాయి. ముఖ్యంగా విత్తనాలను ముందుగా పరీక్షించుకోవటంతో రైతులు నష్టపోయే అవకాశం ఉండదు.



–బరిగెల నాగరాజు, రైతు, లింగగూడెం

నకిలీ విత్తనాలకు చెక్..

ఎన్నికల ముందు పాదయాత్రలో రైతుల సమస్యలను స్వయంగా చూసిన సీఎం వైఎస్ జగన్ రైతులు నష్టపోకూడదని అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌ను ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేశారు. ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తూ నకిలీ విత్తనాలకు చెక్ పెట్టారు. రైతులు ఈ ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకోవాలి.



–గింజుపల్లి కోటేశ్వరరావు, రైతు, అనిగండ్లపాడు

పరోటాలు కాల్చి.. ప్రచారం చేసి

ప్రచార పర్వం



కోడూరులో పరోటాలు కాల్చుతున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

కోడూరు: కృష్ణాజిల్లా అవనిగడ్డ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సింహాద్రి రమేష్‌బాబు బుధవారం మండల కేంద్రం కోడూరులో ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరంగా నిర్వహించారు. ప్రచారంలో భాగంగా విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని ఓ హోటల్‌లో రమేష్‌బాబు పరోటాలు కాల్చి సందడి చేశారు. అనంతరం హోటల్ నిర్వాహకులతో పాటు అక్కడ ఉన్న ప్రజలను ఓట్లు అభ్యర్థించారు.

వినూత్న క్రికెట్ సైట్ స్క్రీన్‌కు పేటెంట్



పేరేచర్లలోని గుంటూరు క్రికెట్ మైదానంలో ఏర్పాటు చేసిన సైట్‌స్క్రీన్



భారీ గాలులు వీచినప్పుడు ఇలా..


తక్కువ ఖర్చుతో ఆవిష్కరించిన జాగర్లమూడి మురళీమోహన్



గుంటూరు ఎడ్యుకేషన్: జేసీసిల్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్, జేకేసీ కళాశాల కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీమోహన్ నూతన ఆవిష్కరణకు పేటెంట్ లభించింది. కోల్‌కత్తాలోని ప్రభుత్వ పేటెంట్ కార్యాలయం మంగళవారం ఈ మేరకు ధ్రువపత్రాన్ని అందించింది. ఈ సందర్భంగా తాను చేసిన నూతన ఆవిష్కరణకు సంబంధించిన వివరాలను ఆయన బుధవారం వివరించారు. క్రికెట్ మైదానంలో పిచ్‌కు ఇరువైపులా బ్యాట్స్‌మెన్, బౌలర్ల దృష్టి మరలకుండా ఉండేందుకు రెండు పెద్ద తెరలు (సైట్ స్క్రీన్) ఉంచుతారు. వాటికి నలుపు, తెలుపు వస్త్రాలు ఉపయోగిస్తారు. వీటిని తయారు చేయటం, వినియోగించడం ఎక్కువ ఖర్చుతో కూడుకున్న పని. తుపానులు, గాలి వానలు వచ్చినప్పుడు కూలిపోవడం, పాడైపోవడం జరుగుతుంది. ఇందుకు సంబంధించి తేలికగా నలుపు, తెలుపు రంగులు మారేవిధంగా ఖనిజంతో సైట్ స్క్రీన్ తయారు చేశారు. గాలి ధారాళంగా వెళ్లేవిధంగా, తుపానులో సైతం పడిపోని విధంగా ఈ స్క్రీన్‌ను తయారు చేశారు. చాలా సులభంగా పిచ్‌లకు ఎదురుగా, బ్యాట్స్‌మెన్‌కు అనుకూలంగా సైట్ స్క్రీన్‌ను కదిలించడంతో పాటు వీలుగా ఉండే విధంగా అమర్చుకోవచ్చు. మెన్, ఉమెన్ క్రికెట్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడు, ఏసీఏ ఉమెన్స్ అకాడమీ పూర్వ చైర్మన్ అయిన మురళీమోహన్ సరికొత్త ఆలోచనతో అతి తక్కువ ఖర్చుతో చేసిన నూతన ఆవిష్కరణకు 20 ఏళ్ల పాటు పేటెంట్ లభించింది. ఈ ఆవిష్కరణ క్రికెట్ క్రీడకు ఎంతో ఉపయోగపడుతుంది. జాగర్లమూడి కుటుంబానికి క్రికెట్ క్రీడతో అవినాభావ సంబంధం ఉంది. వీరి తండ్రి జాగర్లమూడి చంద్రమౌళి ఏసీఏకు అధ్యక్షుడిగా వ్యవహరించడంతో పాటు గుంటూరు క్రికెట్ క్లబ్‌ను స్థాపించారు. చంద్రమౌళి కుమారులు నరేంద్రనాథ్, మురళీమోహన్ క్రికెట్ ఆటలో గతంలో ఆంధ్ర లయోలా కళాశాలకు ప్రాతినిధ్యం వహించారు. ఈ నేపథ్యంలో మురళీమోహన్ పేటెంట్ సాధించడం అభినందనీయమని క్రీడా ప్రముఖులు కొనియాడారు.

కాలేయం..బహుభద్రం

- లివర్ వ్యాధులపై అప్రమత్తత అవసరం
- పెరుగుతున్న వ్యాధి బాధితులు
- అందుబాటులో ఆధునిక చికిత్సలు
- రేపు వరల్డ్ లివర్ డే



లివర్‌డే పోస్టరు

గుంటూరు మెడికల్: కాలేయం(లివర్) మన శరీరంలో అతి పెద్ద గ్రంథి. లివర్ సరిగా పనిచేయకపోతే అనేక రోగాలు శరీరాన్ని చుట్టుముడతాయి. ఆధునిక జీవనశైలి వల్ల నేడు అనేక మంది లివర్ వ్యాధుల బారిన పడుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తం చేస్తుంది. ప్రజలు లివర్ వ్యాధులను సకాలంలో గుర్తించి వైద్యం చేయించని పక్షంలో లివర్ క్యాన్సరుగా మారే ప్రమాదముంది. ప్రతి ఏడాది ఏప్రిల్ 19న వరల్డ్ లివర్ డే నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి'అందిస్తున్న ప్రత్యేక కథనం.

లివర్ బాధితులు..

గుంటూరు జీజీహెచ్‌లో ప్రతి మంగళవారం, శుక్రవారం గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యవిభాగంలో 300 మంది చికిత్స పొందుతున్నారు. వీరిలో 140 మంది లివర్ సంబంధిత సమస్యలతో చికిత్స పొందుతున్నవారు. 2020లో 2,224 మంది, 2021లో 4,081 మంది, 2022లో 4,576మంది చికిత్స, 2023లో 4,8982 మంది వివిధ రకాల సమస్యలతో గ్యాస్ట్రోఎంట్రాలజీ వైద్యవిభాగంలో చికిత్స పొందారు. వీరిలో ఎక్కువ శాతం మంది లివర్ సంబంధిత సమస్యలున్నవారేనని వైద్యులు తెలిపారు.

లివర్ చేసే పనులు...

ఉదరంలో ఉదరవితానికి కిందగా కుడి వైపున మధ్యలో కాలేయం ఉంటుంది. మనం తినే ఆహారాన్ని జీర్ణం చేయటం, జీర్ణక్రియకు దోహదపడే పైత్యరసాన్ని ఉత్పత్తి చేయటం, శరీరంలోని కొవ్వు, చక్కెర, ప్రోటీన్ శాతాన్ని నియంత్రించడం, శరీరం జబ్బు బారిన పడకుండా రక్షణ కల్పించటం, రక్తశుద్ధి చేయటం, శరీరంలోని విషాలను హరించటం చేస్తుంది. మనలో ప్రవేశించే హానికర పదార్థాలను తొలగించటం, ఆహారాన్ని శక్తి రూపంలోకి మార్చటం, వివిధ హార్మోన్ల విడుదలను నియంత్రణలో పెట్టడం, రక్తం గడ్డ కట్టడానికి, గాయాలు త్వరగా మానటానికి కావాల్సిన ఎంజైమ్స్‌ను ఉత్పత్తి చేస్తుంది.

కాలేయ సమస్యలకు ముఖ్య కారణాలు...

మత్తు పదార్థాలు సేవించటం, పొగతాగటం, కొవ్వు పదార్థాలు ఎక్కువగా తీసుకోవటం, ఇన్‌ఫెక్షన్స్ వల్ల కాలేయ సమస్యలు వస్తాయి. లైంగిక సంబంధాలు, ఒకరికి వాడిన సూదిని మరొకరికి వాడటం వల్ల హెపటైటిస్ బి, సి వ్యాధులు వస్తాయి. కలుషిత రక్త మార్పిడి, కలుషిత నీరు, కలుషిత ఆహారం తీసుకోవటం వల్ల హెపటైటిస్ ఏ, ఈ వ్యాధులొస్తాయి. శారీరక వ్యాయామం లేకపోవటం, స్థూలకాయం, నూనె వస్తువులు ఎక్కువగా తినటం, ఫాస్ట్‌ఫుడ్ వల్ల వ్యాధులు వస్తాయి. తెల్లగా ఉండే కళ్లు పసుపు పచ్చగా, గోళ్లు పసుపు రంగులో మారితే కాలేయ సమస్యలు ఉన్నట్లు భావించి వైద్యపరీక్షలు చేయించుకోవాలి.




శ్రేయస్ అయ్యర్‌పై రూ. 12 లక్షల జరిమానా

కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌పై ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ రూ. 12 లక్షలు జరిమానా విధించింది. ఈడెన్ గార్డెన్స్‌లో మంగళవారం రాజస్తాన్ రాయల్స్ జట్టుతో జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో కోల్‌కతా జట్టు నిర్ణీత సమయంలో పూర్తి 20 ఓవర్ల కోటా పూర్తి చేయలేకపోయింది. దాంతో స్లో ఓవర్‌రేట్ నమోదు చేసినందుకు అయ్యర్‌పై పెనాల్టీని విధించారు. తాజా సీజన్‌లో ఇప్పటి వరకు స్లో ఓవర్‌రేట్ కారణంగా రిషభ్ పంత్ (ఢిల్లీ క్యాపిటల్స్), శుబ్‌మన్ గిల్ (గుజరాత్ టైటాన్స్), సంజూ సామ్సన్ (రాజస్తాన్ రాయల్స్)లపై జరిమానా విధించారు.

రిత్విక్ జోడీ శుభారంభం

జీఎస్‌పీ సెగురోస్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్-125 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో హైదరాబాద్ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరి శుభారంభం చేశాడు. మెక్సికోలోని అకాపుల్కో నగరంలో ఈ టోర్నీ జరుగుతోంది. తొలి రౌండ్‌లో రిత్విక్-నిక్కీ పునాచా (భారత్) ద్వయం 7-5, 6-2తో యువాన్ పాబ్లో ఫిచోవిచ్ (అర్జెంటీనా)-లుకాస్ రెస్ డా సిల్వా (బ్రెజిల్) జోడీపై విజయం సాధించి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది.



ఢిల్లీ అదరహో...

వరుస మ్యాచ్‌లలో పరుగుల వరదతో ముంచెత్తుతున్న ఐపీఎల్‌లో ఎట్టకేలకు ఒక స్వల్ప స్కోర్ల పోరు... బౌలర్లు ఆధిపత్యం ప్రదర్శిస్తూ బ్యాటర్ల పని పట్టిన సమయం... మాజీ చాంపియన్ గుజరాత్ టైటాన్స్ సొంతగడ్డపై 100 పరుగులు కూడా చేయలేక కుప్పకూలిన చోట... కేవలం 53 బంతుల్లో లక్ష్యాన్ని ఛేదించిన ఢిల్లీ క్యాపిటల్స్ శిబిరంలో ఆనందం... రన్‌రేట్‌ను మెరుగుపర్చుకునేందుకు వేగంగా ఆడే ప్రయత్నంలో నాలుగు వికెట్లు కోల్పోయినా... చివరకు ఢిల్లీ సునాయాసంగా గెలుపు గీత దాటింది.

- గుజరాత్‌పై 6 వికెట్లతో విజయం
- 89కే టైటాన్స్ ఆలౌట్
- 53 బంతుల్లో లక్ష్యం చేరిన క్యాపిటల్స్

అహ్మదాబాద్: ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ భారీ విజయాన్ని అందుకొని పాయింట్ల పట్టికలో మూడు స్థానాలు ఎగబాకింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 6 వికెట్ల తేడాతో గుజరాత్ టైటాన్స్‌ను చిత్తు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన టైటాన్స్ 17.3 ఓవర్లలో 89 పరుగులకే ఆలౌటైంది. ఐపీఎల్ టోర్నీలో టైటాన్స్‌కిదే అత్యల్ప స్కోరు కావడం గమనార్హం. రషీద్ ఖాన్ (24 బంతుల్లో 31; 2 ఫోర్లు, 1 సిక్స్) మినహా అంతా విఫలమయ్యారు. అనంతరం ఢిల్లీ 8.5 ఓవర్లలో 4 వికెట్లకు 92 పరుగులు చేసింది. జేక్ ఫ్రేజర్ (10 బంతుల్లో 20; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఇచ్చిన శుభారంభంతో గెలుపునకు పునాది పడింది. చక్కటి కెప్టెన్సీతో పాటు 2 క్యాచ్‌లు, 2 స్టంపింగ్‌లు చేసిన రిషభ్ పంత్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.

రాణించిన ఇషాంత్...

ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన రషీద్ కొద్ది సేపు పోరాడటం మినహా గుజరాత్ ఇన్నింగ్స్ పేలవంగా సాగింది. ఆసాంతం పరుగులు చేయడంలో ఇబ్బంది పడిన జట్టు... వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. ఇషాంత్ తన తొలి ఓవర్లోనే కెప్టెన్ శుబ్‌మన్ గిల్ (8)ను వెనక్కి పంపి శుభారంభం అందించగా, ఒకే స్కోరు వద్ద సాహా (2), సాయి సుదర్శన్ (12) వెనుదిరిగారు. ఇషాంత్ బౌలింగ్‌లోనే పంత్ చక్కటి క్యాచ్‌తో డేవిడ్ మిల్లర్ (2) అవుట్ కావడంతో పవర్‌ప్లేను టైటాన్స్ 30/4 వద్ద ముగించింది. పార్ట్‌టైమ్ స్పిన్నర్ స్టబ్స్ కూడా తన తొలి ఓవర్లోనే రెండు వికెట్లు తీయడంతో గుజరాత్ పరిస్థితి మరింత దిగజారింది. ఈ దశలో క్రీజ్‌లోకి వచ్చిన రషీద్ కొన్ని పరుగులు జోడించడంలో సఫలమయ్యాడు. ఆశలు పెట్టుకున్న రాహుల్ తెవాటియా (10)ను అక్షర్ పటేల్ వికెట్ల ముందు దొరకబుచ్చుకోగా మిగతా బ్యాటర్ల ఆట లాంఛనమే అయింది. స్వల్ప లక్ష్య ఛేదనలో కొంత తడబడినా చివరకు ఢిల్లీ ఎలాంటి ప్రమాదం లేకుండా మ్యాచ్‌ను ముగించింది.


రషీద్ ఖాన్


పంత్, ముకేశ్

స్కోరు వివరాలు

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాహా (బి) ముకేశ్ 2; గిల్ (సి) షా (బి) ఇషాంత్ 8; సుదర్శన్ (రనౌట్) 12; మిల్లర్ (సి) పంత్ (బి) ఇషాంత్ 2; మనోహర్ (స్టంప్డ్) పంత్ (బి) స్టబ్స్ 8; తెవాటియా (ఎల్బీ) (బి) అక్షర్ 10; షారుఖ్ (స్టంప్డ్) పంత్ (బి) స్టబ్స్ 0; రషీద్ (సి) పంత్ (బి) ముకేశ్ 31; మోహిత్ (సి) సుమీత్ (బి) ఖలీల్ 2; నూర్ (బి) ముకేశ్ 1; జాన్సన్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (17.3 ఓవర్లలో ఆలౌట్) 89. వికెట్ల పతనం:** 1-11, 2-28, 3-28, 4-30, 5-47, 6-48, 7-66, 8-78, 9-88, 10-89. **బౌలింగ్:** ఖలీల్ 4-1-18-1, ఇషాంత్ 2-0-8-2, ముకేశ్ కుమార్ 2.3-0-14-3, కుల్దీప్ 4-0-16-0, స్టబ్స్ 1-0-11-2, అక్షర్ పటేల్ 4-0-17-1.

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: పృథ్వీ షా (సి) జాన్సన్ (బి) సందీప్ 7; జేక్ ఫ్రేజర్ (సి) మనోహర్ (బి) జాన్సన్ 20; పొరేల్ (బి) సందీప్ 15; హోప్ (సి) మోహిత్ (బి) రషీద్ 19; పంత్ (నాటౌట్) 16; సుమీత్ (నాటౌట్) 9; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (8.5 ఓవర్లలో 4 వికెట్లకు) 92. వికెట్ల పతనం:** 1-25, 2-31, 3-65, 4-67. **బౌలింగ్:** సందీప్ వారియర్ 3-0-40-2; స్పెన్సర్ జాన్సన్ 2-0-22-1, రషీద్ ఖాన్ 2-0-12-1, నూర్ అహ్మద్ 1.5-0-14-0.

ఐపీఎల్‌లో నేడు

పంజాబ్ X ముంబై
వేదిక: ముల్లాన్‌పూర్
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
రాజస్తాన్	7	6	1	12	0.677
కోల్‌కతా	6	4	2	8	1.399
చెన్నై	6	4	2	8	0.726
హైదరాబాద్	6	4	2	8	0.502
లక్నో	6	3	3	6	0.038
ఢిల్లీ	7	3	4	6	-0.074
గుజరాత్	7	3	4	6	-1.303
పంజాబ్	6	2	4	4	-0.218
ముంబై	6	2	4	4	-0.234
బెంగళూరు	7	1	6	2	-1.185

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

శీతల్ దేవి అద్భుతం


శీతల్ దేవి

న్యూఢిల్లీ: ఆర్చరీ పారా క్రీడల్లో వరుస విజయాలతో సత్తా చాటి 'అర్జున' అవార్డు అందుకున్న దివ్యాంగురాలు శీతల్ దేవి అరుదైన ఘనతను సాధించింది. రెండు చేతులు కూడా లేని శీతల్ 'ఖేలో ఇండియా' క్రీడల్లో సాధారణ ఆర్చర్లతో పోటీ పడి రజత పతకం సాధించడం విశేషం. జూనియర్ వరల్డ్ చాంపియన్ ఏక్తా రాణి ఈ పోటీల్లో స్వర్ణం గెలుచుకోగా... ఫైనల్లో ఏక్తా చేతిలో 140-138 తేడాతో శీతల్ ఓడింది. 'ఫోకోమెలియా' అనే అరుదైన వ్యాధి బారిన పడి రెండు చేతులు కోల్పోయిన శీతల్... గత ఏడాది పారా ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలుచుకుంది. పారా ఈవెంట్లలో కాకుండా సాధారణ పోటీల్లో పాల్గొంటే తగిన సాధన లభించడంతో పాటు ఆమెలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందనే ఈ ప్రయత్నం చేశామని శీతల్ కోచ్ అభిలాష వెల్లడించారు.

'టైమ్' టాప్-100 జాబితాలో రెజ్లర్ సాక్షి



న్యూఢిల్లీ: ప్రఖ్యాత 'టైమ్' మేగజీన్ ప్రకటించిన అత్యంత ప్రభావశీలురైన వ్యక్తుల జాబితాలో రియో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత, భారత మహిళా రెజ్లర్ సాక్షి మలిక్‌కు చోటు దక్కింది. 2024 సంవత్సరానికి 'టైమ్' ఈ జాబితాను ప్రకటించింది. లైంగిక వేధింపులకు సంబంధించిన వివాదంలో మహిళా రెజ్లర్ల పక్షాన బలంగా నిలబడి ఆమె చేసిన పోరాటానికి ఈ గుర్తింపు లభించింది. ఈ అంశంలో భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ సింగ్‌కు ఎదురొడ్డి సాక్షి మలిక్ గట్టిగా తన వాణిని వినిపిస్తూ నిరసనల్లో పాల్గొంది. వినేశ్ ఫొగాట్, బజరంగ్ పూనియాలతో కలిసి ఆమె చేసిన ఈ పోరాటం దేశవిదేశాల్లో వార్తల్లో నిలిచింది. ఈ క్రమంలో బ్రిజ్‌భూషణ్ తన పదవి నుంచి తప్పుకోవాల్సి వచ్చింది.

యూకీ జోడీ సంచలనం

మ్యూనిక్: బీఎండబ్ల్యూ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో యూకీ బాంబ్రీ (భారత్)-అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) జోడీ సంచలనం సృష్టించింది. తొలి రౌండ్‌లో ఇండో-ఫ్రెంచ్ ద్వయం మూడో సీడ్ సాండర్ జిలె-జొరాన్ వ్లీజెన్ (బెల్జియం) జంటను బోల్తా కొట్టించి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. 95 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో యూకీ-ఒలివెట్టి జోడీ 4-6, 7-6 (7/5), 10-6తో 'సూపర్ టైబ్రేక్'లో విజయాన్ని అందుకుంది. 11 ఏస్‌లతో అదరగొట్టిన యూకీ-ఒలివెట్టి నిర్ణాయక టైబ్రేక్‌లో పైచేయి సాధించింది. క్వార్టర్ ఫైనల్లో రాబర్ట్ గాలోవే-ఇవాన్ కింగ్ (అమెరికా)లతో యూకీ, ఒలివెట్టి తలపడతారు.



నేడు పాక్, కివీస్ తొలి టి20



రావల్పిండి: టి20 ప్రపంచకప్ సన్నాహాల్లో భాగంగా న్యూజిలాండ్ జట్టుతో పాకిస్తాన్ ఐదు టి20 మ్యాచ్‌ల సిరీస్‌లో పోటీపడేందుకు సిద్ధమైంది. నేడు జరిగే తొలి మ్యాచ్‌లో బ్రేస్‌వెల్ నాయకత్వంలోని న్యూజిలాండ్ జట్టుతో బాబర్ ఆజమ్ సారథ్యంలోని పాకిస్తాన్ జట్టు తలపడుతుంది. తొలి మూడు మ్యాచ్‌లు రావల్పిండిలో, చివరి రెండు మ్యాచ్‌లు లాహోర్‌లో జరుగుతాయి. రాత్రి గం. 7:30 నుంచి మొదలయ్యే ఈ మ్యాచ్‌లను ఫ్యాన్‌కోడ్ యాప్‌లో తిలకించవచ్చు.

గ్రూప్ దశలోనే శ్రీజ, మనిక నిష్క్రమణ

ఐటీటీఎఫ్ ప్రపంచకప్ టోర్నీ

మకావు: అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ సమాఖ్య (ఐటీటీఎఫ్) ప్రపంచకప్ టోర్నమెంట్‌లో భారత అగ్రశ్రేణి మహిళాక్రీడాకారిణులు మనిక బత్రా, ఆకుల శ్రీజలకు నిరాశ ఎదురైంది. వీరిద్దరు గ్రూప్ దశలోనే నిష్క్రమించారు. మొత్తం 48 మంది క్రీడాకారిణులను మొత్తం 16 గ్రూప్‌లుగా విభజించారు. ఒక్కో గ్రూప్‌లో ముగ్గురికి చోటు కల్పించారు. 16 గ్రూప్‌ల్లో టాపర్‌గా నిలిచిన వారు నాకౌట్ దశ ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నారు. గ్రూప్-2లో ఢిల్లీ అమ్మాయి మనిక, గ్రూప్-4లో తెలంగాణ ప్లేయర్ శ్రీజ రెండో స్థానంలో నిలిచారు. నాకౌట్ దశకు అర్హత సాధించాలంటే తప్పనిసరిగా గెలవాల్సిన మ్యాచ్‌ల్లో ప్రపంచ 37వ ర్యాంకర్ మనిక, ప్రపంచ 39వ ర్యాంకర్ శ్రీజ ఓడిపోయారు. బుధవారం జరిగిన రెండో లీగ్ మ్యాచ్‌లలో మనిక 6-11, 4-11, 9-11, 4-11తో ప్రపంచ రెండో ర్యాంకర్ మాన్యు వాంగ్ (చైనా) చేతిలో... శ్రీజ 4-11, 4-11, 15-13, 2-11తో ప్రపంచ నాలుగో ర్యాంకర్ చెన్ మెంగ్ (చేతిలో) ఓటమి పాలయ్యారు.


శ్రీజ
మనిక


నాదల్‌కు చుక్కెదురు



బార్సిలోనా: స్పెయిన్ దిగ్గజం, 12 సార్లు చాంపియన్ రాఫెల్ నాదల్ బార్సిలోనా ఓపెన్ ఏటీపీ-500 టెన్నిస్ టోర్నీలో రెండో రౌండ్‌లోనే వెనుదిరిగాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్ మ్యాచ్‌లో నాదల్ 5-7, 1-6తో డి మినార్ (ఆస్ట్రేలియా) చేతిలో ఓడిపోయాడు. 2003 తర్వాత నాదల్ మళ్లీ ఈ టోర్నీలో రెండో రౌండ్‌లో పరాజయం చవిచూశాడు. తుంటి గాయంతో నాదల్ ఈ ఏడాది కేవలం ఒక టోర్నీలో మాత్రమే పాల్గొన్నాడు. బ్రిస్బేన్ ఓపెన్‌లో నాదల్ క్వార్టర్ ఫైనల్లో ఆస్ట్రేలియా ప్లేయర్ జోర్డాన్ థాంప్సన్ చేతిలో ఓడిపోయాడు.

సినిమా

వీర ధీర శూరన్


'వీర ధీర శూరన్'లో విక్రమ్

విలక్షణ చిత్రాలు, వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తున్నారు హీరో విక్రమ్. బుధవారం (ఏప్రిల్ 17) ఆయన పుట్టినరోజు. ఈ సందర్భంగా విక్రమ్ హీరోగా నటిస్తున్న 62వ చిత్రానికి 'వీర ధీర శూరన్' టైటిల్‌ను ఖరారు చేసి, టైటిల్ టీజర్‌ను విడుదల చేసింది యూనిట్. ఎస్‌యు అరుణ్ కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో ఎస్‌జే సూర్య, దుషారా విజయన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. రియా శిబు నిర్మిస్తున్న ఈ చిత్రంలో కాళి అనే మాస్ క్యారెక్టర్‌లో నటిస్తున్నారు విక్రమ్. తమిళ, తెలుగు భాషల్లో ఈ సినిమా రిలీజ్ కానుంది. త్వరలో తెలుగు టైటిల్‌ను ప్రకటించనున్నారు.

తంగలాన్ నుంచి బర్త్ డే గ్లింప్స్...

విక్రమ్ హీరోగా నటించిన పీరియాడిక్ యాక్షన్ మూవీ 'తంగలాన్'. పా. రంజిత్ దర్శకత్వం వహించారు. పార్వతీ తిరువోతు, మాళవికా మోహనన్ హీరోయిన్లుగా కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించారు. బుధవారం విక్రమ్ పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు చెబుతూ 'తంగలాన్' నుంచి స్పెషల్ గ్లింప్స్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా పా. రంజిత్ మాట్లాడుతూ– ''కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ నేపథ్యంలోని కొన్ని వాస్తవ ఘటనలతో 'తంగలాన్' తెరకెక్కించాం. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ సినిమాని త్వరలోనే పాన్ ఇండియా భాషలతో పాటు ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేయనున్నాం'' అన్నారు.

అమితాబ్.. రెహమాన్‌లకు లతా మంగేష్కర్ అవార్డు


అమితాబ్ బచ్చన్


ఏఆర్ రెహమాన్

బాలీవుడ్ బిగ్ బి అమితాబ్ బచ్చన్, ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ 'లతా దీనానాథ్ మంగేష్కర్' అవార్డుకు ఎంపిక అయ్యారు. ప్రఖ్యాత గాయని లతా మంగేష్కర్ 2022న ఫిబ్రవరి 6న మరణించిన సంగతి తెలిసిందే. ఆమె జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు వివిధ రంగాల్లోని ప్రతిభావంతులకు, సమాజానికి సేవలందిస్తున్న వారికి 'లతా దీనానాథ్ మంగేష్కర్' పురస్కారాన్ని అందజేస్తున్నారు. తొలుత ఈ అవార్డును భారత ప్రధాని నరేంద్ర మోదీ అందుకున్నారు. ఆ తర్వాత లతా మంగేష్కర్ సోదరి ఆశా భోంస్లే ఈ పురస్కారం అందుకున్నారు. 2024కి గాను అమితాబ్ బచ్చన్‌కి 'లతా దీనానాథ్ మంగేష్కర్' అవార్డు ఇవ్వనున్నట్లు లతా మంగేష్కర్ కుటుంబ సభ్యులు ప్రకటించారు. అదే విధంగా భారతీయ సంగీతానికి చేసిన కృషికిగానూ ఏఆర్ రెహమాన్ కూడా ఈ పురస్కారం అందుకుంటారు. అలాగే సామాజిక సేవా రంగంలో 'దీప్‌స్తంభ్ ఫౌండేషన్' మనోబల్‌కు కూడా ఈ అవార్డును ఇవ్వనున్నారు. ఈ నెల 24న లతా మంగేష్కర్ తండ్రి దీనానాథ్ వర్ధంతి. అదే రోజు ఈ పురస్కారాల పంపిణీ ఉంటుంది.

రాబిన్‌హుడ్ డేట్ ఫిక్స్


నితిన్

నితిన్ హీరోగా రూపొందుతోన్న తాజా చిత్రం 'రాబిన్‌హుడ్' విడుదల తేదీ ఖరారు అయింది. డిసెంబర్ 20న ఈ చిత్రాన్ని రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. వెంకీ కుడుముల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో రాజేంద్ర ప్రసాద్, 'వెన్నెల' కిశోర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ''అన్ని వాణిజ్య అంశాలతో పాటు వినోదంతో రూపొందుతోన్న చిత్రం 'రాబిన్‌హుడ్'. ఈ చిత్రంలో నితిన్ మునుపెన్నడూ చూడని సరికొత్త పాత్రలో కనిపిస్తారు. తన గెటప్ నుండి క్యారెక్టరైజేషన్ వరకు పూర్తిగా డిఫరెంట్‌గా ప్రెజెంట్ చేస్తున్నారు వెంకీ కుడుముల. క్రిస్మస్ సెలవులు, ఆ తర్వాత న్యూ ఇయర్ సెలవులు మా సినిమాకి కలిసి రానున్నాయి'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్, కెమెరా: సాయి శ్రీరామ్.

హారర్...మిస్టరీ


సాయి శ్రీనివాస్

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా నటించనున్న 11వ సినిమా (బీఎస్‌ఎస్ 11 వర్కిం గ్ టైటిల్) ప్రకటన వెలువడింది. కౌశిక్ పెగళ్లపాటి దర్శకత్వంలో అర్చన సమర్పణలో ఈ చిత్రాన్ని సాహు గారపాటి నిర్మించనున్నారు. శ్రీరామ నవమి సందర్భంగా ఈ చిత్రాన్ని ప్రకటించి, లుక్ విడుదల చేశారు మేకర్స్. శ్రీరాముడు తన చేతిలోని విల్లుతో ఆకాశంలో ఉన్న రాక్షసుడికి బాణం ఎక్కుపెట్టడం లుక్‌లో కనిపిస్తుంది. ''మంచి భావోద్వేగాలతో కూడిన కమర్షియల్ చిత్రాలను రూపొందించడంలో పేరు పొందిన సాహు గారపాటి 'బీఎస్‌ఎస్ 11'ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మించనున్నారు. హారర్ మిస్టరీగా ఈ మూవీ రూపొందనుంది. ఇతర వివరాలు త్వరలో వెల్లడిస్తాం'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి కెమెరా: చిన్మయ్ సలాస్కర్, సంగీతం: బి. అజనీష్ లోకనాథ్.

జర్నీ టు అయోధ్య

శ్రీరామ నవమిని పురస్కరించుకుని చిత్రాలయం స్టూడియోస్ బ్యానర్ అధినేత వేణు దోనేపూడి 'జర్నీ టు అయోధ్య' (వర్కింగ్ టైటిల్) పేరుతో సినిమా ప్రకటించారు. ప్రస్తుతం గోపీచంద్ హీరోగా 'విశ్వం' చిత్రాన్ని నిర్మిస్తున్న ఈ బేనర్లో 'జర్నీ టు అయోధ్య' రెండో సినిమా. దర్శకుడు వీఎన్ ఆదిత్య ఈ చిత్రానికి కథ అందిస్తున్నారు. ''అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం రూపొందనుంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే వీఎన్ ఆదిత్య నేతృత్వంలో అయోధ్య సహా పలు చోట్ల లొకేషన్స్ పరిశీలిస్తున్నారు. ఒక యంగ్ డైరెక్టర్ తెరకెక్కించనున్న ఈ సినిమాలోని నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో తెలియజేస్తాం'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి దర్శక-నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ నిర్మాణ సారథ్యం వహిస్తున్నారు.


జర్నీ టు అయోధ్య పోస్టర్


జాన్వీ కపూర్

నమ్ముతున్నావా సుహానా?

''సుహానా.. నువ్వు చేసిన ప్రతిదీ నీ దేశం కోసమే చేశావని నమ్ముతున్నావా? మోసం... నిజాయితీ అనేవి కేవలం రెండు పదాలు సుహానా.. మనలాంటివాళ్లను ట్రాప్ చేయడానికి ఇవి ఉపయోగించబడతాయి.. ఈ దేశాలు, సరిహద్దులు... అవి కేవలం ఇసుక మీద రాసిన గీతలు...'' వంటి సంభాషణలు వచ్చే ముందు బ్యాక్‌గ్రౌండ్‌లో 'సారే జహా సే అచ్చా..' పాట వినబడటంతో హిందీ చిత్రం 'ఉలజ్' టీజర్ విడుదలైంది. జాన్వీ కపూర్ లీడ్ రోల్‌లో రూపొందుతున్న చిత్రం ఇది. ఈ చిత్రంలో ఇండియన్ ఫారిన్ సర్వీస్ ఆఫీసర్ సుహానా పాత్ర చేస్తున్నారు జాన్వీ. టీజర్‌లో సుహానాని ఉద్దేశించి గుల్షన్ దేవయ్య పాత్ర మాట్లాడుతున్నట్లుగా ఉంది. సుదాన్షు సరియా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో ఆదిల్ హుస్సేన్, గుల్షన్ దేవయ్య ప్రముఖ పాత్రల్లో కనిపిస్తారు. స్పై యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న 'ఉలజ్' జూలై 5న విడుదల కానుంది.


పమేలా ఆండర్సన్

టీచర్


స్వాతి

స్వాతి ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'టీచర్'. ఆదిత్య హసన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నిఖిల్ దేవాదుల (బాహుబలి ఫేమ్), నిత్యశ్రీ (కేరాఫ్ కంచరపాలెం ఫేమ్), రాజేంద్ర గౌడ్, సిద్ధార్థ్ (90స్ ఫేమ్) కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇటీవల '90స్–ఎ మిడిల్ క్లాస్ బయోపిక్'తో విజయం అందుకున్న ఎంఎస్‌ఓపీ సంస్థ.. అమోఘ ఆర్ట్స్ సహకారంతో కలిసి నిర్మిస్తున్న మూవీ ఇది. నవీన్ మేడారం నిర్మిస్తున్న ఈ సినిమా ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు మేకర్స్. ''ఆద్యంతం కడుపుబ్బా నవ్వించేలా 'టీచర్' తెరకెక్కుతోంది. తెలంగాణలోని అంకాపూర్ గ్రామంలో ఉన్న ముగ్గురు డల్ స్టూడెంట్స్‌కి సంబంధించిన కథతో ఈ మూవీ రూపొందుతోంది. ఈ చిత్రంలో స్వాతి టీచర్‌గా నటిస్తున్నారు. అల్లరి చేసే ఆ ముగ్గురు విద్యార్థులు.. టీచర్‌ని కలిసిన తర్వాత ఏం జరిగింది? వాళ్ల జీవితాలు ఎలా మారాయి? అనేది వినోదాత్మకంగా ఉంటుంది'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: అజీమ్ మహమ్మద్, సంగీతం: సిద్ధార్థ్ సదాశివుని.

నేకెడ్ గన్ రీమేక్‌లో...

హాలీవుడ్ హాట్ తార పమేలా ఆండర్సన్ అభిమానులకు ఓ శుభవార్త. ఈ గ్లామరస్ స్టార్ తాజాగా 'నేకెడ్ గన్' రీమేక్‌లో నటించడానికి అంగీకరించారు. ఈ మధ్యకాలంలో చేసిన చిత్రాల్లోకన్నా ఈ చిత్రంలో పమేలా పాత్ర నిడివి ఎక్కువ కావడం, హీరోయిన్ పాత్ర కావడం అనేది అభిమానులు ఆనందించే విషయమే. 1980 చివర్లలో 1990 ఆరంభంలో వచ్చిన క్రైమ్ కామెడీ 'నేకెడ్ గన్' ఫ్రాంచైజీలో వచ్చిన మూడు చిత్రాలు మంచి విజయాన్ని సొంతం చేసుకున్నాయి. మూడో భాగం 1994లో వచ్చింది. 30 ఏళ్లకు 'నేకెడ్ గన్' మళ్లీ తెరపైకి రానుంది. ఈ చిత్రాన్ని రీమేక్ చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. అకీవా షాఫర్ దర్శకత్వంలో రూపొందనున్న ఈ రీమేక్‌లో లీడ్ రోల్‌లో లియామ్ నీసన్ నటించనుండగా, అతని సరసన పమేలా ఆండర్సన్ నటించనున్నారు. గత మూడు భాగాల్లో డిటెక్టివ్ పాత్రను లెస్‌లీ నీల్సన్ చేయగా అతని ప్రేయసిగా ప్రిసిల్లా ప్రెస్లీ నటించారు. రీమేక్‌లో డిటెక్టివ్‌గా లియామ్ నీసన్, అతని ప్రేయసిగా పమేలా ఆండర్సన్ నటించనున్నారు. వచ్చే ఏడాది జూలై 18న ఈ చిత్రం విడుదల కానుంది. ఇక పమేలా గురించి చెప్పాలంటే... 1990లలో హాటెస్ట్ స్టార్ అంటే పమేలానే. 'ప్లే బాయ్' మ్యాగజీన్ మోడల్‌గా అప్పట్లో బోలెడంత పాపులార్టీ తెచ్చుకున్నారామె. అలాగే బుల్లితెర కోసం 'బేవాచ్' సిరీస్ (1992-1997)లో చేసిన సీజే పార్కర్ పాత్ర కూడా హాట్ స్టార్‌గా పమేలాకి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిపెట్టింది. సినిమాల పరంగా 'రా జస్టిస్, స్కేరీ మూవీ 3, బోరాట్, బేవాచ్' వంటివి పమేలా క్రేజ్ కొనసాగడానికి ఉపయోగపడ్డాయి.

సాక్షి బిజినెస్
గురువారం
18-4-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (మంగళవారం ముగింపు)	
సెన్సెక్స్ ▽ 456	72,944
నిఫ్టీ ▽ 125	22,148

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	15,723	▽	28
డోజోన్స్	37,708	△	91
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,848	△	28
డాక్స్	17,770	△	4
షాంఘై	3,071	△	64
నికాయ్	37,962	▽	509

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		83.04	84.06
£	బ్రిటన్ పౌండ్		104.56	106.76
€	యూరో		87.82	90.16
¥	జపాన్ ఎన్ (100)		53.77	54.97
AUS	ఆస్ట్రేలియా డాలర్		53.20	55.12
S$	సింగపూర్ డాలర్		59.26	63.40
SAR	సౌదీ రియాల్		21.37	22.88
UAE D	యూఏఈ దిర్హామ్		21.84	23.58
¥	చైనా యువాన్		10.40	12.38

అంబుజా సిమెంట్స్‌లో 70 శాతానికి అదానీ వాటా



న్యూఢిల్లీ: అంబుజా సిమెంట్స్‌లో అదానీ కుటుంబం వాటా 3.6 శాతం పెరిగి 70.3 శాతానికి చేరింది. ఇందుకోసం అదానీ కుటుంబం తాజాగా మరో రూ. 8,339 కోట్లు కంపెనీకి సమకూర్చింది. దీంతో మొత్తం మీద రూ. 20,000 కోట్లు సమకూర్చినట్లయిందని సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. అదానీ కుటుంబం 2022 అక్టోబర్‌లో రూ. 5,000 కోట్లు, 2024 మార్చి 28న రూ. 6,661 కోట్లు కంపెనీలో ఇన్వెస్ట్ చేసింది. వార్షికంగా ఉత్పత్తి సామర్థ్యాన్ని 76.1 మిలియన్ టన్నుల నుంచి 140 మిలియన్ టన్నులకు పెంచుకునేందుకు ఈ నిధులు తోడ్పడగలవని అంబుజా వివరించింది.

పేమెంట్ అగ్రిగేటర్లకు ఆర్‌బీఐ మార్గదర్శకాల ముసాయిదా



ముంబై: పేమెంట్ అగ్రిగేటర్ల (పీఏ) నిబంధనలను మరింత కఠినతరం చేసే దిశగా ఆర్‌బీఐ మార్గదర్శకాల ముసాయిదాను విడుదల చేసింది. డిజిటల్ లావాదేవీలు పెరుగుతుండటంలో పీఏలు కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో చెల్లింపుల వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఇవి తోడ్పడగలవని పేర్కొంది. పరిశ్రమవర్గాలు ఈ ముసాయిదాపై మే 31లోగా తమ అభిప్రాయాలను తెలియజేయాల్సి ఉంటుంది. దీని ప్రకారం తాము చేర్చుకునే వ్యాపారస్తుల వివరాలను పీఏలు క్షుణ్నంగా మదింపు చేయాలి. తమ ప్లాట్‌ఫాంపై అందించని సర్వీసులకు నిధులను సేకరించరాదు, సెటిల్మెంట్ చేయరాదు. పీఏ సర్వీసులు అందించే బ్యాంక్‌యేతర సంస్థల నికర విలువ, ఆథరైజేషన్ కోసం దరఖాస్తు చేసుకునేటప్పుడు కనీసం రూ. 15 కోట్లుగా ఉండాలి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

18-4-2024 ఫామ్ ధర...

విశాఖ	430-00
చిత్తూరు	483-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	415-00
విజయవాడ	415-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	410-00
వరంగల్	412-00
రిటైల్ ధర	4.70

రూ.10,000 కోట్ల వ్యాపార లక్ష్యం

- టీవీల విక్రయాల ద్వారా సాధిస్తాం
- శామ్‌సంగ్ ఇండియా వెల్లడి



న్యూఢిల్లీ: ఎలక్ట్రానిక్స్ తయారీ దిగ్గజం శామ్‌సంగ్ టీవీల అమ్మకాల ద్వారా 2024లో భారత మార్కెట్లో రూ.10,000 కోట్ల ఆదాయాన్ని ఆర్జించాలని లక్ష్యంగా చేసుకుంది. రూ.10 వేల కోట్ల మైలురాయిని చేరుకోవడం ఇప్పటి వరకు ఏ కంపెనీ సాధించలేదని కంపెనీ వెల్లడించింది. మధ్య స్థాయి, ప్రీమియం టీవీల విభాగంలో పరిమాణం పరంగా వృద్ధిలో ఉన్నట్టు శామ్‌సంగ్ ఇండియా విజువల్ డిస్‌ప్లే బిజినెస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మోహన్‌దీప్ సింగ్ తెలిపారు. 'ప్రీమియం టీవీలపై పెద్ద ఎత్తున ఫోకస్ చేశాం. కంపెనీ విక్రయాల్లో ఈ విభాగం వాటా 40%. యూహెచ్‌డీ, పెద్ద స్క్రీన్ టీవీల విక్రయాలతో ఈ ఏడాది వృద్ధి ఉంటుంది. ప్రీమియం ఉత్పత్తులకు మెట్రోలు, చిన్న పట్టణాల నుంచీ డిమాండ్ ఉంది' అని వివరించారు.

సంస్థకు 21 శాతం వాటా..

శామ్‌సంగ్ భారత్‌లో 2022-23లో రూ.98,924 కోట్ల టర్నోవర్ అందుకుంది. ఇందులో 70 శాతం మొబైల్స్ అమ్మకాల ద్వారా కాగా మిగిలినది టీవీలు, ఇతర ఉపకరణాల ద్వారా సమకూరింది. దేశీయ టీవీల విపణిలో పరిమాణం పరంగా సంస్థకు 21 శాతం వాటా ఉంది. శామ్‌సంగ్ తాజాగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత అల్ట్రా ప్రీమియం నియో క్యూఎల్‌ఈడీ టీవీలను భారత్‌లో ప్రవేశపెట్టింది. పిక్చర్ స్పష్టంగా, సహజత్వం ఉట్టిపడేలా ఉంటుందని కంపెనీ తెలిపింది. వీటి ప్రారంభ ధర రూ.1.39 లక్షలు. ఓఎల్‌ఈడీ టీవీల ప్రారంభ ధర రూ.1.64 లక్షలు. కాగా, శామ్‌సంగ్ దేశీ విక్రయ టీవీల్లో 90% భారత్‌లో తయారైనవే. దేశంలో ఏటా అన్ని బ్రాండ్లలో కలిపి 1.2 కోట్ల యూనిట్ల టీవీలు అమ్ముడవుతున్నాయని అంచనా.

'స్పేస్'లో మరిన్ని ఎఫ్‌డీఐలకు సై



- నిబంధనల సరళీకరణ
- ఉపగ్రహాల తయారీలో 74%, విడిభాగాల్లో 100% వరకు అనుమతి
- నోటిఫై చేసిన కేంద్రం

న్యూఢిల్లీ: అంతరిక్ష రంగంలో విదేశీ పెట్టుబడులను మరింతగా ఆకర్షించే దిశగా కేంద్రం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా మూడు కేటగిరీల కింద ఉపగ్రహాల తయారీ, శాటిలైట్ లాంచ్ వాహనాలు తదితర విభాగాల్లోకి వంద శాతం వరకు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డీఐ) అనుమతించేలా నిబంధనలను సవరిస్తూ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. దీని ప్రకారం ఉపగ్రహాల తయారీ, శాటిలైట్ డేటా ఉత్పత్తులు మొదలైన విభాగాల్లో 74 శాతం వరకు ఎఫ్‌డీఐలను అనుమతిస్తారు. అది దాటితే ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. మరోవైపు, లాంచ్ వెహికల్స్, వాటికి సంబంధించిన సిస్టమ్స్, స్పేస్‌క్రాఫ్ట్‌ల ప్రయోగం కోసం స్పేస్‌పోర్టుల ఏర్పాటు వంటి విభాగాల్లో 49 శాతం వరకు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అనుమతి ఉంటుంది. ఉపగ్రహాల విడిభాగాలు, సిస్టమ్స్/సబ్-సిస్టమ్స్ మొదలైన వాటి తయారీలో 100 శాతం ఎఫ్‌డీఐలను అనుమతిస్తారు. ఇప్పటివరకు ఉన్న పాలసీ ప్రకారం ఉపగ్రహాల తయారీ కార్యకలాపాల్లో ఎఫ్‌డీఐలకు ప్రభుత్వ అనుమతి తప్పనిసరిగా ఉంటోంది. కొత్త సవరణలకు కేంద్ర క్యాబినెట్ ఈ ఏడాది తొలి నాళ్లలోనే ఆమోదముద్ర వేసింది. వీటికి సంబంధించి కేంద్ర అంతరిక్ష విభాగం ఇన్-స్పేస్, ఇస్రో, ఎన్ఎస్ఐఎల్ వంటి పరిశ్రమ వర్గాలతో సంప్రదింపులు జరిపింది.

మస్క్ పర్యటన నేపథ్యంలో..

అమెరికన్ ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం టెస్లా చీఫ్ ఎలాన్ మస్క్ వచ్చే వారం భారత్‌లో పర్యటించనున్న సందర్భంలో తాజా పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. వేల కొద్దీ ఉపగ్రహాలతో ప్రపంచంలో ఎక్కడైనా హై-స్పీడ్ ఇంటర్నెట్‌ను అందించేలా ఎలాన్ మస్క్ తలపెట్టిన శాటిలైట్ ఇంటర్నెట్ ప్రాజెక్టు స్టార్‌లింక్‌కు ప్రస్తుతం అనుమతులను జారీ చేసే ప్రక్రియ తుది దశలో ఉంది. ఏప్రిల్ 21, 22 తేదీల్లో భారత్‌లో పర్యటించనున్న మస్క్ .. ప్రధాని నరేంద్ర మోదీతో పాటు పలు భారతీయ స్పేస్ కంపెనీలతో కూడా సమావేశం కానున్నారు.

మహిళా టెకీలకు డిమాండ్

టెక్‌యేతర రంగాల్లో ధోరణి • టీమ్‌లీజ్ డిజిటల్ నివేదిక



ముంబై: వచ్చే మూడేళ్లలో (2027 నాటికి) టెక్‌యేతర వ్యాపారాల్లో మహిళా టెకీల పాత్ర దాదాపు పాతిక శాతం మేర వృద్ధి చెందవచ్చని అంచనాలు నెలకొన్నాయి. ఈ ధోరణి అన్ని స్థాయుల్లో (ఫ్రెషర్లు, జూనియర్, మిడ్-సీనియర్, లీడర్‌షిప్, చీఫ్ ఎగ్జిక్యూటివ్) ఉండనుంది. టీమ్‌లీజ్ డిజిటల్ నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం 2023లో నాన్-టెక్ పరిశ్రమల్లో టెక్నాలజీ విధులు నిర్వర్తిస్తున్న మహిళల సంఖ్య 19.4 లక్షలుగా ఉండగా ఇది 2027 నాటికి 24.3 శాతం పెరిగి 24.1 లక్షలకు చేరనుంది. నాన్-టెక్ రంగాల్లో పని చేస్తున్న మొత్తం మహిళా సిబ్బందిలో 0.5 శాతం మంది మాత్రమే టెక్ ఉద్యోగ విధుల్లో ఉన్నారని, ఈ విభాగంలో వారి వాటా మరింతగా పెరగాల్సిన అవసరం ఉందని నివేదిక పేర్కొంది.

టెక్నాలజీలో మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటుండటం, మహిళల ఆధారిత కార్యక్రమాలు జరుగుతుండటం వంటి అంశాల ఊతంతో ఈ ఏడాది మహిళా టెకీల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉందని వివరించింది. రాష్ట్రాల వారీగా చూస్తే రాబోయే నెలల్లో మహిళల నియామకాలు మహారాష్ట్ర, తమిళనాడు, గుజరాత్‌లో అధికంగా ఉండనున్నాయి. చెన్నై, పుణె, నాసిక్, కోయంబత్తూర్, కోచి, ఔరంగాబాద్, వదోదర వంటి నగరాల్లో హైరింగ్ ఎక్కువగా ఉంది.

బిల్లు తగ్గినా దిగుమతి తగ్గలే

- గతేడాది 23.25 కోట్ల టన్నుల చమురు
- 87.7 శాతం వాటా దిగుమతులదే



న్యూఢిల్లీ: దేశీయంగా ముడిచమురు దిగుమతులు గతేడాది(2023-24) దాదాపు యథాతథంగా 23.25 కోట్ల టన్నులుగా నమోదయ్యాయి. అయితే అంతక్రితం ఏడాది(2022-23)తో పోలిస్తే చమురు దిగుమతుల(చెల్లింపుల) బిల్లు 16 శాతం తగ్గింది. వెరసి 157.5 బిలియన్ డాలర్ల బిల్లుకాస్తా గతేడాది రూ. 132.4 బిలియన్ డాలర్లకు దిగివచ్చింది. ఇందుకు అంతర్జాతీయ మార్కెట్లలో చమురు ధరలు క్షీణించడం సహకరించింది. కాగా.. చమురుకోసం విదేశీ సరఫరాలపై ఆధారపడటం అధికమైంది. 2022-23లో 87.4 శాతంగా నమోదైన దిగుమతుల వాటా గతేడాదిలో 87.7 శాతానికి పెరిగింది. దేశీయంగా రిఫైనరీలు ముడిచమురును శుద్ధి చేయడం(రిఫైనింగ్) ద్వారా పెట్రోల్, డీజిల్ తదితర ఇంధనాలను రూపొందించే సంగతి తెలిసిందే. చమురు శాఖకు చెందిన పెట్రోలియం ప్రణాళికలు, విశ్లేషణ విభాగం(పీపీఏసీ) విడుదల చేసిన గణాంకాలివి. వీటి ప్రకారం దేశీయంగా చమురు ఉత్పత్తి అంతక్రితం ఏడాదితో పోలిస్తే గతేడాది యథాతథంగా 2.94 కోట్ల టన్నులుగా నమోదైంది. చమురు దిగుమతులు, వినియోగంలో భారత్ ప్రపంచంలోనే మూడో పెద్ద ఆర్థిక వ్యవస్థకాగా.. దేశీ ఉత్పత్తి నీరసించడంతో విదేశీ సరఫరాలపై ఆధారపడటం పెరిగినట్లు పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి.

పెట్రోలియం ప్రొడక్టులూ

గతేడాది ముడిచమురుతోపాటు.. ఇండియా 23.4 బిలియన్ డాలర్ల విలువైన 4.81 కోట్ల టన్నుల పెట్రోలియం ప్రొడక్టులను దిగుమతి చేసుకుంది. వీటిలో ఎల్‌పీజీ, సీఎన్‌జీ తదితరాలున్నాయి. అయితే మరోవైపు 47.4 బిలియన్ డాలర్ల విలువైన 6.22 కోట్ల టన్నుల పెట్రోలియం ప్రొడక్టులను ఎగుమతి చేయడం గమనార్హం! గతేడాది భారత్ 13.3 బిలియన్ డాలర్ల విలువైన 30.91 బిలియన్ ఘనపు మీటర్ల(బీసీఎం) గ్యాస్‌ను దిగుమతి చేసుకుంది. అయితే రష్యా- ఉక్రెయిన్ యుద్ధం ప్రభావంతో భారీగా పెరిగిన ధరల కారణంగా 2022-23లో 26.3 బీసీఎం గ్యాస్‌కు ఏకంగా 17.1 బిలియన్ డాలర్లు చెల్లించింది. గతేడాది నికరంగా చమురు, గ్యాస్ దిగుమతులకు 121.6 బిలియన్ డాలర్లు వెచ్చించింది. ముడిచమురు, పెట్రోలియం ప్రొడక్టులు, ఎల్ఎన్‌జీ దిగుమతుల నుంచి ఎగుమతులను మినహాయించి అంతక్రితం ఈ పద్దు 144.2 బిలియన్ డాలర్లుగా నమోదైంది.

వొడాఫోన్ ఐడియాకు యాంకర్ నిధులు

ఎఫ్‌పీవోలో భాగంగా రూ. 5,400 కోట్లు



న్యూఢిల్లీ: వొడాఫోన్ ఐడియా ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫర్(ఎఫ్‌పీవో)కు యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి మద్దతు లభించింది. దీంతో దేశ, విదేశీ ఇన్వెస్టర్ల నుంచి రూ. 5,400 కోట్లు సమీకరించింది. వెరసి పేటీఎమ్, ఎల్ఐసీ తదుపరి మూడో పెద్ద యాంకర్ బుక్‌గా వొడాఫోన్ ఐడియా ఎఫ్‌పీవో నిలిచింది. గతంలో యాంకర్ ఇన్వెస్టర్ల ద్వారా పేటీఎమ్ రూ. 8,235 కోట్లు, ఎల్ఐసీ రూ. 5,627 కోట్లు చొప్పున సమకూర్చుకున్నాయి. కాగా.. షేరుకి రూ. 11 ధరలో 74 ఫండ్స్‌కు దాదాపు 491 కోట్ల షేర్లను కేటాయించినట్లు వొడాఫోన్ ఐడియా వెల్లడించింది. రూ. 5,400 కోట్లు అందుకున్నట్లు తెలియజేసింది. 5 దేశీ ఎంఎఫ్‌లకు 79.52 కోట్ల షేర్లను జారీ చేసినట్లు పేర్కొంది. ఇది 16.2 శాతం వాటాకు సమానమని తెలియజేసింది.

యస్ బ్యాంక్‌ను మించి

ఈ నెల 18న ప్రారంభమైన వొడాఫోన్ ఐడియా ఎఫ్‌పీవో 22న ముగియనుంది. ఇందుకు షేరుకి రూ. 10-11 ధరల శ్రేణిని నిర్ణయించింది. రూ. 18,000 కోట్ల సమీకరణ ద్వారా దేశంలోనే అతిపెద్ద ఎఫ్‌పీవోగా నిలవనుంది. ఇప్పటివరకూ 2020లో రూ. 15,000 కోట్లు సమీకరించిన యస్ బ్యాంక్ పేరిట ఈ రికార్డ్ నమోదై ఉంది.

భవిత

మేనేజ్‌మెంట్ విద్యకు మార్గం.. సీమ్యాట్

ఎంబీఏ స్పెషల్

» సీమ్యాట్ 2024కు ప్రకటన విడుదల
» దేశవ్యాప్త విద్యా సంస్థల్లో ప్రవేశాలకు అవకాశం



జాతీయ స్థాయిలో మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే కామన్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్ట్(సీమ్యాట్)కు ప్రకటన వెలువడింది. సీమ్యాట్‌లో స్కోర్‌తో దేశవ్యాప్తంగా ఏఐసీటీఈ అనుమతి ఉన్న విద్యాసంస్థల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో సీమ్యాట్ 2024ను నిర్వహించనున్నారు.

అర్హత

ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణతతో సీమ్యాట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం అర్హత కోర్సు చివరి సంవత్సరం చదువుతున్నవారూ దరఖాస్తు చేసుకోవచ్చు. గరిష్ఠ వయసు నిబంధన లేదు.

400 మార్కులకు సీమ్యాట్

ఆన్‌లైన్ విధానంలో 400 మార్కులకు పరీక్ష ఉంటుంది. ప్రతి ప్రశ్నకు 4 మార్కుల చొప్పున 100 ప్రశ్నలు వస్తాయి. ఇందులో ఒక్కో సెక్షన్ నుంచి 20 చొప్పున 5 విభాగాల్లో ప్రశ్నలు ఉంటాయి. క్వాంటిటేటివ్ టెక్నిక్స్ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్, లాజికల్ రీజనింగ్, లాంగ్వేజ్ కాంప్రహెన్షన్, జనరల్ అవేర్‌నెస్, ఇన్నోవేషన్ అండ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ విభాగాల్లో ఈ ప్రశ్నలు అడుగుతారు. ఆన్‌లైన్ పరీక్ష వ్యవధి 3 గంటలు. రుణాత్మక మార్కులుంటాయి. తప్పుగా గుర్తించిన ప్రతి సమాధానానికి ఒక్కో మార్కు చొప్పున తగ్గిస్తారు. ప్రశ్నపత్రం ఇంగ్లిష్ మాధ్యమంలో ఉంటుంది.

పరీక్షకు ప్రిపరేషన్ ఇలా

- ప్రాథమిక అధ్యయనం పూర్తయిన తర్వాత సీమ్యాట్ గత ప్రశ్నపత్రాలను ప్రాక్టీస్ చేయాలి. వీటిద్వారా ప్రశ్నలు అడిగే సరళి అర్థం అవుతుంది. పరీక్షకు ముందు వీలైనన్నీ మాక్ టెస్టులు రాయాలి. సూత్రాలు ఉపయోగించే విధానం తెలుసుకోవాలి. షార్ట్‌కట్ మెథడ్స్‌పై పట్టు సాధించాలి. ఐసెట్, మ్యాట్ సన్నద్ధత సీమ్యాట్‌కు ఉపయోగపడుతుంది.
- **లాంగ్వేజ్ కాంప్రహెన్షన్:** అభ్యర్థి ప్రాథమిక ఇంగ్లిష్ పరిజ్ఞానాన్ని పరిశీలించేలా ప్రశ్నలు వస్తాయి. ఖాళీలు పూరించడం, వాక్యంలో తప్పులను గుర్తించడం, సమానార్థాలు, వ్యతిరేక పదాలు, జాతీయాలు, సామెతలు, ప్రత్యక్ష, పరోక్ష వ్యాక్యలుగా మార్చడం, వాక్యంలో పదాలను క్రమ పద్ధతిలో అమర్చడం, కాంప్రహెన్షన్ తదితర విభాగాల్లో ప్రశ్నలు వస్తాయి.
- **క్వాంటిటేటివ్ టెక్నిక్స్ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్:** శాతాలు, నిష్పత్తి, సరాసరి, లాభనష్టాలు, కాలం-పని, కాలం-దూరం, వయసు నిర్ణయించడం, రైళ్లు, పడవ వేగాలు , కసాగు, గసాభా, వైశాల్యాలు వంటి అంశాలపై ప్రశ్నలుంటాయి. అలాగే నంబర్ అనాలజీ, నంబర్ క్లాసిఫికేషన్, ఫిగర్ అనాలజీ, వెన్ డయాగ్రమ్స్, నంబర్ సిరీస్, కోడింగ్, డీకోడింగ్, వర్డ్ బిల్డింగ్ మొదలైన విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. హైస్కూల్ స్థాయి పాఠ్యపుస్తకాలను చదవడం, మాక్ టెస్టులు రాయడం ద్వారా మంచి స్కోర్ చేయవచ్చు.
- **లాజికల్ రీజనింగ్:** ఈ విభాగంలో అజంప్షన్స్, కన్‌క్లూజన్‌లు, ఇన్ఫరెన్సెస్, కాజ్ అండ్ ఎఫెక్ట్, అనలిటికల్ రీజనింగ్, లీనియర్ అరెంజ్‌మెంట్, బ్లడ్ రిలేషన్స్, నంబర్ సిరీస్, నాన్ వెర్బల్ రీజనింగ్ తదితర అంశాల నుంచి ప్రశ్నలుంటాయి.
- **జనరల్ అవేర్‌నెస్:** ఇందులో ఎక్కువ ప్రశ్నలు దైనందిన జీవితంతో ముడిపడిన అంశాలతోనే వస్తాయి. పర్యావరణాంశాలు, వర్తమాన వ్యవహారాలపై ప్రశ్నలుగా అడుగుతారు. వీటితో పాటు భారత్-పొరుగు దేశాలు, చరిత్ర,సంస్కృతి, భూగోళం,ఆర్థిక వ్యవహారాలు,పాలిటీ, సైన్స్ అంశాల నుంచి ప్రశ్నలుంటాయి. హైస్కూల్ సోషల్, సైన్స్ పాఠ్యపుస్తకాలు చదవాలి. తాజా పరిణామాలపై అవగాహన పెంచుకోవాలి.
- **ఇన్నోవేషన్ అండ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్:** వివిధ కొత్త అవిష్కరణలపై అవగాహన పెంచుకోవాలి. కొత్త వ్యాపారం, స్టార్ట్ అప్‌లకు సంబంధించిన పథకాలు, ప్రోత్సాహకాలపై పరిజ్ఞానం ఉండాలి. తాజా వ్యాపార ధోరణులు, పెట్టుబడులు ఎఫ్‌డీఐ, స్కిల్ డెవలప్‌మెంట్, వెంచర్ క్యాపిటలిస్ట్, ఫైనాన్షియల్ అసిస్టెన్స్ తదితర అంశాలు తెలుసుకోవాలి.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:**18.04.2024
- **సవరణలకు అవకాశం:** 2024 ఏప్రిల్ 19-21వ తేదీ వరకు
- **సీమ్యాట్ పరీక్ష:** 2024, మేలో నిర్వహిస్తారు
- **వెబ్‌సైట్:** https://exams.nta.ac.in/CMAT

బెస్ట్ ఇన్‌స్టిట్యూట్స్‌లో.. బీఎస్+ఎంఎస్



సైన్స్‌పై ఆసక్తి ఉన్న ఇంటర్ ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు చక్కటి మార్గం.. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐఐఎస్ఈఆర్)! దేశంలో సైన్స్ విద్య, పరిశోధనలకు సంబంధించి ఐఐఎస్ఈఆర్ క్యాంపస్‌లకు ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్స్‌గా పేరుంది. ఈ క్యాంపస్‌లు అందించే బీఎస్, బీఎస్-ఎంఎస్ ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో చేరితే.. బ్యాచిలర్ స్థాయి నుంచే రీసెర్చ్ దిశగా నైపుణ్యాలు సొంతం చేసుకోవచ్చు!! తాజాగా ఐఐఎస్ఈఆర్‌ల్లో ప్రవేశాలకు ఐఏటీ-2024 నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో.. ఐఏటీ-2024తో ప్రవేశం కల్పించే క్యాంపస్‌లు-కోర్సులు, ప్రవేశ ప్రక్రియ, పరీక్ష విధానం, బెస్ట్ స్కోర్‌కు మార్గాలపై ప్రత్యేక కథనం..

» ఐఏటీ స్కోర్‌తో ఐఐఎస్ఈఆర్ క్యాంపస్‌ల్లో ప్రవేశం
» ఇంటర్ (ఎంపీసీ, బైపీసీ) అర్హతతో దరఖాస్తుకు అవకాశం
» కోర్సులు పూర్తి చేసుకుంటే సైన్స్ రంగంలో ఉజ్వల కెరీర్

దేశంలో సైన్స్ ఎడ్యుకేషన్, రీసెర్చ్ విభాగాల్లో నిపుణులను తీర్చిదిద్దే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన విద్యాసంస్థలు.. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ క్యాంపస్‌లు. ఐఐఎస్ఈఆర్‌కు దేశవ్యాప్తంగా ఏడు క్యాంపస్‌లు ఉన్నాయి. వీటిలో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్(ఇంజనీరింగ్ సైన్సెస్, ఎకనామిక్ సైన్సెస్), అయిదేళ్ల బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ + మాస్టర్ ఆఫ్ సైన్స్ ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఈ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష.. ఐఏటీ(ఐఐఎస్ఈఆర్ ఆప్టిట్యూడ్ టెస్ట్).

ఏడు క్యాంపస్‌లు.. 1933 సీట్లు

- ఐఏటీ స్కోర్ ఆధారంగా.. ఐఐఎస్ఈఆర్‌కు చెందిన ఏడు క్యాంపస్‌లలోని 1933 సీట్లకు పోటీ పడొచ్చు.
- **బీఎస్+ఎంఎస్ ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్:** బెర్హంపూర్ క్యాంపస్‌లో 180 సీట్లు; భోపాల్ క్యాంపస్‌లో 255 సీట్లు; కోల్‌కత క్యాంపస్‌లో 250; మొహాలీ క్యాంపస్‌లో 250; పుణె క్యాంపస్‌లో 288; తిరుపతి క్యాంపస్‌లో 275; తిరువనంతపురం క్యాంపస్‌లో 320 సీట్లు అందుబాటులో ఉన్నాయి.
- **భోపాల్‌లో బీఎస్:** బీఎస్+ఎంఎస్ డ్యూయల్ డిగ్రీ ప్రోగామ్‌తోపాటు ఐఐఎస్ఈఆర్‌లో అందుబాటులో ఉన్న మరో రెండు ప్రత్యేక ప్రోగ్రామ్‌లు.. బీఎస్ ఇంజనీరింగ్ సైన్సెస్, బీఎస్ ఎకనామికల్ సైన్సెస్.వీటిని ప్రస్తుతం భోపాల్ క్యాంపస్‌లో అందిస్తున్నారు. ఇంజనీరింగ్ సైన్సెస్‌లో 84సీట్లు, ఎకనామిక్ సైన్స్‌లో 31సీట్లు ఉన్నాయి. విద్యార్థుల్లో ఇంటర్ డిసిప్లినరీ అప్రోచ్.. మల్టీ డిసిప్లినరీ ప్రోగ్రామ్స్‌లో నైపుణ్యాలు పెంచే ఉద్దేశంతో ఈ కోర్సులను అందుబాటులోకి తెచ్చారు.

ఐఏటీ-2024 అర్హతలు

2022, 2023 విద్యాసంవత్సరాల్లో సైన్స్ స్ట్రీమ్‌లో ఇంటర్మీడియెట్(ఎంపీసీ, బైపీసీ)లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. 2024లో పరీక్షలకు హాజరైన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు 55 శాతం మార్కులు సాధిస్తే సరిపోతుంది.

ఐఏటీ పరీక్ష ఇలా

ఐఏటీ పరీక్ష మొత్తం నాలుగు విభాగాల్లో 60 ప్రశ్నలతో పరీక్ష నిర్వహిస్తారు. బయాలజీ, మ్యాథమెటిక్స్, కెమిస్ట్రీ, ఫిజిక్స్ సబ్జెక్ట్‌ల నుంచి 15 ప్రశ్నలు చొప్పున అడుగుతారు. మొత్తం 240 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయిస్తారు. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్క్ నెగెటివ్ మార్కుగా నిర్దేశించారు. పరీక్షకు లభించే సమయం మూడు గంటలు.

140 మార్కులు సాధించేలా

ఐఐఎస్ఈఆర్‌లో బీఎస్+ఎంఎస్, బీఎస్ (ఇంజనీరింగ్ సైన్సెస్, ఎకనామికల్ సైన్సెస్) కోర్సుల్లో ప్రవేశించాలనుకునే వారు ఐఏటీలో 140కి పైగా మార్కులు సాధించేలా కృషి చేయాలని సబ్జెక్ట్ నిపుణులు సూచిస్తున్నారు. గతంలో జనరల్ కేటగిరీలో 230 మార్కుల నుంచి 140 మార్కుల మధ్యలో సాధించిన వారికి సీట్లు లభించాయి.

వినూత్న బోధన విధానం

- ఐఐఎస్ఈఆర్ క్యాంపస్‌లలో బీఎస్+ఎంఎస్ కోర్సులకు వినూత్న బోధన విధానాన్ని అమలు చేస్తున్నారు. మొత్తం పది సెమిస్టర్లుగా అయిదేళ్ల వ్యవధిలో ఉండే ఈ ప్రోగ్రామ్‌లో.. మొదటి రెండేళ్లు ఫౌండేషన్ కోర్సుగా ఉమ్మడి సబ్జెక్ట్‌లతో బోధన సాగుతుంది. మూడు, నాలుగు సంవత్సరాల్లో అభ్యర్థులు తాము ఎంచుకున్న మేజర్ (బయాలజీ/కెమిస్ట్రీ/ఫిజిక్స్/ మ్యాథమెటిక్స్) సబ్జెక్ట్‌లలో బోధన సాగిస్తారు. వీటితోపాటు అభ్యర్థులు తమకు ఆసక్తి ఉన్న మైనర్ సబ్జెక్ట్‌లను కూడా ఎంచుకోవచ్చు. అయిదో ఏడాది పూర్తిగా రీసెర్చ్ యాక్టివిటీస్‌పైనా, థీసిస్ వర్క్ పూర్తి చేసే విధంగా ఉంటుంది.
- ఐఐఎస్ఈఆర్-భోపాల్ క్యాంపస్‌లోని నాలుగేళ్ల బీఎస్ ఇంజనీరింగ్ సైన్సెస్‌లో.. మొదటి రెండేళ్లు ఉమ్మడి కరిక్యులం ఉంటుంది. ఆ తర్వాత రెండేళ్లు కెమికల్ ఇంజనీరింగ్ లేదా డేటా సైన్స్ అండ్ ఇంజనీరింగ్ లేదా ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అండ్ కంప్యూటర్ సైన్స్ సబ్జెక్ట్‌లను మేజర్ సబ్జెక్ట్‌లుగా బోధన సాగిస్తారు. అభ్యర్థులు తమకు ఆసక్తి ఉన్న సబ్జెక్ట్‌ను మేజర్ సబ్జెక్ట్‌గా ఎంచుకోవాల్సి ఉంటుంది.

ఉజ్వల అవకాశాలు

ఐఐఎస్ఈఆర్‌లో బీఎస్, బీఎస్+ఎంఎస్ కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులు సైన్స్ రంగంలో ఉజ్వల కెరీర్స్ అందుకునే అవకాశముంది. ప్రభుత్వ రీసెర్చ్ లేబొరేటరీల్లో ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్‌లో ప్రవేశించే అవకాశం ఉంటుంది. అదే విధంగా ఫార్మా, కెమికల్, సిమెంట్ రంగాల్లో కొలువులు సొంతం చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:**2024 ఏప్రిల్ 1-మే13
- **దరఖాస్తు సవరణ:** 2024 మే 16, 17 తేదీల్లో
- **హాల్ టికెట్‌ల జారీ:** 2024 జూన్ 1 నుంచి
- **ఐఏటీ పరీక్ష తేదీ:** 2024, జూన్ 9
- **వెబ్‌సైట్:** https://iiseradmission.in

ఐఏటీలో బెస్ట్ స్కోర్‌కు మార్గాలివే

ఫిజిక్స్

ఈ సబ్జెక్ట్‌లో రిఫ్రాక్షన్స్, అప్లికేషన్ ఇన్ డైలీ లైఫ్, 'లా'స్ అండ్ మోషన్, గ్రేవిటేషన్, థర్మోడైనమిక్స్, ఆప్టిక్స్, డ్యూయల్ రేడియేషన్ అండ్ మ్యాటర్, థర్మో డైనమిక్స్, ఎలక్ట్రో మ్యాగ్నటిజం అంశాలపై దృష్టి సారించాలి.

కెమిస్ట్రీ

విద్యార్థులు కొంత సులభంగా భావించే కెమిస్ట్రీలో.. పిరియాడిక్ క్లాసిఫికేషన్ ఆఫ్ ఎలిమెంట్స్, క్లాసిఫికేషన్ ఆఫ్ ఎలిమెంట్స్ అండ్ పిరియాడిసిటీ ఇన్ ప్రాపర్టీస్, ఎన్విరాన్‌మెంటల్ కెమిస్ట్రీ, మెటల్స్ అండ్ నాన్ మెటల్స్, జనరల్ ప్రిన్సిపుల్స్ అండ్ ప్రాసెసెస్ ఆఫ్ ఐసోలేషన్ ఎలిమెంట్, పి-బ్లాక్ ఎలిమెంట్స్, డి అండ్ ఎఫ్ బ్లాక్ ఎలిమెంట్స్, కోఆర్డినేషన్ కంపౌండ్స్, హాలోఅల్కనేస్ అండ్ హాలోరెన్స్‌లపై అవగాహన ఏర్పరచుకోవాలి.

బయాలజీ

జనటిక్ ఎవల్యూషన్, అవర్ ఎన్విరాన్‌మెంట్, లైఫ్ ప్రాసెస్, హ్యూమన్ సైకాలజీ, బయో టెక్నాలజీ అండ్ ఇట్స్ అప్లికేషన్స్, ప్రిన్సిపుల్ ఆఫ్ ఇన్‌హెరిటెన్స్ అండ్ వేరియేషన్, మాలిక్యులర్ బేసిస్ ఆఫ్ ఇన్‌హెరిటెన్స్, హ్యూమన్ ఫిజియాలజీ అండ్ అనాటమీ, ప్లాంట్ ఫిజియాలజీ, ఎకాలజీలపై దృష్టి పెట్టాలి.

మ్యాథమెటిక్స్

ఈ సబ్జెక్ట్‌లో క్వాడ్రటిక్ ఈక్వేషన్స్, మ్యాథమెటికల్ రీజనింగ్, స్టాటిస్టిక్స్ ప్రాబబిలిటీ, రియల్ నంబర్, అనలిటికల్ జామెట్రీ ఇన్ టూ డైమెన్షన్, కోఆర్డినేట్ జామెట్రీ, మ్యాథమెటికల్ రీజనింగ్, ఎవల్యూషన్ ఆఫ్ ఇంటెగ్రల్స్,ప్రాబబిలిటీ, ట్రిగ్నోమెట్రీ, కాలిక్యులస్, ఫంక్షన్స్‌లపై పట్టు సాధించాలి.

ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలు

ఐఐఎస్ఈఆర్ ఐఏటీ ప్రిపరేషన్ కోసం విద్యార్థులు పదకొండు, పన్నెండు తరగతులకు సంబంధించి ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల ఆధారంగా అధ్యయనం సాగించాలి. గత ప్రశ్న పత్రాలను పరిశీలిస్తూ.. ఆయా అంశాలకు లభిస్తున్న వెయిటేజీని పరిగణనలోకి తీసుకోవాలి. వీటితోపాటు.. మోడల్ టెస్ట్‌లు, మాక్ టెస్ట్‌లకు హాజరవడం కూడా మేలు చేస్తుంది. అదే విధంగా జేఈఈ-మెయిన్, అడ్వాన్స్‌డ్ గత ప్రశ్న పత్రాల సాధన కూడా ఉపయుక్తంగా ఉంటుంది.

బేసిక్స్‌పై పట్టు సాధిస్తూ

ఐఐఎస్ఈఆర్ ఐఏటీ ప్రిపరేషన్ సమయంలో అభ్యర్థులు అన్ని సబ్జెక్ట్‌లలోని బేసిక్ కాన్సెప్ట్స్, ఫార్ములాలపై పూర్తి స్థాయిలో పట్టు సాధించాలి. అదే విధంగా ఆయా అంశాలను చదివేటప్పుడు అప్లికేషన్ అప్రోచ్‌తోపాటు ప్రాక్టీస్‌కు ప్రాధాన్యమివ్వాలి. ముఖ్యంగా ఫిజిక్స్‌లో ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. అదే విధంగా ముఖ్యమైన కాన్సెప్ట్‌లు, ఫార్ములాలు, నిర్వచనాలను షార్ట్ నోట్స్‌గా రూపొందించుకుంటే.. రివిజన్ సమయంలో ఉపయుక్తంగా ఉంటుంది.

ఆగని భగభగలు

46 డిగ్రీల దిశగా ఉష్ణోగ్రతలు • పలుచోట్ల 42-45 డిగ్రీలకు నమోదు



ప్రధాన నగరాలు, పట్టణాల్లో మంగళవారం నమోదైన ఉష్ణోగ్రతలు

నగరం/పట్టణం	గరిష్ఠం	కనిష్ఠం
రెంటచింతల	44.3	26.6
రాజమహేంద్రవరం	44.0	26.0
ఏలూరు	44.0	25.0
కర్నూలు	43.5	29.7
తిరుపతి	43.0	25.0
కడప	42.6	27.4
విజయవాడ	42.0	28.0
గుంటూరు	42.0	27.0
మార్కాపురం	42.0	25.0
విజయనగరం	41.0	36.0
నెల్లూరు	41.0	30.9
అనకాపల్లి	40.5	26.5
విశాఖపట్నం	37.8	25.8

- విజృంభిస్తున్న తీవ్ర వడగాడ్పులు
- రాయలసీమ మీదుగా కొనసాగుతున్న ద్రోణి
- అక్కడక్కడ తేలికపాటి వర్షాలకు అవకాశం

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో భానుడి భగభగలు కొనసాగుతున్నాయి. రోజురోజుకు మరింత తీవ్ర రూపం దాలుస్తున్నాయి. పలుచోట్ల 42 నుంచి 45 డిగ్రీలకుపైగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సాధారణంకంటే 3–6 డిగ్రీలు అధికంగా ఇవి రికార్డవుతుండడంతో అనేక మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, వడగాడ్పులు వీస్తున్నాయి. జనాన్ని బెంబేలెత్తిస్తున్నాయి. బుధవారం అత్యధికంగా వైఎస్సార్ జిల్లా కొంగలవీడులో 45.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. పెద్దదేవళాపురం (నంద్యాల జిల్లా) 44.9, రావికమతం (అనకాపల్లి), రామభద్రపురం (విజయనగరం), దొనకొండ (ప్రకాశం),



మంగనెల్లూరు (తిరుపతి)ల్లో 44.1 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. 16 జిల్లాల్లో 43 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 67 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 125 మండలాల్లో వడగాడ్పులు వీచాయి. గురువారం 76 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 214 మండలాల్లో వడగాడ్పులు వీయనున్నాయి. **విజయనగరం జిల్లాలో 22, పార్వతీపురం మన్యం 13, శ్రీకాకుళం 12, అనకాపల్లి 11, పల్నాడు** 7, అల్లూరి సీతారామరాజు 4, కాకినాడ 3, తూర్పు గోదావరి 2, ఎన్టీఆర్ 2 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీచే అవకాశాలున్నాయి. ప్రకాశం 24, గుంటూరు 17, తూర్పు గోదావరి 17, పల్నాడు 16, ఎన్టీఆర్ 14, శ్రీకాకుళం 14, కృష్ణా 13, కాకినాడ 12, బాపట్ల 12, ఎస్పీఎస్సార్ నెల్లూరు 11, అల్లూరి సీతారామరాజు 11, ఏలూరు 9, తిరుపతి 7, కోనసీమ 7, అనకాపల్లి 6, విజయనగరం 5, విశాఖపట్నం 3, పశ్చిమ గోదావరి 3 మండలాల్లోను, పార్వతీపురం మన్యం, నంద్యాల, వైఎస్సార్ జిల్లాల్లో ఒక్కో మండలంలోను వడగాడ్పులు వీచే అవకాశాలున్నాయి. శుక్రవారం 47 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 229 మండలాల్లో వడగాడ్పులు వీస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

మూడురోజులు తేలికపాటి వర్షాలు

మరోవైపు గల్ఫ్ ఆఫ్ మన్నార్ నుంచి దక్షిణ తెలంగాణ వరకు తమిళనాడు, రాయలసీమల మీదుగా వ్యాపించి ఉన్న ద్రోణి సగటు సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతోంది. దీని ప్రభావంతో రానున్న మూడు రోజులు కోస్తాంధ్ర, రాయలసీమల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) బుధవారం నివేదికలో తెలిపింది. అదే సమయంలో ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు కూడా సంభవించవచ్చని పేర్కొంది. అందువల్ల ఆయా ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. గురువారం అల్లూరి సీతారామరాజు, తూర్పు గోదావరి, కర్నూలు, నంద్యాల, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు జిల్లాలు, శుక్రవారం ప్రకాశం, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు జిల్లాలు, శనివారం అల్లూరి సీతారామరాజు, కాకినాడ జిల్లాల్లో ఈ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ వివరించింది.

ఫ్రాంక్ మోర్నీతో 'అవేరా' ఒప్పందం

సాక్షి, అమరావతి: రాష్ట్రానికి చెందిన ఎలక్ట్రిక్ స్కూటర్ల తయారీ సంస్థ అవేరా.. చైనాకు చెందిన ఎలక్ట్రిక్ స్కూటర్ల సంస్థ ఫ్రాంక్ మోర్నీతో ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం నూతన టెక్నాలజీని అనుసంధానం చేస్తూ కొత్త మోటార్ల అభివృద్ధి, పరిశోధనపై రెండు సంస్థలు కలిసి పనిచేయనున్నాయి. పర్యావరణ పరిరక్షణకు ఎలక్ట్రిక్ వాహనాలు దోహదపడుతున్న తరుణంలో ఈ ఒప్పందంతో ఈ రంగంలో మరింత వేగంగా విస్తరిస్తామని అవేరా విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. మొబిలిటీ టెక్నాలజీపై మరింత పరిశోధనలు చేయడానికి ఈ ఒప్పందం దోహదం చేస్తుందని తెలిపింది.

నేడు సుప్రీంలో చంద్రబాబు మరో కేసు విచారణ

ఓటుకు కోట్లు కేసు విచారించనున్న జస్టిస్ సుందరేశ్ ధర్మాసనం

సాక్షి, న్యూఢిల్లీ: టీడీపీ అధినేత చంద్రబాబుపై మరో కేసును సుప్రీంకోర్టు గురువారం విచారించనుంది. తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఓటుకు కోట్లు కేసును జస్టిస్ సుందరేశ్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టితో కూడిన ధర్మాసనం విచారించనుంది. ఈ కేసులో చంద్రబాబును నిందితునిగా చేయాలని, దర్యాప్తు సీబీఐకి అప్పగించాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి దాఖలు చేసిన రెండు వేర్వేరు పిటిషన్లను ధర్మాసనం విచారించనుంది. ఈ కేసు ఈ నెల 4న ఇదే ధర్మాసనం ముందుకు విచారణకు రాగా చంద్రబాబు తరఫు న్యాయవాదులు మరోసారి వాయిదా వేయాలని కోరారు. ఇప్పటికే పలుమార్లు వాయిదా కోరారని, మరోసారి కోరవద్దని ధర్మాసనం చెప్పింది. ఈ నేపథ్యంలో ఈ కేసు వాదనలు గురువారం ప్రారంభమయ్యే అవకాశం ఉంది. అయితే, ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలు ఊపందుకున్న నేపథ్యంలో ఏదో ఒకటి చెప్పి చంద్రబాబు తరఫు న్యాయవాదులు మరోసారి వాయిదా కోరతారని న్యాయనిపుణులు చెబుతున్నారు.

ఓటుకు కోట్లు కేసులో చంద్రబాబుకు శిక్ష తప్పదు

- ఇది కచ్చితంగా బాబు పట్టుబడే కేసే
- అందుకే ఆయన లాయర్లు సిల్లీ కారణాలతో వాయిదాలు కోరుతున్నారు
- చిన్న పాయింట్‌తో కేసును సాగదీస్తున్నారు
- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డ వ్యక్తి తెలంగాణకు సీఎం అయ్యారు
- మరో వ్యక్తి చంద్రబాబు సీఎం పదవి కోసం నిస్సిగ్గుగా బయట తిరుగుతున్నాడు
- కేసీఆర్ ఈ కేసును స్వార్థ రాజకీయాలకు వాడుకున్నారు
- వైఎస్సార్‌సీపీ మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: ఓటుకు కోట్లు కేసులో మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుకు శిక్ష తప్పదని మంగళగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) స్పష్టంచేశారు. ఈ కేసులో న్యాయం గెలుస్తుందని, చంద్రబాబుకు శిక్ష తప్పదని తెలిసే ఆయనకు ఒంట్లో బాలేదని, బంధువుల ఇళ్లల్లో పెళ్లిళ్లు ఉన్నాయంటూ చిల్లర కారణాలతో వారు వాయిదాలు కోరుతున్నారని అన్నారు. ఈ కేసులో చంద్రబాబును, రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డ తెలంగాణ సీఎంను తప్పించేందుకు చంద్రబాబు లాయర్లు వాదనలు జరగకుండా సిల్లీ కారణాలతో వాయిదాలు వేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. గురువారం సుప్రీం కోర్టులో 'ఓటుకు కోట్లు' కేసుపై విచారణ జరగనున్న నేపథ్యంలో ఎమ్మెల్యే ఆర్కే బుధవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. ఈ కేసును త్వరగా విచారించాలంటూ గతంలో న్యాయమూర్తి నాగేశ్వరరావు తీర్పు ఇచ్చారని, ఏ రోజుకు ఆ రోజు విచారించాలని తెలుపుతూ జస్టిస్ బోప్డే తీర్పు ఇచ్చారని తెలిపారు. స్పష్టమైన తీర్పులు ఉన్నా.. చంద్రబాబు లాయర్లు చిన్న పాయింట్‌ని పట్టుకుని ఈ కేసును ఏడేళ్లుగా సాగదీస్తున్నారని, కోర్టును తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. న్యాయస్థానాల తీర్పులు చట్టానికి లోబడి త్వరితగతిన వెలువడాలని కోరుతున్నట్లు చెప్పారు. గురువారం నుంచైనా వాదనలు జరిగేలా కోర్టులు ముందుకెళ్తాయని భావిస్తున్నట్లు వివరించారు.

బాబు నిస్సిగ్గుగా బయట తిరుగుతున్నారు

రూ.50 లక్షలు అడ్వాన్స్‌గా ఇస్తూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డ వ్యక్తి తెలంగాణకు ముఖ్యమంత్రిగా ఉన్నారని, ప్రధాన సూత్రధారిగా ఉన్న మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి పదవి కోసం నిస్సిగ్గుగా బయట తిరుగుతున్నారని మండిపడ్డారు. ఆడియో, వీడియో టేపులతో రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిన దొంగలు బయట బాహాటంగా, దేశాన్ని ఉద్ధరించే నాయకులుగా చలామణి అవుతున్నారంటే ప్రజల్లో ఎలాంటి సంకేతాలు వెళతాయో న్యాయస్థానాలు ఆలోచించాలని అభిప్రాయపడ్డారు. ఈ కేసులో చంద్రబాబుకు సుప్రీం కోర్టు నోటీసులు ఇచ్చినా సిగ్గూ, లజ్జా లేకుండా బుకాయిస్తూ బయట తిరుగుతున్నారని అన్నారు. డబ్బు కట్టలతో దొరికిన వ్యక్తి తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారని విమర్శించారు. అప్పటి కేసీఆర్ ప్రభుత్వం ఈ కేసును స్వార్థ రాజకీయాలకు వాడుకుందని ఆరోపించారు. అధికారంలో ఉన్నప్పుడు కేసు గురించి మాట్లాడని వారు.. ఇటీవల తెలంగాణ హైకోర్టుపై నమ్మకం లేదని, మధ్యప్రదేశ్‌కు ఈ కేసును బదిలీ చేయాలంటూ సుప్రీం కోర్టును ఆశ్రయించడం ఆశ్చర్యానికి గురి చేస్తుందన్నారు. అప్పుడే కేసీఆర్ ఈ కేసుపై సీరియస్‌గా ఉంటే ఇప్పటికే చంద్రబాబుకు శిక్ష పడి ఉండేదని చెప్పారు.

ఒక కేసు.. ఐదు పిటిషన్లు

తాను వేసిన రెండు పిటిషన్లతో పాటు మరో మూడు పిటిషన్లను విచారించేందుకు సుప్రీం కోర్టు అంగీకరించిందని చెప్పారు. తెలంగాణ ఏసీబీ ఈ కేసును సరిగా విచారణ చేయిట్లేదని, సీబీఐకి అప్పగించాలని ఒక పిటిషన్ వేసినట్లు చెప్పారు. చంద్రబాబును ముద్దాయిగా చేర్చాలంటూ తగిన ఆధారాలతో రెండో పిటిషన్ వేశానన్నారు. ఈ రెండూ గురువారం విచారణకు వస్తున్నాయన్నారు. వీటితోపాటు జెరూసలేం మత్తయ్యను తెలంగాణ హైకోర్టు క్వాష్ చేయడంపై ఏసీబీ సుప్రీం కోర్టును ఆశ్రయించిందని తెలిపారు. మత్తయ్యను క్వాష్ చేయడంపై అభ్యంతరం తెలుపుతూ సెబాస్టియన్ కూడా సుప్రీంను ఆశ్రయించారన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు తెలంగాణ సీఎంగా ఉన్నందున, ఈ కేసును తెలంగాణ హైకోర్టులో విచారించొద్దంటూ ఆ రాష్ట్రానికి చెందిన మాజీ మంత్రులు జగదీష్ రెడ్డి, సత్యవతి రాథోడ్, మహమూద్ అలీ తదితరులు సుప్రీంను ఆశ్రయించారని, ఇది ఐదో పిటిషన్ అని పేర్కొన్నారు.

పురందేశ్వరి వైఖరిపై కాపుల మండిపాటు

- బీజేపీ అభ్యర్థుల్లో కాపు నేతలేరి?
- బీజేపీ కేంద్ర నాయకత్వానికి లేఖ రాసిన పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆనంద్

సాక్షి, అమరావతి: ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి ఏకపక్ష వైఖరిని తప్పుపడుతూ పార్టీలోని కొందరు కాపు, బలిజ నాయకులు తీవ్రస్థాయిలో మండిపడుతూ జాతీయ నాయకత్వానికి ఫిర్యాదు చేశారు. పొత్తులో బీజేపీకి కేటాయించిన సీట్లతో పాటు అభ్యర్థుల ఎంపికలో కాపు సామాజిక వర్గానికి కనీస ప్రాధాన్యత దక్కలేదని, ఇందుకు రాష్ట్ర అధినాయకత్వ నిర్ణయాలే కారణమని రాష్ట్ర బీజేపీ కార్యదర్శి, శ్రీకాళహస్తి నియోజకవర్గ కన్వీనర్ కోలా ఆనంద్ జాతీయ నాయకత్వానికి లేఖ రాశారు. ఆ లేఖ ప్రతులు బుధవారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. పొత్తులో భాగంగా బీజేపీకి 6 లోక్‌సభ, 10 అసెంబ్లీ స్థానాలు కేటాయించినా.. ఒక ఎంపీ, ఎమ్మెల్యే స్థానం కూడా కాపు, బలిజ నాయకులకు ఇవ్వకపోవడం విచారకరమంటూ ఆయన మరో లేఖను రాష్ట్ర పార్టీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరికి పంపించారు. బీజేపీ జాతీయ నాయకత్వం సోము వీర్రాజు వంటి నాయకులకు రాష్ట్ర పార్టీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించి ప్రాధాన్యత ఇచ్చిందని, ఇప్పుడు పొత్తులో ఒక్క సీటు కూడా దక్కకపోవడం 'ఎవరి తప్పు' అంటూ పురందేశ్వరికి రాసిన లేఖలో కోలా ఆనంద్ ప్రశ్నించారు. పురందేశ్వరి, చంద్రబాబు వ్యవహార శైలిపై బీజేపీ ప్రస్తుత రాష్ట్ర కార్యవర్గంలో కీలక బాధ్యతల్లో పనిచేస్తున్న 9 మంది నాయకులు జాతీయ నాయకత్వానికి ఫిర్యాదు చేస్తూ లేఖ రాసిన విషయం తెలిసిందే.

వీశాట్–2024 ఫలితాలు విడుదల

ఏప్రిల్ 24 నుంచి 30 వరకు కౌన్సెలింగ్



ఫలితాల సీడీను విడుదల చేస్తున్న వీసీ నాగభూషణ్ తదితరులు

చేబ్రోలు: విజ్ఞాన్ వర్సిటీలో బీటెక్, బీఫార్మసీ, బీఎస్సీ అగ్రికల్చరల్ ప్రవేశాలకు దేశవ్యాప్తంగా నిర్వహించిన వీశాట్–2024 ఫేజ్–1 ఫలితాలను బుధవారం విడుదల చేశారు. వీసీ నాగభూషణ్ మాట్లాడుతూ..వీశాట్–2024 ర్యాంకులతో పాటు జేఈఈ మెయిన్ ఫలితాలు, ఎంసెట్ ర్యాంక్‌లు, ఇంటర్ మార్కు లనూ పరిగణనలోనికి తీసుకుంటామన్నారు. వీశాట్‌లో 1–50 లోపు ర్యాంకులు సాధించిన వారికి 50% స్కాలర్‌షిప్, 51–200 లోపు ర్యాంక్‌లు సాధించిన వారికి 25% స్కాలర్‌షిప్, 201–2,000లోపు ర్యాంకులు సాధించిన వారికి 10% స్కాలర్‌షిప్‌ను నాలుగేళ్ల పాటు అందజేస్తామన్నారు. ఇంటర్ లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు, జేఈఈ మెయిన్స్ లోఅత్యధిక పర్సంటైల్ సాధించిన విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేస్తామన్నారు. ఈ నెల 24–30వరకు విజ్ఞాన్ వర్సిటీలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. వీశాట్ ఫేజ్–2 పరీక్షలను మే 1–15 వరకు నిర్వహిస్తామని చెప్పారు. వీశాట్‌లో ఎం.బాలమూర్తి, డి.లోకేశ్ రాజ్, ఓ.శివమణికంఠ, పి.కార్తికేయ చౌదరి, పి.బాల శివ సత్యనారాయణ, జి.అచ్యుత కుమార్, వై.మణి ధీరజ్, జీ.హిమనీష్ నందన్ రెడ్డి, కే.సత్య సాయి దుర్గ సాత్విక్, ఐ.వినయ్ కుమార్ రెడ్డిలు తొలి 10 ర్యాంకులు సాధించారని డీన్ అడ్మిషన్స్ కేవీ కృష్ణ కిషోర్ తెలిపారు.

రైతులకు నయవంచకుల బురిడీ

- లీజు పేరుతో ట్రాక్టర్ యజమానులకు మోసం
- ముగ్గురు నిందితుల అరెస్టు
- 57 ట్రాక్టర్లు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

తాడిమర్రి: రైతుల వద్ద ట్రాక్టర్లను లీజుకు తీసుకుని, వాటిని ఇతరులకు అమ్మి సొమ్ము చేసుకున్న ముగ్గురు వ్యక్తులను బుధవారం శ్రీసత్యసాయి జిల్లా పోలీసులు అరెస్టు చేసి, వారినుంచి రూ.4.56 కోట్ల విలువ చేసే 57 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి తాడిమర్రి పోలీసుస్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. శ్రీసత్యసాయి జిల్లా నల్లచెరువు మండలం బొమ్మిరెడ్డిపల్లికి చెందిన నల్లజంగిరి రవికుమార్, వైఎస్సార్ జిల్లా పులివెందుల పట్టణానికి చెందిన లోమడ బయారెడ్డి, ప్రొద్దుటూరులోని ఎస్ఆర్‌కే బ్రిక్స్ ఇండస్ట్రీస్‌లో పనిచేయడానికని రైతులను నమ్మించి లీజు పేరుతో తాడిమర్రి, కణేకల్లు మండలాలకు చెందిన పలువురు రైతుల వద్ద ట్రాక్టర్లను తీసుకున్నారు. ఒక్కొక్క ట్రాక్టర్‌పై నెలకు రూ.25 వేల లీజు చెల్లిస్తామని నమ్మబలికారు. అనంతరం వాటిని పులివెందుల పరిసర ప్రాంతాల్లో విక్రయించి సొమ్ము చేసుకున్నారు. ట్రాక్టర్ యజమానులకు అనుమానం రాకుండా మూడు నెలల పాటు లీజు చెల్లించారు. తరువాత కనిపించకుండా పోయారు. దీంతో తాడిమర్రికి చెందిన దేవర రామ్మోహన్ అనే బాధితుడు ఈ ఏడాది మార్చి 11న తాడిమర్రి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో డీఎస్పీ శ్రీనివాసులు ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో రవికుమార్, బయారెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించగా.. వారితో పాటు కాకర్ల హాజీపీరా, బోగిరెడ్డి చంద్రఓబులరెడ్డి, పెసల నాగమల్లారెడ్డి, తలారి రామలింగేశ్వరరావు, చిన్న జయచంద్రారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సాకే రామ్మోహన్, సుదర్శన్‌రెడ్డి అనే వ్యక్తులతో కూడిన ముఠా గుట్టురట్టయ్యింది. వీరు ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అనేక మంది రైతుల వద్దనుంచి ట్రాక్టర్లను లీజుకు తీసుకుని వాటిని నెల్లూరు, ప్రకాశం, వైఎస్సార్, కర్నూలు, నంద్యాల, గుంటూరు జిల్లాల్లోని వివిధ గ్రామాల్లో తక్కువ ధరకు మీ పేరుపై రిజిస్టర్ చేయిస్తామని అగ్రిమెంట్ చేసుకుని వారిని కూడా మోసగించారు. పోలీసుల విచారణలో భాగంగా నిందితులు ఇతర జిల్లాల్లో అమ్మిన రూ.4.56 కోట్లు విలువ చేసే 57 ట్రాక్టర్లను గుర్తించి రికవరీ చేశారు. బుధవారం ఉదయం దాడితోట సమీపంలోని చెక్‌పోస్టు వద్ద నిందితులు నల్లజంగిరి రవికుమార్, లోమడ బయారెడ్డి, కాకర్ల హాజీ పీరాలను అరెస్టు చేశారు. మిగిలిన వారు పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలోనే అరెస్టు చేస్తామని ఎస్పీ తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి 2024

జైత్రయాత్ర

గురువారం
ఏప్రిల్, 18



గుసగుస

సర్వేల గుబులు




టీడీపీ పెయిడ్ సర్వేలపై ఆ పార్టీ నేతలే తలలు పట్టుకుంటున్నారు. దాదాపు జాతీయ మీడియా, తటస్థ సర్వే సంస్థలన్నీ ఏపీలో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని చెప్తున్నాయి. ఈ నేపథ్యంలో టీడీపీ అను 'కుల'మీడియా ప్రచారం చేస్తున్న సర్వేలపై సొంత కార్యకర్తలకే నమ్మకం కుదరట్లేదు. వీరు గొప్పగా చెప్పుకుంటున్న సర్వే సంస్థల అంచనాలన్నీ గతంలో బొక్క బోర్లా పడ్డవే. ప్రశాంత్ కిశోర్(పీకే) డబ్బు లందుకున్నప్పుడు ఏదో ఒకటి వాగి, వెళ్తున్నారు. దీంతో ఆయన మాటల్ని అస్సలుకే నమ్మట్లేదట. దీనికి తోడు తమ అధినేత అబద్ధాల్ని ఎంత కాన్ఫిడెన్స్‌తో చెప్తారో తెలియడంతో, తమ అనుకూల సర్వేలపై కనీస నమ్మకం పెట్టుకోలేకపోతున్నారట.

నిమ్మక.. నమ్మమిక



పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండలో నిమ్మక జయకృష్ణ పరిస్థితి అడకత్తెరలో పోక చెక్కలా మారింది. నమ్ముకుని వెంట నడిచిన టీడీపీ శ్రేణులే వెన్నుపోటు పొడిచారు. గత రెండు ఎన్నికల్లో టీడీపీ తరఫున బరిలో నిలిచి ఓడిన నిమ్మక, ఈసారి టీడీపీ టికెట్ నిరాకరించడంతో జనసేనలో చేరారు. జనసేన నుంచి చివరి టికెట్ పొందిన అభ్యర్థి ఈయనే. దీంతో టీడీపీ రెండు వర్గాలుగా విడిపోయింది. జనసేన శ్రేణులు కూడా జయకృష్ణకు హ్యాండిచ్చాయి. పడాల భూదేవి ఆధ్వర్యంలోని టీడీపీ వర్గం నిమ్మక చేసిన నమ్మకద్రోహానికి బదులు తీర్చుకునే పనిలో ఉన్నారట.

టీడీపీలో 'ముళ్ల'పూడి!



గోపాలపురం టీడీపీలో గ్రూపుల గోలతో ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి వెంకట రాజుతోపాటు, పార్టీ అధినేత చంద్రబాబుకూ తలబొప్పి కడుతోంది. మద్దిపాటికి సీటు కేటాయించడంతో మాజీ జెడ్పీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు వర్గం పూర్తిగా వ్యతిరేకమయింది. చంద్రబాబు నల్లజర్ల సమావేశం ముగించుకుని తిరిగి వస్తున్నప్పుడు ముళ్లపూడి అనుచరులు బాబును అడ్డుకున్నారు. దీంతో ఈ రెండు వర్గాల మధ్య సయోధ్య కోసం గన్ని వీరాంజనేయుల్ని రంగంలోకి దించినా ప్రయోజనం కనిపించట్లేదట. జనసేన వర్గం సైలెంటైపోయింది. ఎలాగూ గెలి చేది లేదని, ఈ పాటి దానికి బొక్కసానికి హోల్ పెట్టుకోవడమెందుకని డబ్బులు మిగుల్చుకునే పనిలో ఉన్నారట మద్దిపాటివారు..!

అరకులో గీతకు వాతే

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి దీవెనలతో అరకు ఎంపీ సీటు దక్కించుకున్న కొత్తపల్లి గీతకు కొత్త చిక్కులొచ్చాయి. ఆమె ఎస్టీ కాదంటూ వచ్చిన ఫిర్యాదుపై విచారణ జరిపిన ప్రభుత్వం తుది నిర్ణయం వెల్లడించింది. ఎస్టీ కాదని తేల్చి చెప్పింది. దీనిపై స్టే తెచ్చుకున్నా.. ఆమెను తొలగించాలంటూ బీజేపీ గిరిజన నాయకులు పార్టీ కేంద్ర నాయకత్వంపై ఒత్తిడి తెస్తున్నారు. బీజేపీ అనుబంధ గిరిజన సంఘాలు కూడా ఆమె అభ్యర్థిత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. గత ఎన్నికల్లో సొంత పార్టీ(జన జాగృతి) పెట్టి, ఇదే స్థానంలో పోటీ చేసిన ఆమెకు వచ్చిన ఓట్లు కేవలం 1145. ఆ ఎన్నికల్లో అరకు ఎంపీ స్థానంలో 15 మంది పోటీ చేస్తే ఈమెది 14వ స్థానం. అలాంటి గీత వెంట టీడీపీ, జనసేన శ్రేణులు కూడా నడిచేందుకు ససేమిరా అంటున్నాయట..!

జగన్ మామయ్యా.. జగన్ మామయ్యా.. అంటూ స్కూలు విద్యార్థుల ఆత్మీయ పలకరింపులు..

రాష్ట్ర రూపురేఖలను మరింత గొప్పగా మార్చేందుకు నీ వెంటే నడుస్తామంటూ యువతీ యువకుల నినాదాలు..

మంచి చేసిన మిమ్మల్ని గెలిపించడానికి మేమంతా సిద్ధమంటూ మహిళల హామీ..

పేదింటి భవిష్యత్తును మరింత గొప్పగా మార్చేందుకు పెత్తందార్లపై యుద్ధానికి సిద్ధమంటూ రైతులు, కార్మికులు భరోసా..

మనవడా మళ్లీ నువ్వే కావాలి.. నువ్వే రావాలి.. అంటూ వృద్ధుల ఆశీస్సులు..





కూటమి బలం నీటి బుడగే!

- బస్సు యాత్రలో అడుగడుగునా సీఎం జగన్‌కు జన నీరాజనం
- ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల్లో ఉప్పొంగిన అభిమాన సంద్రం
- వారధిపై పాదయాత్ర నాటి ప్రభంజనాన్ని తలపించిన బస్సు యాత్ర
- మండుటెండైనా.. అర్ధరాత్రయినా రోడ్ షోలకు పోటెత్తుతున్న జన సంద్రం
- విజయవాడలో 4.30 గంటలపాటు జైత్రయాత్రలా సాగిన రోడ్ షో
- తామెన్నడూ ఈ ప్రజా స్పందనను చూడలేదంటోన్న ఉద్యోగ, వ్యాపార వర్గాలు
- తాము పుంజుకున్నామనే చోట బస్సు యాత్ర సక్సెస్‌తో టీడీపీలో నైరాశ్యం
- తమది బలుపు కాదు వాపే అంటున్న టీడీపీ సీనియర్ నేతలు
- తొలిసారి ఓటేయబోతున్న 18–21 ఏళ్ల విద్యార్థులంతా జగన్ వెంటే..
- మళ్లీ రాబోయేది వైఎస్సార్‌సీపీ సునామీయేనంటున్న రాజకీయ విశ్లేషకులు

సార్వత్రిక ఎన్నికల తొలి విడత ప్రచారంలో భాగంగా 'మేమంతా సిద్ధం' పేరుతో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం జగన్ నిర్వహిస్తున్న బస్సు యాత్రలో ప్రతి రోజూ కన్పిస్తున్న దృశ్యాలివి. రాజకీయాల్లో అరుదుగా కన్పించే ఘట్టాలకు బస్సు యాత్ర వేదికగా మారింది. మండుటెండైనా.. అర్ధరాత్రయినా సీఎం జగన్‌ను చూసేందుకు జనం ఆరాట పడుతున్నారు. బస్సు యాత్ర సాగుతున్న రోడ్డుకు ఇరువైపులా స్కూలు పిల్లల నుంచి వృద్ధుల వరకూ కిలోమీటర్ల కొద్దీ బారులుతీరి.. సీఎం జగన్‌పై పూల వర్షం కురిపిస్తున్నారు. మంచి చేసిన మిమ్మల్ని గెలిపించి మళ్లీ సీఎంగా చేసుకుంటామని హామీ ఇస్తున్నారు. బస్సు యాత్రలో భాగంగా నిర్వహిస్తున్న రోడ్‌షోలకు జనం పోటెత్తుతున్నారు. రోడ్ షో సాగినంత దూరం సెల్‌ఫోన్‌లను చేతులతో పైకెత్తి లైట్‌లను ఆన్ చేసి సంఘీభావం తెలుపుతున్నారు. బస్సు యాత్రలో భాగంగా నిర్వహిస్తున్న బహిరంగ సభలు జనసంద్రాలను తలపిస్తున్నాయి.

తామెన్నడూ ఈ స్థాయి ప్రజా స్పందనను చూడలేదని నెల్లూరు జిల్లా కావలికి చెందిన వెంకటేశ్వర యాదవ్ అనే ఉపాధ్యాయుడు చెప్పారు. 'ఓ వైపు ఎండలు మండిపోతుంటే ఇంతగా జనం వచ్చారంటే ఏమని చెప్పాలి? మళ్లీ జగనే అని ప్రత్యేకించి చెప్పాలా?' అని ఒంగోలుకు చెందిన కుమార్ అనే వ్యాపారి అన్నారు. విజయవాడలో అభిమానం ఇంతలా కట్టలు తెంచుకోవడం ఏమిటో అర్థం కాలేదని రాజేశ్వర్ అనే న్యాయవాది అన్నారు. బస్సు యాత్ర సాగుతున్న ప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపార వర్గాల వారందరిదీ ఇదే మాట.

మేలు చేశారు కాబట్టే జనం జేజేలు

బస్సు యాత్రకు మేమంతా సిద్ధమంటూ స్కూలు పిల్లల దగ్గర నుంచి వృద్ధుల వరకూ పోటీపడి వస్తున్నారు. దారి పొడవునా సీఎం జగన్‌ను చూసేందుకు జనం ఆరాటపడుతున్నారు. రోడ్ షోలు.. బహిరంగ సభలకు లక్షల సంఖ్యలో వస్తున్న జనం.. జగన్‌ను మళ్లీ సీఎంగా చేసేందుకు మేమంతా సిద్ధమంటూ నినదిస్తున్నారు. సంక్షేమాభివృద్ధి పథకాల ద్వారా సీఎం జగన్ అన్ని వర్గాలకు మంచి చేయడం వల్లే ఇంత భారీ స్పందన వస్తోంది. జనం జేజేలు పలుకుతున్నారు.

\- గుంటూరు ఏటుకూరు క్రాస్ వద్ద సభకు వచ్చిన వ్యాపారి చందోలు మల్లికార్జున

సాక్షి, అమరావతి: ఉమ్మడి ప్రకాశం, ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల్లో, తూర్పు ప్రాంతంలో ఇటీవల తాము బలం పుంజుకున్నామని కూటమి.. ప్రధానంగా టీడీపీ చెబుతోంది. కానీ.. బస్సు యాత్రతో ఆ ప్రాంతాలలో తమది బలం కాదు వాపేనన్నది స్పష్టమైందని గుంటూరు జిల్లా టీడీపీకి చెందిన చెందిన ఓ సీనియర్ మాజీ ఎమ్మెల్యే బాహాటంగా వ్యాఖ్యానిస్తున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఆ పార్టీకి చెందిన ఓ మాజీ ఎంపీదీ అదే మాట. ఉమ్మడి గుంటూరు జిల్లాలో బస్సు యాత్రకు తండోపతండాలుగా జనం కదలి రావడం.. ఏటుకూరు క్రాస్ వద్ద నిర్వహించిన బహిరంగ సభకు లక్షల మంది జనం తరలివచ్చారు. గుంటూరు జిల్లా నుంచి ఎన్టీఆర్ జిల్లాలోకి అడుగుపెట్టి విజయవాడ–తాడేపల్లి మధ్య కృష్ణా నదిపై నిర్మించిన వారధిపై బస్సు యాత్రకు సునామీలా పోటెత్తిన జనసందోహం.. పాదయాత్ర నాటి దృశ్యాన్ని సాక్షాత్కరింపజేసింది. విజయవాడ నగరంలో అశేష జనవాహిని మధ్య 4.30 గంటలపాటు జైత్రయాత్రలా రోడ్ షో సాగింది. ఇది చూసి ఓర్వలేకే సీఎం జగన్‌పై దాడికి టీడీపీ నేతలు ఉసిగొలిపారని రాజకీయ విశ్లేషకులు

- మిగతా IVలో

వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం

- టౌమ్స్ నౌ–ఈటీజీ రీసెర్చ్ తాజా సర్వే స్పష్టీకరణ
- 1,12,122 మందితో అభిప్రాయ సేకరణ
- 50 శాతం ఓట్లు.. 19–20 లోక్‌సభ స్థానాలు..
- టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి దక్కేది 43% ఓట్లే
- 3–4 లోక్‌సభ స్థానాల్లో టీడీపీ, ఒక చోట బీజేపీ ఉనికి చాటుకునే అవకాశం
- రెండు లోక్‌సభ స్థానాల్లోనూ జనసేనకు ఓటమే
- బాబును జనం నమ్మడం లేదని తేల్చిన సర్వే
- టౌమ్స్‌నౌ గ్రూప్ ఎడిటర్ నవికా కుమార్ వెల్లడి
- 122 శాసనసభ, 21 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్ సీపీ గెలుస్తుందని తేల్చిన పొలిటికల్ క్రిటిక్ సర్వే
- కూటమి 53 శాసనసభ, 4 లోక్‌సభ స్థానాలకే పరిమితం అవుతుందని స్పష్టీకరణ
- వైఎస్సార్‌సీపీదే విజయమని తేల్చిన ఎన్డీటీవీ

- వివరాలు IVలో

భూ'దండు' పాళ్యం బ్యాచ్–4

నీకింత.. నాకింత...

అమరావతిని ముక్కలు చేసి పంచుకున్న చంద్రబాబు అండ్ కో

చంద్రబాబుది పైకి అభివృద్ధి మంత్రం.. లోన కుట్ర, కుతంత్రం. అరచేతిలో సింగపూర్‌ను చూపించి.. అమరావతిని చంద్రబాబు అండ్ కో ముక్కలు చేసి పంచుకుంది. పచ్చదండు బినామీలు పచ్చని భూముల్ని గద్దల్లా తన్నుకుపోయారు. ఈ డ్రామాలో నారాయణ, లింగమనేని ఇలా ఎవరికి వారే వీర లెవల్లో రక్తి కట్టించారు. క్విడ్ ప్రోకోతో అనుమానం రాకుండా కథంతా నడిపించారు. ఇన్నర్ రింగ్ రోడ్డు పేరిట లింగమనేనికి భూముల లబ్ధి, నారాయణ కోసం అష్టవంకర్లుగా రింగ్ రోడ్డు ఎపిసోడ్ ఈ డ్రామాకే హైలైట్. బాబు, నారాయణ ద్వయం లింగమనేని రమేశ్‌తో ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో బేరం కుదుర్చుకుని క్విడ్ ప్రోకోకు బరితెగించారు. తిలా పాపం.. తలా పిడికెడు.. అన్నట్లు ఈ దోపిడీలో తన దత్తపుత్రుడికీ చంద్రబాబు కొద్దిపాటి వాటా పంచారు. ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను తమకు భూములు కానుకగా ఇచ్చిన వారికి అనుకూలంగా చేయడమే ఈ క్విడ్ ప్రోకో కథ. ప్రతిఫలంగా హెరిటేజ్ ఫుడ్స్‌కు భూములు, బాబుకు కరకట్టపై బంగ్లా కానుక.



- లింగమనేని కోసం ఇన్నర్ రింగ్ రోడ్డులో భారీ మార్పులు
- ఆ భూముల విలువ రూ.2 వేల కోట్లకు పైగా చేరేలా పన్నాగం..
- ప్రతిగా క్విడ్ ప్రోకోలో హెరిటేజ్‌కు భూములు, బాబుకు కరకట్ట బంగ్లా
- నారాయణ విద్యా సంస్థల కోసం అష్టవంకర్లుగా రింగ్ రోడ్డు.. పవన్ కల్యాణ్‌కూ లాభం చేకూరుస్తూ అమరావతిలో ప్యాకేజీ

రాజధానిలో కాగితాలపై ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్ఆర్) అలైన్‌మెంట్‌ను ఇష్టమొచ్చినట్టుగా మెలికలు తిప్పుతూ తమ భూముల ధరలు వేల కోట్లకు పెంచుకోవడంలో చంద్రబాబు బరితెగింపునకు బాబోయ్ అనాల్సిందే. లింగమనేని రమేశ్ భూముల మార్కెట్ విలువ రూ.177.50 కోట్ల నుంచి రూ.887.50 కోట్లకు.. రాజధాని నిర్మాణం అనంతరం ఏకంగా రూ.2,130 కోట్లకు చేరేలా ఐఆర్ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చేశారు. ఈ కుంభకోణాన్ని సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం పూర్తి ఆధారాలతో సహా వెలికితీసి చంద్రబాబు, నారాయణ, లింగమనేని రమేశ్, లింగమనేని వెంకట సూర్య రాజశేఖర్, రామకృష్ణ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ కేపీవీ అంజని కుమార్, హెరిటేజ్ ఫుడ్స్, ఎల్‌ఈపీఎల్ ప్రాజెక్ట్స్, నారా లోకేశ్‌లపై కేసు నమోదు చేసింది.

సాక్షి, అమరావతి

రాజధాని అమరావతి పేరుతో చంద్రబాబు సాగించిన దోపిడీ కాండ గురించి రెండు మూడు సీజన్లతో వెబ్ సిరీస్ తీయొచ్చు. ఈ కుంభకోణంలో ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో మార్పుల ఘట్టం అత్యంత కీలకం. సీఆర్‌డీఏ అధికారుల 94 కి.మీ. అలైన్‌మెంట్ ప్రకారం లింగమనేని, నారాయణ కుటుంబాలకు చెందిన భూములకు 3 కి.మీ. దూరం నుంచి ఐఆర్ఆర్ నిర్మించాలి. అయితే చంద్రబాబు ఆదేశాలతో సీఆర్‌డీఏ అధికారులు ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో మార్పులు చేశారు. చంద్రబాబు, లింగమనేని కుటుంబాలకు చెందిన 355 ఎకరాలు, హెరిటేజ్ ఫుడ్స్‌కు చెందిన 13 ఎకరాలను ఆనుకుని ఐఆర్ఆర్ నిర్మించేలా అలైన్‌మెంట్ ఖరారు చేశారు. దీనిని గోప్యంగా ఉంచిన చంద్రబాబు, నారాయణలు తమ కుటుంబ సంస్థలు హెరిటేజ్, రామకృష్ణ హౌసింగ్ లిమిటెడ్‌లతోపాటు తమ బినామీ లింగమనేని రమేశ్ తన సంస్థల పేరిట ఇన్నర్ రింగ్ రోడ్డుకు అటూ ఇటూ భారీగా భూములు కొన్నారు. అనంతరం సింగపూర్‌కు చెందిన సుర్బాన జ్యూరాంగ్ కన్సల్టెన్సీని రంగంలోకి తెచ్చారు. అప్పటికే ఖరారు చేసిన ఇన్నర్ రింగ్ రోడ్ డిజైన్‌ను అమరావతి మాస్టర్ ప్లాన్‌లో చేర్చారు. అనంతరం ఎస్టీయూపీ అనే కన్సల్టెన్సీని నియమించారు. మాస్టర్ ప్లాన్‌లో పొందుపరిచిన అలైన్‌మెంట్‌కు అనుగుణంగానే డిజైన్ ఉండాలని ఈ కన్సల్టెన్సీకి షరతు విధించారు. అంటే... అప్పటికే సీఆర్‌డీఏ అధికారుల ద్వారా తాము ఖరారు చేసిన అలైన్‌మెంట్‌నే ఎస్టీయూపీ కన్సల్టెన్సీని అడ్డం పెట్టుకొని ఆమోదించేలా చేశారు.

ఇదేం పని నారాయణ!

సీఆర్‌డీఏ అధికారులు మొదట రూపొందించిన అలైన్‌మెంట్ ప్రకారం ఇన్నర్ రింగ్ రోడ్డును గుంటూరు జిల్లాలోని అమరావతి నుంచి కృష్ణా జిల్లాలోని నున్న మీదుగా నిర్మించాలి. గుంటూరు జిల్లాలోని నూతక్కి – కృష్ణా జిల్లా పెద్దపులిపర్రు మధ్య కృష్ణా నదిపై వంతెన నిర్మించి అక్కడ నుంచి తాడిగడప – ఎనికేపాడు మీదుగా నున్న వరకు ఇన్నర్ రింగ్ రోడ్డు కొనసాగిస్తారు. ఇలాగైతే నారాయణ విద్యా సంస్థల భవనాలను భూసేకరణ కింద తొలగించాలి. దీంతో సీఆర్‌డీఏ అధికారులపై నారాయణ తీవ్రం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన ఆదేశాలతో అలైన్‌మెంట్‌ను 3 కి.మీ. తూర్పు దిశగా మార్చారు. దీని ప్రకారం గుంటూరు జిల్లాలో రామచంద్రపురం– కృష్ణా జిల్లా చోడవరం మధ్య వంతెన నిర్మిస్తారు. అక్కడి నుంచి పెనమలూరు మీదుగా నిడమానూరు నుంచి నున్న వరకు ఇన్నర్ రింగ్ రోడ్డును నిర్మిస్తారు.

హెరిటేజ్‌కు భూ సంతర్పణ

అలైన్‌మెంట్‌ను మెలికలు తిప్పి లింగమనేని కుటుంబానికి కల్పించిన ప్రయోజనానికి క్విడ్ ప్రోకోగా హెరిటేజ్ ఫుడ్స్‌కు భూములు సమకూరాయి. ఐఆర్ఆర్ అలైన్‌మెంట్‌ను ఆనుకునే కంతేరులో హెరిటేజ్ ఫుడ్స్‌కు 10.4 ఎకరాల లబ్ధి కలిగింది. 2014 జూన్–సెప్టెంబర్ మధ్యలో ఈ భూములను హెరిటేజ్ ఫుడ్స్ కొనుగోలు చేసినట్టు చూపించారు. ఈ వ్యవహారంలో హెరిటేజ్ ఫుడ్స్ డైరెక్టర్ హోదాలో లోకేశ్ ఉన్నారు. లింగమనేని కుటుంబం నుంచి మరో 4.55 ఎకరాలను కొనుగోలు పేరిట హెరిటేజ్ ఫుడ్స్ దక్కించుకుంది. ఇదిలా ఉండగా క్విడ్ ప్రో కోలో భాగంగా లింగమనేని రమేశ్ కృష్ణా నది కరకట్ట మీద ఉన్న తమ బంగ్లాను చంద్రబాబుకు బహుకరించారు. పవన్ కల్యాణ్‌కు ఐఆర్ఆర్ అలైన్‌మెంట్‌కు సమీపంలోనే 2.4 ఎకరాలు ధారాదత్తం చేశారు.

ఐఆర్ఆర్‌లో అవినీతి విశ్వరూపం

ఐఆర్ఆర్ అలైన్‌మెంట్ ఖరారుకు ముందు ఆ ప్రాంతంలో ఎకరా భూమి రూ.50 లక్షలుండేది. ఆ భూముల మార్కెట్ విలువ రూ.177.50 కోట్లు. ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పు తర్వాత ఎకరా రూ.2.50 కోట్లు పలికింది. 355 ఎకరాల విలువ రూ.887.50 కోట్లకు పెరిగింది. అమరావతి పూర్తయితే ఎకరా విలువ సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో రూ.4 కోట్లకు చేరుతుందని చంద్రబాబు అప్పట్లోనే ప్రకటించారు. ఇన్నర్ రింగ్ రోడ్డును ఆనుకుని ఉన్న భూముల విలువ ఎకరా రూ.6 కోట్లకు చేరుతుందని ఆయన అంచనా వేశారు. అమరావతి నిర్మాణం పూర్తయితే లింగమనేని కుటుంబ సభ్యులకు చెందిన 355 ఎకరాల విలువ ఏకంగా రూ.2,130 కోట్లకు చేరుతుందని అంచనా. మార్కెట్ ధర ప్రకారం హెరిటేజ్ ఫుడ్స్ 10.4 ఎకరాల విలువ రూ.4.50 కోట్ల నుంచి రూ.22.50 కోట్లకు పెరిగింది. అమరావతి పూర్తయితే అది రూ.54 కోట్లకు చేరుతుందని లెక్క తేలింది. హెరిటేజ్ ఫుడ్స్‌తో ఒప్పందం చేసుకున్న మరో 4.5 ఎకరాల విలువ సైతం రూ.24 కోట్లకు చేరుతుంది.



చౌదరికి 3డీ సినిమా ఖాయం!

- సుజనా చౌదరి కోసం బలి అయిన బీసీ నేతల్లో ఆగ్రహం
- విజయవాడ పశ్చిమ సీటుపై తిమ్మినిబమ్మి చేసిన బాబు
- పక్కా ప్రణాళికతో మైనార్టీలకు దారుణ మోసం
- తన పార్టీ వారికి తానే వెన్నుపోటు పొడిచిన బాబు
- పోతిన మహేశ్‌కు పవన్ ద్వారా వెన్నుపోటు
- కేశినేనినీ వాడేయడానికి విఫలయత్నం
- టీడీపీకి 'పశ్చిమం' ఎప్పుడూ ఆరవ వేలే
- అయినా ఎప్పటికప్పుడు అణగదొక్కడం ఎందుకో?

'తొలి నుంచి మా నియోజకవర్గాన్ని చంద్రబాబు ఆరో వేలు (సిక్స్ ఫింగర్ – ఉపయోగం లేనిదని అర్థం)గా చూస్తున్నారు. ఓ వైపు నాయకత్వం మీకే, మీదేనని మభ్యపెడుతూ మరో వైపు బహు నాయకత్వాన్ని పెంచి పోషిస్తూ నిత్యం గొడవలకు ఆజ్యం పోశారు. పార్టీ పేరిట భారీ మొత్తాల్లో ఖర్చు చేయించారు. మరెవరికో టికెట్ ఇవ్వాలనే ప్రణాళిక ముందు నుంచే ఉన్నప్పుడు బీసీలు, మైనార్టీలను వెర్రిబాగులోళ్లను చేయడం ఎందుకు? వారిని సర్వభ్రష్టత్వం పట్టించడం ఎందుకు?' అని బాధిత టీడీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఈ ఎన్నికల్లో సదరు చౌదరికి 3డీ సినిమా కనిపించడం ఖాయం అని వ్యాఖ్యానిస్తున్నారు.

- వివరాలు IIIలో

ఆయన 'జీవి'తం అంతా అవినీతిమయం. భూములను 'హాం'ఫట్ చేయడంలో ఆయనది అందెవేసిన చేయి. స్థలం కనిపిస్తే చాలు కబ్జానే. పేదల భూముల్లో అడ్డగోలుగా చేపల చెరువులు తవ్వించి వారినోట్లో మట్టికొట్టిన భూ బకాసురుడు. నకిలీ ఎరువులను రైతులకు అంటగట్టి వారిని నిలువునా ముంచాడు. ఉద్యానసాగు పంటల సబ్సిడీని స్వాహా చేసి అన్నదాతలను అడ్డంగా దోచుకున్నాడు. ఇదీ వినుకొండ మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అవినీతి చరిత్ర.

జీవి అవినీతి

ఏబీ అభ్యర్థులు?

బకాసురుడు



-వివరాలు IVలో

ఓటేస్తే డిస్కౌంట్... ఫ్రీ హెయిర్ కట్!

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం! మన రాత మారాలన్నా, నేతల తలరాతలు మార్చాలన్నా మన చేతుల్లోనే ఉంది. అందుకే ప్రతి ఓటరూ ఓటు హక్కు వినియోగించుకోవాలంటూ ఎన్నికల సంఘం కోడై కూస్తోంది. అయినా కొందరిలో మాత్రం చలనం శూన్యం. అందుకే, ఈ ఓట్ల జాతరలో దుమ్మురేపేందుకు మేము సైతం అంటున్నారు కొందరు ఔత్సాహిక వ్యాపారులు. అటు ఓటింగ్ శాతం, ఇటు తమ వ్యాపారం పెరిగేలా బంపర్ ఆఫర్లు ప్రకటిస్తున్నారు. 'ఓటేసి వేలిపై సిరా చుక్క చూపండి, డిస్కౌంట్ పొందండి' అంటూ ఓటర్లను ఊరిస్తున్నారు. ఉత్తరాఖండ్ హోటల్, రెస్టారెంట్ అసోసియేషన్ తాజాగా ఆఫర్ ప్రకటించింది. రాష్ట్రంలో 19న శుక్రవారం ఒకే విడతలో లోక్‌సభ ఎన్నికలు పూర్తవుతాయి. పోలింగ్ ముగిసిన తర్వాత నుంచి 20వ తేదీ సాయంత్రం దాకా తమ హోటళ్లు, రెస్టారెంట్లలో ఏం తిన్నా బిల్లులో 20 శాతం డిస్కౌంట్ ఇస్తామని తెలిపింది. ఓటింగ్ శాతాన్ని పెంచేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని, వేలిపై సిరా గుర్తు చూపి డిస్కౌంట్ పొందచ్చని అసోసియేషన్ ప్రెసిడెంట్ సందీప్ సాహ్ని చెబుతున్నారు. శుక్రవారమే రాష్ట్ర వ్యాప్తంగా పోలింగ్ జరగనున్న తమిళనాడులోని చెంగల్పట్టు జిల్లాలో కూడా ఓటేసిన వారికి పోలింగ్ రోజు హోటళ్లు, ఫుడ్ స్టాల్స్, బేకరీలు.. ఇలా ఎక్కడ ఏం తిన్నా 5 శాతం తగ్గింపు లభిస్తుంది. ఓటర్లను ప్రోత్సహించేందుకే ఈ చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ ఎస్.అరుణ్ రాజ్ చెప్పారు. ఇక కాంచీపురం కలెక్టర్ కలైసెల్వి మోహన్ వాటర్ బాటిళ్లపై పోలింగ్ సంబంధ పోస్టర్లను అతికించడం ద్వారా ఓటర్లలో చైతన్యం నింపుతున్నారు.

ఏప్రిల్ 26న రెండో విడతలో పోలింగ్ జరిగే మహారాష్ట్రలోని అకోలాకు చెందిన అనంత కొల్కర్ అదిరిపోయే ఆఫరిచ్చాడు. ఓటేసి సిరా గుర్తు చూపిన వారికి తన సెలూన్‌లో ఫ్రీగా హెయిర్ కట్ చేస్తానంటూ షాపు ముందు బోర్డు పెట్టేశాడు. మే 25న ఆరో విడతలో పోలింగ్ జరగనున్న జంషెడ్‌పూర్‌లో కూడా ఓటేసిన వారికి హోటళ్లు, రెస్టారెంట్లు, మాల్స్, కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు డిస్కౌంట్ ఇచ్చేలా ఈసీ అధికారులు ఒప్పించారు. గత నవంబర్‌లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బైక్ ట్యాక్సీ సంస్థ ర్యాపిడో 2,600 పై చిలుకు పోలింగ్ బూత్‌లకు ఫ్రీ రైడ్స్ ఆఫర్ చేయడం తెలిసిందే. ఈసారి సార్వత్రిక ఎన్నికలు ఏడు విడతల్లో జూన్ 1 దాకా సుదీర్ఘంగా జరగనున్న నేపథ్యంలో ఆఫర్ల జోరు కూడా పెరిగేలా కనిపిస్తోంది!

నాన్‌లోకల్ నాయిక

స్థానికేతర నేతల కర్మభూమిగా యూపీ

సోనియా, మాయా నుంచి స్మృతీ దాకా	ఎందరో స్థానికేతరుల రాజకీయ అరంగేట్రం	కేంద్రంలో, రాష్ట్రంలో అత్యున్నత పదవులు

దిగ్గజాల వంటి లోకల్ నేతలు ఎందరో ఉండొచ్చు. మేం మాత్రం పక్కా నాన్ 'లోకల్'! పుట్టి పెరిగింది ఎక్కడన్నది మాకనవసరం. మేమెక్కడ ల్యాండైతే అదే మాకు 'లోకల్'! 'తగ్గేదే లే...' అంటున్నారు మహిళా రాజకీయ వలస పక్షులు. వీరిలో చాలామంది ఉత్తరప్రదేశ్‌ను తమ రాజకీయ కర్మభూమిగా మార్చుకోవడం విశేషం. అతి పెద్ద రాష్ట్రమైన యూపీకి అత్యధిక సంఖ్యలో నాన్ లోకల్ నాయికలకు రాజకీయ భిక్ష పెట్టిన రికార్డు కూడా ఉంది. అలా ఎక్కడెక్కడి నుంచో వలస వచ్చి ఇక్కడ రాజకీయ అరంగేట్రం చేసినవారిలో ఏకంగా రాష్ట్రాన్నే ఏలిన వారొకరు. కేంద్రంలో చక్రం తిప్పినవారు ఇంకొకరు. ఈ వలస పక్షుల్లో సినీ తారలూ ఉన్నారు...

– సాక్షి, నేషనల్ డెస్క్



డింపుల్ 'భాభీ'...

డింపుల్ యాదవ్ స్వస్థలం ఉత్తరాఖండ్. సమాజ్‌వాదీ అధ్యక్షుడు, యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్ భార్యగా యూపీలో అడుగుపెట్టారు. 2009 ఫిరోజాబాద్ ఉప ఎన్నికలతో రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. కానీ కాంగ్రెస్ నేత రాజ్‌బబ్బర్ చేతిలో ఓటమి చవిచూశారు. 2012లో కనౌజ్ లోక్‌సభ స్థానం ఉప ఎన్నికలో విజయం సాధించారు. 2019లో మళ్లీ ఓడినా 2022లో ములాయం సింగ్ యాదవ్ మరణం తర్వాత మెయిన్‌పురి ఉప ఎన్నికలో గెలుపొందారు. 'వికాస్ కీ చాబీ.. డింపుల్ భాభీ..' అంటూ సమాజ్‌వాదీ కార్యకర్తల నినాదాల నడుమ రెట్టించిన ఉత్సాహంతో ఈసారీ మళ్లీ మెయిన్‌పురిలో బీజేపీతో తలపడుతున్నారు.

మీరా.. షీలా.. సుచేతా...


మీరాకుమార్

బిహార్‌కు చెందిన లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్ కూడా యూపీ నుంచే రాజకీయ అరంగేట్రం చేశారు. 1985లో బిజ్నోర్ ఉప ఎన్నికలో విజయంతో ఆమె ప్రస్థానం ఆరంభమైంది. కానీ తర్వాత ఆమె యూపీ నుంచి మళ్లీ పోటీ చేయలేదు. 2017లో యూపీఏ రాష్ట్రపతి అభ్యర్థిగా ఎన్డీఏ అభ్యర్థి రామ్‌నాథ్ కోవింద్ చేతిలో ఓడారు. ఢిల్లీ సీఎంగా సుదీర్ఘకాలం చక్రం తిప్పిన పంజాబ్ పుత్రి షీలా దీక్షిత్ కూడా కాంగ్రెస్ తరఫున 1994లో తొలిసారి యూపీలోని కనౌజ్ నుంచే గెలిచారు. యూపీ తొలి మహిళా సీఎంగా చరిత్రకెక్కిన ప్రముఖ స్వాతంత్ర్య యోధురాలు సుచేతా కృపలానీ స్వస్థలం పంజాబ్!



రాజకీయాల్లోనూ జయప్రదం

రాజమండ్రిలో పుట్టిన తెలుగుతేజం జయప్రద. అసలు పేరు లలితా రాణి. తెలుగు సినిమాల్లో వెలుగు వెలగడమే గాక బాలీవుడ్‌లోనూ రాణించారు. ఏడెనిమిది భాషల్లో నటించి ఎనలేని స్టార్‌డం సొంతం చేసుకున్నారు. ఎన్టీఆర్ ప్రోద్బలంతో 1994లో టీడీపీలో చేరడం ద్వారా రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. టీడీపీ నుంచి రాజ్యసభ సభ్యురాలిగా పార్లమెంట్‌లో అడుగుపెట్టారు. పార్టీతో విభేదించి సమాజ్‌వాదీ పార్టీలో చేరడం ద్వారా యూపీలో అడుగు పెట్టారు. 2004, 2009 లోక్‌సభ ఎన్నికల్లో రాంపూర్ నుంచి విజయం సాధించారు. అనంతరం సమాజ్‌వాదీతోనూ పొసగక రాష్ట్రీయ లోక్‌మంచ్ పేరిట సొంత పార్టీ పెట్టి విఫలమయ్యారు. చివరికి 2019లో బీజేపీ గూటికి చేరారు.



మాయావతి.. యూపీ క్వీన్

ఈ 'బెహన్ జీ' పుట్టింది, చదివింది ఢిల్లీలో అయినా దేశ రాజకీయాలను శాసించే స్థాయికి ఎదిగింది మాత్రం యూపీ నుంచే. 1984లో కాన్షీరాం స్థాపించిన బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ)లో వ్యవస్థాపక సభ్యురాలిగా చేరిన మాయావతి 1989లో తొలిసారి యూపీ నుంచే ఎంపీగా గెలిచారు. తర్వాత ఆమె రాజకీయ జైత్రయాత్ర అప్రతిహతంగా కొనసాగింది. రాష్ట్రంలోనే గాక దేశ రాజకీయాల్లోనూ తిరుగులేని దళిత నేతగా ఎదిగారు. 1995లో కాన్షీరాం ఆశీస్సులతో అనూహ్యంగా ముఖ్యమంత్రి పీఠం ఎక్కారు. దేశంలో తొలి దళిత మహిళా సీఎంగా చరిత్ర సృష్టించారు. నాలుగుసార్లు యూపీ సీఎంగా చేశారు. ఆమె రాజకీయ ప్రస్థానాన్ని ప్రజాస్వామ్య సంచలనంగా మాజీ ప్రధాని పీవీ నరసింహారావు అభివర్ణించారు.



హేమమాలిని... మథుర 'గోపిక'

అందం, నటనతో దేశాన్ని ఉర్రూతలూపిన బాలీవుడ్ డ్రీమ్‌గాళ్ హేమమాలిని స్వస్థలం తమిళనాడు. తమిళ సినిమాల నుంచి బాలీవుడ్‌లో అడుగుపెట్టి బంపర్‌హిట్లతో దేశవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్నారు. ముంబైలో స్థిరపడిన హేమ 2011లో తొలిసారిగా రాజ్యసభకు ఎన్నికయ్యారు. తర్వాత బీజేపీలో చేరి యూపీ బాట పట్టారు. 2014లో మథుర నుంచి 3 లక్షల పై చిలుకు మెజారిటీతో గెలుపొందారు. 2019లోనూ అక్కడి నుంచే గెలిచారు. ఈసారి హ్యాట్రిక్ కొట్టేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. తన స్థానికతపై విపక్షాల విమర్శలను, "కృష్ణుడిని ఆరాధించే గోపికగా మథురను నా స్వస్థలంగా మార్చుకున్నాను. పదేళ్లుగా ఇక్కడి ప్రజలకు సేవలందిస్తూ వారి మనసు గెలిచా. మళ్లీ గెలుపు నాదే' అంటూ దీటుగా తిప్పికొడుతున్నారీ 'బసంతి'!

ధీశాలి... మేనక



ఇందిర చిన్న కొడుకు సంజయ్ భార్యగా గాంధీల కుటుంబంలో అడుగుపెట్టిన మేనక భర్త మరణానంతరం ఆ కుటుంబానికి పూర్తిగా దూరమయ్యారు. ఆమె స్వస్థలం ఢిల్లీ. 26 ఏళ్ల వయసులో రాష్ట్రీయ సంజయ్ మంచ్ పేరుతో పార్టీ స్థాపించి 1984లో యూపీలోని అమేథీ నుంచి ఏకంగా రాజీవ్‌నే ఢీకొట్టి ఓడారు. 1989లో పిలిభిత్ నుంచి లోక్‌సభకు వెళ్లారు. 2004లో బీజేపీలో చేరారు. పిలిభిత్ నుంచి ఆరుసార్లు గెలిచారు. కేంద్ర మంత్రిగా రాణించారు. గత ఎన్నికల్లో సుల్తాన్‌పూర్ నుంచి గెలిచిన ఈ జంతు ప్రేమికురాలు ఈసారీ అక్కడి నుంచే బరిలో ఉన్నారు.

స్మృతీ ఇరానీ.. జెయింట్ కిల్లర్




ఢిల్లీలో పుట్టి పెరిగిన ఈ సీరియల్ 'క్వీన్' బుల్లితెర నటిగా దేశవ్యాప్తంగా అభిమానుల మనసు దోచారు. 2003లో బీజేపీలో చేరి రాజకీయ రంగ ప్రవేశం చేశారు. 2004 లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీలో పోటీ చేసిన ఓడినా వెనకడుగు వేయలేదు. రాజ్యసభకు నామినేటయ్యారు. 2014లో అమేథీలో రాహుల్‌తో పోటీ పడటం ద్వారా యూపీ గడ్డపై కాలుమోపారు. తొలి ప్రయత్నంలో ఓడినా 2019లో రాహుల్‌ను ఓడించడంతో జెయింట్ కిల్లర్‌గా ఆమె పేరు దేశమంతటా మారుమోగింది. తనను 'అమేథీ కీ బిటియా (అమేథీ బిడ్డ)'గా అభివర్ణించుకుంటూ అక్కడే స్థిరపడిపోయారు. ఈసారీ అమేథీ బరిలో నిలిచి, దమ్ముంటే తనతో తలపడాలంటూ రాహుల్‌కు సవాలు విసురుతున్నారు.

ఇటలీ టు ఢిల్లీ.. వయా యూపీ



యూపీకి రాజకీయంగా వలస వచ్చి దేశంలోనే పవర్‌ఫుల్ పొలిటీషియన్‌గా ఎదిగిన మహిళల్లో అగ్రతాంబూలం సోనియా గాంధీదే. ఇటలీలో పుట్టి మాజీ ప్రధాని రాజీవ్ గాంధీని పెళ్లాడి, భారత్‌ను మెట్టినింటిగా చేసుకున్న సోనియా రాజకీయ రంగప్రవేశం చేసింది యూపీ నుంచే. గాంధీల కంచుకోటైన అమేథీ నుంచే 1999 లోక్‌సభ ఎన్నికల్లో అరంగేట్రం చేశారు. 2004లో రాయ్ బరేలీ నుంచి గెలిచి దేశ రాజకీయాల్లో సూపర్‌స్టార్‌గా మారారు. యూపీఏ చైర్‌పర్సన్‌గా పదేళ్ల సంకీర్ణ ప్రభుత్వంలో చక్రం తిప్పారు. 2019 దాకా రాయ్‌బరేలీ నుంచే లోక్‌సభకు ఎన్నికవుతూ వచ్చారు. తాజాగా సోనియా రాజ్యసభకు వెళ్లడంతో ఈసారి కూతురు ప్రియాంక బరిలో దిగొచ్చని భావిస్తున్నారు.



ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న మొరార్జీ దేశాయ్ (కుడివైపు)

ప్రజల హక్కులను కాలరాస్తే, ప్రజాస్వామ్యానికి పాతరేస్తే ఏమవుతుందో ఆరో లోక్‌సభ ఎన్నికల్లో ఇందిరాగాంధీకి అనుభవంలోకి వచ్చింది. ఇందిరకు, కేంద్రంలో కాంగ్రెస్‌కు తొలి ఓటమి రుచి చూపడమే గాక తొలి కాంగ్రెసేతర సర్కారుకు బాటలు పరిచిన ఎన్నికలుగా అవి చరిత్రలో నిలిచిపోయాయి. ఎమర్జెన్సీ ముసుగులో ప్రతిపక్షాల నేతలందరినీ జైల్లోకి నెట్టిన ఇందిర వారి చేతుల్లోనే మట్టికరిచారు. జనతా పతాకం కింద ప్రధాన విపక్షాలన్నీ ఒక్కటై 'ఇందిర హటావో, దేశ్ బచావో' నినాదంతో కాంగ్రెస్‌ను ఓడించాయి...

కేంద్రంలో తొలిసారి కాంగ్రెసేతర సర్కారు

1975 జూన్ 25 నుంచి 1977 మార్చి 21 దాకా 21 నెలల కొనసాగిన ఎమర్జెన్సీ దేశ ప్రజలకు పీడకలగా మారింది. పౌర హక్కులను హరించడం మొదలుకుని తీవ్ర నిర్బంధం అమలైంది. పత్రికా స్వేచ్ఛను కాలరాశారు. మగవాళ్లకు బలవంతంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల వంటి చేష్టలతో ఇందిర సర్కారు బాగా చెడ్డ పేరు తెచ్చుకుంది. మొరార్జీ దేశాయ్ మొదలుకుని జయప్రకాశ్ నారాయణ్ దాకా విపక్ష నేతలంతా జైలుపాలయ్యారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విపక్షాల కార్యకర్తలు ఊచలు లెక్కించారు.

ఇందిర హటావో దేశ్ బచావో

ఫలించిన విపక్షాల సమైక్యనాదం

ఆరో లోక్‌సభ పోరులో ఇందిర ఓటమి

కేంద్రంలో కొలువుదీరిన జనతా సర్కారు


ఒక్కతాటిపైకి విపక్షాలు

ఎమర్జెన్సీ అనంతరం ఏడాది ఆలస్యంగా 1977లో ఇందిర ఎన్నికలకు వెళ్లారు. ఆమెను ఢీకొట్టేందుకు కమ్యూనిస్టేతర ప్రధాన ప్రతిపక్షాలన్నీ ఒక్కటయ్యాయి. భారతీయ జనసంఘ్, భారతీయ లోక్‌దళ్, సంయుక్త సోషలిస్ట్ పార్టీ, కాంగ్రెస్ ఫర్ డెమక్రసీతో పాటు కాంగ్రెస్ (ఓ) కూడా జేపీ స్థాపించిన జనతా పార్టీలో కలిసిపోయాయి. మొరార్జీ దేశాయ్‌ను అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్న నినాదాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లారు. జేపీ 'ఇందిరా హటావో, దేశ్ బచావో' నినాదం దుమ్మురేపింది. ఎమర్జెన్సీపై జనాగ్రహం ఎన్నికల ఫలితాల్లో ప్రతిఫలించింది. జనతా పార్టీ 41.32 శాతం ఓట్లతో 295 స్థానాలు సాధించింది. మిత్రపక్షాలతో కలిపి జనతా బలం 330కి చేరింది. 492 స్థానాల్లో పోటీ చేసిన ఇందిర కాంగ్రెస్ (ఆర్) కేవలం 154 స్థానాలతో కుదేలైంది. అంతటి ప్రజా వ్యతిరేకతలోనూ దక్షిణాది 92 స్థానాలతో ఇందిరకు అండగా నిలిచింది. వాటిలో 41 ఆంధ్రప్రదేశ్ చలవే. హిందీ రాష్ట్రాల్లో కాంగ్రెస్ గెలిచింది రెండే సీట్లు! రాయ్‌బరేలీలో ఇందిర ఓటమి చవిచూశారు! ఎమర్జెన్సీ వేళ రాజ్యాంగేతర శక్తిగా మారిన చిన్న కొడుకు సంజయ్‌గాంధీ కూడా అమేథీలో పరాజయం పాలయ్యారు.

తొలి కాంగ్రెసేతర ప్రధాని మొరార్జీ

తొలి కాంగ్రెసేతర ప్రధానిగా మొరార్జీ దేశాయ్ 1977 మార్చి 24న ప్రమాణం చేశారు. అయితే మూడేళ్లకే సర్కారులో లుకలుకలు మొదలయ్యాయి. నేతలు జనతా పార్టీని వీడడంతో లోక్‌సభలో బలం తగ్గింది. దాంతో మొరార్జీ గద్దె దిగాల్సి వచ్చింది.

రాజ్ నారాయణ్... జనతాలో ముసలం


రాజ్ నారాయణ్

ఈ సందర్భంగా రాజ్ నారాయణ్ గురించి తప్పక చెప్పుకోవాలి. 1977 ఎన్నికల్లో రాయ్‌బరేలీలో ఇందిరను ఓడించిన ఈయన తదనంతరం జనతాపార్టీలో ముసలానికీ కారకుడయ్యారు. జనతాను వీడి జేడీ(ఎస్)ను స్థాపించారు. మొరార్జీ రాజీనామాతో ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలంటూ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డిని అభ్యర్థించారు. కానీ ఇందిరా కాంగ్రెస్ సహకారంతో జనతా పార్టీ నేత చౌదరీ చరణ్‌సింగ్ 1979 జూలై 28న ప్రధాని అయ్యారు. అయితే ఇందిర బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు విసిగి నెలలోపే రాజీనామా చేశారు!

ఆరో లోక్‌సభలో పార్టీల బలాబలాలు
(మొత్తం స్థానాలు 542)

పార్టీ	స్థానాలు
జనతా పార్టీ	295
కాంగ్రెస్	154
సీపీఎం	22
అన్నాడీఎంకే	18
ఇతరులు	43
స్వతంత్రులు	10

విశేషాలు...

పెరిగిన ఓటింగ్

- 1977 లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతం 60.49 శాతానికి పెరిగింది.
- 1971 జనాభా లెక్కల ఆధారంగా లోక్‌సభ స్థానాలను 542కు పెంచారు.
- 31 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎన్నికలు జరిగాయి.
- ఐదు జాతీయ పార్టీలు, 15 రాష్ట్ర పార్టీలు, 14 రిజిస్టర్డ్ పార్టీలు లోక్‌సభ ఎన్నికల్లో పాల్గొన్నాయి.
- ఎమర్జెన్సీ విధింపు పట్ల ఇందిర ఏనాడు పశ్చాత్తాపడలేదు. మరో దారి లేకపోయిందంటూ సమర్థించుకున్నారు. షెడ్యూల్ ప్రకారం 1976లోనే ఎన్నికలు జరిపి ఉంటే తానే గెలిచేదాన్నని కూడా ఇందిర అభిప్రాయపడటం విశేషం!

– సాక్షి, నేషనల్ డెస్క్

• అగాథా సంగ్మా

గేమ్ చేంజర్

అగాథా సంగ్మా. ఆ పేరే ఓ రికార్డు. రాజకీయ దిగ్గజమైన తండ్రి పీఏ సంగ్మా వారసురాలిగా మేఘాలయలోని తుర నుంచి తొలిసారి లోక్‌సభలో అడుగు పెట్టినా, ఆ తర్వాత ఈశాన్య రాష్ట్రాల ప్రతినిధిగా ఎదిగారు. అతి చిన్న వయసులోనే కేంద్ర మంత్రి బాధ్యతలు సమర్థంగా నిర్వహించి గేమ్ చేంజర్‌గా పేరు తెచ్చుకున్నారు. 2014లో లోకసభ బరిలోంచి తప్పుకున్నా 'అయాం నాట్ అ చైల్డ్ ఎనీమోర్' అంటూ 2019లో లోక్‌సభ రీ ఎంట్రీ ఇచ్చారు. ఈసారీ తురా నుంచే బరిలో ఉన్నారు...

– సాక్షి, నేషనల్ డెస్క్

వాటర్ ఉమన్...


పరిచయం

తండ్రి పీఏ సంగ్మా రాజీనామాతో 2008లో అగాథా తొలిసారి లోక్‌సభ ఎన్నికల బరిలో దిగారు. తుర ఉప ఎన్నికలో ఘనవిజయం సాధించి దేశంలోనే యంగెస్ట్ ఎంపీగా నిలిచారు. తర్వాత 2009 లోక్‌సభ ఎన్నికల్లోనూ నెగ్గారు. 29 ఏళ్ల వయసులో కేంద్ర మంత్రి అయ్యారు. ఆ ఘనత సాధించిన అతి పిన్న వయస్కురాలిగానూ చరిత్ర సృష్టించారు. అంతేగాక అసోంకు చెందిన రేణుకాదేవి బార్కాటకి అనంతరం ఈశాన్య రాష్ట్రాల నుంచి కేంద్ర మంత్రి అయిన రెండో మహిళగా నిలిచారు. నీటికోసం నెత్తి మీద కుండతో కిలోమీటర్ల కొద్దీ నడవాల్సిన దుస్థితి నుంచి మహిళలను బయటికి తేవడమే తన కల అని చెప్పే అగాథా వాటర్ ఉమన్‌గా పేరు తెచ్చుకున్నారు. ఈశాన్య గ్రామాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యమిచ్చారు. అక్కడి వెనకబడ్డ ప్రాంతంలో కొత్త వెలుగులు నింపారు. 2012లో జరిగిన రాజకీయ పరిణామాలతో కేంద్ర మంత్రిగా రాజీనామా చేశారు. 2014లో మేఘాలయ రాష్ట్ర రాజకీయాల్లో రంగప్రవేశం చేశారు. ఎమ్మెల్యేగా గెలుపొంది నేషనల్ పీపుల్స్ పార్టీ చీఫ్ విప్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2018లో సౌత్ తుర నుంచి ఘనవిజయం సాధించి అసెంబ్లీలో అడుగు పెట్టారు. 2019 లోక్‌సభ ఎన్నికలతో మళ్లీ జాతీయ రాజకీయాల్లో అడుగుపెట్టారు. మాజీ సీఎం ముకుల్ సంగ్మాపై ఘనవిజయం సాధించారు. తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తున్నందుకు గర్వంగా ఉందంటారామె. మేఘాలయ నుంచి మళ్లీ లోక్‌సభలో అడుగు పెడతారా అన్నది ఆసక్తికరం.

పర్యావరణ ప్రేమిక...

అగాథా సంగ్మా 1980 జూలై 24న ఢిల్లీలో జన్మించారు. మేఘాలయలోని వెస్ట్ గారో హిల్స్‌లో పెరిగారు. తురాలోని కాన్వెంట్ ఆఫ్ జీసస్ అండ్ మేరీ నుంచి పాఠశాల విద్య పూర్తి చేశారు. పుణె యూనివర్సిటీలో ఎల్ఎల్‌బీ అనంతరం ఢిల్లీ హైకోర్టులో అడ్వకేట్‌గా చేరారు. బ్రిటన్‌లోని నాటింగ్‌హామ్ వర్సిటీలో ఎన్విరాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్‌లో మాస్టర్స్ చేశారు. 2019లో పాట్రిక్ రోంగ్మా మారక్‌ను పెళ్లాడారు. పర్యావరణవేత్త అయిన అగాథా సందర్భం వచ్చినప్పుడల్లా ప్రకృతి పట్ల తన ప్రేమను, బాధ్యతను చాటుకున్నారు. పెళ్లి కూడా పూర్తి పర్యావరణహిత పద్ధతిలో చేసుకుని ఆదర్శంగా నిలిచారు. చెట్ల పెంపకాన్ని ప్రోత్సహించడానికి పెళ్లికి వచ్చినవారికి విత్తన పత్రాలిచ్చారు. నిశ్చితార్థ సమయంలోనూ మొక్కలు నాటారు. అగాథా పుస్తకాల పురుగు. సమయం దొరికిందంటే పుస్తకం పట్టుకుంటారు. అగాథా అంతే బాగా రాస్తారు కూడా. ఫొటోగ్రఫీ అన్నా ఆమెకు ప్రాణం.

ఇదిగో నవరత్నాల వెలుగులు

నాటి టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో కలిగిన లబ్ధి ఇలా..(రూ.ల్లో)

పథకం	టీడీపీ పాలనలో	వైఎస్సార్ సీపీ పాలనలో
సాగుకు సాయం	0	40,500
పెన్షన్	0	1,38,250
డ్వాక్రా రుణమాఫీ	0	48,000
మహిళలకోసం	10,000 (పసుపు, కుంకుమ)	56,250
బడికెళ్లే పిల్లలకు	0	45,000
కులవృత్తివారికి	0	40,000
మొత్తం	10,000	3,68,000

ఊరందరి బట్టలుతికితేనే వాళ్లకి పూట గడిచేది. తరతరాలుగా వస్తున్న కులవృత్తి వారి కడుపునింపలేదు. ఉన్న అర ఎకరం పొలంలో పంటలు పండించేందుకూ నానా తిప్పలు పడేవారు. తప్పనిసరి పరిస్థితుల్లో అటు వ్యవసాయ కూలీగా... మరోవైపు ఉపాధి కూలీగా మారినా ఆశించిన ఫలితం కనిపించేది కాదు. ఆదుకోవాల్సిన అప్పటి ప్రభుత్వాలు ఉదాసీన వైఖరి అవలంబించాయి. గత ప్రభుత్వం ఏవో పథకాలని చెప్పి డబ్బు కట్టించుకుంది. కానీ పరికరాలు ఇవ్వకుండా ముఖం చాటేసింది. ఇదీ శ్రీకాకుళం జిల్లా ఎల్.ఎన్.పేట మండలం యంబరాం గ్రామానికి చెందిన వాడాడ సింహాచలం, రమణమ్మ దంపతుల కన్నీటి గాథ.

-ఎల్.ఎన్.పేట

వెల్లివిరిసిన సంతోషాలు..



తెలుగుదేశం పార్టీ ఐదేళ్ల పాలనలో సింహాచలం కుటుంబానికి ఒరిగిందేమీ లేదు. ఆ ప్రభుత్వం గొప్పగా చెప్పుకున్న ఆదరణ పథకం కింద ఇస్త్రీ పెట్టెతో పాటు ఇతర పరికరాల కోసం వాడాడ సింహాచలంతో పాటు ఆయన కుమారుడు రాంబాబు కూడా దరఖాస్తు చేసుకున్నాడు. లబ్ధిదారుని వాటాగా పది శాతం బ్యాంక్ డిపాజిట్ చెల్లించారు. దరఖాస్తుతో పాటు అధికారులకు డీడీలు అందించారు. ఊరిలో మొక్కుబడిగా కొందరికి వచ్చాయి. వీరికి మాత్రం ఆ పరికరాలేవీ రాలేదు. చాలా కాలం మండల పరిషత్ కార్యాలయం చుట్టూ తిరిగితే వీరు చెల్లించిన డీడీ వెనక్కిచ్చారు. మొత్తమ్మీద డీడీ కోసం వెచ్చించిన ఎక్స్ఛేంజ్ నష్టపోవాల్సి వచ్చింది.

నేడు ఆర్థికంగా ఎదిగి.. గౌరవంగా నిలిచి..

రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన తరువాత సింహాచలం కుటుంబం పరిస్థితి పూర్తిగా మారిపోయింది. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు వారిని ఆదుకున్నాయి. ఇప్పుడు ఆయనకు వృద్ధాప్య పింఛన్,తన భార్య రమణమ్మకు వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా పథకాలు, కుల వృత్తుల వారికిచ్చే జగనన్న చేదోడు, వైఎస్సార్ రైతు భరోసా, మనవళ్లకు అమ్మ ఒడి పథకం నిధులు అందుతున్నాయి.

బతుకుపై పూర్తి భరోసా



ఎన్నికల ముందు చెప్పినట్లు జగనన్న గెలిచిన తర్వాత వృద్ధాప్య పింఛన్ పొందేందుకు 60ఏళ్ల అర్హతగా నిర్ణయించడంతో నాకూ ఆ కానుక వచ్చింది. మా ఊరిలోని గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకోగా వారు మంజూరు చేశారు. ప్రతీనెలా వలంటీరు ఒకటో తేదీనే ఇంటికి తెచ్చి అందిస్తున్నారు. నాకు జగనన్న చేదోడు పథకం ద్వారా రూ.10వేలు వంతున ఏటా ఆర్థిక సాయం అందుతోంది. ఇప్పుడు బతుకుపై పూర్తి భరోసా ఏర్పడింది.

– వాడాడ సింహాచలం



రాజమహేంద్రి రాత మారింది

- రూ.423 కోట్లతో నాలుగున్నరేళ్లలో నగర రూపురేఖలు మారిపోయాయి.
- నవరత్నాలుతో జిల్లా వ్యాప్తంగా 33 పథకాలతో ప్రజలకు మేలు జరిగింది. రికార్డు స్థాయిలో రూ.25,436 కోట్లు వెచ్చించారు.
- నాడు-నేడులో 1069 పాఠశాలల భవనాలకు రూ.369.89 కోట్లు వెచ్చించారు.
- గృహాల కోసం 68,518 మందికి రూ.1233.34 కోట్లు వెచ్చించారు. 336 గ్రామ సచివాలయాలకు రూ.108.47 కోట్లు విడుదలయ్యాయి.
- డిసెంబర్ నాటికి ప్రభుత్వం సంక్షేమ పథకాలకు రూ.25,436 కోట్లు వెచ్చించింది.
- రాజమహేంద్రవరంలో రూ.475 కోట్లతో ఏర్పాటైన మెడికల్ కళాశాలలో 150 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వచ్చాయి.
- 1.46 లక్షల మంది ఇంటి పట్టాలు అందుకున్నారు. తొలి దశలో రూ.113.48 కోట్లతో 63,000 ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది.
- అనపర్తి బలభద్రపురంలో రూ.2500 కోట్లతో గ్రాసిమ్ కాస్టిక్ సోడా పరిశ్రమతో 2500 మందికి ఉపాధి లభించింది.
- గోకవరం మండలం గుమళ్లదొడ్డి వద్ద రూ.260 కోట్లతో ఇథనాల్ ప్లాంట్ పనులు జరుగుతున్నాయి. 210 మంది నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుంది.
- కొవ్వూరు మండలం ఇసుకపట్ల పంగిడి వద్ద రూ.1,350 కోట్లతో త్రివేణి రెన్యువబుల్స్ ఆధ్వర్యంలో సోలార్ గ్లాస్ తయారీ పరిశ్రమ ఏర్పాటైంది. దీని ద్వారా 2400 మందికి ఉద్యోగాలు దక్కాయి.
- నల్లజర్ల మండలం పోతవరంలో రూ.50 కోట్లతో జాగ్రతి బయోటెక్ ప్రైవేటు సంస్థ బయోటెక్నాలజీ కంపెనీ అందుబాటులోకి రానుంది.

ఇదిగో.. మార్పు

ఉమ్మడి 'తూర్పు'లో అభివృద్ధి వికాసం



పెద్దాపురం వద్ద శానిటైజర్లు, స్పిరిట్ తయారు చేసే కేబీకే బయోటెక్ డిస్టిలరీ యూనిట్



అమలాపురం జిల్లా కలెక్టరేట్

- మారిన రాజమహేంద్రవరం రూపురేఖలు
- కాకినాడ తీరంలో అపార ఆయిల్ నిక్షేపాలు
- తొలిదశలో 20 మిలియన్ టన్నుల సామర్థ్యంలో గేట్‌వే పోర్టు
- రూ.1,265 కోట్ల ! పెట్టుబడులతో భారీ, మధ్యతరహా పరిశ్రమలతో 3,586 మందికి ఉపాధి
- నాలుగున్నరేళ్లలో 3,516 ఎంఎస్ఎంఈలు
- 16,394 మందికి ఉద్యోగకల్పన
- రూ.875.18 కోట్లతో 3586 మందికి ఊతం

సాక్షి ప్రతినిధి, కాకినాడ:/సాక్షి, రాజమహేంద్రవరం/అమలాపురం: తూర్పు గోదావరికి రాష్ట్రంలో ఉన్న ప్రత్యేకతే వేరు. గడచిన ఐదేళ్ల ప్రగతితో ఆ జిల్లా స్వరూపమే మారిపోయింది. పట్టణాలతో పోటీపడేలా పల్లెల్లో సైతం పారిశ్రామికీకరణకు పునాదులు పడ్డాయి. రూ.299.40 కోట్లతో రోడ్లు, భవన నిర్మాణాలు చేపట్టారు. రూ.229.40తో పనులు మొదలయ్యాయి. మరో 33 రోడ్లను రూ.42.87 కోట్లతో మరమ్మతులు చేశారు. రెండో దశలో రూ.26.37 కోట్లతో పనులు చేపట్టారు. కత్తిపూడి-ఒంగోలు జాతీయ రహదారి విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. వశిష్ఠ నదిపై వంతెన నిర్మాణానికి రూ.580.42 కోట్ల నిధులు మంజూరయ్యాయి. కోనసీమ రైల్వే లైన్ కల సాకారమవుతోంది. దీనికోసం ఈ ఏడాది రూ.300 కోట్లు నిధులు వచ్చాయి. అయినవిల్లి మండలంలో రూ.300 కోట్లతో 440/132 కేవీ మెగా విద్యుత్ స్టేషన్ పనులు జరుగుతున్నాయి. పి.గన్నవరం మండలం ఉడిమూడిలంక, గంటి పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక ప్రజలు గోదావరిపాయ దాటాల్సిన అవసరం లేకుండా రూ.49.50 కోట్లతో వంతెన పనులు మొదలయ్యాయి. ముమ్మిడివరం- ఐ.పోలవరం సరిహద్దులో వృద్ధ గౌతమీ, గౌతమీ నదీపాయల మధ్య పశువుల్లంక మొండి రేవు వద్ద రూ.49 కోట్లతో వంతెనను సీఎం జగన్‌పూర్తి చేయడంతో 16 గ్రామాల్లోని 8 వేల మందికి సౌకర్యం కలిగింది. 2023, 2024 సంవత్సరాల్లో ఖరీఫ్, రబీ సీజన్లలో రికార్డు స్థాయిలో దిగుబడి సాధించారు. గతేడాది ఎకరాకు 32 బస్తాలు దిగుబడి వస్తే ఈ ఏడాది 38 నుంచి 45 బస్తాలు పండించారు. ఏటా ఖరీఫ్ సీజన్‌లో 3.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తున్నారు.



రాజమహేంద్రవరంలో గవర్నమెంట్ మెడికల్ కాలేజ్

ఈ ఐదేళ్లలో రైతులకు అందించిన తోడ్పాటు ఇలా..

పథకం	లబ్ధిదారులు	మొత్తం రూ. కోట్లలో
డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసా	184999	648.03
డాక్టర్ వైఎస్సార్ సున్నా వడ్డీ పంటరుణాలు	79242	11.56
డాక్టర్ వైఎస్సార్ ఫ్రీ క్రాప్ ఇన్సూరెన్స్	59724	296.35
ఇన్‌పుట్ సబ్సిడీ ఫార్మర్స్	74963	94.95
డాక్టర్ వైఎస్సార్ యంత్రసేవ పథకం	2431	27.53



కాకినాడ సెజ్‌లో చురుగ్గా జరుగుతున్న పెన్సిలిన్‌జీ ప్లాంట్ పనులు

అభివృద్ధికి... అడుగులు

- ఆరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు నాడు-నేడులో రూ.9.21 కోట్లు మంజూరు
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎదురైన సమస్యల్లో రూ.72.88 కోట్ల నిధులతో 1,102 పనులకు పరిష్కారం.
- 'నాడు- నేడు' మొదటి విడతలో రూ.104.96 కోట్లతో 436 పాఠశాలలు, రెండో విడతలో రూ.257 కోట్లతో 761 పాఠశాలలు, 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలల అభివృద్ధి.
- పేదలందరికీ ఇళ్లు రెండు విడతల్లో 34,454 ఇళ్లకు రూ.62,017 కోట్లు కేటాయింపు.
- జల జీవన్ మిషన్‌లో రూ.515.93 కోట్లతో ఓవర్ హెడ్ ట్యాంకులు, పైప్‌లైన్‌ల నిర్మాణం.
- జగనన్న కాలనీల్లో 209 లేఅవుట్లలో కుళాయిల కోసం రూ.45.75 కోట్లు కేటాయింపు.
- ఇంటింటికీ గోదావరి జలాలందించేందుకు రూ.1,650 కోట్లు కేటాయింపు

ఫుడ్ ప్రాసెసింగ్, రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్లు, హేచరీల్లో కల్పిస్తున్న ఉపాధి ఇలా

- 2019- 20లో 265 యూనిట్లతో 1707 మందికి
- 2020-21లో 119 యూనిట్లతో 978 మందికి
- 2021-22లో 720 యూనిట్లతో 4254 మందికి
- 2022-23లో 2412 యూనిట్లతో 9455 మందికి

అవును, సుజనా కోసం బీసీలు బలయ్యారు. ముస్లిం మైనార్టీలు మోసపోయారు. టీడీపీ అధినేత చంద్రబాబు తన పార్టీకే చెందిన విజయవాడ పశ్చిమ నియోజకవర్గ నాయకులను పక్కా ప్రణాళికతో బలి పశువుల్ని చేశారు. పార్ట్‌నర్ పవన్‌తో పోతిన వెంకట మహేష్‌ను పొడిపించేశారు. పెత్తందారీ పోకడలకు ప్రతీకగా ప్రత్యేక గుర్తింపు పొందిన చౌదరి (సుజనాను బాబుతో సహా టీడీపీలోని ముఖ్యులు సైతం చౌదరి అనే సంబోధిస్తుంటారు) కోసం బాబు తమను రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఫణంగా పెట్టేశారని పశ్చిమలోని బీసీ, మైనార్టీ నాయకులు ఆక్రోశం వెళ్లగక్కుతున్నారు. తమ రాజకీయ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేశారని నిప్పులు చెరుగుతున్నారు.

చౌదరికి 3డీ సినిమా ఖాయం!

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి టీడీపీని ఆక్రమించేసుకున్నాక చంద్రబాబు విజయవాడ పశ్చిమ నియోజకవర్గాన్ని ఒక ఆప్షన్‌గా ఎంచుకున్నారు. అక్కడి నేతలు సొంతంగా బలపడకుండా చూసుకోవడంలో జాగ్రత్త పడుతున్నట్లు ప్రతి ఎన్నికల్లో చోటుచేసుకున్న పరిణామాలు నిర్ధారిస్తున్నాయి. టీడీపీ ఆవిర్భావం అనంతరం ఒంటరిగా పోటీ చేసింది తక్కువే. 1998 లోక్‌సభ ఉప ఎన్నిక మొదలు 1999, 2004, 2009, 2014 జనరల్ ఎలక్షన్లలో వామపక్షాలు, బీజేపీ, మహాకూటమి, జనసేనలతో టీడీపీ కూటమి కట్టి తలపడింది. 2019లో నేరుగా పోటీ అన్నట్లు కలరింగ్ ఇచ్చినా, జనసేనతో లోపాయికారీ ఒప్పందం లేకపోలేదు. 2004, 2009, 2019 ఎన్నికల్లో తలపడిన టీడీపీ ఓటమి చెందింది. 1983లో మాత్రమే టీడీపీ నుంచి బి.ఎస్. జయరాజ్ పోటీచేసి సీపీఐ అభ్యర్థిపై గెలుపొందారు. కాగా సైద్ధాంతికంగా భిన్న ధృవాలైన సీపీఐ, బీజేపీలకు పశ్చిమ సీటును కేటాయించడం బాబుకే సాధ్యమైంది.



పోతిన మహేశ్, బుద్దా వెంకన్న, షబానా ఖాతూన్

తరచూ ఇంఛార్జిల మార్పుతో ఏమార్పు

పశ్చిమలో సంస్థాగతంగా పార్టీ బలపడక పోవడానికి, నిలకడగా ఏ ఒక్కరికీ నాయకత్వాన్ని అప్పగించక పోవడానికి.. ఒంటరిగా ఎన్నికలకు వెళ్లే ధైర్యం బాబుకు లేకపోవడమే. కూటమి కట్టినప్పుడల్లా పశ్చిమ సీటును ఇతరులకు కేటాయించడం బాబుకు పరిపాటి. మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీలతో పాటు పోటీ చేసి ఓడిన బీసీలు బుద్దా వెంకన్న, నాగుల్ మీరా (దూదేకుల), మైనార్టీ వర్గానికి చెందిన జలీల్‌ఖాన్, ఆయన కూతురు షబానా ఖాతూన్, మొహమ్మద్ ఫతావుల్లా, ఎంఎస్ బేగ్ తదితర నాయకులు టీడీపీ నుంచి ఉన్నారు. వీరిలో ఎవరికి వారికి నియోజకవర్గ ఇంఛార్జి స్థాయి నీదే అనడం, ఆ తర్వాత కొంత కాలానికి పక్కన పెట్టేయడం చంద్రబాబుకు ఇక్కడ చెల్లుబాటయ్యింది.

సుజనా మాటకు నాని అడ్డుచెప్పరనే..

బీజేపీలోకి సుజనాను పంపింది, ఇప్పుడు ఆ పార్టీ తరపున పశ్చిమ సీటును కేటాయించిందీ బాబు అనేది జనమెరిగిన సత్యం. పొత్తు కుదరక ముందు వరకు.. సుజనా చౌదరి విజయవాడ లోక్‌సభ అభ్యర్థి అని పచ్చమీడియా, సోషల్ మీడియా ఊదరగొట్టిన సంగతి తెలిసిందే. సుజనా, కేశినేనిల మధ్య సాన్నిహిత్యం మెండుగా ఉన్నందున, చౌదరి మాటను నాని జవదాటరనేది బాబు నమ్మకం. బహుశా ఆ దృష్ట్యానే కేశినేనిని పశ్చిమ ఇంఛార్జిగా కొనసాగిస్తూ బీసీలు, మైనార్టీలను దూరంచేసే ప్రణాళికను బాబు అమలు పరిచారు. కాకపోతే ఊహించని రీతిలో బాబు ఎత్తులను చిత్తు చేస్తూ నాని టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ఎంపీ కేశినేని శ్రీనివాస్‌ను అడ్డుగా పెట్టి..

విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని)ను దాదాపు రెండున్నరేళ్లకు పైగా పశ్చిమ నియోజకవర్గ ఇంఛార్జిగా కొనసాగిస్తూ అదే ప్రాంతానికి చెందిన బుద్దా వెంకన్న, జలీల్‌ఖాన్, నాగుల్‌మీరా, ఫతావుల్లా తదితరులను పక్కన పెట్టుకుని వారి చేతనే కేశినేనికి వ్యతిరేకంగా వ్యవహరింపజేయడం బాబుకే చెల్లిందని నగర నేతల ఏకాభిప్రాయం. ముఖ్యంగా కార్పొరేషన్ ఎన్నికల ప్రచారమప్పుడు నగరమంతా నవ్వుకునేలా ముఖ్య నాయకులను వీధుల్లోకి చేర్చి తిట్ల దండకాలను కొనసాగించడం కొసమెరుపు. ఒకే ఎత్తుగడతో అందర్నీ చిత్తు చేయడమనేది బాబు నైజమని ఆ పార్టీలోని సీనియర్లు వల్లె వేసే మాట.

పవన్ చేత పోతినను...

జనసేన కోసం ఏళ్ల తరబడి పనిచేసిన, గత ఎన్నికల్లో పార్టీ తరపున పోటీ చేసి 22,367 ఓట్లు పొందిన బీసీ వర్గానికి చెందిన పోతిన వెంకట మహేష్‌ను సుజనా చౌదరి సీటు కోసం తన రాజకీయ పార్ట్‌నర్ పవన్ కళ్యాణ్ చేత చంద్రబాబు పొడిపించేశాడని స్థానికంగా వాడ వాడ కోడైకూస్తోంది. చివరి నిమిషం వరకు సీటు ఆశించి మోసపోయిన పోతిన, జనసేనను వీడి వైఎస్సార్ సీపీలో చేరిన సంగతి తెలిసిందే. సుజనా చౌదరి కోటీశ్వరుడైనంత మాత్రాన బీసీలు డబ్బులకు అమ్ముడుపోతారని అనుకోవడం పొరపాటని పోతిన బాహాటంగానే ధ్వజమెత్తారు. 'ధనికుడైనందున చౌదరిని బీజేపీ అభ్యర్థిగా తాము అంగీకరిస్తామని మా అధినేత అనుకుని ఉండొచ్చు. నోట్లతో ఓటర్లను, భారీ బేరసారాలతో మమ్మల్ని లొంగదీసుకోవచ్చనే అంచనాకు వచ్చి ఉండొచ్చు. సమకాలీన రాజకీయాల్లోని లోతుపాతులు మాకూ తెలిసొచ్చాయి. పెత్తందారు పచ్చనోట్లకు పేదలు, మాబోటి నాయకులందరూ లొంగి పోతారనుకోవడం పొరపాటని 'పెద్దలు' గ్రహించేలా గుణపాఠం నేర్పుతాం' అని టీడీపీ, జనసేనల్లోని బీసీ, మైనార్టీల నేతలు చెబుతున్నారు. 'వాళ్లు చేయాల్సింది చేశారు.. మేం చేయగలిగింది చేసి చూపిస్తాం' అని వేర్వేరుగా 'సాక్షి'తో వారు మనసులో మాట వెలిబుచ్చారు.



జలీల్‌ఖాన్, ఫతావుల్లా, నాగుల్‌మీరా



ఎంఎస్ బేగ్

చిత్రం సాక్షిగా
అవును.. కరెక్టే కదా..







సర్వే సంస్థలన్నీ రాష్ట్రంలో వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని బల్లగుద్ది చెబుతున్నాయి.. అన్ని వర్గాల ప్రజలూ అదే మాట్లాడుకుంటున్నారు.. అటు మేధావులు, ఇటు సామాన్యుల నోటా అదే మాట వినిపిస్తోంది. ఇదే విషయం గురించి 'ఫ్యాన్ గాలి ప్రచండం' శీర్షికన బుధవారం 'సాక్షి' ఎలక్షన్ స్పెషల్ ప్రముఖంగా ప్రచురించింది. ఈ కథనాన్ని ప్రజలు ఆసక్తిగా చదవడం రాష్ట్ర వ్యాప్తంగా కనిపించింది.

– సాక్షి నెట్‌వర్క్



మీకు తెలుసా?

ప్రాక్సీ ఓటంటే..

భద్రతా బలగాలు, రక్షణ రంగాల్లో పని చేసే వారు ప్రాక్సీ విధానంలో ఓటు వేయొచ్చు. వారి తరఫున ఒక ప్రతినిధిని ఓటు వేసేందుకు అనుమతిస్తారు. పోలింగ్ బూత్ పరిధిలోని ప్రాక్సీ ఓటర్ వివరాలపై ముందు ఆర్ఓ ద్వారా ప్రిసైడింగ్ అధికారికి సమాచారం ఇస్తారు. ప్రాక్సీ ఓటరు ఆ పోలింగ్ బూత్ పరిధిలోని మిగతా ఓటర్ల మాదిరిగానే ఓటు వేస్తారు. సాధారణ ఓటర్‌కు కుడి చేతి చూపుడు వేలుకు సిరా చుక్క పెడితే ప్రాక్సీ ఓటర్‌కు మధ్య వేలుకు పెడతారు. ఇక తన ఓటు వినియోగించుకున్నప్పుడు అందరిలాగే చూపుడు వేలుకు చుక్క పెడతారు.

టెండర్ ఓటు

కొన్ని సమయాల్లో ఓటు వేయడానికి వచ్చే సరికి అతని ఓటును ఎవరో వేసేస్తారు. ఆ సందర్భంలో సదరు ఓటరు వివరాలను ప్రిసైడింగ్ అధికారి పరిశీలిస్తారు. అతడు వాస్తవంగా ఓటు వేయలేదని నిర్ధారణకు వస్తే... ఈవీఎం ద్వారా కాకుండా బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటు వేసే అవకాశం కల్పిస్తారు. దీన్నే టెండర్ ఓటు అంటారు. ఇందుకోసం ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో 20 చొప్పున బ్యాలెట్ పేపర్లు అందుబాటులో ఉంటాయి.



కొత్తపల్లి తీరే అంత!

పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురానికి మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు తరచూ పార్టీలు మారడంలో సిద్ధహస్తులు. 1984లో తెలుగుదేశం పార్టీతో రాజకీయ ప్రవేశం చేసిన ఆయన 1989లో పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత మంత్రిగా, లోక్ సభసభ్యునిగానూ పనిచేశారు. ప్రజారాజ్యం ఆగమనంతో ఆ పార్టీలో చేరారు. అక్కడి నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లారు. అక్కడ ఇమడలేక వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో మంచి ప్రాధాన్యం లభిస్తున్న సమయంలో మళ్లీ టీడీపీలో చేరారు. ఆ పార్టీలో సరైన ప్రాధాన్యం లభించక మళ్లీ వైఎస్సార్‌సీపీలోకి వచ్చారు. తాజాగా జనసేనలో చేరారు. ఇప్పుడు జనసేనలో టికెట్ దొరకలేదు. దీంతో మళ్లీ ఏపార్టీలోకి వెళ్తారోనని అందరూ ఆసక్తిగా ఉన్నారు.

సింగిల్ ఓటుతో సీఎం సీటు దూరం

2008 రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో ఈ విచిత్రం చోటుచేసుకుంది. సీఎం రేసులో ఉన్న అభ్యర్థి సీపీ జోషి కేవలం ఒకే ఒక్క ఓటు తేడాతో ఓడిపోయారు. 'నాథ్‌ద్వారా' అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సీపీ జోషికి 62,215 ఓట్లు వచ్చాయి. బీజేపీ నేత కల్యాణ్ సింగ్ చౌహాన్‌కు 62,216 ఓట్లు వచ్చాయి. రీకౌంటింగ్ చేసినా ఫలితంలో మార్పులేదు. దీంతో కల్యాణ్ సింగ్‌ను విజేతగా ప్రకటించారు. టెండర్ ఓట్లను లెక్కించలేదని, కల్యాణ్‌సింగ్ భార్య రెండు చోట్ల ఓటు వేశారని, వాటిని రద్దు చేయాలని సీపీ జోషి హైకోర్టును ఆశ్రయించారు. కేసు సుప్రీంకోర్టు వరకూ వెళ్లింది. సుప్రీం ఆదేశంతో టెండర్ ఓట్లతో కలిపి రీకౌంటింగ్ నిర్వహించారు. మళ్లీ ఇద్దరికీ సమాన ఓట్లు వచ్చాయి. ఎన్నికల సంఘం డ్రా తీయగా, అందులో కల్యాణ్ సింగ్‌నే విజయం వరించింది.

ఆ కుటుంబమే.. 7 సార్లు...

తెనాలి నియోజకవర్గం ఏర్పాటైనప్పటి నుంచి ఆ కుటుంబ సభ్యులే ఏడుసార్లు ఎమ్మెల్యేగా ఉన్నారు. 1952లో మొదటి ఎన్నికల్లో పోటీచేసి గెలుపొందిన ఆలపాటి వెంకట్రామయ్య వరుసగా మూడుసార్లు గెలవగా.. ఆ తర్వాత ఆయన కుమార్తె దొడ్డపనేని ఇందిర తండ్రి బాటలో మూడు సార్లు ప్రజాప్రతినిధిగా ఎన్నికయ్యారు. మూడో తరంగా ఇందిర కుమార్తె డాక్టర్ గోగినేని ఉమా కూడా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఇప్పటివరకు 15 సార్లు ఎన్నికలు జరగగా వరుసగా ఏడుసార్లు ఆ కుటుంబ సభ్యులే శాసనసభ్యులు కావడం విశేషం.



అప్పుడు వైఎస్సార్.. ఇప్పుడు జగన్

దివంగత మహానేత వైఎస్సార్ హయాంలో ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించారు. ఆ రిజర్వేషన్లను రద్దు చేస్తామంటున్న బీజేపీతో పొత్తుపెట్టుకున్న టీడీపీ, జనసేన పార్టీలను ముస్లింలు చిత్తుగా ఓడిస్తారు. పార్టీలకతీతంగా ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ, సచివాలయం, వలంటీర్ వ్యవస్థతో ప్రభుత్వ సేవల్ని ఇంటి వద్దకే తీసుకొచ్చిన గొప్ప పాలనాదక్షుడు సీఎం జగన్. మళ్లీ జగన్ సీఎం అయితేనే రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఆనందంగా ఉంటారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం.

- షేక్ మహమ్మద్, ఎంజేఎం కన్వీనర్, ఒంగోలు, ప్రకాశం జిల్లా

మీరూ స్పందించండి

పబ్లిక్ వాయిస్

ఎన్నికల గురించి మీరేం అనుకుంటున్నారు.. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య తేడా ఏమిటి? పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెరగాలంటే మీ సూచనలేంటి? అభివృద్ధికి మీరిచ్చే నిర్వచనం ఏమిటి? ప్రజలకు, రాజకీయ పార్టీలకు మీరేమైనా చెప్పాలనుకుంటున్నారా? ఇలా ఎన్నికలకు సంబంధించి ఏ అంశంపై అయినా సరే మీ అభిప్రాయాలను **73867 92224** నంబర్‌కు మీ ఫొటో సహా వాట్సాప్ ద్వారా పంపిస్తే ప్రచురిస్తాం.



దార్శనికుడు సీఎం జగన్

సీఎం జగన్‌మోహన్‌రెడ్డిలా ఆదర్శవంతమైన విలువలతో కూడిన రాజకీయాలు నేడు దేశానికి చాలా అవసరం. మెరుగైన విద్య, ఆరోగ్య వసతులే అభివృద్ధికి మూలాధారం. ఆ రెండు అంశాల్లో మన రాష్ట్రం దేశంలోని చాలా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందంటే సీఎం జగన్ నిబద్ధతే కారణం. ప్రస్తుత ప్రభుత్వంలో డీబీటీ ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే సంక్షేమం చేరడంతో పైసా అవినీతికి ఆస్కారం లేకుండా పోయింది. ప్రతిపక్షాలు చెప్పే అభివృద్ధి వారి అనుచర గణం, వంతపాడే మీడియా సంస్థలకు దోచిపెట్టడమే. సీఎం జగన్ పాలనలో అందుకు తావులేదు.

- కందిగంటి సుధాకర్‌బాబు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, విజయవాడ

'కోతల' రాతలు
ఇంకెన్నాళ్లు

బాబు గ్రాఫిక్స్ మాయ నుంచి బయటకు రాలేకపోతున్న రామోజీ

రూ.35,000 కోట్లకుపైగా విదేశీ పెట్టుబడులను ఆకర్షించిన జగన్ సర్కారు

ఫ్యాక్ట్ చెక్

సాక్షి, అమరావతి: చంద్రబాబు హయాంలో అనంతపురానికి మైక్రోసాఫ్ట్ వచ్చేసింది. హైపర్‌లూప్ టెక్నాలజీతో గంటలో అమరావతి నుంచి విశాఖకు వెళ్లిపోవచ్చు. దుబాయ్‌కు చెందిన బీఆర్‌షెట్టి అమరావతిలో నిర్మించిన ఆసుపత్రుల్లో ప్రజలకు అత్యాధునిక వైద్యం అందుతోంది... 'ఇవన్నీ గ్రాఫిక్స్ రా' అని ప్రజలు ఎప్పుడో తేల్చేసినా ఆయన కూలీ రామోజీ మాత్రం ఆ మాయాజాలం నుంచి బయటకు రావడం లేదు. అందుకే జగన్‌మోహన్ రెడ్డి సర్కార్‌లో విదేశీ పెట్టుబడులు వాస్తవ రూపంలో కనిపిస్తున్నా కళ్లకు గంతలు కట్టేసుకుని రాష్ట్రానికి విదేశీ పెట్టుబడులు రాలేదంటూ కొయ్ రాజా కొయ్ శీర్షికతో ఓ పుచ్చు కథనాన్ని ప్రచురించారు. కోవిడ్ కాలంలో ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ సంస్థలు తమ వ్యాపార విస్తరణ కార్యక్రమాలను తగ్గించుకున్నప్పటికీ విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంలోనే కాదు వాస్తవ రూపంలోకి తీసుకురావడంలో కూడా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ముందుంది. గడిచిన ఐదేళ్ల కాలంలో రూ.35,000 కోట్లకుపైగా విదేశీ పెట్టుబడులు వచ్చాయి. జపాన్‌కు చెందిన యకహోమా టైర్స్ అచ్యుతాపురం సెజ్‌లో సుమారు రూ.1929 కోట్లతో భారీ టైర్ల తయారీ పరిశ్రమను ఏర్పాటు చేసి ఉత్పత్తి ప్రారంభించింది. జర్మనీకి చెందిన ఎలక్ట్రిక్ బస్సుల తయారీ సంస్థ పెప్పర్ మోషన్ చిత్తూరు జిల్లా పలమనేరు వద్ద రూ.4,640 కోట్లతో యూనిట్ ఏర్పాటు చేస్తోంది. యూరప్‌కు చెందిన పెట్రోగ్యాస్ కృష్ణపట్నం వద్ద రూ.600 కోట్లతో ఏర్పాటు చేసిన భారీ ఫ్లోటింగ్ ఎల్ఎన్‌జీ టెర్మినల్ వారం రోజుల క్రితమే వాణిజ్యపరంగా ఉత్పత్తి ప్రారంభించింది. జపాన్‌కు చెందిన డైకిన్ రూ.2,600 కోట్లతో ఏసీ తయారీ యూనిట్‌ను తిరుపతి జిల్లా శ్రీ సిటీలో ప్రారంభించింది. టోరే ఫార్మా అక్కడే రూ.1,000 కోట్ల పెట్టుబడులను వాస్తవరూపంలో తెచ్చింది. క్యాడ్‌బరీస్ చాక్లెట్స్ మాండలీజ్ రూ.1,600 కోట్లతో భారీగా విస్తరిస్తోంది. అడిడాస్ బ్రాండ్‌తో తయారయ్యే పాదరక్షల తయారీ సంస్థ హిల్‌టాప్ సెజ్ పేరుతో రూ.800 కోట్లతో ఏర్పాటు చేస్తున్న యూనిట్ ఉత్పత్తి ప్రారంభించడానికి సిద్ధంగా ఉంది.



దావోస్‌లో పాలకూర పప్పు..

వాస్తవాలు ఇలా కళ్లకు కనబడుతుంటే.. విదేశీ పెట్టుబడుల కోసం రాష్ట్రం చాలా సమావేశాలు, డిప్లొమాటిక్ ఔట్‌రీచ్‌లు ఏర్పాటు చేసింది కానీ ఏం సాధించలేదంటూ ఈనాడు రాసేసింది. గత ప్రభుత్వంలో దావోస్ వెళ్లిన చంద్రబాబు పాలకూర పప్పు... బెండకాయ వేపుడు ప్రసంగం ఇప్పటికీ అంతర్జాతీయంగా కామెడీ పీస్‌గా ఉంది. ఈ నెలలో టెస్లా అధినేత ఎలన్ మస్క్ భారత్ పర్యటనకు వస్తున్నారు. ఆయనను ఏపీకి తీసుకురావడానికి ప్రభుత్వం చర్చలు జరుపుతోంది. ఇక్కడ వనరులు అవకాశాలను వివరిస్తూ వార్తలు రాయాల్సింది పోయి.. నీచ రాజకీయాల బాబు కోసం స్థానిక యువత నోట్లో మట్టి కొట్టే విధంగా విషపురాతలు రాయడం తగునా? అని యువత ప్రశ్నిస్తోంది.

ఐదేళ్లలో రాష్ట్రానికి వచ్చిన కొన్ని ముఖ్యమైన విదేశీ కంపెనీలు

కంపెనీ పేరు	పెట్టుబడి విలువ (రూ.కోట్లలో)
యకహోమా టైర్స్	1,929
పెప్పర్ మోషన్	4,640
టీసీఎల్	5,000
టోరే	1,000
డైకిన్	2,600
కాసిస్	500
మాండలీజ్ విస్తరణ	1600
హిల్‌టాప్ సెజ్ (అడిడాస్)	800
ఎస్‌జీసీ ట్రాన్స్‌మిషన్	185
ఎల్ పాలిమార్స్	240
పెట్రోగ్యాస్	600

బకాసురుడు



అవినీతి జీవి

రూ.వందల కోట్లు కైంకర్యం

- వందలాది ఎకరాల భూముల ఆక్రమణ
- నకిలీ ఎరువులతో రైతులను నట్టేట ముంచిన వైనం
- రేషన్, ఇసుక, అక్రమ మద్యం మాటున అక్రమార్జన
- ఉపాధి హామీ, నీరు చెట్టు, సీసీ రోడ్ల పేరుతో ప్రజాధనం లూటీ
- మరుగుదొడ్ల బిల్లుల్లో భారీగా చేతివాటం
- అభివృద్ధి పనుల్లోనూ మాయాజాలం
- వినుకొండ టీడీపీ అభ్యర్థి జీవీ ఆంజనేయులు అవినీతి చిట్టా

సాక్షి, నరసరావుపేట/వినుకొండ/నూజెండ్ల:

2014లో టీడీపీ అధికారంలోకి వచ్చాక 'జీవీ' నీరు–చెట్టు, ఇసుక, మట్టిని అడ్డంగా దోచేశారు. బంధువులు, బినామీల ద్వారా పోరంబోకు, అగ్రహారం భూములను కబ్జా చేశారు. పేదలకు ప్రభుత్వం అందించిన భూములను స్వాహా చేసి చేపల చెరువుల తవ్వకాలు చేపట్టారు.

- బొల్లాపల్లి మండలం అయ్యన్నపాలెంలో 4,450 ఎకరాల కొత్త చెరువులో సర్వే నం.438లో 180 ఎకరాలు జీవీ బావమరిది కె.నరసింహారావు బినామీల ద్వారా ఆక్రమించుకున్నారు.
- గుమ్మనంపాడులో ఈనాం భూములను జీవీ, ఆయన బినామీలు వదలలేదు. పాలడుగు వెంకట రాయుడు, చిరుమామిళ్ల రామకృష్ణయ్య అగ్రహారికులుగా వ్యవహరిస్తున్న సమయంలో వారి పరిధిలో సర్వే నంబర్ 1 నుంచి 54 వరకు 5,968 ఎకరాల భూమి ఉంది. ఇందులో దేవుని మాన్యం భూమి సర్వే నం.43లో చెన్నకేశవస్వామి భూమి 200 ఎకరాలు, బంగారమ్మ తల్లి భూమి 16 ఎకరాలు, ఆంజనేయ స్వామి మాన్యం 13 ఎకరాలు, మరో కబ్జాలో భాగంగా ఊరచెరువు కింద 17 ఎకరాలను ఆక్రమించుకున్నారు.
- రేమిడిచర్ల గాలెయ్యకుంట సమీపంలోని ఎస్సీ భూములను గుంటూరుకు చెందిన జీవీ అనుచరుడు కృష్ణ 110 ఎకరాలు చౌకగా చేజిక్కించుకున్నారు. బొల్లాపల్లి మండలంలోనే జీవీ బంధువులు, బినామీలు ఆక్రమించుకున్న భూముల విలువ రూ.వందల కోట్లకు పైగా ఉంటుంది.

కొప్పుకొండలో కబ్జా పర్వం

వినుకొండ రూరల్ మండలం నడిగడ్డ పరిధి కొప్పుకొండలోని వాగు **పోరంబోకు** భూములను 1940లో బ్రిటీష్ ప్రభుత్వం మత్స్య సహకార సంఘానికి ప**ంపిణీ చేసింది.** 1980లో అదే గ్రామానికి చెందిన రైతుల నుంచి 17.80 ఎకరాల భూమిని **జేవీఎస్ ఆక్వా** కల్చర్ రాజ్యలక్ష్మి ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కొనుగోలు చేసింది. జీవీ **మేనమామ, ఒం**గోలు వెంకటేశ్వర్లు, మరో బినామీ రామకోటేశ్వరరావును అడ్డుపె**ట్టుకొని చుక్కల** భూమిగా ప్రకటించి ఈ భూమిని కొనుగోలు చేశారు. ఆ భూముల చు**ట్టూ మూడు** కిలోమీటర్ల మేర దాదాపు 25 చేపల చెరువులను అక్రమంగా సాగు చేస్తున్నారు. ఖాతా నం.585లో 136 ఎకరాలు, ఖాతా నంబరు 571లో 30 ఎకరాలతో పాటు సర్వే నంబరు 281లో మరికొంత భూమిని కలిపి సుమారు 300 ఎకరాల పోరంబోకు భూములను కబ్జా చేశారు. వీటి విలువ రూ.50 కోట్లు.

శివశక్తి పేరుతో ప్రభుత్వ సొమ్ము స్వాహా

శివశక్తి బయో కంపెనీ పేరుతో ప్రభుత్వ సొమ్మును స్వాహా చేశారు. రైతులకు అందించే సూక్ష్మ పోషకాలైన మెగ్నీషియం సల్ఫేట్, జింకు, బోరాన్, ఫెర్రస్ సల్ఫేట్ కొనుగోలుకు అప్పట్లో ప్రభుత్వం టెండర్లు వేయగా వరుసగా నాలుగేళ్లు కిలో రూ.35 లు, జీఎస్టీ లేకుండా రూ.28తో మార్క్‌ఫెడ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. మల్టీనేషనల్ కంపెనీలైన కోరమండల్, నాగార్జున, టాటా వంటి కంపెనీలు ఎరువులు తయారు చేస్తున్నప్పటికీ ప్రాచుర్యం లేని శివశక్తి కంపెనీకి టెండర్లను మార్క్‌ఫెడ్ ఖరారు చేసింది. ఏటా రూ.33.97 కోట్లు అదనంగా రాయితీ పొందింది. ఇలా నాలుగేళ్లు దాదాపు రూ.100 కోట్లకు పైగా సబ్సిడీ రూపంలో బొక్కేశారు. శివశక్తి బయో టెక్నాలజీ లిమిటెడ్, విజయ గ్రోమిన్, నవభారత్ పలు కంపెనీల పేర్లతో నెల్లూరు జిల్లా వెంకటగిరి, నాయుడుపేట, సూళ్లూరుపేట, చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి, తిరుపతి, కర్నూలు జిల్లాతోపాటు ఇతర రాష్ట్రాల్లో నకిలీ బయో ఎరువులు విక్రయించి రైతులను మోసగించారు.

ఉద్యాన సబ్సిడీ స్వాహా

ఉద్యాన శాఖ ద్వారా పండ్లు, కూరగాయలు సాగు చేసే రైతులకు అమలవుతున్న సబ్సిడీని రూ.10 కోట్లకు పైగా జీవీ స్వాహా చేశారు. వెల్లటూరు, మేళ్లవాగు, వడ్డెంగుంట, చీకటీగలపాలెం ప్రాంతాల్లో టమాటా, బొప్పాయి, పుచ్చ, నిమ్మ పంటలకు షేడ్‌నెట్, పాలి హౌస్, కూరగాయల పందిళ్ల పేరుతో వచ్చే సబ్సిడీని ఆయనే కైంకర్యం చేశారు. నూజెండ్ల, ఈపూరు మండలాల్లో మిర్చి రైతులు నష్టపోవడంతో రైతులకు ఇచ్చిన పరిహారాన్ని కాజేశారు. జీవీ అనుచరులు, బినామీలు బొల్లాపల్లి, వినుకొండ, రూరల్ మండలాల్లో ఉన్న అప్పటి అధికార పార్టీ నాయకులు రేషన్ మాఫియాగా ఏర్పడి రూ.200 కోట్లు దోపిడీ చేశారు. గుండ్లకమ్మలో ఇసుక దందా, ఉపాధి హామీ పనులు, నీరు చెట్టు పనులు, చెక్‌డ్యామ్‌లు, సీసీ రోడ్లు, ఇంకుడు గుంతల పేరుతో కోట్లల్లో స్వాహా చేశారు. ఈ అక్రమాలపై అప్పటి ఎంపీడీవో రవికుమార్‌తో పాటు 9 మంది ఉపాధి హామీ సిబ్బంది సస్పెండ్ అయ్యారు. 2014లో నూజెండ్ల మండలం మూర్తింజాపురంలో 10 గ్రామాలకు తాగునీరు అందించే సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ నిర్మాణంలో అవినీతి జరిగింది. పనులు నాసిరకంగా చేయడంతో చెరువు నీరు నింపే క్రమంలోనే చెరువుకట్ట కొట్టుకుపోయింది. ఎన్ఎస్‌పీ కెనాల్ ఆధునికీకరణలో భాగంగా నాగార్జున సాగర్ మేజర్, మైనర్ కెనాల్స్ పనులు నాసిరకంగా చేపట్టి రూ.90 కోట్లు వెనకేసుకున్నారు. వినుకొండలో తాగునీటి సమస్య నెలకొనడంతో మంచినీటి సరఫరా కోసం రూ.2 కోట్లు మంజూరైంది. మంచినీటి ట్యాంకర్ల పేరుతో రోజూ లక్షల రూపాయల మున్సిపాలిటీ నిధులను దోచుకున్నారు. ఈపూరు మండలంలోని ఊడిజర్ల గ్రామ మరుగుదొడ్ల లబ్ధిదారులకు తెలియకుండా రూ.35 లక్షల మేర దోచుకున్నారు.

15 ఎఫ్ఐఆర్‌లు

తన వ్యాపార భాగస్వామిని హత్యచేయించడంలో జీవీపై కేసు నమోదైంది. తర్వాత హత్యకు గురైన వ్యక్తి కుటుంబ సభ్యులను బెదిరించి కేసులను రాజీ చేసుకొని 2009 ఎన్నికల్లో వినుకొండ నుంచి పోటీ చేశారు. జీవీపై ఇప్పటివరకు దౌర్జన్యం, ప్రభుత్వ విధుల నిర్వహణకు ఆటంకం తదితర నేరాలపై 15 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. వినుకొండ పోలీస్‌స్టేషన్‌లో తొమ్మిది, శావల్యాపురం 3, ఈపూరు, బండ్లమూడి, సత్తెనపల్లిల్లో ఒక్కో కేసు నమోదైంది. ఈ కేసులన్నీ విచారణలో ఉన్నాయి. ● వినుకొండ రూరల్ మండలం వెంకుపాలెంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడికి చెందిన వల్లభ డెయిరీలోకి జీవీ అనుచరులతో చొరబడి వస్తువులను ధ్వంసం చేశారు. దీనిపై వినుకొండ పోలీస్‌స్టేషన్‌లో జీవీపై 25-7-2023న క్రైం నంబర్ : 163/23తో 143, 447, 379, 506 రెడ్‌విత్ ఐపీసీ సెక్షన్ల ప్రకారం కేసు నమోదైంది. ● వినుకొండలో లోకేష్ పాదయాత్ర సందర్భంగా నిబంధనలు అతిక్రమించి ప్రజలకు ఇబ్బందులు కలిగించినందుకు జీవీపై వినుకొండ టౌన్ పోలీస్ స్టేషన్లో 17-5-2023న క్రైం నంబర్ 130/23తో 143, 341, 188, రెడ్‌విత్ 34 ఐపీసీ సెక్షన్ల ప్రకారం కేసు నమోదైంది. ● ఈపూరు మండలం అంగలూరు గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా ధర్నా చేసి పోలీసు విధులకు ఆటంకం కలిగించినందుకు ఈపూరు పోలీస్ స్టేషన్లో జీవీపై 12-12-2021న క్రైం నంబర్ 169/2021తో 341, 353 రెడ్ విత్ 34 ప్రకారం కేసు నమోదైంది.

వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం

సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికల్లో జనసేన, బీజేపీ జెండాలతో టీడీపీ జతకట్టినా ఎగిరేది వైఎస్సార్‌సీపీ పతాకమేనని టైమ్స్‌నౌ–ఈటీజీ రీసెర్చ్ తాజా సర్వే తేల్చి చెప్పింది. పొలిటికల్ క్రిటిక్ కన్సల్టెన్సీ కూడా అదే మాట స్పష్టం చేసింది. రాష్ట్రంలో 25 లోక్‌సభ స్థానాల్లో 50 శాతం ఓట్లతో 19-20 స్థానాలను చేజిక్కించుకుని వైఎస్సార్‌సీపీ విజయభేరి మోగిస్తుందని టౌమ్స్‌నౌ–ఈటీజీ రీసెర్చ్ సర్వే వెల్లడించింది. టీడీపీ కూటమి 43 శాతం ఓట్లకే పరిమితం అవుతుందని పేర్కొంది. టీడీపీ 3-4 లోక్‌సభ స్థానాల్లో, బీజేపీ ఒక స్థానంలో ఉనికి చాటుకునే అవకాశం ఉందని తెలిపింది. రాష్ట్రంలో గత రెండు వారాల్లో 1,12,122 మందిని టైమ్స్‌నౌ–ఈటీజీ ప్రతినిధులు ఇంటర్వ్యూ చేశారు. ఇందులో 85 శాతం మందిని క్షేత్ర స్థాయిలో నేరుగా కలిసి ఇంటర్వ్యూ చేయగా.. 15 శాతం మందిని ఫోన్‌లో ఇంటర్వ్యూ చేశారు. వారు వెల్లడించిన అభిప్రాయాలను క్రోడీకరించి.. సర్వే ఫలితాలను మంగళవారం రాత్రి టైమ్స్ నౌ చానెల్‌లో ప్రసారం చేశారు. ఇక అత్యంత ప్రతిష్టాత్మకమైన పొలిటికల్ క్రిటిక్ కన్సల్టెన్సీ సంస్థ గత రెండు వారాలుగా రాష్ట్రంలో విస్తృతంగా సర్వే చేసి.. వివిధ వర్గాల ప్రజల అభిప్రాయాలను సేకరించింది. వాటిని క్రోడీకరిస్తే.. 122 శాసనసభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించడం ఖాయమని తేలిందని వెల్లడించింది. వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావడం తథ్యమని స్పష్టం చేసింది. రాష్ట్రంలో 25 లోక్‌సభ స్థానాలకు గాను 21 స్థానాలు వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంటుందని పేర్కొంది. టీడీపీ కూటమి కేవలం నాలుగు స్థానాల్లో ఉనికి చాటుకునే అవకాశం ఉందని వెల్లడించింది. కాగా, ఎన్డీటీవీ సైతం వైఎస్సార్‌సీపీదే విజయమని స్పష్టం చేసింది.



చంద్రబాబును జనం నమ్మడం లేదు

ఎన్నికల ప్రచారంలో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు తనకు ఇవే చివరి ఎన్నికలని.. అవకాశం ఇవ్వాలని ప్రజలను ప్రాధేయపడుతున్నారు. అయినా చంద్రబాబును ప్రజలు నమ్మడం లేదు. చంద్రబాబు ఇచ్చిన మాటపై నిలబడకుండా మోసం చేస్తారనే అభిప్రాయం ఆంధ్రప్రదేశ్ ప్రజల్లో బలంగా నాటుకుపోయింది. ఇదే టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి ఘోర పరాజయానికి దారి తీస్తోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసిన సీఎం జగన్ ప్రజల్లో విశ్వసనీయతను చాటుకున్నారు. మహిళలు అత్యధికంగా సీఎం జగన్‌కు మద్దతు పలుకుతున్నారు. ఇదే వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించడానికి బాటలు వేస్తోంది. **–నవికా కుమార్, టైమ్స్‌నౌ గ్రూప్ ఎడిటర్**

ప్రజల్ని ఏమార్చాలంటే
కుదరదు

ఇంటర్వ్యూ

ఓటరుకు అన్నీ తెలుసు.. ఈ ఎన్నికల్లో జగన్‌దే గెలుపు

- కూటమి కట్టడం కాదు.. గతంలో ఏం చేశారో చెప్పాలి
- జగన్ పాలనలో విద్యా రంగం అద్భుతం

ప్రముఖ సినీ హీరో విశాల్



- 'నేను ఎవరికీ వ్యతిరేకం కాదు.. మనసు లోతుల్లో అనిపించిందే చెబుతున్నా..
- జగన్ ప్రభుత్వంలో పల్లెల్లో విద్యా రంగంలో మార్పులు బాగా అనిపించాయి.
- ఏ నాయకుడైనా సరే... ప్రజలకు ఏం చేస్తున్నారనేది ముఖ్యం.
- పొత్తు పెట్టుకోండి.. అయితే గతంలో ఇంత మంచి చేశామని ప్రజలకు చెప్పగలరా?
- ఈ ఐదేళ్లు ఇప్పుడున్న ఆయన ఏం చేయలేకపోయారని ధైర్యంగా మాట్లాడగలరా?
- ప్రజల్ని ఏమార్చాలంటే కుదరదు. ప్రజలకు అన్నీ తెలుసు.
- ఎవరెన్ని కూటములు కట్టినా... ఈ ఎన్నికల్లో జగన్‌దే గెలుపు అని నా భావన
- వీడెందుకు ఇంత మంచి చేస్తున్నాడనే మంటతో కొందరు కాళ్లు పట్టుకుని లాగాలని చూస్తారు.
- అలాంటి వాటికి వెరవని నేత జగన్ అనేది నా నమ్మకం..' అని హీరో విశాల్ తన మనసులో మాటను బయటపెట్టారు. రత్నం సినిమా విడుదల నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

మళ్లీ ఆయనే సీఎం..

నేనెప్పుడూ మనసులో ఉన్నదే మాట్లాడతా. పాదయాత్ర రోజుల నుంచి జగన్‌ను గమనిస్తున్నాను. ట్రెడ్ మిల్‌పై రెండు కి.మీ వాకింగ్ చేస్తే అలసి పోతాం. అలాంటిది ప్రజల సమస్యలు తెలుసుకోవడం కోసం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వేల కిలోమీటర్లు నడవడం ప్రజా సమస్యల పట్ల ఆయన నిబద్ధతను చాటిచెబుతోంది. ఒక కొడుకుగా తండ్రి ప్రజాసేవను కొనసాగించడం మామూలు విషయం కాదు. జగన్ నాకు నచ్చిన నాయకుడు. మళ్లీ ఆయనే సీఎం.

విద్యలో సంస్కరణలు భేష్

ఆంధ్రప్రదేశ్ పల్లెల్లో విద్యారంగంలో మార్పులు నన్ను ఆకట్టుకున్నాయి. ఎంత ఖర్చయినా సరే ప్రతి ఒక్కరూ చదువుకోవాలన్న జగన్ సంకల్పం నచ్చింది. ఆడపిల్లలకు మంచి విద్య నేర్పించి మంచి భవిష్యత్‌ను ఇవ్వాలి. ఆడపిల్ల చదువు సమాజానికి మలుపు. జగన్ పాలనలో అది సాకారమవుతోంది. అందరికీ నాణ్యమైన విద్య అందాలనేది నా కోరిక. అందుకే మా అమ్మ పేరుతో ట్రస్ట్ నిర్వహిస్తున్నాను. చాలామంది ఆర్థిక ఇబ్బందులతో చదువు మానేస్తున్నారు. మా వలంటీర్లు అలాంటి వారిని వెదికి చదివించడం చేస్తున్నారు.

మంచి నేతను ఎవరూ ఆపలేరు

ఏ నాయకుడైనా ప్రజలకు ఏం చేస్తున్నారనేది ముఖ్యం. ఇప్పుడున్న పరిస్థితుల్లో మంచి చేయాలంటే చాలా కష్టం.. మంచి చేసేవాళ్లని చూసి ఎన్నో కుట్రలు చేస్తారు. వైఎస్ జగన్‌పై దాడులు జరుగుతున్నాయి. అయితే మంచి చేయాలనుకునే నాయకుడిని ఆపడం ఎవరితరం కాదు. సినిమాలు, రాజకీయాలు రెండింటినీ సమన్వయం చేయడం కష్టం. రాజకీయాలంటే చాలా కష్టమైన విషయం. ఏసీ రూముల్లో కూచుని రాజకీయాలు చేయాలంటే కుదరదు. రాజకీయాల్లోకి రావాలంటే కొన్ని విషయాలు పూర్తిగా మర్చిపోవాలి. **-సాక్షి, అమరావతి**

మనసులో ఉన్నదే చెబుతున్నా

నాకు ఆంధ్రలో ఓటు లేకున్నా.. కొంతకాలంగా ఇక్కడి రాజకీయాలు గమనిస్తున్నా. జగన్ ఇంటర్వ్యూలు తరచుగా చూస్తాను. నేను వైఎస్సార్‌సీపీని సపోర్ట్ చేయడం లేదు. చంద్రబాబుకు వ్యతిరేకం కాదు. మనసులో ఏమనిపిస్తుందో అదే చెబుతున్నాను. పార్టీలు జత కట్టడం మంచిదే. అయితే ఆ పార్టీలన్నీ ఒకే మేనిఫెస్టో పెట్టాలి. గతంలో మీరు ఏం మంచి చేశారో ప్రజల ముందుకు వచ్చి చెప్పాలి. ఈ ఐదేళ్లలో ఇప్పుడున్న ప్రభుత్వం ఏం చేయలేదో చెప్పగలగాలి. అలా కాకుండా ఇప్పుడు వచ్చి ఐదేళ్ల నాటి మేనిఫెస్టోను తుడిచి దానికే రెండు, మూడు తాయిలాలు చేర్చి ప్రజల్ని ఏమార్చాలంటే కుదరదు. ప్రజలకు అన్నీ తెలుసు. పొత్తులు పెట్టుకోండి.. అయితే మీరెందుకు పొత్తులు పెట్టుకుంటున్నారో ఓటరుకు తెలుసు. ఎవరికి ఓటేయాలో కూడా తెలుసు. ఎవరెన్ని కూటములు కట్టినా ఈ ఎన్నికల్లో జగన్‌దే గెలుపు.

కూటమి బలం నీటి బుడగే!

▶ మొదటి పేజీ తరువాయి

స్పష్టం చేస్తున్నారు. కూటమి బలం అంతా ప్రచారంలో మాత్రమే ఉందని, వాస్తవంగా ఆ బలం అంతా నీటి బుడగేనని పలువురు టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు ఒప్పుకుంటున్నారు.

రాబోయేది ఫ్యాన్ సునామీయే..

బస్సు యాత్రకు 18-21 ఏళ్ల మధ్య వయసున్న యువతీ యువకులు అధిక శాతం మంది కదలివస్తుండటాన్ని బట్టి చూస్తే రాబోయేది వైఎస్సార్‌సీపీ సునామీయేనన్నది స్పష్టమవుతోందని రాజకీయ విశ్లేషకులు తేల్చి చెబుతున్నారు. సీఎం జగన్‌ను చూసేందుకు స్కూలు పిల్లలు తల్లితండ్రులతో కలిసి తరలివస్తున్నారు. చంటి బిడ్డలను చంకనేసుకున్న మహిళలు, అవ్వాతాతలు సీఎం జగన్‌ను దగ్గర నుంచి చూసేందుకు వస్తున్న దృశ్యాలు అడుగడుగునా కన్పిస్తున్నాయి. వీటిని పరిశీలిస్తున్న రాజకీయ విశ్లేషకులు.. వైఎస్సార్‌సీపీ ప్రభంజనం కళ్లకు కట్టినట్లు కన్పిస్తోందని తేల్చిచెబుతున్నారు.

యూత్ అంతా జగనన్న వెంటే

బీటెక్ చదువుతున్నా. ఫస్ట్ టైమ్ ఓటేయబోతున్నా. అదీ మంచి పనులు చేస్తున్న సీఎం జగన్‌కు ఓటేయబోతున్నందుకు గర్విస్తున్నా. విద్యా దీవెన ద్వారా ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన ద్వారా వసతి–భోజన ఖర్చులకు డబ్బులు సీఎం జగన్ ఇస్తున్నారు. దాంతో నన్ను చదవించడానికి మా తల్లితండ్రులకు ఆర్థికంగా ఇబ్బంది పడాల్సిన పరిస్థితి తప్పించారు. నైపుణ్యాలను పెంచుకునేలా ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తున్నారు. బీటెక్ పూర్తికాగానే క్యాంపస్ ఇంటర్వ్యూలో కచ్చితంగా ఉద్యోగం సాధిస్తా. నాలాంటి పేద విద్యార్థులు అందరూ ఉన్నత చదువులు చదవాలంటే మళ్లీ జగనే సీఎం కావాలి. జగన్ ఘన విజయం మా విద్యార్థుల ఓట్లతోనే ప్రారంభమవుతుంది.

–హనుమాన్ జంక్షన్ వద్ద బస్సు యాత్రలో పాల్గొన్న విద్యార్థి కమలాకర్







చేబ్రోలు చూసేద్దాం

చిత్రం సాక్షిగా

జాతిపిత మహాత్మ గాంధీ ఇప్పుడు కనుక కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామాన్ని సందర్శిస్తే చాలా చాలా సంతోషపడిపోతారు. ఆయన కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాక్షాత్కరిస్తోందిక్కడ. దేశానికి స్వాతంత్య్రం వచ్చాక 75 ఏళ్లలో జరగని అభివృద్ధి కేవలం గత ఐదేళ్లలోనే ఇక్కడ కళ్లకు కడుతోంది. రంగురంగుల స్కూల్ భవనం, లోపల సకల వసతులు, ఆస్పత్రి, ఆర్బీకే, సచివాలయ భవనాలు, తాగునీరు, డ్రైనేజీ, ఇతరత్రా మౌలిక సౌకర్యాలతో నాలుగు వేలపై చిలుకు గడప ఉన్న ఈ గ్రామం నేడు కళకళలాడుతోంది. పనులన్నీ ఉన్న ఊళ్లోనే చకచకా అయిపోతున్నాయి. ఒక్క భవనాల రూపంలోనే పంచాయతీకి కోట్లాది రూపాయల ఆస్తులు సమకూరాయి. ఇంతలో ఎంత మార్పు అంటూ గ్రామస్తులు సంబరపడుతున్నారు. – పిఠాపురం



సుందరంగా రూపుదాల్చిన పాఠశాల

రూ. 90 లక్షల వ్యయంతో రక్షిత మంచినీటి పథకం



రూ.70 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం



